# కానుక

**ముళ్లపూడి వెంకటరమణ** సాహిత్యంపై

ఎమ్వీయల్

సమగ్ర పరిశోధన

**సాహితి**

**కానుక**

**ఎమ్వీయల్**

మొదటి ముద్రణ : జనవరి 1973

రెండవ ముద్రణ : మే 1978

మూడవ ముద్రణ : సెప్టెంబర్ 2019

వెల : రూ. **100/-**

డి.టి.పి : నవదుర్గ

పంపిణీదారులు :

**సాహితి ప్రచురణలు**

33-22-2, చంద్రం బిల్డింగ్స్

సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ.

ఫోన్ : 0866 - 2436642/43, 8121098500

**email : sahithi.vja@gmail.com**



## నివేదన

ఈ రచన చెయ్యాలన్న ఆలోచన అంకురించిననాటినుంచి రకరకాలుగా సహకరించినవారు :

శిష్టా జగన్నాథం, బసవరాజు అనే జ్యేష్ఠ.

బాపు, బి.వి.యస్. రామారావు.

ఎం.ఎస్.రావు, కాట్రగడ్డ నరసయ్య.

నండూరి రామమోహనరావు, పన్నాల సుబ్రహ్మణ్యభట్టు.

అమరలింగేశ్వరరావు, మన్మథరావు, అవధాని, బసవరాజు అప్పారావు.

ముందస్తుగా పాఠకుల్ని కాసేపు ఆగమన్నవారు :

ఆరుద్ర, ప్రొఫెసర్ తూమాటి దొణప్ప.

అందరికీ కృతజ్ఞతలు. వందనాలు.

- ఎమ్వీయల్

# కానుక సూచిక


| | | |
|---|---|---|
| ముందస్తుగా... | ఆరుద్ర | v |
| కాసేపు ఆగండి | తూమాటి దొణప్ప | viii |
| మనసులో మాట | | x |
| ప్రొలోగ్ | | 11 |
| ఋణానందలహరి | | 28 |
| రాజకీయ బేతాళ పంచవింశతిక | | 38 |
| విక్రమార్కుడిమార్కు సింహాసనం | | 51 |
| బాలసాహితి | | 71 |
| గిరీశం లెక్చర్లు | | 90 |
| ఇద్దరమ్మాయిలూ – ముగ్గురబ్బాయిలూ | | 98 |
| వ్యూలూ–రివ్యూలూ | | 111 |
| అనువాదాలు | | 124 |
| కథానాయకుడి కథ | | 128 |
| పాటలూ – పద్యాలూ | | 135 |
| వెండితెర నవల | | 138 |
| చిత్రరచన | | 144 |
| పంచరత్నాల కథ | | 167 |
| కథన కుతూహలరాగం | | 192 |
| ఎపిలోగ్ | | 198 |




# ముందస్తుగా...

అడుగుజాడ గురజాడదే కనుక ఆధునిక రచయితలమందరం అప్పారావుగారి దగ్గర్నుంచే అభ్యుదయభావాలు పెంచుకోడం మొదలెట్టాం. అప్పారావుగారి మంచితోపాటు వారి హాస్యానికికూడా వారసత్వాన్ని ప్రకటించుకొన్న ఒకానొకడు బహుశా ఒకడే ఒకడు, ముళ్లపూడి వెంకటరమణ మాత్రమే.

సులభంగా రాయడం అలవర్చుకోడం ఎంత కష్టమో, సున్నితమైన హాస్యంతో జీవితాన్ని రంగరించడంకూడా అంతకష్టమే. 'ఆద్యంతం నవ్వు తొణికిసలాడేటట్టు గంభీరమైన ఇతివృత్తాన్ని నడిపించడం అంత తేలికైన విషయంకాదు' అని అప్పారావుగారే ఒకసారి హెచ్చరించారు. ఈ సంగతి ముళ్ళపూడి వెంకటరమణకు స్వానుభవమే. లోపల ఎంత బడబాగ్ని ఉన్నా సముద్రజలాలు శీతలాలు. చేదుసత్యాలకు మంచి నవ్వుల పంచదారపాకం పట్టించడం ఆ సత్యాలను అయినవాళ్ళచేత తినిపించాలని తాపత్రయపడేవాడికే చాలా అవసరం. ఈ అవసరాన్ని తన రచనా వ్యాసంగపు తొలిదశలోనే ముళ్ళపూడి వెంకటరమణ గుర్తించాడు.

పట్టుమని పదేళ్లు పట్టుదలతో రెండుపూటలా ఒక జీవితకాలానికి ఒక జీవితచరిత్రకు సరిపడే రచనలు రమణ చేశాడు. ఆధునిక సాహిత్యంలో తనకోస్థానం సుస్థిరం చేసుకున్నాడు. చదివీచదవగానే ఇది 'రవణీ'యమైన శైలి అని చప్పున తెలిసిపోయే గొప్పతనాన్ని సంతరించుకొన్నాడు. అతని యాస, అనుకరణ పరాయణులకు మంచిమూస.

రవణ రాసిన ఏకథ చదివినా సరే ఇది తెలుగువాడు తప్ప ఇంకోడు రాయలేడు అని స్పష్టంగా చెప్పవచ్చు. ఆయన ఊహలు తెలుగుతనంతో ఊపిరి పీలుస్తాయి. తెలుగువాళ్ళ మంచిచెడ్డలు, మాయమర్మాలు, కష్ట సుఖాలు, నిత్యనైమిత్తికాలు, ఈతిబాధలు, మధురస్వప్నాలు ఒకటేమిటి తెలుగుజీవితం ఆయన కథావస్తువు. బుడుగు ఒకచోట అంటాడు– చంటి పిల్లలకు తెలుగురాదు కనక అబద్ధాలాడరట. రమణ ఎన్నడూ తెలుగు మీరిపోడు కనక ఎప్పుడూ సుబద్ధాలే సృష్టిస్తాడు.

ఒక రచయిత చేసిన సృష్టిని ఎప్పుడో తీరుబాటుగా సాహిత్య చరిత్రకారులూ, పరిశోధకులూ, విమర్శకులూ అంచనా వేయడం పరిపాటి. అయితే యుగకర్తల విషయంలోనూ, ఒక ప్రత్యేక విభాగాన్ని రాణింపచేసిన వారి విషయంలోనూ మినహాయింపులు ఉంటాయి. అందుకే రమణ సాహిత్యంపై ఎమ్వీయల్ ఇప్పుడే సమగ్ర పరిశీలన చేశాడు.

ఎమ్వీయల్ విద్యార్థిదశలో ఏరికోరి సాహిత్యాన్నే అభ్యసించాడు. ఇప్పుడు అధ్యాపకుడై సాహిత్యాన్నే బోధిస్తున్నాడు. సర్వసాధారణంగా మన కళాశాలల్లోని ఉపన్యాసకులు మొక్కుబడికి, పొట్టకూటికి ప్రాచీన సాహిత్యంలోని గోరంత ప్రాశస్త్యాన్ని కొండంత చేసి పాఠాలు చెప్పడమే రివాజు. వాటిమీద పరిశోధనలు చేసి కొట్టిన పిండినే గోనెల్లో పోసి డాక్టరేటు సంపాదించుకొని మర్నాడా విషయాలు విస్మరించడం కూడా రివాజే. అయితే ఎమ్వీయల్ అలాంటివాడు కాదు. నేటి సజీవ సాహిత్యంపై అభిమానం, ఈనాటి ప్రముఖ రచయితలతో సాన్నిహిత్యం, అధునాతన ఉద్యమాలపట్ల ఉత్సాహం, నవీన ప్రక్రియలపట్ల జిజ్ఞాస అతనికి మెండుగా ఉన్నాయి. అందుకే ఈనాటి వచనరచనలో సరికొత్త విప్లవాన్ని తెచ్చిన రమణ సాహిత్యంపై తన దృష్టిని కేంద్రీకరించాడు. సమగ్ర పరిశోధనకు పూనుకున్నాడు. సమగ్రతకోసమే రమణ రాసిన అన్నితరహాల రచనలను సమీక్షించాడు. రమణ రచనల్లో దొరికిన జాతి జీవనాడిని పట్టుకున్నాడు.

విప్లవకారుడు ఎప్పుడూ సంప్రదాయాన్ని విస్మరించడు, విస్మరించలేడు. సంప్రదాయాన్ని సరికొత్త బాణీలకు సద్వినియోగం చేస్తాడు. రమణ చేసిందీ, ఎమ్వీయల్ ఎత్తిచూపిందీ అదే. పాతరీతుల్లో కొత్త అభిప్రాయాలను చెప్పినప్పుడీ విప్లవం కొట్టొచ్చినట్టు కనబడదు. అందుకే పంచతంత్రాన్నీ బేతాళ



పంచవింశతినీ, సాలభంజికల బాణీలనీ రమణ సామర్థ్యంతో ఈనాటికి అనువుగా మలచుకొన్నాడు. అందువల్లనే ఆధునికమైనా ఈ కథలు ఆంధ్రులకు ఆత్మీయమైనాయి.

రమణా, ఎమ్వీయల్ ఇద్దరూ నాకు ఆత్మీయులే. వాళ్ళ ప్రతిభను కొనియాడడం ఆత్మస్తుతే అవుతుంది. అది మానేసి కొంచెం పరచింతవైపు చూపు ప్రసరింపచేస్తాను. నిజానికి సాహిత్యలోకంలో నాకు పరులెవ్వరూ లేరు. అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు అయినవాళ్ళనే పరుల కింద జమకట్టేవాళ్లు కొందరుంటారు. రమణ అభ్యుదయ రచయిత కాదనీ ఆయనకు కమిట్‌మెంట్ లేదనీ కొందరన్నట్టు ఎమ్వీయల్ ఈ గ్రంథంలో చెప్పాడు. రమణ తొలినుంచీ అభ్యుదయవాదే. ఇటీవల స్వయంప్రతిపత్తిగల అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యుడయ్యాడు. శాస్త్రీయ సామ్యవాదంలోని మూలసూత్రాలన్నీ జీవితాన్ని సమగ్ర పరిశీలన చేశాక ఏర్పడినవే. రమణకు వర్గ స్వభావాలు తెలుసు. ఆ తత్వాలను కూలంకషంగా పరిశీలించి రచనలను చేశాడు. ఈ విషయాన్ని అడుగడుగునా ఎమ్వీయల్ మనకు చక్కగా వివరించాడు. ఇందుకు అతన్ని అభినందిస్తున్నాను.

ముళ్ళపూడి భాయీజాన్సన్‌కి

ఎమ్వీయల్ సెబాస్వెల్

త్యాగరాయనగరు
మద్రాసు–17
15–11–72

**– ఆరుద్ర**

# కాసేపు ఆగండి

ఎన్నిరంగాలకు బ్రాటోవరయినా కొంతమందికి అద్భుతంగా రాణించే శక్తి వుంటుంది. అలాటి అరుదైన వ్యక్తులలో 'ఎమ్వీయల్' కథానాయకుడయిన ముళ్ళపూడి వెంకటరమణ ఒకరు. ఉద్యోగిగా, నిరుద్యోగిగా, రచయితగా, జర్నలిస్టుగా, సినిమానిసిగా సీరియస్‌గా, సిన్సియర్‌గా నెగ్గుకొచ్చిన అసలయిన సిసలయిన ఆంధ్రుడాయన.

వెంకటరమణగారి అప్పారావు వగైరాలమాట ఖచ్చితంగా చెప్పలేంగాని గుమాస్తా గోపాళం కొడుకు 'బుడుగు' మాత్రం – గురజాడవారి గిరీశంలా, చిలకమర్తివారి గణపతిలా, మొక్కపాటివారి బారిష్టరు పార్వతీశంలా, మునిమాణిక్యంవారి కాంతంలా – కలకాలం కలకలలాడే పాత్ర అని గట్టిగా చెప్పుకోవచ్చు. అంతేకాదు, పిల్లలపేరుతో, పెద్దల పేరుతో వచ్చిన బాలసాహిత్యంలో ఆబాలగోపాలాన్ని యింతగా ఆకర్షించిన 'బాలగోపాళం' వంటి పాత్ర మరోటి లేదంటే అత్యుక్తి కాదు.

పసిపిల్లల మనస్తత్వాన్ని, ఆలోచనాసరళినీ, వృద్ధవ్యవహారానుకరణ శక్తినీ, భావప్రకటనాపద్ధతుల్ని సునిశితంగా పరిశీలించి భావనచేసి వుంటే తప్ప, 'బుడుగు' వంటి విశిష్టపాత్రని రూపకల్పన చెయ్యడం అసంభవం. ఏలాటి శాస్త్రపరీక్షకైనా నిలవగలిగే నికార్సయిన సత్తా బుడుగు పాత్రచిత్రణంలో నూటికి నూరుపాళ్ళూ వుంది. ఈ దృష్టితో చేసిన రచనలు ఆధునిక సాహిత్యంలో అత్యల్పంగా కన్పిస్తాయి.



ఒక్కోసారి నాకనిపిస్తూ వుంటుంది వెంకటరమణే బుడుగుగా రూపెత్తాడా అని. ఎందుకంటే బుడుగు ఇతర్లపై అధారిటీ చలాయిస్తాడు; తనపై యితర్ల అధార్టీని ససేమిరా సహించడు. బుడుగు చిన్ననాటి వాగీశ్వరత్వమే వెంకటరమణ అనంతర రచనల్లో విరాడ్రూపంతో గోచరిస్తుంది. బుడుగు యింతగా త్రివిక్రమ క్రమంలో ఎదగడానికి ముళ్ళపూడివారి కలం మూలకారణమయినా, కథనానుగుణంగా రేఖాచిత్రాలు గీసిన తెరవెనుక టెక్నీషియన్ 'బాపు' కుంచెను మనం మరవలేం.

కావిళ్ళకు కావిళ్ళు కాయితాలు ఖరాబుచేసిన వృద్ధండ పండితులు ప్రబంధ సుందరులులేని కవిత్వాన్నీ పాషాణపాకంలేని పాండిత్యాన్నీ మెచ్చుకోలేరు. మెచ్చుకునేవాళ్ళను చూసి పైపెచ్చు, ఏకగ్రీవంగా యేడ్చుకుంటారు. అందులోనూ 'సినిమానిసి' సాహిత్య జీవితంపై యింతలావుపాటి సమీక్ష ఏమిటా అని బోల్డు హాఃచర్యపడిపోయి యీ పాపానికి ఒడిగట్టిన దుష్man ఎవడురా అని కోప్పడతారు.

శ్రీనివాసమూర్తి ముళ్ళపూడి వెంకటరమణ రచనలను మీలో చాలామంది లాంగ్‌షాట్‌లోనే చూసి తృప్తిపడివుంటారు. సాహిత్య సత్యవ్రతుడు ఎమ్వీయల్ క్లోజప్‌లో అమర్చి, తీర్చిన టెక్నిక్ (అలర్) దృశ్యాలను చూడాలని మీరు కుతూహలపడతారుకదూ!

అయితే పేజీ తిప్పండి.

**తూమాటి దొణప్ప**
24-7-72

# మనసులో మాట

అందమైన ముఖచిత్రం సృష్టికర్త సర్వశ్రీ బాపుగారికీ –

"ఎమ్వీయల్ 75 ఏళ్ళ పుట్టినరోజు వేడుకకి ఎలా అయినా వీలు చేసుకు వస్తాను" – అన్న శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారికీ –

"కానుక" ఇంతకు ముందు ప్రచురించిన నవోదయవారికీ, పునర్ముద్రణ గురించి అడిగితే – "బాగుంటుంది, ప్రస్తుతం నేను వేయలేను, మీరు వేయండి" అన్న మా శ్రేయోభిలాషి, సహృదయులూ శ్రీ నవోదయ రామమోహనరావుగారికీ–

"కవర్పేజీ ఇలా బాగుంటుంది" అని చెప్పటమే కాక అందంగా ముస్తాబు చేసి పంపిన, పుస్తకం ముద్రణలో విలువైన సూచనలు ఇచ్చిన శ్రీ బ్నింగారికీ–

అరుదయిన ఫోటోలు పంపిన శ్రీ వర ముళ్ళపూడిగారికీ –

క్రమం, కార్యక్రమం భుజాన వేసుకున్న శ్రీ ఎస్టీపీ శ్రీవెంకటేశ్వర్లుగారికీ –

సహకారం అందించిన శ్రీయుతులు బి. చంద్రశేఖర్, రమణమూర్తి, సి. హెచ్. వేణుగార్లకీ

అందంగా ప్రచురించిన సాహితీ ప్రచురణలు, విజయవాడ వారికీ –

.... ఇందరు మహానుభావులని మా కుటుంబ సభ్యులని చేసేస్తే – తాను పెందలాడే గంధర్వలోకం చేరి, పుస్తకాలు చదువుకోవచ్చు అని ప్రణాళిక, ప్రహేళిక రచించిన నానారు ఎమ్వీయల్గారికీ –

వందన చందన తాంబూలాది సత్కారాలు !!!

రచయిత, నిర్మాత, వ్యాఖ్యాత, వక్త – ఇలా బహుముఖంగా ప్రతిభా పరిమళాలు
వెదజల్లిన ఎమ్వీయల్ గారిని, కొత్త తరానికి పరిచయం చేయాలని –
ఆయన కొన్ని ఫోటోలు ఈ పుస్తకంలో చేర్చాము.

"పెహలా పచ్చీస్" నిత్య యువకుడు ఎమ్వీయల్కి
ప్రేమతో సమర్పించే "తీస్రా పచ్చీస్" కానుక !!

**అనురాధ**
**రామ్ప్రసాద్**



# కానుక



## ప్రొలోగ్

**లాంగ్‌షాట్**

పదారేళ్ల చిన్నవాడు మదరాసు మహానగరంలో జనారణ్యం లాటిచోట నాలుగురోడ్ల కూడలిలో నిలబడ్డాడు. అతగాడు భోజనంచేసి వారం రోజులయినా ఆ చిన్నెలేవీ కనబడటంలేదు. అతనూ కనబడనివ్వటంలేదు.

రోజూ రెండుపూటలా భోజనం వేళలు దాటిపోయిన సంగతి నికరంగా తేల్చుకుని తలదాచుకుంటున్న చోటుచేరి తలారా చన్నీళ్ళ స్నానం చేసి మరిన్ని నీళ్ళు కడుపునిండా తాగి ఆకలిని చంపుకుని, ప్రపంచాన్ని జయించినవాడిలా నవ్వుకోటం అతనికలవాటు. ఆ రోజు భోజనంవేళ దాటిపోని కారణాన అలా నిలబడిపోయాడు.

ఒక క్షణం ఆగితే ఒక రూపాయి దొరుకుతుందేమో ఒకపూట భోజనం చెయ్యవచ్చునన్న ఆశవున్నా అంతకన్నా మరొక ప్రయోజనంవుంది అతను నిలబడటానికి.

'భోజనం చెయ్యకుండా ఆకలిమోహంతో నా గుమ్మంలో పడుకోకు. అన్నం తింటే ఇంటికిరా. లేకపోతే పో' అని నిలువ నీడనిచ్చినవాడు చెప్పిన ధర్మసూక్ష్మం తలకెక్కి భోజనంచేసినట్టు నటించటం నేర్చుకున్నాడు, నీడకు దూరం కాకూడదని. అందువల్ల హోటళ్లు మూసేస్తేగాని ఇంటికి చేరకూడదన్న పట్టుదలతో నిర్వికారంగా నిలబడిపోయాడు.

అంతలో అతగాడి జతగాడొకడు ఓ సుబ్బారావును వెంటపెట్టుకొనినవాడై అక్కడికి చేరుకున్నాడు.

**మిడ్‌షాట్**

'చూశావోయ్ ఆనందం! ఇతను డబ్బుల్లేక పాపం ఒకపూటే భోజనం చేస్తున్నాట్ట. రెండోపూట టిఫిన్‌తో సరిపెట్టుకుని నెట్టుకొస్తున్నాట్ట' అన్నాడు జతగాడు.

ఆనందం నవ్వుకున్నాడు. రోలువచ్చి డోలుతో మొరపెట్టుకున్న వైనం గుర్తుకొచ్చి. 'మరే ఒకపూటే భోజనంచేసి వుండటం చాలాకష్టం' అన్నాడు ఎంతోబాధతో.

రెండుపూటలా అన్నంలేకుండా వుండొచ్చు. వారంరోజులు కూడా వుండొచ్చు మహరాజులాగా. కాని ఒకపూట రుచిమరిగి రెండోపూట పస్తుండటం నరకం అన్నవాక్యాలు ఆనందం ఆకలిపేగుల్లో ఉండలు చుట్టుకుని బయటపడలేకపోయాయి.

**క్లోజప్**

ఆ ఆనందం పేరే ముళ్ళపూడి వెంకటరమణ.

ఆ ఆనందం కథే 'ఆకలీ – ఆనందరావు'.

'ఇది నీ కథేనోయ్ హిహిహి' అన్నారు సహసంపాదకులు పత్రికలో పనిచేస్తున్నప్పుడు.

'హ హ్హ హ్హ నా కథేనోయ్' అని నవ్వుకున్నాడు రవణ.

కన్నీళ్ళు చాలా విలువైనవి.

ఖర్చు చేస్తే కష్టం.

కనకనే కన్నీళ్ళకు ఆనకట్ట కట్టి కరెంటు పుట్టించాడు రవణ జీవితంలోను, సాహిత్యంలోను. ఆ కరెంటు ప్రసరించిన వెలుగులో ప్రపంచాన్ని చదువుకున్నాడు. అక్షరాల్లోకి అనువదించుకున్నాడు.

**మై హీరో**

ఆ ముళ్లపూడి వెంకటరమణ నా రచనకు కథానాయకుడు.

రవణ సాహిత్యమే ఈ పుస్తకానికి వస్తువు.

మీరంటారు.

రవణ రామాయణం రాయలేదు. ప్రబంధం రాయలేదు. కనీసం నాటకం రాయలేదు. అతని సాహిత్యంమీద పుస్తకం రాయటం ఏవిటని?



రవణ జీవితమే అతని సాహిత్యం. సాహిత్యమే అతని జీవితం. అతని రచనలు గొప్పవన్న నమ్మకం నాకుంది. వాటిగురించి చెప్పవలసింది చాలా వుందని అనిపించింది.

ఇది చదివాక నీమాటే రైటనో కనీసం నీ మాటా రైటేననో మీరంటారన్న ధైర్యం కూడా నాకుంది.

'రవణ రాసినవి జటకాకథల'న్నాడు ఒక విమర్శకుడు.

'అతను హాస్యం రాస్తాడు. నవ్వొస్తుంది కూడా' అన్నాడొక రచయిత.

'అతనికి మార్క్సిజం తెలీదు' అన్నాడొక అభ్యుదయ వాది.

'అతను కమిటెడ్ కాలేదు' అన్నాడొక కమిటీ మెంబరు.

వీటికి జవాబులు విడివిడిగా చెప్పదలుచుకోలేదు. రవణ సాహిత్య దర్శనమే ఈ ప్రశ్నలకు జవాబు.

**క్రేన్ వ్యూ**

'ఇతను హాస్యరచయిత' అన్న యోగ్యతాపత్రం అందుకున్న తరవాత ఆ పేరు పోగొట్టుకుని 'రచయిత' అనిపించుకోవాలని రవణ ఆందోళనపడలేదు. ఆ పేరు నిలబెట్టుకోవాలని తాపత్రయపడనూలేదు.

కాబోలనుకున్నాడు.

అంతే!

కాదనడం ఎందుకని జనాభిప్రాయానికి అనుగుణమైన మాటలు నాలుగు 'ముళ్లపూడి వెంకటరమణ కథలు' అనే పుస్తకానికి ముందుమాటలుగా రాశాడు.

"ఇందులో కథలన్నీ కూడబలుక్కొని కలసికట్టుగా గాని, విడివిడిగా గాని రచయితకి తెలీకుండా మీదగ్గరకి గుట్టుగావచ్చి ఇందులో దేశానికి సందేశాలున్నాయి తెలుసా? అనిచెప్పి అంతటితో ఊరుకోక అవేమిటో కూడా వెల్లడిచేసినట్టభినయిస్తే ఇంకోసారి నవ్వేసి అలాగేలే అనండి. వాటిమాట మటుకు నమ్మకండి".

ఇది రవణ చెప్పిన పచ్చిఅబద్ధం. ఈ సంకలనంలోనే 'సాక్షి' కథ వుంది. ఇందులోనే 'ఛాయలు' కథ వుంది. ఈ రెండు కథలూ ఏ దృష్టితో చూసినా మంచి చిన్న కథలనే అభిప్రాయానికి ఎంత కొమ్ములు తిరిగిన విమర్శకుడయినా రాక తప్పదు.

ఈ రెండుకథల్లో కూడా హాస్యం ఉండచ్చుగాని ఈ కథలు చదివి కూడా రవణ హాస్యరచయిత పరవాలేదు నవ్విస్తా... అని అర్ధనిమీలిత నేత్రాలతో అనుకోడం అపరాధం. సాహిత్యద్రోహం.

'నవ్వుతోబాటు రెండు కన్నీటిబొట్లు కూడా రాల్పించేదే నిజమైన హాస్యం'. అటువంటి హాస్య రస రమణీయత రవణ రచనల్లో కనబడుతుంది. శబ్దంనించి ప్రభవించి నిశ్శబ్దంగా పర్యవసించే జీవితంలోని ప్రతిధ్వనీ, రవణ రచనల్లో వినబడుతుంది.

**జనతా జనత**

రవణ రాసిన అక్షరాలా పాతిక కథల్లోనూ రెండు పౌరాణిక కథలు తప్పించి ఏ రచనయినా మధ్యతరగతి జీవితాన్నే చూపిస్తుంది. మధ్యతరగతి మనుషుల కష్టసుఖాలు, డబ్బు ఇబ్బందులు, సమాజంలో వారి పరిస్థితి, ఉద్యోగాలు, ఆశలు దురాశలు అడియాసలు, ఆకలి, కన్నీళ్ళు, కలలు, కలవరింతలు, భ్రమలు భ్రమింపచెయ్యడాలు, డబ్బంటే లెక్కలేనట్లుండటం డబ్బుకోసం తాపత్రయపడటం, ఎదురుదెబ్బలు ఓదార్పులు, అవమానాలు అసూయలు, పెళ్ళిళ్ళు కట్నాలు, పురుళ్ళు పుణ్యాలు, కులాలు గోత్రాలు, పురుషార్థాలు వేదాంతాలు అన్నిటినీ కలగలుపుకుని, తనరచనల్లో నిలుపుకుని రచన చేశాడు రవణ.

రవణ సాంఘికంగా వస్తున్న మార్పుల్ని పరిశీలించాడు. పట్టుకొమ్మల వంటి పల్లెలు నగర ప్రభావంతో ఎలామారిపోతోందీ గమనించాడు. పల్లె, పట్నం మధ్య ఏర్పడిన అగాధాన్ని రెండుతరాల మధ్య కనబడుతున్న భేదాల్ని పరిశోధించాడు. పై తరగతి కింది తరగతిని ఎలా అణిచేస్తోందో గమనించాడు. వీరి కష్టసుఖాలతో పాటు వారి అహంకారాన్ని, అవినీతిని ప్రదర్శించాడు. మధ్యతరగతి పైకెగరలేక, ఎగరాలనే ఆశపోక – కిందికి జారలేక, జారాల్సిన అవసరం తప్పించుకోలేక ఎలా అవస్థపడుతోందో నిజజీవితం నించి అటు వేదాంతంలోకో, ఇటు కలలరాజ్యానికో ఎలా పలాయనమవుతోందో దర్శించాడు. కులాల గోడలు కూలిపోవాలనే కలను నిజపరచడానికి రచనల్లో ప్రయత్నించాడు.

నేటి ఆర్థికవిధానం మనుషులమీద ఎలాటి ప్రభావం చూపుతున్నదో గమనించాడు. డబ్బొక్కటే పరమార్థం కాదు. అంతకంటె విలువైనవి చాలావున్నాయని చెప్పటంతోపాటు ఒకో సమయంలో డబ్బుకు విలువలేదని నిరూపించే కథలు రాశాడు.

అరగొర జ్ఞానంతో రాజకీయ చైతన్యంలేని జనంమధ్య రాజకీయాలెలా ఆటలాడుకొంటున్నదీ చూశాడు. రాజకీయాలతోపాటు సమానంగా ప్రభావం కలిగిన సినిమాతో సంఘానికి, యువతరానికి వున్న సంబంధాన్ని స్పష్టం చేశాడు.

సమకాలిక సాహిత్య జగత్తులో వస్తున్న మార్పుల్ని పట్టి చూపుతాడు. మనుషుల్ని సంస్కృతీపరుల్ని చేసే సాహిత్యం చెడుదోవపడితే ఎంతటి ప్రమాదమో తపనపడతాడు.



గ్రాంధిక వ్యావహారిక వాదం దగ్గర్నించి జాత్యభిమానాలతో విమర్శలుచేసే కువిమర్శలవరకు ఏదీ వదలకుండా రచనల్లో చోటిస్తాడు.

వీటన్నిటిమీదా తన అభిప్రాయాల్ని స్పష్టంగా చెబుతూ అవహేళన చేస్తాడు. మెచ్చుకుంటాడు. పారడీ చేస్తాడు. పాఠకులకందే స్థాయిలో ప్రదర్శిస్తాడు.

లోకం తన రచనల్లో ప్రతిఫలించేట్లు, తన రచనలు లోకంలో ఆదరణ పొందేట్లు సున్నితంగా సుతారంగా కారంగా కరుణాత్మకంగా గంభీరంగా రచనలుచేసిన రవణ కేవలం హాస్యరచయిత అన్నది అబద్ధం.

రవణ రచయిత.

'తోటివాళ్ళమీద సాటివాళ్ళమీద వెటకారాలూ మిరియాలూ నూరడం, వాళ్ళ దుర్గుణగణాలు జాబితావేసి చదివించి నవ్వించి హాస్యం చేయడమే ఆయన లక్ష్యమనీ ఆయన హాస్యరచయిత మాత్రమేననీ అనుకునేవాడు వట్టి తెలివితక్కువవాడు.'

'ప్రేమ, ఆపేక్ష, ఆవేదన, వాత్సల్యం ఉండడంవల్లనే హాస్యంలో మాటమాటకు కండపుష్టి కలుగుతుంది.'

'తన జాతిపట్ల తనకు గల ఆపేక్షకీ, ప్రేమకీ, గౌరవానికీ, గర్వానికీ, లజ్జకీ దానికోసం ఆయనపడ్డ బాధకీ ఆయన రచనలన్నీ అక్షరానువాదాలు'.

అని భమిడిపాడి కామేశ్వరరావుగారి గురించి రవణరాసిన మాటలు రవణకీ వర్తిస్తాయి.

**ఫ్లాష్‌బాక్**

రవణ 1932 జూన్ 28న పుట్టాడు. మదరాసు కేసరీ స్కూల్లో ఎస్సెల్సీ చదివాడు. ఫిఫ్త్ ఫారంలో ఉన్నప్పుడే డిబేట్లలోను, వ్యాసరచన పోటీలలోను పాల్గొనటం అలవాటయింది. కనబడిన ప్రతిపుస్తకం చదవటం, కనబడని పుస్తకంకోసం వెదకటం దినచర్యగా ఉండేది. లెక్కల్లో రవణ చాలా ప్రతిభ కనబరచేవాడు. సహపాఠులంతా రవణదగ్గర రోజూ లెక్కలు నేర్చుకునేవారు. అప్పకవీయం క్షుణ్ణంగా చదువుకోటంతో పద్యాలు అల్లడం హాబీ అయింది. గణాల్లోనే అన్నిటినీ బందీచేస్తున్న కుర్రవాణ్ని చూసి తెలుగు మాష్టారితో సహా అంతా ముచ్చటపడేవారు.

ఆ ఉత్సాహంలోనే 'ఉదయభాను' అనే వ్రాతపత్రిక ప్రారంభించి ఎడిటరయిపోయాడు. గిడుగు సీతాపతి, న్యాపతి రాఘవరావు వంటి పెద్దల ప్రోత్సాహం లభించటంతో పత్రికకు ఆర్థిక స్తోమత రావటానికి మిత్రులతో కలిసి ఒక ప్రదర్శన ఏర్పాటుచేశాడు. ఆ డబ్బుతో సైక్లోస్టైయిల్ మిషన్ కొన్నారు. పత్రికకు రవణ ఎడిటరయితే బాపు వ్రాయసకాడు.

చదువు వెనకపట్టకుండానే రవణ ఆటల్లోను, నాటకాల్లోను పాల్గొంటుండేవాడు. చంద్రగుప్త నాటకంలో చాణక్య వేషం వేసిన రవణని చూసి కొందరు సాహిత్యాభిమానులు అతను నటనవైపు తిరిగిపోతాడేమో అని భయపడ్డారు.

స్కూలు చదువు సాగించటానికి నాలుగయిదుచోట్ల ట్యూషన్లు చెప్పసాగాడు. ఆ శ్రమకు లభించే రూపాయో రెండో చేతికి రాగానే ఆకలి హొటలువేపు నడిపించినా కాళ్ళు సెకండ్‌హాండ్ బుక్‌స్టాల్ దగ్గరే ఆగిపోయేవి.

ఇదీ అదీ అనకుండా కనబడిన ప్రతిపుస్తకం చదివి సంపాయించిన జ్ఞానమే రచయిత కాబోయే రవణకి పెట్టుబడి అయింది.

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన సంవత్సరమే రవణ కూడా ఎస్సెల్సీనించి విముక్తిపొంది చదువుకి స్వస్తిచెప్పాడు. పదహారోయేట లోకంలోకి విసరబడ్డ రవణకి జీవితం చాలాపాఠాలు నేర్పింది. పదిమందినీ చదివి అపారమైన విజ్ఞానం సంపాయించుకున్నాడు.

పాతికేళ్ళలోనే రకరకాల ఉద్యోగాలు, వ్యాపకాలు వ్యాసంగాలు, వీటితోనే తలపండింది రమణకి. కాస్మాపాలిటన్ సిటీ అయిన మదరాసు నుంచి కార్మికులు, శ్రామికులు, పారిశ్రామికుల మధ్య వెళ్ళి పడ్డాడు విశాఖ పట్టణంలో. అక్కడికి చేరినా జీవితం సముద్ర మధ్యంలో ఉన్నట్లే అయింది కాని గట్టెక్కలేదు. అల విసిరికొట్టినట్టు విశాఖపట్టణం వెళ్ళిపడినా అంత వేగంతో మళ్ళా మదరాసు చేరుకున్నాడు. ఈ మార్పిడిలోనే అతను కృష్ణా గోదావరి ప్రాంతాలను, అక్కడి వ్యక్తుల తత్వాలను ఆకళించుకోవటంతో పాటు విశాఖపట్టణం పలుకుబడినీ విజయనగరం జిలుగు నుడినీ తెలుసుకున్నాడు. ఇన్ని మాండలికాల రుచి, ఇందరు వ్యక్తుల కష్టసుఖాల చవి గుర్తెరిగినవాడు కనకనే సర్వమాండలికాల్ని తన రచనల్లో నిలువరించుకోగలిగాడు.

ఎస్సెల్సీ వదిలిన తరువాత రవణని వరించిన చదువు 'రేడియో ఇంజినీరింగ్'. ఇదీ మదరాసులోనే. రేడియోలయితే శాస్త్రరీత్యా అన్నిటికీ ఒకటే పద్ధతి. కాని మనిషికలా కాదు. ఒకో వ్యక్తికి ఒకో పద్ధతి, ఒకో శాస్త్రం. అది చదవటం ఒక కళ. యంత్రాలను చదవగలిగిన రవణ అంతకంటె నిశితంగా మానవ తంత్రాలను, యంత్రాంగాలను కూడా చదవగలిగాడు.

క్రొవ్విడి లింగరాజుగారు ఎడిటరుగావున్న 'ప్రజాపత్రిక'లో రవణ సబ్ ఎడిటరుగా పనిచేశాడు. కావాలనుకున్నదాన్ని సాధించగలనన్న నమ్మకం వుండటం, సాధించటం, నమ్మినదాన్ని ధైర్యంగా ఆరాధించటం రచనలుగా అనువదించటం ప్రజాపత్రిక రోజుల్లోనే అలవడింది.



వైజాగ్ హార్బర్లో ఉద్యోగం కష్టం సుఖం నేర్పింది. అక్కడ పనిచేసే బీదాబిక్కితో కలిసి వాళ్ళ ఆకలినే పంచుకుంటూ వాళ్ళ కన్నీళ్ళే నంచుకుంటూ నీడల జాడల్ని, చీకటి మేటల్ని శ్రద్ధగా చూశాడు. సీమదొర పక్కనే చీమలా కనబడే పనివాడినీ వారి అంతరాలనీ అంతరంగాలనీ అవగాహన చేసుకున్నాడు. విశాఖపట్టణం తెలుగుభాషతో పాటు అక్కడి మోసాలభాష, దగాలభాష, అవినీతిభాష, కన్నీళ్ళభాష క్షుణ్ణంగా చదువుకున్నాడు. టాలీ క్లర్క్ ఉద్యోగమే కాకుండా డబ్బులకోసం కూలిపని చెయ్యటానిక్కూడా సిద్ధపడాల్సివచ్చింది. 'చదువుకున్నోళ్ళొచ్చి మాకూట్లో దుమ్ము కొడుతున్నార'ని తిట్టుకుంటున్న కూలివాడి మాటలలో సత్యాన్ని గ్రహించి హార్బరు ఉద్యోగానికి గుడ్‌బై చెప్పాడు. రవణ చేసిన అన్ని ఉద్యోగాలకంటే ఈ ఉద్యోగం అందించిన అనుభవం చాలా రచనల్లో కనబడుతుంది. వ్యక్తుల చిత్రణలో కనబడుతుంది. ఉపమానాలలో కనబడుతుంది. చివరికి 'ప్రాణమిత్రులు' చిత్రంలో సృష్టించిన హార్బరు వాతావరణంలో కనబడుతుంది.

మదరాసు చేరుకోవాలి. అక్కడే స్థిరపడాలన్న తపన ఎక్కువైంది. అప్పటికి సబ్ ఎడిటర్ కావాలన్నది రవణ కోరిక. అదో దేవేంద్రపదవిలా అనిపించేది. ఏలూరులో దిగి మదరాసు వెళ్ళటానికి డబ్బు సంపాయించే మార్గాలాలోచించాడు. ఈదర వెంకటరావుగారు చాలామంచివారని రచయితలంటే ఆదరాభిమానాలు కనబరుస్తారని విని అక్కడకు వెళ్ళాడు. 'మీ పత్రికకి నాలుగయిదు కథల్రాసి యిస్తాను. నాకు మద్రాసు వెళ్ళేందుకు డబ్బివ్వండి' అని అడిగి సరేననిపించుకుని అక్కడే కూచుని కథలు రాశాడు. అవి తన సంచిలో భద్రపరచి ఉషారుగా ఈలేసుకుంటూ ఏలూరు రోడ్లమీద ఒక రౌండు కొట్టి తిరిగి వెళ్లేసరికి సంచికాస్తా మాయమైంది.

రవణ సగంసగం చెప్పిన కథల కథ విని వెంకటరావుగారికి కంటనీరు తిరిగింది. కథలు తరువాత పంపించవచ్చుగాని ఈ డబ్బు తీసుకుని మద్రాసు వెళ్ళు. ఉద్యోగం చూసుకో అని ఆయన యిచ్చిన నూటపదహార్లు మద్రాసులో ఉద్యోగం సంపాయించటానికి పెట్టుబడి అయింది.

ఎవరైనా 'మా దగ్గర ఉద్యోగం లేదం'టే రవణకి కోపం వచ్చేదికాదు. జాలేసేది. 'పాపం నిజంగా ఉద్యోగంలేదేమో! వాళ్ళుమాత్రం ఏం చేస్తారు!' అని తననితాను ఓదార్చుకుని మళ్ళా అన్వేషణలో పడేవాడు.'

'అయామె రైటర్ – నేను బోరన్‌రైటర్ని – నేను సబ్ ఎడిటర్ ఉద్యోగమే చేస్తా. ప్రూఫు రీడరు చెయ్యను.' అన్నది రవణ సంకల్పం. అప్పటికి అతను రాసిన కథలు 'బాల' పత్రికలో అచ్చయ్యాయి. అంతకు మించి రచనలు చెయ్యలేదు. అయినా 'నేను

రచయితని. నేను మంచి కథలు రాస్తాను. బాలకథలు రాయను' అన్న నమ్మకం, వెర్రి ఆవేశం.

అప్పుడే అసిస్టెంట్ డైరెక్టరుగా ఒక డబ్బింగు పిక్చరుకి పనిచేశాడు. అక్కడ రకరకాల భాషలతో మాట్లాడేవారి మాటల్ని తన కర్థమయే భాషలోకి 'డబ్' చేసుకున్నాడు. కాని ఈ ఉద్యోగంలోను డబ్బు చేసుకోలేకపోయాడు. స్థిరంగా నిలవలేకపోయాడు.

ఈ అస్థిరపరిస్థితిలోనే రవణ శ్రీనివాస శిరోమణిగారి రామాయణానువాదానికి వ్రాయసకాడుగా పనిచేయటం జరిగింది. రామాయణ కావ్యంపట్ల రవణకు గల ఆసక్తే అన్ని భాషల్లో రామాయణాల్ని క్షుణ్ణంగా చదువుకునేట్లు చేసింది. రవణలో రూపుకడుతున్న రచయితకి ఈ సహకారమే సంపూర్ణమైన ఆకారాన్ని దిద్దింది.

54లో ఆంధ్రపత్రిక డెయిలీ సబ్ ఎడిటర్ ఉద్యోగంలో చేరాడు. రెండేళ్ళపాటు దినపత్రికలోను నాలుగేళ్ళపాటు వారపత్రికలోను పనిచేసి పేరు, పేరుతోపాటు స్థిరమైన ఊరూ సంపాయించుకున్నాడు. వారపత్రికలో రవణ చాలా శీర్షికలు సృష్టించాడు. చాలా రచనలకు వరవడి పెట్టాడు. ఆ బాణీలోనే పత్రిక దినదినాభివృద్ధి పొందటం చూశాడు. పత్రికలో పనిచేస్తున్నప్పుడే రేడియోకోసం రచనలు చేశాడు.

సంపాదక శాఖనించి సినిమాలో సంభాషణల శాఖకు రావడం 'దాగుడుమూతలు' చిత్రంతో జరిగింది. తనకథతో తన సంభాషణలతో తన భావాలకు తగినచిత్రం డి.బి.నారాయణ తీసిన దాగుడుమూతలు. తొలిచిత్రం ఇదే అయినా మొదట విడుదలయిన చిత్రం 'రక్తసంబంధం'. ఈ రక్తసంబంధమే రవణను చిత్రపరిశ్రమకు ఆత్మీయుణ్ణి చేసింది. 'గుడిగంటలు' విజయపరంపరను ధ్వనించాయి. 'మూగమనసులు' పరిశ్రమలోనివారందరూ తేరిపారచూసేట్లు చేసింది. సినీరచయితగా పేరుప్రతిష్ఠలు సంపాయించుకుని స్థిరపడ్డారు.

63లో మిత్రులతో సహా జ్యోతిమాసపత్రిక స్థాపించి శ్రమలో వాటా తీసుకున్నాడు. అచిరకాలంలోనే పాతికవేల కాపీల వరకు అమ్ముడయే అభిమానం సంపాయించుకున్న ఈ పత్రిక రవణ సంపాదకవర్గంలో ఉండడంవల్ల రచయితల పత్రికయింది. వర్ధమాన రచయితయినా ప్రఖ్యాత రచయితయినా జ్యోతికి రాయటానికి ఉరకలు పెట్టేంతగా ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని యిచ్చింది.

63 జనవరిలో రిపబ్లిక్‌డే సందర్భంగా బ్రహ్మచారిగా వుండే స్వాతంత్ర్యాన్ని ఆనందంగా వదులుకుని శ్రీదేవిని స్వీకరించాడు. ఒడిదుడుకులతో ఉద్వేగంతో ఉద్రేకంతో ప్రవహించే జీవనస్రవంతి నాటినుంచి సంపూర్ణత్వాన్ని సాధించుకుని నిండుగా సాగటం ప్రారంభించింది.



67 రవణ జీవితాన్ని మరోమలుపు తిప్పింది. 'సాక్షి' చిత్ర నిర్మాణంతో నిర్మాతగా మారాడు. తను రాసిన కథను తనకు నచ్చేట్లు, ఖండాంతరవాసులు కూడా మెచ్చేట్లు చిత్రంగా నిర్మించుకున్నాడు. రచనలోలాగే చిత్ర నిర్మాణంలో కూడా సాహసకృత్యాలు చేసి నిలబడగలిగాడు. తరువాత సంవత్సరానికొకటి చొప్పున నిర్మిస్తూ వచ్చిన బంగారుపిచ్చిక, బుద్ధిమంతుడు, బాలరాజుకథ, సంపూర్ణ రామాయణం నిర్మాతగా రవణ స్థాయిని పెంచుతూ ఆంధ్రప్రజల అభిమానాన్ని సంపాయించిపెట్టాయి.

## 'అహం' బ్రహ్మ

రచయితగా రవణ నేలవిడిచి సాముగాని, రచనగాని చెయ్యడు. అతని రచనల్లో తెలుగు మనుషుల్ని చూడవచ్చు. వాళ్ళ ఆశల్ని చూడవచ్చు. కలల్ని, రాజకీయాల వలల్ని చూడవచ్చు.

తన రచనలు చదివి మనుషులు అమాంతం మారిపోతారని గాని అంతా మంచివాళ్ళయిపోతారని గాని ఏ రచయితా వెర్రిఆవేశం పెట్టుకోడు. కాకపోతే తన రచనలు లోకానికి అవసరం అనీ, ఏ కొంచెమో ఉపకరిస్తాయనీ నమ్మకం లేకపోతే అసలు రచన చెయ్యలేడు. ఆ నమ్మకం వేడి కలిగిస్తే, పాఠకుల ఆదరణతో ఆశ చిగురిస్తే రచయితగా లోకంతో ఆత్మీయతను ఏర్పరచుకుంటాడు.

రవణకా నమ్మకం వుంది. ఆశ వుంది. కనకనే ఆత్మీయతా వుంది.

## వెలుగు నీడలు

లోకంలో మనుషులుంటారంతే! మంచివాళ్ళు చెడ్డవాళ్ళని రెండు కులాల వాళ్ళుండరు. సాక్షి చిత్రంలో అంత చెడ్డపకీరు చుక్క కళ్ళకి దేవుడే! అందుకే 'మా యన్ననని తప్పులేదు. తప్పంతా మీదే' అంటుంది. అలాగే ఏ తోక్రానీ అయినా తోక్రాతిన్న కష్టమర్‌కి తప్ప తన ఆలుబిడ్డలకి మంచివాడే అవుతాడు కదా! పైగా మంచి, చెడు అన్నది మనిషిలో లేదు. చూసేవాడి దృష్టిలో ఉంది.

ఋణానందలహరిలో అప్పారావుతో ఒకచోట అనిపిస్తాడు రవణ. 'మంచీ చెడ్డా అనేవి రిలెటివ్. మనిషికీ మనిషికీ వుండే చుట్టరికాన్ని బట్టి వుంటాయి. నేనంటే మీకు గిట్టనపుడు నాకు మంచిదైంది మీకు చెడ్డది'.

మనుషుల మంచి చెడ్డల గురించి 'సాక్షి'లో చుక్క కూడా అంటుంది.

'మంచోళ్ళు సెడ్డోళ్ళు అంటూ యిడిగా వుండరు మావా! మంచీ చెడ్డా కలిస్తేనే మడిసి'.

రవణ రచనల్లో ఈ విషయానికి చాలా ప్రాధాన్యత కనబడుతుంది.

రవణ ఏ రచనలోను 'ఇతడు దుర్మార్గుడు. వీని దుండగములకు అంతులేదు' అని తనుగా చెప్పడు. అతని మంచి చెడ్డలు ఎదటివారి కళ్ళలోంచి ప్రతిఫలింపజేస్తాడు. అందుకే రవణ రచనల్లోని ప్రతివ్యక్తిలోనూ మంచీ చెడూ రెండూ కనబడతాయి.

జూల్స్‌వెర్న్ నవలలో అయుదాని రక్షించినపుడు,

"మీరు హృదయం ఉన్న మనుషులు. సహృదయులు" అన్నాడు సర్‌ఫ్రాన్సిస్ ఆశ్చర్యానందాలతో.

"మరే! అప్పుడప్పుడు.. నాకు తీరిక ఉన్నప్పుడు." అంటాడు ఫాగ్.

అలాగే బాగా తీరిక, లేక అందులోనూ ఏదో స్వార్ధమూ వుంటే తప్ప ఏ వ్యక్తీ మరొకడిచేత మంచి అనిపించుకునే పని చెయ్యడు. జీవితయాత్రలో జరుగుబాటుకో, తిరుగుబాటుకో – పొరపాటునో అలవాటునో ప్రతిమనిషి చెడ్డపనో తప్పుపనో చెయ్యక తప్పదు. అంతమాత్రం చేత అతనిమీద దుర్మార్గుడు అనే ముద్ర వెయ్యలేం. జీవిత సమరంలో అస్తిత్వ నిరూపణకి తిమింగిల గిలం' తంతు జరగక తప్పదు.

వేట కథలో రవణ రాసినట్లు 'ఎరని చూస్తున్న పులిని చూస్తున్న వేటగాణ్ణి చూస్తున్న ఎరనీ పులినీ వేటగాణ్ణి చూస్తున్న పులిని చూస్తున్న వేటగాణ్ణి చూస్తున్న ఎరని మేస్తున్న పులిని కాస్తున్న.... సంరంభంలో 'ఏది ఎర? ఏది పులి? ఏది గురి? ఏది బలి? ఎవరు మంచి? ఎవరు చెడు? ఏది పాపం? ఏది పుణ్యం?'

ఈ తత్వదర్శన ఫలితంగా రవణ రచనలు మనుషులతో నిండి వుంటాయిగాని కేవలం మంచివాళ్ళతోను కేవలం చెడ్డవాళ్ళతోను నిండి వుండవు. ఏ కులాన్ని, ఏ వర్గాన్ని, ఏ తరగతిని, ఏ జాతిని మంచిగానో, చెడుగానో రవణ చిత్రించడు.

పడుగూ పేక కలిస్తేనే బట్టకి ఆకారం. వెలుగూ నీడా నిలిస్తేనే మనిషికి ఆధారం.

**రుచిగల భాష**

రవణ రచనలన్నీ తేటయిన వ్యావహారికంలోనే ఉన్నాయి. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రి తెలుగు పలుకుబడిని జీర్ణించుకుని వ్యావహారికంలోని సొగసుల్ని తమ రచనల్లో నిలుపుకోగలిగారు. చాలామంది రచయితలు తాము వ్యావహారిక వాదులమని పబ్లిగ్గా చెప్పుకుంటూనే చాలా గ్రాంధిక రూపాలు వాడుతూ వాక్యనిర్మాణంలో కూడా గ్రాంధిక మర్యాదల్ని పాటిస్తున్నారు. అంటే వ్యవహారంలో ఉన్న పలుకుబడిని పట్టుకోలేకపోయారన్నమాట. రవణ తన రచనల్లో శ్రీకాకుళం దగ్గర్నుంచి అన్నిమండలాల వ్యావహారికాన్ని వాడుకున్నాడు, పాత్రలకి తగినట్లు, సబ్జెక్టుకి అతికేట్లు. చివరికి మదరాసు తెలుగుని కూడా ఉపయోగించుకున్నాడు. వచనరచన చేసేప్పుడు 'సీతాకల్యాణం' ఎంతటి ప్రాబంధిక



శైలిలో రాశాడో అదికాక మిగిలిన అన్ని రచనల్లోను ఉచ్చారణలో శబ్దం ఎలా వుంటుందో 'అక్షరాలా' అలాగే రాశాడు. అంతేకాని పదస్వరూపం మారిపోతోందే, పండితులేమంటారో నన్న జంకు కనబరచలేదు. మాండలిక పదాల్నే కాకుండా సామెతల్ని జాతీయాల్ని కూడా కధావసరం గమనించి ఏ ప్రాంతంలో ఏస్థాయివారు ఎలా ప్రయోగిస్తారో అలాగే రాశాడు. ఆ సామెతలు, జాతీయాలు కూడా అవసరాన్ని బట్టే వాడినట్లు కనబడతాయిగాని రచయిత పాండిత్య ప్రకర్ష ప్రదర్శించటానికి పనిగట్టుకు వచ్చినట్లుండవు.

**'గోల్డ్ కాయినింగ్'**

వ్యావహారికంతోపాటు తనురాస్తున్న సబ్జెక్టులు అప్పు, రాజకీయాలు, సినిమా, ప్రేమ వీటికి తగినట్లు కొన్నివందల పదాలను, పదబంధాలను సృష్టించాడు రవణ. వాటికి తగినట్లు వ్యక్తులపేర్లు సృష్టించుకున్నాడు. తెలుగుభాషకు ఇంత 'కంట్రిబ్యూషన్' మరే రచయిత దగ్గర్నుంచి రాలేదు. అలాగే ఆయా విషయాలకు ప్రత్యేకంగా అతికేట్లు సామెతల్ని, సంప్రదాయపు నుడుల్ని మార్చి రాసుకోవడం కూడా కనబడుతుంది.

**'పొయెట్రీ'ట్ మెంట్**

సామాన్యంగా రచయిత తను చెప్పదలుచుకున్న విషయం కళ్ళకు కట్టినట్లు కనబడడానికి కవిత్వాన్ని వాడుకుంటాడు. నాటకకర్తలు కూడా రంగస్థలంమీద ప్రదర్శించటానికి వీల్లేని విషయాలు కళ్ళకు కట్టినట్లు చెప్పటానికి పద్యాలు రాస్తారు. రవణ దృశ్యసాక్షాత్కారానికి తన రచనల్లో కవితాశైలిని ఉపయోగించుకున్నాడు. పదాలతో, వాక్యాలతో బొమ్మలు తయారుచేసి వాటిని పాఠకుని కళ్ళఎదుట ఆడిస్తాడు. కవితాశైలితో రాయటంతోపాటు రవణ వచనరచనలో ఒక తూగు, గమకం గమనించవచ్చు. వాక్యాలు 'బాలెన్స్‌డ్'గా నడుస్తాయి.

వీటితోపాటు భాషలో వేగాన్ని సాధించాడు రవణ. ఆ వేగాన్ని పదాలలోకి, అక్షరాలలోకి తీసుకురాగలిగాడు. 'తాంబూలాలిచ్చేశారు' కథలో చివర ఉండే ఉత్తరం, వేటకథలో అప్పన్న ఋణదరాజుల సంభాషణ అన్ని రచనల్లో 'కాయిన్' చేసిన కొత్తపదాలు భాషకు రవణ తెచ్చిన వేగాన్ని ప్రదర్శిస్తాయి.

**చిరంజీవులు**

రవణ సృష్టించుకున్న పాత్రలు శాశ్వతత్వాన్ని సంపాదించుకుని చాలా తేలికగా లోకంలో స్థిరపడిపోయాయి. అప్పారావు, రెండుజళ్ళ సీత, గుర్నాధం, బుడుగు, సీగానపెసూనాంబలు పదుగురి నోళ్ళలో పదికాలాల పాటు వినబడే పేర్లు. అలాగే

రాజకీయాలకు, సినిమాలకు అవి చెప్పే ఎడతెగని కథలకు వేసే చిక్కుముళ్ళకు తీసే నేర్పరితనానికి పాతపాత్రల్ని ఉపయోగించుకున్నాడు. బేతాళుడు, విక్రమార్కుడు అలా వచ్చారు. వివిధ విషయాలపై అనర్గళంగా అభిభాషించటానికి తగినవ్యక్తి 'గిరీశం' అని భావించి 'గిరీశం లెక్చర్లు' రాశాడు.

అది నవలయినా, చిన్న కథయినా చివరికి జీవితచరిత్ర అయినా ఎన్నుకున్న పాత్రకు సంపూర్ణ స్వరూపాన్ని ఇస్తాడు రవణ.

**సినిమసీ**

కథనం సినిమాటిక్‌గా సాగటం రవణ ప్రత్యేకత. సినిమా టెక్నిక్‌తో ఫొటోగ్రాఫిగ్గా కథ, సన్నివేశాలు నడవటంతో రచనకో వేగం వస్తుంది. ఒకో సన్నివేశంలో 'త్రి-డి' ఎఫెక్ట్ కూడా కనబడుతుంది.

**సహజీవనం**

మనతోపాటు మనజీవితంలో పక్షులు, జంతువులు కూడా పాలు పంచుకుంటున్నాయి. తెలిసోతెలియకో మనం వాటితో సహజీవనం చేస్తూనే వున్నాం. ఇంత విడదీయరాని అనుబంధంవున్న వాటిని రచనల్లోకి రానియ్యకుండా తోలేస్తుంటారు రచయితలు. రవణ హాస్యానికే కాకుండా విషాదానికి, సెటైర్‌కి కూడా పక్షుల్ని, జంతువుల్ని రచనల్లో వాడుకున్నాడు. మహారాజు - యువరాజు కథలో పిల్లకాకి యువరాజు నెత్తిన రెట్టవెయ్యాలని ఉత్సాహపడటం, ఋణానందలహరి మొత్తం వాటితోనే సాగటం, ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలులో రామనాధంగారి ఉపన్యాస సందర్భంగా కాకి, మేక ప్రవేశపెట్టడం అన్నీ రవణ ప్రత్యేకతను ప్రస్ఫుటం చేసేవే!

**సమస్యలతో 'రణం'**

ఎన్నుకున్న సబ్జెక్టులు ప్రధానంగా అప్పులు, రాజకీయాలు, ప్రేమ, సినిమాయే అయినా చాలా సమస్యలు ప్రతికథలోను తొంగిచూస్తుంటాయి. కొన్ని బాహాటంగా కనబడి తల వేలాడేసేవయితే, మరికొన్ని ఆర్చేవాడివా తీర్చేవాడివా అని పాతకుణ్ణడిగి తలవంచుకు తొలగిపోయేవి. కులాంతర వివాహం, నిరుద్యోగం, ఎన్జీవోల సమస్య, బడిపంతుళ్ళ సమస్య, ఆర్ధిక సమస్య ప్రతిరచనలోను ఎక్కడో అక్కడ ప్రవేశపెట్టకుండా వదల్లేదు.

**అ'మెరికన్లా'టి మనుషులు**

ఇన్నిటితోపాటు ప్రతిసమస్య పల్లెలో ఎలా ప్రభావం చూపిస్తోంది, పట్టణంలో ఎలా చూపిస్తోంది అన్నది కూడా పరిశీలిస్తారు. నగర ప్రభావం, నాగరీకం మీరిపోవటం, విదేశాలపై మోజు కూడా అన్ని రచనల్లోను పరిశీలించాడు. అమెరికాపై మోజుండే భారతీయుల తత్వాన్ని అవహేళన చేశాడు.

**పురుషార్ధాలు-తాత్పర్యాలు**

వర్తమాన సాంఘిక జీవనం తప్పించుకోలేనివి ఎకనమిక్సు, పాలిటిక్సు, సెక్సు, సినిమా : నిజానికివే ఈనాటి చతుర్విధ పురుషార్ధాలు. అందుకని ఈ నాలుగిటితో నాలుగు పుస్తకాలు రాయటంతోపాటు నాలుగిటిని ప్రతి రచనలోను సూక్ష్మంగా ప్రదర్శించటం రవణ కలవాటు.

**'లోనారసిమేలన'గా**

సెటైర్ అనే సాహిత్య ప్రక్రియ ఆంగ్లంలో ఎక్కువగా వర్ధిల్లింది. తెలుగులో వాడుకున్నవారు బహుతక్కువ. తేటగా చెప్పినా, సూటిగా చెప్పినా దులపరించుకుపోయే వ్యక్తికి నాటుకునేట్లు చెప్పటం అవసరం. కాని అలా చెబితే ఆ రచనలు చదవబడకపోగా వీడు నాకు చెప్పొచ్చేవాడా అనే నిందావాక్యానికి గురి అవుతాడు రచయిత. అలాకాక హాస్యాన్ని బాణంగాచేసి, సెటైర్‌ని ములికిగావేసి ప్రయోగిస్తే నవ్వుతూ అందుకుంటాడు. పైకి నవ్వినా ఒంటరిగా ఉన్నప్పుడు అవహేళనకు కనీసం బాధపడతాడు - మారకపోయినా. ఈ బాణానికే 'పారడీ' అనే జిలుగు పెడితే మరింత ఆకర్షణీయంగా ప్రచార సులభంగా రూపొందుతుంది. వర్తమాన సాంఘిక మర్యాదలు చెడ్డవని తోస్తే అవహేళన చేస్తూ, మంచివనిపిస్తే మర్యాదనిస్తూ హాస్య ప్రధానంగా రచనలు చేశాడు రవణ. మామూలుగా చదువుకునేవాడికి హాస్యం చక్కలిగింతలు పెట్టినా, లోనారసి మేలనగలిగేవాడికి కనువిప్పు కలుగుతుంది.

**పారడీ**

రవణ కధని, కధనాన్ని శైలిని, వర్ణనల్ని, పద్యాన్ని, శీర్షికల్ని, చివరకి పాత్ర చిత్రణని కూడా పారడీ చేశాడు. తను ప్రధానంగా తలచిన పురుషార్ధాల వైపు జనం ఎలా పరుగులు పెడుతున్నారో చూసి పరుగునాపి ఎలా ఆలోచింప చెయ్యాలో గురిచూసి హాస్య శర ప్రయోగం చేశాడు.

**వాడేవీడు**

మనిషిలో వుండే ఆస్తిక నాస్తిక భావాల సమ్మేళనంతోపాటు రకరకాల ద్వైత తత్వాలను విశ్లేషించి రచనల్లో ప్రదర్శించాడు రవణ. పాత్రల మనస్తత్వ చిత్రణ విషయంలో రవణ రచన చాలా పరిణతంగా కనబడుతుంది. కథలో అప్పారావుగాని, గుర్నాధంగాని కథాకాలంనాడెలా వున్నారన్నది అతని గత చరిత్రమీద ఆధారపడుతుంది. భావి జీవితం ఎలా రూపు కట్టబోతోందో దానిమీదా ఆధారపడుతుంది. అప్పారావు

– నిన్న, ఇవాళ, రేపు అన్నది ఆలోచించి మరీ, కథలో అతని మాటగాని, చేతగాని రూపొందిస్తాడు రవణ. అలాగే వ్యక్తుల ఆకార విశేషాలు వ్యక్తిత్వంలో ప్రతిఫలిస్తాయి. రవణ తను సృష్టించిన పాత్రల రూపురేఖ విలాసాలు వివరంగా చెప్పి వాటివల్ల ఆ వ్యక్తుల మనస్తత్వాలలో కనబడే ఎగుడు దిగుళ్లు చిత్రిస్తాడు.

### బుడుగు వెంకటరమణ

చిన్నపిల్లల తత్వాన్ని నిశితంగా పరిశీలించి మరీ బుడుగు రాశాడు రవణ. చిన్నపిల్లల్ని చిన్నపిల్లలంటే కోపం వస్తుంది. ఎప్పుడూ పెద్దవాళ్ళతో పోల్చుకుంటారు అన్ని విషయాల్లోను. తమకంటె చిన్నవాళ్ళ దగ్గర పెద్దరికం ప్రదర్శిస్తారు. మనుషులపట్ల, జీవితంపట్ల కొన్ని అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. రవణ బుడుగు ఆటపాటల్ని, ఆశల్ని, ఆశయాల్ని, చదువుసంధ్యల్ని, రాలుగాయితనాన్ని, ప్రేమనీ, అభిమానాన్ని అన్నిటినీ చిత్రించాడు. బుడుగు భాషమీద రవణ భాషా శాస్త్రవేత్త చేసేటంత గొప్ప పరిశోధన చేశాడనిపిస్తుంది.

### కలల్టెక్నిక్

మధ్యతరగతి మనిషి జీవితంలో తగిలే ఎదురుదెబ్బలు తట్టుకోలేక కలల్లోకి ఎలా పరుగులు పెడుతున్నాడో, పారిపోతున్నాడో పట్టి చూపాడు రవణ.

ప్రేమకథాలహరి కూడా 'కలపూర్తిగా చూసి కళ్లు తెరిచాడు గోపాలం' అనే ప్రారంభిస్తాడు.

జీవితం ఉన్నప్పుడు కల, భ్రాంతికూడా వుంటాయన్నది రవణ సిద్ధాంతం. 'పగటికలలు' అనే వ్యాసం కూడా రాశాడందుకే. ఇదే విషయం 'ఇద్దరు మిత్రులు' సినిమా నవలలో సూత్రప్రాయంగా సిద్ధాంతీకరించాడు.

"సమస్యలను, బాధలను ఎదుర్కోలేనివారు చాలామంది వాటిని జయించే పద్ధతి ఒకటే. అవి ఒడిసి పట్టుకునేవరకు పరుగెత్తి పారిపోవడం. ఆ పరుగెత్తే మార్గాలు రెండు. భ్రాంతి మొదటిది. ఇది కారుచౌక. గొప్పాబీదా అందరికీ అందుబాటులో వుండేది. కాని అట్టేసేపు మన్నదు. ఏ సమస్యో గుచ్చుకోగానే మెలకువ వస్తుంది. ఇది పోగానే మళ్ళీ వెంటనే మత్తుకావాలంటే కొందరు భ్రాంది అనువైందనుకొంటారు. కాని భ్రాంతిలాగే ఇదీ కొద్దిసేపు నిలిచేదే."

### ఇదే నా లోకం

సెక్సు, ఎకనమిక్సు, పాలిటిక్సు, సినిమాలను అవహేళన చేసినా, వాటిలో చెడును ఎత్తిచూపటం తన ఉద్దేశం అయినా మానవజీవితం ఆ నాలుగిటితో



ముడిపడిపోయింది. విడదీయటం అసాధ్యం అని గుర్తించి వాటిపట్ల రవణ ప్రేమనే కలిగిస్తాడు కాని ద్వేషాన్ని రగిలించడు. రాజకీయంలోను, సినిమారంగంలోను కుళ్ళు ఉన్నదని చెప్పినప్పటికీ ఆ రంగాలలో తను ప్రవేశపెట్టిన పాత్రలకి, పాఠకులకి కూడా ఆయా రంగాలపట్ల, మానవత్వంపట్ల, సమాజంపట్ల జాలితో, బాధతో కూడిన ఆప్యాయత కలిగేట్లే రచించాడు. అదేకాక ఆ పాత్రలకి, పాఠకులకి కూడా భవిష్యత్తుపై ఆశ, నువ్వువెళ్ళి ఆ రంగంలో నిలబడితే మార్పు వస్తుందేమోనన్న విశ్వాసం కలిగించే విశ్వరూప ప్రదర్శనచేసి ముగిస్తాడు రచనల్ని.

జీవితంపట్ల ఎంత రుచి కలిగిస్తాడో మృత్యువు అంటే భయపడక్కర్లేదన్న సత్యాన్ని అంతఘాటుగా చెబుతాడు.

### ఎక్కువరాయని భాస్కరుడు

దాదాపు పాతికేళ్ళ సాహిత్య వ్యాసంగంలో రవణ పాతిక కథలే రాశాడు. మూడు నవలలే రాశాడు. అవకాశం, అవసరం ఉండికూడా అంత తక్కువ రచనలు చెయ్యటం ఆశ్చర్యంగానే కనబడుతుంది. 'రచయిత ఏదేనా రాయడం కంటె రాయకుండా ఉండటం కష్టం' అన్నాట్ట ఓ రచయిత.

### ముందడుగు

తక్కువగా రాయడంతో పాటు తనకు మించిన విషయాల జోలికి పోకుండా ఉండడంకూడా రవణలో కనబడుతుంది. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే బ్రహ్మచారిగా వున్నప్పుడు 'రాధగోపాలం' సాంసారిక జీవితచిత్రణ చేశాడు. పాలిట్రిక్సు తెలుసుకోకముందు రాజకీయ బేతాళ పంచవింశతిక రాశాడు. సినిమారంగానికి దూరంగా వున్నప్పుడే 'విక్రమార్కుడి మార్కు సింహాసనం' రాశాడు.

### బి.జి.యమ్

రవణని ప్రధానంగా ప్రభావితం చేసింది వాల్మీకి. ముఖ్యంగా ఉపమానాల ప్రయోగంలో రవణపై వాల్మీకి ప్రభావం ఎంత గాఢంగా ఉన్నదీ స్పష్టంగా కనబడుతుంది. ఒక వస్తువుకి ఒక ఉపమానం చెప్పడంతో తృప్తిపడక వరసగా పది పదిహేను చెప్పడం వాల్మీకి రచనలోను, ఆ పద్ధతినే సాగే రవణ రచనల్లోను చూడవచ్చు.

గురజాడ అప్పారావు ప్రభావం రవణ రచనలపై వుంది. పాత్రల రూపకల్పన, మాటతీరు, సన్నివేశ కల్పన, ఆ సన్నివేశాలలో పాత్రలు సంచరించే విధానం అన్నిటిలోనూ కన్యాశుల్కం వరవడిగా తీసుకున్నాడు రవణ అనిపిస్తుంది. ముఖ్యంగా ఏ పాత్రనించీ తను తొంగి చూడకుండా అన్నిటిపట్లా సమానమైన ఆదరాభిమానాలు ప్రదర్శించే 'నాటకీయ పద్ధతి' అప్పారావుగారినించే రవణ నేర్చుకుని వుంటాడు.

గురజాడతో పాటు హాస్యరచనకు, సెటైర్‌కి రవణ గురుతుల్యునిగా ఎంచుకున్న వ్యక్తి భమిడిపాటి కామేశ్వరరావు.

కథ రాయడంలోను, కథనంలోను శైలిలోను రవణను ఆకర్షించి రవణ రచయితగాను, వ్యక్తిగాను రూపొందటానికి తోడ్పడింది మల్లాది రామకృష్ణశాస్త్రిగారు.

**ఇద్దరుమిత్రులు**

బాపు రవణలకెంత వయస్సుందో వారి స్నేహానికీ అంతే వయసు. బంగారుకలలు కనే బాల్యంనుంచి, కలల్నేకాక మంచిచెడుల్నీ, వెలుగునీడల్నీ కలబోసుకుంటూ కలిసిమెలిసి వున్నారు. వ్రాతపత్రిక నడిపినా జ్యోతిపత్రిక నడిపినా ఇద్దరి ఆలోచన, ఆచరణ ఒకే బాటలో నడిచాయి. బుడుగుకు రవణ రాత ప్రాణం పోసిందో, బాపు గీత ప్రాణం పోసిందో తేల్చిచెప్పటం కష్టం. ఆ రచనలోలాగే జీవితంలోనూ ఒకరికిద్దరై ఇద్దరూ ఒకటై కళనే కళకళలాడించే అదృష్టం వారికి లభించింది అనటంకంటె తెలుగువారికి లభించింది అనటం బావుంటుంది.

**అడుగుజాడ**

రవణ తన వరవడితో తన బాణీతో తన ప్రభావాన్ని చాలామంది మీద ప్రసరించాడు. కవులు, కథకులు, జర్నలిస్టులు, జీవితకథకులు చాలామంది రవణని ఆసరాగా తీసుకున్నారు. అంతమంది అనుకరించటానికి ప్రయత్నించినా ఆయా ప్రక్రియలలో రవణ ప్రతిభ ఇనుమడించిందేగాని ఇంచుకంత కూడా తగ్గలేదు.

**ఎడ్వాన్స్ బుకింగ్**

పుస్తకాల ప్రచురణలో రవణ రచనలు విప్లవాత్మకమైన విజయాన్ని సాధించాయి. 'కథానాయకుడు కథ'కి ప్రచురణకు ముందే 5500 కాపీలకు ఆర్డర్లు వచ్చాయి. విడుదలయిన పదిరోజులలో మరో ఆరువేల కాపీలు అమ్ముడయాయి. తొలిసారిగా తెలుగు పుస్తకానికి మార్కెట్‌పెంచి 'ఎమెస్కో' పాకెట్‌బుక్ ప్రచురణకు పునాది వేసిన ఘనత 'కథానాయకుడు కథ' కే దక్కింది. అలాగే 'బుద్ధిమంతుడు' నవలకు కూడా ప్రచురణకు ముందే ఎనిమిదివేల కాపీలకు ఆర్డర్లు వచ్చాయి.

**తొలిపలుకున తుదిపలుకు**

రవణ సాహిత్యార్ణవంలో రత్నాలే తప్ప నత్తగుల్లలసల్లేవు. ఇది నా దృష్టిదోషం కాదు. రవణ సృష్టిదోషమే! సీరియస్‌గా నవలరాసినా, సీరియల్గా కథల్రాసినా, సినిమాకి రాసినా, సినిమా నవలరాసినా, అనువాదం చేసినా తను నమ్మిన సిద్ధాంతాల్ని, తనకు తెలిసిన సత్యాల్ని, తనకు నచ్చిన విషయాల్ని స్పష్టంగా సుందరంగా సూటిగా చెప్పాడు.



అందువల్లనే ముళ్ళపూడి వెంకటరమణ సాహిత్య పరిశీలనలో రవణ రాసిన ప్రతి పుస్తకాన్ని ప్రతి వ్యాసాన్ని మీ ముందుంచ దలుచుకున్నాను. ఆ ఉత్సాహంతోనే అచ్చయిన పుస్తకాలేకాక అందినంతవరకు సంపుటాలలోకి రాని రచనల్ని, అచ్చుకాని సినిమాస్క్రిప్టుల్ని కూడా యిందులో పరిశీలించాను. ఏ రచనయినా యిందులో చెప్పాల్సిందేమీ లేదు అనేట్లు లేదు. రవణ రాసిన ప్రతి అక్షరం రవణని ప్రత్యక్షం చేస్తుందనటానికి సాక్ష్యం మీముందున్న పుస్తకమే!

పదండి ముందుకు...



*నవోదయ, బాపూ, ఎమ్వీయల్, రమణ, పులిదిండి రాజు, నందూరి రామ్మోహనరావు, బి.వి.సీతారాముడు గార్లు*




# ఋణానందలహరి

**'హాస్యమందున అఋణ'**

ప్రేమను ప్రేమించిన రవణ 'ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ' రాశాడు. రాజకీయాల అరాజకీయాల్ని ద్వేషించిన రవణ 'రాజకీయ భేతాళ పంచవింశతిక' రాశాడు. సినీమానిసి సెరిబ్రల్ సినిమియాని స్టడీ చేసిన రవణ 'విక్రమార్కుడి మార్కు సింహాసనం' రాశాడు. పిల్లల్ని, పువ్వుల్ని, నవ్వుల్ని వరించిన రవణ "బుడుగు" రచించాడు. అప్పుల్నీ వాటివల్ల జరిగే తప్పుల్నీ, ముప్పుల్నీ మెప్పుబడయునట్లు, ఒప్పుగా, ప్రతిపద హాస్యమొప్పుగా రవణ 'ఋణానందలహరి' రాశాడు. జీవితానికి నిర్వచనం ఏమిటి? అన్న ప్రశ్నకు రవణ జవాబ్దారిగా "ఋణానందలహరి" అన్నాడు. నిజం! ఈ మాట నమ్మకపోతే మీరు 'ఋణానందలహరి' చదవనంత ఒట్టు!

అఋణ కిరణాలతో హాస్యాన్ని మేలుకొలిపాడు రవణ. అందుకే 'హాస్యమందున అఋణ బుడుగు వెంకటరమణ' అని ఆరుద్ర చెప్పింది అక్షరాలానిజం. హాస్యం



పుట్టుకలో ఒర్జినాలిటీని, పవిత్రతలో వర్జినాలిటీని ప్రదర్శించిన రవణ హాస్య సృష్టిలో ఎవరికీ చివరికి "బ్రహ్మ"కి కూడా ఋణగ్రస్తుడు కాలేదు. తను రాయదలుచుకున్న సబ్జెక్టుకి అతికిపోయే అప్పారావుని తనే సృష్టించుకున్నాడు.

**ఋణానుబంధ రూపేణ**

'ఏదో ఋణానుబంధం వుండబట్టి...' 'వాడికి ఋణం తీరిపోయింది'. ఈ మాటలు ప్రతివారి నోటా ఏదో ఒకనాడు రాక తప్పదు. ఋణానుబంధం వుండబట్టే మీకూ నాకూ అప్పారావుకీ స్నేహం కలిసింది. ఋణానుబంధం తీరిపోయి స్నేహం (నూనె) కాస్తా యిగిరి చక్కా పోతే దీపం కొండెక్కి పోతుంది. మళ్లా కిందికి దింపి వెలిగించటం కష్టం. అందుకే 'పరిచయాలు, స్నేహాలు, అంతర్జాతీయ సంబంధాలూ ఎలా పుట్టి పెరిగి విరుగుతాయనీ! అప్పుల మూలాన్నే కదా!' అంటాడు అప్పారావు. అతనింకా బోల్డు అనగల్డు. ఆనక పరిచయం అయ్యాక విందాం ఇంకా ఏం అనగల్డో.

పై పేరాలో నాలుగువాక్యాలు పట్టుకుచూస్తే వేదాంతం ఘాటు మొహం పగిలేలా కొడుతుంది. దానివల్ల వైరాగ్యం వచ్చే ప్రమాదం పసికట్టి రవణ ఋణాల దాఋణాలకి వేదాలు, పురాణాలు ఆధారాలు చూపి ఆ సబ్జెక్టుకో సుళువూ, ఆ సబ్జెక్టులో 'ఆరి' మరియు తేరినవారికి బాధ్యతా అంటగట్టి 'హెవీస్టఫ్' కావాల్సినదాన్ని లైట్‌స్టఫ్‌గా మార్చి నవ్వేస్తాడు, నవ్వించేస్తాడు, కరెక్టుగా చెప్పాడని నమ్మించేస్తాడు.

'ఈ భ్రమా భ్రమణం మధ్య అఖండ జ్యోతిలా వెలిగేది డబ్బు' అని అవగాహన చేసుకుని "ఋణవృక్షం" కింద ఋణబుద్ధుడుగా మారిన అప్పారావు ప్రపంచతంత్రం యొక్క పరమ సత్యాన్ని బోధిస్తాడు. ఆ యొక్క జ్యోతి లేకపోతే జీవితం, ప్రపంచం, జేబు అంతా చీకటి. కవిత్వాలు, రాజకీయాలు, ప్రేమలు, ఒడంబడికలు, మినిష్టర్ల టూరు,స్టేటుమెంట్లు, స్టేటుమెంటాలిటీలూ అన్నీ దాఋణంగా స్తంభించిపోతాయి.

**అప్ సారస్యం**

"అప్పంటే ఏమనుకున్నావు? మహా పవిత్రమైనది. పంచభూతాలలో ఒకటి. పృధ్వి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశం అన్నారు. ఇదీ వరస. ఏడాది పొడుగునా సముద్రుడి దగ్గర 'అప్పు' పీల్చేసుకుంటాడు అఋణ కిరణాలవాడు. అందుకే ఏడాది తిరిగేసరికల్లా బాకీ తీర్చేస్తాడు వఋణుడు. ఋణాలు తీర్చమని వఋణుడిని కోరేవే ఋక్కులు. వీటితోటే వేదాలనే నాలుగు ఋక్కులు రాశార్ట' అని ఋణచరిత్రమీద, ఋణగ్రహణశక్తి మీద పరిశోధించి, సత్యాన్ని సాధించి ఆరాధించి వివరించాడు డాక్టర్ అప్పారావు.

'కర్ణుడు దుర్యోధనుడి దగ్గర అప్పుచేసి దానాలు ఇచ్చేస్తుండేవాడు' అని అప్పారావు చెబితే ఎంత ఆలోచించినా కాదనలేం.

'హరిశ్చంద్రుడికి యిరుగుపొరుగు చక్రవర్తుల దగ్గర అప్పు చెయ్యాలన్న ఊహ పోకనే నక్షత్రకుడితో నానా అవస్థలూ పడ్డాడు. ఈ అయిడియా తగిల్తే ఆ పని చేసేవాడు కాదంటావా? అసలు అప్పుడు కూడా అపకీర్తి శేషుడు కాగల ప్రమాదం లేదుగా' అని అప్పారావు అంటూంటే హరిశ్చంద్రుడిమీద జాలేస్తుంది. అప్పారావులాటి సలహాదారుడుంటే ఆయనన్ని కష్టాలు పడేవాడు కాదుగదా అనిపిస్తుంది.

**అప్ సోషలిజం**

'కోటీశ్వరరావు' లక్షలప్పుల్చేస్తాడు. 'లక్షాధికారి' వేలప్పు చేస్తాడు. 'వేలా'యుధం వందలప్పు చేస్తాడు. 'వంద'నం అయిదు పదీ అప్పు చేస్తాడు. తాతా, బిర్లా, తాబీ తర్లాల దగ్గర్నించి నువ్వూ నేనూ వరకు అప్పుల్చెయ్యడం తప్పనిసరి.

'రాక్ ఫెల్లర్‌కి యెంత డబ్బున్నా జేబులో వేసుకు తిరగడు గదా! ఓ అర్ధణా బటానీలు కొనబోయినపుడు చెక్కులిస్తే వాడు పుచ్చుకోడు గదా! అప్పుచెయ్యకేం చేస్తాడు పక్కవాడి దగ్గరా?'

రాష్ట్రప్రభుత్వం కేంద్రం దగ్గర, కేంద్రప్రభుత్వం అమెరికా దగ్గర అప్పుచేసినట్లే పాములు చీమలదగ్గర 'పుట్ట'లు అప్పుచ్చుకుంటాయి. (చూ. చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు.)

ఈ కథలో చీమలు పెట్టిన పాముల పుట్టను చీమలు మళ్లా మెట్టడానికి తలపెట్టినపుడు, ఆ చీమల్ని పొట్టన పెట్టుకోడానికి పాములు ప్రయత్నించడం, ఆ పాముల్ని కుట్టడానికి దేగలు రెక్కలు కట్టుకురావటం- యిదంతా దేనివల్ల 'ఋణానుబంధం' వల్ల. పుట్ట పట్టనన్ని చీమల్ని సపరివారంగా దండునడిపించడం, సుబ్బన్న, నాగలక్ష్మి అను నాగ దంపతులు వచ్చి పుట్టపై 'తృ' హక్కును వివరించి వెంటనే 'జ్మ' చేయించవలసిందిగా కోరటం 'గరుడదర్శనం' కాగానే పడగలు వంచుకుని బుద్ధిగా పొదరింటికి చేరడం మొదలుగా గల కథను హాస్యరసవత్తరంగా రచించాడు రవణ.

ఈ కథ చదువుతుంటే రవణ మన కథల్ని చీమమీద, పాముమీద పెట్టి చెబుతున్నాడనిపిస్తుంది. కాని కాదుట : "సుబ్బన్నకి దూరంగా ఆగి బకబక నవ్వి, ఈ సింహాద్రిగారు మన కథలనే మనుష్యులమీద అల్లి తమాషాగా చెబుతున్నారు" అంటుంది దారిన పోతున్న బాతు.



**పంచతంత్రం+వాల్ట్ డిస్నీ = ముళ్ళపూడి**

పిట్టలమీద, జంతువులమీద పెట్టి నీతికథలను చెప్పటం పంచతంత్రంలో కనబడుతుంది. ఆనక వాల్ట్‌డిస్నీ తన కార్టూన్ చిత్రాల్లో జంతువులతోనే కథల్ని నడుపుతాడు. ఇది 'ఋణానందలహరి' అనే ప్రపంచ తంత్రంలో 'టెక్నిక్ కలర్'లో కనబడుతుంది. కాకి వేసే కావు కేకలు, కావులింతలు, చీమల చిమ చిమ నవ్వులు, పాముల 'దోబుస'లు 'బుస్సు'న తేన్చటాలు తెలుగు సాహిత్యంలో రవణతోనే శ్రీకారం చుట్టుకుని ఆకారం దిద్దుకున్నాయి.

**పల్లెపట్టు, పట్టణంపట్టు**

గుర్నాథం, అప్పారావు కుర్రకారు మనుషులు. మునసబుగారు, నర్సయ్య వగైరాలు పెద్దకారు మనుషులు. పట్నాల్లో కుర్రకారు భానుమతి వెళ్లిన సినిమాకి వెళ్ళటానికి, సీత నడిచే రోడ్డులో బీటు కాయటానికి అప్పుల్జేస్తారు. పల్లెటూళ్ళో శేషయ్యలూ పెరుమాళ్ళూ నర్సయ్యలూ అప్పు చెయ్యటం ఒక కళగా ప్రాక్టీస్‌చేసి ఎగ్గొట్టటం హాబీగా పెట్టుకుంటారు.

"తిరుగు టపాలో కట్నం బకాయి జ్మకాని పక్షంలో తృ కుమారుడు చి॥ వెంకట్రామయ్య పునర్వివాహ శుభలేఖ మరుగు టపాలో అందగలదని" పాతకారు మనుషులు ఉత్తరాలు రాసుకునేవారు. ఆ తరం ఋణానుబంధాలు అలాటివి. అప్పులిచ్చి పుచ్చుకుని 'డబ్బు చెడ్డవారు చివరికి స్నేహం, బంధుత్వం చెడ్డవారు' కూడా అయిపోతారు.

'నరసయ్య గాడున్నాడంటే మహాటక్కరి. వస్తూనే ముందు నా దగ్గర చేకాపు రొక్కం రెండొందలుంటుందని చెప్పించుకున్నాడా ఆనక మళ్ళీ కాదనకుండా.'

నర్సయ్య మునసబు దగ్గర వందరూపాయలు వడేసి పట్టుకుపోతుంటే కోడలుపిల్ల కిసుక్కున నవ్వింది యిదేనా తమ పెవేజకత్వం అన్నట్లు.

'కోడలా – నీక్కూడా నవ్వొచ్చెనే తల్లీ. చూదాం రేపొద్దున నీమొగుడెంత పెవేజకత్వం చూపిస్తాడో! నాదేముంది అంతా అయిపోయే. మాకూ మాకూ మొహమాటాలుంటాయి'.

ఇలా అని నర్సయ్యలాటి ఋణబంధువుకి తిరిగిరాదని తెలిసికూడా అప్పులిచ్చే మునసబు పాతతరం మనిషే! కుర్రతరంవారికి వడేసి అప్పు పట్టటమూ తెలీదు. ధారాళంగా అప్పులివ్వటమూ తెలీదు.

'ఈ తరం సజ్జు ఉట్టి కుర్రనాగమ్మలు, అప్పు అడగడం కూడా చేతగాదు. ఎందుకు పనికొస్తారంట?' అని మునసబన్నాడంటే అనడామరి! నిజంకూడా అంతే!

## ఋణసూక్తం

'జీవితమే పెద్ద అప్పు'

'అప్పుడక్కపోతే వాడెవడో మనమెవడో'

'అడిగితేనే ఇవ్వడం ఇస్తేనే పుచ్చుకోవడం పుచ్చుకుంటేనే మళ్ళీ ఇవ్వడం ఈ మూడు లేకపోతే జీవితం బోరు కొట్టెయ్యదూ'!

'అప్పు పుట్టించే తాహతూ పలుకుబడీయివే ఒహడి గొప్పతనానికి గీటురాళ్ళు.'

'అప్పులు ముప్పులు నివారించే శ్రీరామ రక్షలు.'

'అప్పనగా నేమి? మనచేతిలో పాతిక రూపాయల్ని కాసేపు గుర్నాధాన్ని పట్టుకోనివ్వడం'.

అంతెందుకు 'చంద్రుడు' సూర్యుడి దగ్గర్నించి కాంతిని అప్పు తీసుకుంటాడు. అందుకే ఋణ కిరణుడయ్యాడు. సూర్యుడు కాంతిని ఎక్కడా అప్పుచ్చుకోలేదు. అందుకే అఋణ కిరణుడయ్యాడు. ఈ ప్రాధమిక సత్యంతోనే ఋణానందలహరి ప్రారంభమవుతుంది.

"ఋణ కిరణాలతో లోకాన్ని జోకొడుతున్న చంద్రుడు

అఋణకిరణుడు కనుచూపు

మేరలో కానరాగానే తెల్లబోయి పాలిపోయాడు."

ఈ ఋణోపదేశాన్ని మరింత నిష్ఠగా విస్పష్టంగా విశిష్టంగా పొందదలుచుకుంటే పక్కపేజీ అప్పుతీసుకుని ఆక్రమించిన అప్పారావుని పరిచయం చేస్తా పదండి.

## మీట్ మిష్టరప్రావ్

'అప్పారావు నాకు మెడ్రాసులో స్నేహం అయ్యాడు నాన్నా' అన్నాడు గుర్నాధం.

'ఎంత స్నేహం అయితే మటుకు యిలా స్వగ్రామాలదాకా తరివి అప్పులడుగుతారుటోయ్? ఇదెక్కడి స్నేహం' అన్నారు మునసబుగారు ఆలోచించి.

కాని అప్పారావు సంగతి మునసబుగారికేం తెల్సు? అప్పారావుని అర్ధం చేసుకోవటానికి గుర్నాధానికి బోల్డు డబ్బు ఖర్చయింది.

ఓనాడు గుర్నాధం బాత్‌రూమ్‌లోంచి మేకప్ రూములోకి వచ్చి గావుకేక పెట్టాడు తన చొక్కా కనపడక. 'ఎవరో నల్లటి పొట్టివాడు హడావుడిగా వచ్చి తొడుక్కుపోయినట్టు గుర్తు' అని అప్పారావు రూపురేఖల్ని అభివర్ణించాడు మిత్రుడు. గుర్నాధం గుండె గుభేలుమనగా వెతికి వెతికి అప్పారావుని కనిపెట్టి పట్టుకునేసరికి జేబులో డబ్బు



కాస్తా అప్పారావు చేసే దానధర్మాలకీ యజ్ఞయాగాలకీ ఖర్చయిపోయింది. భానుమతి వెళ్ళిన సినిమాకి వెళ్ళటానికి తగినడబ్బు 'సంపాయించటం'లో అతడు చూపిన వొడుపు 'అన్నపూర్ణ పెళ్ళి ప్రమాదము' తప్పించుటలో అప్పారావు ప్రదర్శించిన ప్రెజ్ఞ గుర్నాధాన్ని మూర్ఛపోయేటట్టు చేశాయి. ఆ పిమ్మట అప్పారావు గురించి చాలా తెలుసుకున్నాడు గుర్నాధం.

## ఋణాకారం

"అప్పారావు కొత్త రూపాయినోటులా ఫెళఫెళలాడుతూ ఉంటాడు. కాలదోషం పట్టిన దస్తావేజులాంటి మాసిన గుడ్డలూ, బడిపంతులుగారి చేబదుళ్లలా చిందరవందరగా ఉండే జుట్టూ, అప్పుతెచ్చిన విచ్చురూపాయలా మెరిసే పత్తికాయల్లాంటి కళ్ళూ, అప్పులివ్వగలవాళ్ళందర్నీ చేపల్లా ఆకర్షించగల యెరలాటి చురుకైన చూపులూ – అతను బాకీలవాళ్ళకి కోపిష్టివాడి జవాబులా టూకీగా వుంటాడు."

"అతని పుడకల్లోనే వాళ్ళనాన్న ఉగ్గు పొరుగింట అప్పు తెచ్చి పట్టించాడు."

"అతను యెప్పుడు యెవర్ని యెంత అడుగుతాడో యెవరి దగ్గర యెంత ఎలా పుచ్చుకు చక్కాపోతాడో అతనికే తెలియాలి. అతనికీ తెలియదేమో కూడా! ఆ ఋణలీల మనకి అర్ధంగాదు."

## ఋణ ప్రతిష్ఠ

'నీకు తెలుసో తెలీదోగాని యిండియా గవర్నమెంటువాళ్లు, ఇంకా చిన్న సర్కార్లవాళ్ళు, రిజర్వు బ్యాంకువాళ్ళు దేశంమీదా విదేశాలమీదా అప్పులు నొల్లుకోవాలంటే బ్యాంకీలవాళ్ళు డిబెంచర్లు ఫ్లోట్ చెయ్యాలంటే ఓం ప్రధమంగా యితన్ని ముందుగా సలహా అడిగిగాని మరొకపని చెయ్యరట. ఫోర్డు, రాక్ ఫెల్లర్, జెబి టేలరు, సి.డి. దేశ్‌ముఖ్ వీళ్ళంతా కూడా ఇతనికి ఉత్తరాలు రాస్తారట.'

ఇదీ టూకీగా అప్పారావు గురించి గుర్నాధం చెప్పగా – మునసబు గారికీ, మనకూ తెలిసిన వైనం. మనకు తెలీని వైనాలు బోల్డు వుండవచ్చు. అవి లోకంలో కిక్కిరిసిపోయివున్న అప్పారావుల్ని చూస్తే యిట్టే తెలిసిపోతాయి.

## రవణా బ్రహ్మ

ఇదే రవణ ప్రత్యేకత. అప్పారావు అన్నిజాతుల్లోనూ, మతాల్లోను, అన్ని కులాల్లోను వుంటాడు. అన్ని తరగతుల్లోనూ వుంటాడు. (తరగతులంటే బళ్ళో క్లాసులేగాక మాస్ పీపులు, క్లాస్ పీపులూ అని కూడా అర్ధం పర్ధం అన్నమాట). షేక్స్‌పియర్ "ఫాల్‌స్టాఫ్" షెరిడాన్ 'మాలెప్రాప్' గురజాడ 'గిరీశం' లాటి పాత్రలు అన్ని కాలాలకీ అన్ని దేశాలకీ సరిగ్గా అతికిపోతాయి.

అలా అపూర్వ సృష్టి అనదగిన పాత్ర తెలుగు లిటరేచరులో మరోటివుంది. అదే నక్షత్రకుడి పాత్ర. గౌరన అనే ద్విపద కవి హరిశ్చంద్రోపాఖ్యానంలో 'నక్షత్రకుడి' పాత్రను సృష్టించాడు. ఏనాటికీ శాశ్వతంగా అలానిలిచిపోయే వుంటుంది.

అలాగే అప్పారావు.

**ఋణజ్ఞాని**

'ముందర మీ బాకీ ఫయిసలయిందిగదా అమ్మయ్యా. గుండెల మీద రాయి దిగినట్టువుంది. అదేమిటో ఆ రాయి లేకపోతే నాకు నిద్రపట్టదు' అన్నాడు అప్పారావు మున్సబుగారితో.

అప్పారావు గిరీశం తోబుట్టినవాడు కొన్ని లక్షణాల్లో.

'మంచీ చెడ్డా అనేవి రిలెటివ్– మనిషికీ మనిషికీ ఉండే చుట్టరికాన్ని బట్టి ఉంటాయి. నేనంటే మీకు గిట్టనపుడు నాకు మంచిది మీకు చెడ్డది' ఇలాంటి విలువైన ముక్కలు మహాజ్ఞానిలా అనగలిగే గిరీశంలానే అప్పారావు, 'యింగ్లీషూ అదీ విని దంగై నాలిక్కరుచుకుంటారు విన్నవాళ్ళు.

రవణ కథల్లో అక్కడక్కడా అప్పు ప్రస్తావన రాక తప్పదు. అప్పారావు కూడా సాక్షాత్కరించకా తప్పదు. కాని ఋణానందలహరిలో అప్పారావు ఆకారవికారాలు, అలవాట్లూ, ఆదేశాలు, ఉపదేశాలు, ఉపన్యాసాలు, ఉపసంహారాలు అన్నిటితో అతని సమగ్ర స్వరూపం కనబడుతుంది.

**ఋణక'ధనం'**

రవణ కథనం స్క్రీన్ ప్లేలా వుంటుంది. అందుకే కథ చదువుతుంటే కళ్ల యెదుట నిమిషానికి ముప్ఫయ్యారు 'ఫ్రేము'లు చకచకా తిరిగి పోతున్నట్టనిపిస్తుంది.

**దృశ్యం 10. పగలు – పుట్టదగ్గర**

కథ వింటున్న సుబ్బన్న, నాగలక్ష్మి యీ మధుర ఘట్టాన్ని తలుచుకుని ఒకరినొకరు ఓరకంట చూసుకున్నారు. (క్లోజప్).

అదిగో ఆచూపులే మీ యిద్దరినీ వొకే క్షణంలో మోసగించాయి.

(చీమల సింహాద్రి డైలాగు O.B. అంటే సింహాద్రి డైలాగు నాగదంపతుల క్లోజప్‌మీద వినబడుతుంది కాని సింహాద్రి కనబడదు.)

**దృశ్యం 86. పగలు – శివాలయం దగ్గర**

అప్పారావు ఊరి శివారు దగ్గర శివాలయం చేరువలో ఋణాశలా నిలబడ్డాడు. గుర్నాధం చెప్పగా చెప్పగా మునసబుగారు ఋణ తేజస్వంతరావు అయిన అప్పారావుని



చూడాలని ముచ్చటపడి బయల్దేరారు. శివాలయం మొగదల్లో బసచేసిన సుబ్బారావు మునసబుగారికి అయిదు వందలివ్వాలి. అది మునివేళ్లతో పట్టుకుని అలా గుర్నాధం జతగాడైన అప్పారావుకి బదలాయించవచ్చునని ఋణాలోచన చేశారు మునసబుగారు.

కాలరట్టుకుని గజ్జెల గుర్రంలాటి చిన్నది చూపుల కొంకితో లాగేయగా గుర్నాధం మధ్యలో ఆగిపోయాడు. మునసబుగారు అప్పారావుని సమీపించారు.

అప్పారావే సుబ్బారావనీ, సుబ్బారావే అప్పారావనీ మీకు తెలుసు నాకు తెలుసు మునసబుగారికేం దెల్సు?

ఇక చదవండి ఫ్రేములెంత చలాకీగా క్లోజప్పుల్లోకి ట్రాలీ షాట్లలోకి మారిపోతాయో!

ము : 'నువ్విలా ఇచ్చావో నేనలా మరొకరికి ఫిరాయించేస్తా. మా పిల్లడి జతగాడికి పాపం అర్జెంటుగా కావాలట.'

అప్పారావు గుండె ఠంగున ఆగిపోయింది. అంతలో అల్లంత దూరాన గుర్నాధాన్ని చూడగానే మళ్లా గబగబా కొట్టుకుంది.

(ఇద్దరి బుజాల మీంచి లాంగ్‌షాట్‌లో గుర్నాధం – గజ్జెల గుర్రం దెబ్బకి మెడ బెణికినవాడై.)

ము : సుబ్బారావూ–వాడేనోయ్ మా పిల్లడు.

అ : చిత్తం. వాడే మా జతగాడు.

గు : హలో! అప్పారావు, సారీ లేటయింది.

అ : వేళకొచ్చావురా.

ము : నీ పేరు సుబ్బారావు గాదటోయ్?

అ : (చెడ్డ బతాణీ నమిలిన వేదాంతిలా నవ్వి) వాటీజినే నేమ్‌సార్? పేరులోనేముంది?

కట్.

**ఋణవచనాలు**

రవణ రాసిన తెలుగునుడి మాంఛి పల్లెటూరి పలుకుబడికి గుడి.

'నాన్నమ్మ కూతురు వరాలమ్మకు మనువెలా అయిందనీ, అదంతా ఓ గాధ గాదుమరి. తాతబ్బాయీ రావకిష్టుడూ ఇద్దరూ తోడబుట్టిన వాళ్లేనాయె. ఏణ్ణార్థం అటూ ఇటూ గాళ్లేనాయె'.

**పారడీగా'రడీ'**

సంప్రదాయం అపమార్గం పట్టినప్పుడు విసర్జించకుండా దాన్ని పారడీ చేసి అవహేళన చేస్తాడు రవణ.

'అప్పుకవీయం' టైటిల్ ప్రసిద్ధ ఛందోగ్రంథం – 'అప్పకవీయా' నికి పారడీ. ఋణానందలహరిలో కనబడే ఇరవై ఆరు ఉపశీర్షికలు ప్రాచీన కావ్యాల్లో ప్రచురణ కర్తలు పెట్టే శీర్షికలకి పారడీ.

ఉదా : అప్పారావు ఋణ హృదయము వివరించుట.

వచ్చినవాడు అప్పారావు

(వచ్చినవాడు ఫల్గునుడవశ్యము గెల్తుమనంగ రాదు.)

ప్రమాదము తప్పిన ప్రకారము.

చీమా పాముల సంవాద ప్రకారము.

బాతు పరిహసించుట.

గరుడ దర్శనం.

వారేవీరు లేక పరివర్తనము.

ఫలశ్రుతి.

తెలుగులో జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రిగారు 'పారడీశాస్త్రి' గా పేరు పొందారు. కందుకూరి వీరేశలింగంగారు 'అభాగ్యోపాఖ్యానం' అనే పారడీ కావ్యాన్ని తెలుగు ప్రబంధాలను అవహేళన చెయ్యటానికి రాశారు.

ప్రబంధ కథాసరణిని పారడీచేస్తూ ఇందులో 'ఋణదత్తుని కథ' రాయటం జరిగింది.

ఋణసుందరి అనే నాయికకి ఋణతిలక అనే చెలికత్తె వుండటం ఋణదత్తుడనే కథానాయకుడు ప్రథమ వీక్షణంలో మోహించటం, తరువాత కథ అంతా ప్రబంధ కథ ఫక్కీలో జరిగిపోతుంది.

'బుక్‌చేసిన సీటు మా జీవితం' అన్నవాక్యం 'వడ్డించిన విస్తరి మీ జీవితం' అన్న శ్రీశ్రీ పద్యపాదానికి పారడీ.

ఇలా శీర్షికలు, పేర్లు పెట్టడం దగ్గర్నించి కథనంలోను, సంభాషణల్లోనూ కూడా పారడీ చెయ్యటం రవణ రచనలోని ప్రత్యేకత.

## మరిగుప్పెడు చెప్పతగిన విషయాలు

ఋణరచనకు తగిన పదాలను సృష్టించడం మరో ప్రత్యేకత.

హలో, హలో, (అయిదు రూపాయలు) ఋణలీల, ఋణ హృదయం, ఋణ తరుణహాసం, ఋణశాస్త్రజ్ఞులు, చేకాపు, ఋణ గ్రహణ విద్య, ఋణరంగం, ఎదురప్పులు, అలాగే బాకీలు 'కాబోలీ దెయ్యం'లా వసూలు చేసేవాడికి ఓ బిరుదు 'క్రూరఅప్పులవాడు' అని.



## ఋణబారసాల

ఋణకిరణుడు, అఋణకిరణుడు, సుబ్బన్న, నాగలక్ష్మి, ఋణదత్తుడు, ఋణబుద్ధి, ఋణసిద్ధి, ఋణసుందరి, ఋణతిలక, ఋణకేతుడు, అఋణ, కఋణ, చేబదులు చెంచయ్య, ఏడుకొండలు (వడ్డీలకిచ్చేవాడు) అనే నామకరణాలు, మునసబులూ, నర్సయ్యలూ, పెరుమాళ్లూ ఋణానందలహరి నిండా కనబడి పేరులోని పెన్నిధులను పాఠకుల కందిస్తారు.

చీమలకి, పాములకి, కాకులకి, లోకులకి తగినట్లు సామెతలు మార్చిరాయటం ఒక నూతన సృష్టి.

పాము "కోటికి పడగెత్తి పుట్టింది."

కాకులు 'రెక్కాడితే కాని డొక్కాడనివాళ్ళు'. పెద్దకాకి పిల్లకాకిని 'కాకమ్మ కబుర్లు' చెప్పొద్దని కావుకేకలు వెయ్యటం.

ఉపమానాలు కూడా అప్పుచుట్టూ పరిభ్రమించేట్లు చెయ్యటం.

'అప్పులు తీర్చేసినవాడి మనసులా!'

'అప్పుచేసిన డబ్బులా హడావిడిగా ఖర్చయిపోయింది.'

'తొలిసారిచ్చిన చేబదులు డబ్బులా'

'లోభి జేబులో డబ్బులా'

'దివాలా ఎత్తినవాడి పరువులా!'

## కొన్ని సూక్తులు-దీవెనలు

'ఏ జేబులో ఏ అప్పుందో'

'లైఫే ఓ పెద్దట్రిక్కు'

'జీవితమే ఓ పెద్ద అప్పు'

'అడగ్గానే అప్పుదొరకా!'

'విష్‌యు లోన్'.

## ఋణోపసంహారం

చిరంజీవి అప్పారావు అన్నికాలాల్లోనూ అన్నిలోకాల్లోనూ అందరి హృదయాల్లోను శాశ్వతంగా నిలబడతాడు. అతనికీర్తి దశదిశలా మోగిపోతుంది. అప్పారావుని అతని సృష్టికి కారకుడయిన రవణాబ్రహ్మని తెలుగు సాహిత్యం, తెలుగుదేశం మరచిపోదు.




# రాజకీయ బేతాళ పంచవింశతిక

ఋణరంగం కన్నా దాఋణరంగం రాజకీయ రణరంగం. ఋణ రంగాన్ని సమగ్రంగా చిత్రించిన రవణ రాజకీయ రణరంగాన్ని కూడా మరింత సున్నితంగా, సుతారంగా వొడుపుగా చిత్రించాడు.

**అధర్మాభ్యుదయం**

లంచాలు రుసుముల స్థాయికి వచ్చి గౌరవప్రతిష్ఠలు గడించేసుకున్నాయి. సిఫార్సులు అధికార్ల ఉత్తర్వుల హోదా గడించేసుకుని పబ్లీకుని పైమీద కండువా వేసుకుని తిరగసాగాయి. ధర్మాసుపత్రి రంగునీళ్ళు మందులస్థాయిలో ఆయాస్థానాలను అలంకరించాయి. పరువుగలవారి పన్నుల బరువులు కూడా ఆపన్నులే మిగతా బస్తాలూ గంపలతో పాటు మోసే అవకాశం వచ్చింది.



**మానిఫెస్టివల్స్**

ఇలాంటప్పుడే ఎవరైనా రాజకీయాల గురించి మాట్లాడతారు. కాకపోతే రాజకీయాల వేషం వేసుకున్న రచయితలు నేను రాజకీయాలు మాట్లాడుతున్నానహో అని డబ్బాకొట్టుకుంటారు. వేసుకోని రచయితలు రాజకీయాలు రచనల్లోకి తెచ్చి తను చెప్పదలచుకున్నదేదో ఖచ్చితంగా చెబుతారు. అటూయిటూగానివారు చెప్పదలచుకున్నదేదో పాఠకులకి తెలియనివ్వక, తనకీ తెలియక అగమ్యగోచర నిగమార్థ దర్శనంచేసి కొత్త పోజులో నిలబడతారు.

'పార్టీలే రంగులు మార్చేస్తున్న ఈరోజుల్లో, కొన్ని పార్టీలు జుట్టుకోరంగు మీసానికోరంగు, రాష్ట్రానికో రంగు, అవసరానికో హంగు మారుస్తున్న ఈ కాలంలో రంగుమీద రంగేస్తున్న పరిస్థితుల్లో' ఎవర్నీ ఊసరవెల్లి అండానికి వీల్లేదు.

రచైతయినా ఏపార్టీకని, ఏ మనిషికని, ఏ గ్రూపుకని కట్టుబడతాడు? కట్టుబడాలి? ఈ పరిస్థితుల్లో రాజకీయాలకంటె నాయకులకంటె చురుగ్గా ఆలోచిస్తాడు రచయిత. ఆలోచించాలి రచయిత. అందరికంటె ముందు నడవడానికి తగిన 'బాలెన్స్'ని సమకూర్చుకోవాలి. అది లేనినాడు ఏరోజు ఏం మాట్లాడుతుందీ తెలియక రచయిత రాజకీయ నాయకుడికంటె అన్యాయమైపోతాడు.

**పా'పాల' కథ**

'యెవుడి మటుకాడు నేనొక్కణ్ణే చెంబెడు నీళ్లోస్తే అన్ని పాలలో తెలుస్తదేటిలే అనుకున్నాడు. తెల్లారేసరికి గంగాళం నిండింది. కాని అన్నీ నీళ్లే. ఒక్క పాలచుక్కలేదు. రాజుగారు ఊరందరికీ దండనేశాడు. అలాగా ప్రజల్లో ప్రెతోడూ, ఓటరుగానే ఆలోచించి మన వొక్కళ్లం డబ్బు తీసుకోటేస్తే పోయిందేటని సర్దిజెప్పుకున్నాడు.'

ఇలా వుంది యిప్పటి రాజకీయం.

ఆంధ్రదేశంలో రాజకీయాలకి రణరంగం గోదావరి. మిగిలిన పట్టులవున్న ప్రజ వప్పుకున్నా – కోకపోయినా ఆ పట్టునవున్న పౌరుషం రాజకీయంగా కనబడే నిలబడే కక్షలూ కావేషాలూ మరోచోట కనరావు. గోదావరి ప్రాంతంలో పాలిటిక్సు రాబట్టే పూర్వం రాజరాజ నరేంద్రుడు నన్నయ్యని భారతం రాయమన్నాడు. అందుకే రవణ ఈ కథలకు రంగస్థలంగా గోదావరి ప్రాంతాన్ని ఎన్నుకున్నాడు.

**రాయభారాలు**

వెంకన్న చౌదరిగారి కుమార్డు రామదాసు ఎలక్షనుకు నిలబడుతుంటే అతని తమ్ముడు నర్సయ్య సుబ్బరాజు దగ్గరకి రాయబారవొచ్చాడు. రామిరెడ్డిగారిని ప్రచారానికి కదిలించినట్టాయనా మరి జయం ఖాయవని నర్సయ్య కథనం. సుబ్బరాజు

రామిరెడ్డిగారిని కలిసి సంగజ్జెప్పాడు. రామిరెడ్డిగారు సుబ్బరాజు స్థితినీ, రామదాసు పరిస్థితినీ అర్థంచేసుకుని రాజకీయాల కథలు కథలుగా చెప్పడం ప్రారంభించాడు. ఒక్కో కథ రామిరెడ్డి చెప్పడం, సుబ్బరాజు విప్పటం. ఇలా పాతిక కథల మేరకు సాగి సాగి సుబ్బరాజు అర్జునుడుగా రామిరెడ్డి కృష్ణుడుగా గీతోపదేశంతో పూర్తవుతుంది. తర్వాత రాజకీయ కురుక్షేత్ర సంగ్రామం ప్రారంభమవుతుందన్నమాట.

రణాలకు, రుణాలకు, సినీదారుణాలకు కథలు కట్టిన రవణ సినిమాలకు విక్రమార్కుడ్ని ఎన్నుకున్నట్టే రాజకీయాలకు బేతాళుడ్ని ఎన్నుకున్నాడు.

విసుగుచెందని విక్రమార్కుడు సుబ్బరాజు, కథలు చెప్పే బేతాళుడు రామిరెడ్డి. కడతేరడం గీతోపదేశంతో.

బేతాళుడి పొట్టలో పుట్టెడు కథలు. లొంగదీసుకోవాలేగాని ఎన్ని కథలయినా చెబుతాడు. రవణ వేసిన బేతాళమంత్రం రాజకీయాలమీద పారింది. రాజకీయ బేతాళ పంచవింశతికగా అవతరించింది.

## శ్రీకృష్ణార్జున గాథలు

పాలిటిక్సు గురించి అందులో ట్రిక్సు గురించి సాహిత్యంలో మొట్టమొదట ప్రవచించింది ప్రపంచించింది భారతం. అన్నదమ్ములు ఢిల్లీ సింహాసనంకోసం చేతులు జాచటంతో పెద్ద యుద్ధమైపోయింది. ఆ రణరంగంలో అర్జునుడు ఈనాడు సుబ్బరాజు. ఆనాటి కృష్ణుడే రామిరెడ్డి సాయానికి రమ్మని అర్జునుడు కృష్ణుణ్ణడిగినట్లే సుబ్బరాజు రెడ్డినడిగాడు. లేకపోతే సుబ్బరాజుకి పాతిక కథలు చెప్పి అతని తెలివితేటల్ని లెక్కజూసుకున్నాడు. అతని జవాబులన్నీ విని సుబ్బరాజు గట్టోడేనని తేల్చుకున్నాక మరి నువ్వేగోదాలోకి దిగమన్నాడు రెడ్డి. సుబ్బరాజు అర్జునుడిలా మొహం వేలవేశాడు.

## రాజకీయాస్త్ర సన్యాసం

'నేను నిలబణ్ణు...నిలబళ్లేను' అన్నాడు అర్జునుడు. సంగతేంటని అడగటంతోపాటు రెచ్చగొట్టడానికి పరాచికం కూడా ఆడిచూశాడు కృష్ణుడు.

'బయ్యం కాదు. బయఁవూ కాదు అసయ్యఁవూ కాదు. దిగులు, గుబులు. ఈ యమాయిక ప్రజల్నిచూసే – ఈళ్ళ కాడోట్లు దీసుకుపోయి ఏదో ఉద్ధరిస్తావనడం దగా. అబద్ధం. అందుకేనందుకు మనసొప్పదు. పోనీ అటు చూదారా అంటే పాలిటిక్సంతా ఉట్టి మాయదారిగోల. పద్మవ్యూహవంటారే అలాగుంది. అందుకెల్తే ఇక నదేపోత. అందులో కొట్టకలాడితే ఇక దేస్సేవ జేసేదేటి? అక్కడనెగ్గలేను. ఈళ్లకి దగా తినిపించలేను. నావొల్లకాదు. తెలిస్తెల్సి నేన్నిలబణ్ణు' అన్నాడు సుబ్బరాజు అనబడే మాజీ అర్జునుడు.



## సస్పెన్స్

అప్పుడు రామిరెడ్డి రాజకీయాల విశ్వరూప ప్రదర్శన టెక్నికలర్‌లో 70m.m. వో ఎఫెక్టుతో చూపించాడు. మధ్యల అది చూపిస్తే బాక్సాఫీస్సూత్రం బద్దలయిపోతుంది. ఎంతకాదనుకున్నా ట్రెడిషన్ ట్రెడిషనే. ఈ చాప్టరు చివరికి రాజకీయాల విశ్వరూప ప్రదర్శన రిజర్వుచేసుకుని ఈలోగా కురుక్షేత్రం జరగడానికి వీలుగా పాపం పండిన వృత్తాంతము, పండేసిన విధానము గమనించుడు.

## జెండాపై కపిరాజు

ఈ పెద్ద పెద్ద మాటలుచూసి రాజకీయాలంటే బెంగెట్టుకోకండి. సుబ్బరాజులాగా కాడి అవతలపారేసి పోతానంటే కుదర్దు. నువ్వు పాలిటిక్సుకి దూరంగా వుంటానన్నా పాలిటిక్సు నిన్ను దూరంగా వుండనివ్వవు. కాల్జారేట్టుచేసి కలిపేసుకుంటాయి. ఆనక కళ్లు నులువుకుచూస్తే నీ 'అస్తిత్వం' కాస్తా ప్రబంధనాయిక నడుంలాగా వుందాలేదా అనే షేక్స్‌పియర్ కొశ్చెన్లో పడిపోతుంది.

## మన పాల్టిక్సు వైస్సు

రామిరెడ్డి అన్నట్లు 'అసలు పాలిటిక్సంతా మాయదారిగోల' అనుకోడం అందరూ దగాకోర్లనుకోడం పొగరుమోత్తనం. మన పాల్టిక్సులో స్వార్థం అనేది ఎప్పుడయ్యా వచ్చింది– నిన్నగాక మొన్నకదా!'

మళ్ళా రామిరెడ్డే అన్నట్లు 'రాజకీయాల్ని జూసి ఈ పదేళ్ల అభివృద్ధికే నివ్వింత కంగారుపడి బెంబేలెత్తిపోతే ఎలా?

రవణ ఈ పుస్తకం రాసేనాటికి స్వాతంత్ర్యం వచ్చి పదేళ్లే అయింది!

## రాజకీయాకారం

ఈ రచనకి బేతాళుడు ఆకారాన్ని ప్రసాదిస్తే పాతకథల వరవళ్లు ప్రాణాన్ని పోశాయి.

'ఓ మహారాజా! ఈ కథకి విడుపు తెలిసికూడా చెప్పకపోయావో నీ తల వెయ్యివక్కలవుతుంద'న్నాడు బేతాళుడు.

మహారాజు కథ విప్పేవాడు. కథ కథకీ మౌనభంగం జరిగేది. మళ్లీ మామూలే! బేతాళుడు చెట్టెక్కేసేవాడు.

రాజకీయ రణరంగంలోని వూహాల్నీ వ్యూహాల్నీ ఉన్నది వున్నట్టు చెబుతూ లేనిది ఉన్నట్టు చెప్పగలుగుతూ, ఉన్నది లేనట్టు చెయ్యగలుగుతూ సుబ్బరాజుకి రాజకీయ బేతాళ పంచవింశతిక చెప్పుకొచ్చాడు రెడ్డి.

"నువ్వాకథ విని దాని వయినం చెప్పాలి. సరైన జవాబు తెలిసి కూడా బాగుండదనో ముసిలాయన ఏవనుకుంటాడనో, ఛ ఛ ఇలాటి ఎదవాలోచన్లు బయటికెలా జెప్పటవనో మానకూడదు. మానితే నామీదొట్టే. నివ్వింకా ఎలక్షన్లో దిగలేదు కాబట్టి ఒట్లు సత్యాలమీద నమ్మిక వుంటుంది" అన్నాడు బేతాళుడ్ని యిమిటేట్ చేస్తూ రామిరెడ్డి.

### 'పిట్ట' కథలు

ఏడుగురు రాకుమారులు, ఏడుచేపల కథ వరవడిగా తీసుకుని 'అనగనగా ఒక చేప' కథ, రాజుగారి పాలగంగాళంలో అందరూ తలో చెంబూ నీళ్లు పొయ్యటం కథ ఆధారంగా నేరము శిక్షలో ఉపకథ, 'అంత కింతైంది యింతకెంత అనే పాతకథ పట్టాలమీద డిటో టైటిలుకథ సాగాయి.

అన్నిటికంటె విచిత్రమైన 'కథకాదు సుమా కలకాదు సుమా' అన్నది. బడిపంతులు రావనరసుగారు హఠాత్తుగా నవ్వటం మొదలుపెట్టారు. ప్రపంచంలో వున్న ప్రతివాడు ఈ నవ్వు తననిచూసే అని బుజాలు తడువుకోసాగారు. 'రామ పట్టాభిషేక' సమయంలో 'లక్ష్మణదేవర నవ్వు'ల గలగలల్లోంచే ఈ రావనరసు నవ్వు తాలూకు రాజకీయాల కలకలలు పుట్టుకొచ్చాయి. ఇలా పాతకథలే కాకుండా పసందైన సామెతలు కూడా కథల వేషాలు వేసుకుని యిందులో సందుచేసుకున్నాయి.

### రాజకీర గాథలు

పాలవేకరి కదిరీపతి 'శుకసప్తతి' అనే కావ్యం రాశాడు. అందులో చిలుక చెడుదోవన పడేవారిని నిలిపి, కథలు చెబుతుంది. రవణ ఈ కావ్య కథనాన్ని జీర్ణించుకుని యిందులో 'చిలుకచెప్పిన రహస్యం కథ' రాశాడు. ఇదే కాకుండా శుకసప్తతిలోలాగా 'దగాపడ్డ తమ్ముడికథ' 'స్వామిద్రోహి కథ' అంతకింతైతే ఇంతకెంత' అనే కథల్ని సృష్టించి రాజకీయశుక ఉపన్యాసాల చిలుక పలుకుల్ని పలికించాడు రవణ.

### 'దస్తూరి స్వహస్తం' లేక 'ట్రూ' కాపి

కథలో అవసరంకొద్దీ ఏదేనా ఇంగ్లీషు కథని వాడుకున్నా కథ చివర ఆ ఆంగ్ల కథపేరు చెప్పి మూలరచయితకి కృతజ్ఞతలు చెప్పడం రవణ నిజాయితీకి నిదర్శనం. ఇందులో ఆరో కథ కిటుకు సోమర్ సెట్ మామ్ రాసిన ఇంగ్లీషుకథకి 'పచ్చికాపీ' అని రవణే చెప్పుకున్నాడు.

### కన్యాశుల్కానికి జై

ఆంగ్లాంధ్ర సాహిత్యాల్లో కావ్యాలు, కథలు, సామెతలు ఎలా అయితే రవణని విజ్ఞాన ధనవంతుడ్ని చేశాయో అంతకు రెట్టింపు సంపదని అందించింది కన్యాశు



ల్కం. రవణ రచన ఏదిచూసినా ఎక్కడో అక్కడ కన్యాశుల్కంలో మెరుపు తళుక్కుమంటూనే వుంటుంది.

'వినాయక వ్రతము కథ'లో 'ఈ శషభిషలు కుదరవు' అన్నారు పంతులుగారు. చుట్టంగారి సామానులో ఆవకాయకుండ బద్దలుకొట్టి అన్నప్పుడు అగ్నిహోత్రావధాన్లు ప్రథమకోపం గుర్తుకు వస్తుంది.

'సేవాంతకుడి కథ'లో ఆలయనిర్మాణం ఆపుజేసిన శాస్త్రిగారు ప్రయివేటు పనిమీద ఫ్యాక్టరీ లైసెన్సుకోసం ఢిల్లీవెళ్ళి తిరిగివచ్చి నిర్మాణం అయిపోయిందని తెలుసుకున్నారు. 'శంకుస్థాపన రాయో' అని ఆశ్చర్యంలో మూర్ఛపోయారు. ఈ సంఘటన రామప్పంతులు పొరుగూరు వెళ్ళి వచ్చేలోగా లుబ్ధావధాన్లు పుస్తె ముడెయ్యటం' రామప్పంతులు వచ్చి అగ్నిహోత్రావధాన్లయిపోవటం వగైరాలను స్ఫురణకు తెస్తుంది. కన్యాశుల్కంలో ప్రతిసంఘటనా మరో మలుపు తిరగడానికి వీలైన గట్టి పునాదితో వుంటుంది. అలాగే 'సేవాంతకుడి కథ'లో కూడా దెబ్బతిన్న శాస్త్రి మరో ఎత్తువేస్తాడు. నేలబారు గుడికి మహత్యంగల తాయెత్తు కట్టడానికి, చేసిన తప్పు ఒప్పుగా కప్పెట్టడానికి.

### కథకళి

పాతకథను తీసుకున్నంత మాత్రాన పాతకథలాగా పేలవంగా కాకుండా దానిని మరిన్ని మలుపులు తిప్పి, వాడుపులు నప్పి పింగళిసూరన 'కళాపూర్ణోదయం అంత పోకడపోయే కథనశక్తి రవణకుంది. 'సేవాంతకుడి' కథలో కథ, కథనం కూడా అత్యద్భుతంగా వుంటాయి గమనించండి.

### మిం'గుడి' కథ

సమకాలిక సమాజంలో సత్యవాదిలా, స్వార్థహీనుడిలా విద్దూరంగా, స్వార్థపరుడి ఔదార్యంలా పొట్టిగా దర్జాగా' వున్న ఒక ఆలయం గురించి గోపన్న మణిసిద్ధుడ్ని అడగగా ఆయన ఈ కథ చెప్పాడని రామిరెడ్డి సుబ్బరాజుకి చెప్పాడు.

'కరణీకులం'లో పుట్టిన పంతులారొకాయన్ని పంచాయితీలో పనికిరాదని అపోజిషన్‌వాళ్ళు పబ్లిగ్గా దించేసేసరికి ఆయన శివమెత్తిపోయాడు. ముందు (నుయ్యి) వెనక (గొయ్యి) లాలోచించి రామాలయ నిర్మాణానికి పదివేల విరాళం ప్రకటించాడు. దీనికోసం అక్కడున్న రెండు గ్రూపులవాళ్లు కొట్టుకుచస్తారని ఆయన ఆశ.

అపొజిషన్ మనిషయిన శాస్త్రిగారు ముందు కొంత కంగారుపడినా ఆనక తమాయించుకుని జమాయించి నిలబడ్డారు. డిటోరావు సాయంతో స్థలనిర్ణయాన్నే సుబ్బరంగా క్యాష్ చేసుకుని గోడలుకట్టే శాఖ, పునాది రాయిశాఖ, టాపులేపేశాఖ తలొకరికీ అప్పగించి శంకుస్థాపన పోర్టుఫోలియో తనుంచుకున్నాడు.

పనిమీద పైకెళ్లొచ్చిన (ఢిల్లీకి) శాస్త్రిగారికి బడ్జెటు ప్రకారం పదిరోజుల్లో గుడి కట్టేశారని తెలిసి గుండె గుభేలుమంది. 'శంకుస్థాపనరాయో' అన్నారు రామప్పంతుల్లాగ. అన్నీ విని కంగారెక్కి గుడిదగ్గర కెళ్లారు. ప్రారంభోత్సవం చేసే మినిస్ట్రు గుళ్ళోకెళ్లడం ఎలాగా అన్నంత పొట్టిగా వుంది గుడి. శాస్త్రిగారి రాజకీయమ్మెదడు తీవ్రంగా పనిచేసింది. పంతులొస్తే శివమెత్తిపోతాడు అనుకున్నాడు. అంతే మర్నాడు వూళ్లో వరసాగ్గా అయిదారుగురికి శివాలెత్తాయి. అంతా చెల్లాచెదురుగా వున్నా ఏకగ్రీవంగా గుడి గొప్పదనం ఉద్ఘోషించారు పూనకంలోనే.

'శాస్త్రిగారు నడుంకట్టి దగ్గరుండి నడిపించారు కొన్నాళ్లు – దుకాణాలకు జోరుగా లైసెన్సు లిప్పించారు. వేలాదిగా జనం రాసాగారు. కొత్తలోనే ఒకరిద్దరు మంత్రులు ఇద్దరుముగ్గురు సినిమాతారలు అర్చనకు వచ్చారు. ఆ సందర్భంలోనే వి.ఐ.పి.లు పాకవలసిన అవసరం లేకుండా నిలువులోతున సొరంగం వేయించడం జరిగింది' గుడిఎదురుగా.

## పిచ్చిక గుడి

పంతులుగారొచ్చి గుడిచూసి కళ్లనీళ్లు పెట్టుకొని కక్షకొద్దీ ఎలక్షన్లో శాస్త్రికి పోటీగా నిలబడ్డారు. విక్రమార్కుడిలాంటి సుబ్బరాజు ఆ ఎలక్షన్లో పంతులారు కాకుండా శాస్త్రి గెలుస్తాడని నిజం చెప్పడంతో బేతాళుడు మౌనం వహించాడు.

పట్టువదలని సుబ్బరాజు మర్నాడు పక్కకథలోకి ప్రయాణమయ్యాడు.

## వరవడికాదగిన కథ

ఈ పుస్తకంలోంచి ఈ కథ చింపి ఎక్కడ నిలబెట్టినా ఉత్తమ కథానిక అనిపించుకుంటుంది.

శాస్త్రి 'రేపు పంతులొస్తే శివమెత్తినట్టు ఆడిపోతాడు.. మరే, శివమెత్తినట్టు ఆడిపోతాడు' అనుకున్నాడు.

ఆ ఛాప్టరు అక్కడ ఆపి మరోటి ప్రారంభిస్తూ,

'మర్నాడు సాయంత్రానికి ఊళ్లో మడేలు వీరన్నకూ, అంతా మరిచిపోయిన గణాచారికీ, డిటోరావు రెండో పెళ్లానికీ, ఆ మర్నాడు శ్రేష్టిగారికీ సాయంత్రం కంట్రాక్టరుగారి అత్తగారికీ శివాలెత్తాయి' అని చెప్పటంలో మంచి టెక్నిక్ కనిపిస్తుంది. ప్రతి కథ ఎత్తుగడ, ముగింపు చదువరిని ఆకర్షించి పూర్తిచేసేవరకు వదలనివ్వని శక్తిని సంపాదించుకున్నాయి.



## భాషనే వాడుడు

గోదావరీ తీరంలో జరిగిన ఈ కథలు గోదావరి పలుకుబడిని రంగరించుకుని సాగుతాయి.

"ఓరబ్బో, నివ్వుకూడా జోకేశావే!! నివ్వేటి ఆయనెవుడూ– ఆ బోజరాజు మొఖంజూస్తే కవిత్వం పుట్టద్దంటారు జూడూ – అలాగే మినీస్ట్రు పేరు జెబితే, పెతివోడికి హేళన, వెటకారం తన్నుకొస్తనయి. అబ్బే నిన్నన్నాననిగాదు. ఊసొచ్చిందిగదాని చెబతన్నా."

## గ్రాంధిక పీడకలవేట

తెలుగులో మాండలికాన్ని ఉపయోగించుకుని వచ్చిన రచనల్తక్కువ. ఈ మధ్యనే వెలుగు వెన్నెల గోదారి, ముత్యాలపందిరి, చిల్లరదేవుళ్లు, రావిశాస్త్రి కథలు వగైరాలు వచ్చాయి. ఆ మధ్యన శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు వైదిక కుటుంబాల భాషని గోదావరి, కృష్ణా మండలంవాళ్ల పలుకుబడిని వినియోగించి కథలు రాశారు.

–గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కంవల్ల ఈ సౌందర్యం బాగా తెలుసుకున్నవాడు కనకనే ముళ్లపూడి, కథనంలో కొత్త దారులు తొక్కగలిగాడు.

## సాలెగూడుపట్లు

పల్లెటూళ్లో రాజకీయాలు గూడుకట్టుకొన్న స్థలాలు కొన్నుంటాయి. స్కూళ్లు, ఆసుపత్రులు, సొసైటీలు, కాలవగట్లు, చెరువుపాటలు, రోడ్ల కంట్రాక్టులు మొదలైన సబ్జెక్టులన్నీ ఈ రచనలో చోటు చేసుకున్నాయి. రాజకీయాల మబ్బునీడలు పడి వానచుక్కలేక, ఉక్కపోత తగ్గక మగ్గిపోయే నమూనా పల్లెటూరు ఈ రచనలో కనబడుతుంది. ఇందులో చేపకథ పరిశోధించే మంత్రిగారిలాటి కడుపుమండించే పాత్రలున్నట్లే కంటతడిపెట్టి మనసు కరిగించే స్కూలు మాస్టు రావనరసులాటి పాత్రలు కూడా వున్నాయి. డిటోరావులు, రోటీవాలా, బేటీవాలాల్లాటి పోటీవాలాలు కథల్లో తప్పనిసరిగా వుంటారు. వీళ్లందరి చిత్రణలోను ఎక్కడా బెసుగుదలగాని పరాకుగాని కనబడదు. ఏ వూరువెళ్లినా యిలాటి ఆకార వికారాల్తోనే కనబడతాయి ఈ పాత్రలు అన్నంత సజీవంగా నడుస్తాయి, మాట్లాడతాయి.

## ఇదే'నా'దేశం

ఇందులో రాజకీయాలు దేశాన్ని విడిచి పాతకథల ముసుగుల్లో సాము చెయ్యకుండా ధైర్యంగా ముందుకు పొడుచుకొచ్చి కనబడతాయి.

రావనరసుగారు నవ్వటానికి గల కారణాలు వివరిస్తూ యిచ్చిన లిస్టు ఆంధ్రదేశంలోని అరాచకాన్ని స్పష్టం చేస్తుంది.

'జీతాలు వేళకి అందడం, అందిస్తామనడం, పంచదార ధరలు తగ్గటం, ఆంధ్రలో రైల్వేలపట్ల కేంద్రం వైఖరి, ముఖ్య ప్రతిపక్షంలో ఏకత, కాంగ్రెసులో టిక్కెట్లు పంపకం.' వగైరాల్లో ఏదిచూసినా సరే రావనరసుగారే కాదు మనంకూడా ఏడవలేక నవ్వకతప్పదు.

రాయలసీమ, తెలంగాణ వర్గాల అసంతృప్తిని, రాజాజీ స్వతంత్ర పార్టీ లక్ష్యాల్ని వివరించటాన్ని, జవహర్‌లాల్ రాజీనామాచేసి మళ్లా పోటీచెయ్యాలని జయప్రకాశ్, లోహియా అనటాన్ని కూడా రవణ అక్కడక్కడ స్పృశించాడు.

రవణ అన్ని రచనల్లాగే ఈ రచనలోకూడా గుర్తుంచుకోతగ్గ వాక్యాలు రాజకీయ నాయకుల అభిప్రాయాల్లాగా, రచయితకి ఈ పుస్తకం రాయటానికి వచ్చిన కోపానికి కారణాల్లాగా కనబడతాయి.

'రాజకీయం అనేది ఒకకళ'.

'తప్పేలా ఒప్పేలా తప్పులు చెయ్యటం రాజకీయం'.

'నోట్లు జల్లి వోట్లు పండిస్తాం'

'ముద్దర్లిష్టం లేపోతే తేలిగ్గా వేసుకోవాల్తప్ప అసలొద్దనరాదు.'

'ప్రజలు వేరు వోటర్లు వేరు.'

'చర్చలే దేశానికి జీవం. అదే రాజకీయ చైతన్యం.'

'ప్రతి అభ్యర్థికీ రెండు మానిఫెస్టోలుంటాయి – డబులెంట్రీ పద్దులాగా. ఒకటి ప్రజలను ఆకట్టుకునేది, రెండోది గ్రూపులనూ, నాయక వినాయకులనూ ఆకట్టుకునేది.'

'దేశంలో పన్లు పార్టీ పాలసీలనిబట్టి కాదు; మనుషుల పాలసీలను బట్టి జరుగుతాయెప్పుడూ.'

'దేశంకన్నా రాష్ట్రం, రాష్ట్రంకన్నా ఊరు, ఊరుకన్నా వాడ, వాడకన్నా పార్టీ, పార్టీకన్నా గ్రూపు, గ్రూపుకన్నా నాయకుడు, నాయకుడికన్నా అతని పెట్టుబడిదారు, అతనికన్నా 'నేను' ముఖ్యం అని రాజనీతి అంటారు.'

'లంచగొండితనం వంటి అవినీతి పనులన్నీ ఇవి నీతిపనులన్న జాబితాలకి ఎగబాకిపోయాయి.'

'బీదవాళ్లు బీదబాధలూ, గొప్పవాళ్లు గొప్పబాధలూ పడుతున్నారు.'

'మెజారిటీజనం చేసేది నేరమెలా అవుద్ది?'



**అలంకారాలు–మిరియాలు**

'ఈ వూరు మునిసిపాల్టీ అయినంతొట్టు'

'పిల్ల ఎలక్షను వాగ్దానంలా ఏపుగా నదురుగా ఉంది. సుస్థిర ప్రభుత్వంలా ధీమాగా ఉంది. కాబోయే మంత్రిగారి ముఖంలా కళకళలాడుతుంది. లంచగొండి ఉద్యోగంలా పచ్చగా వుంది. రాజనీతిజ్ఞుడి భాషలా, అవకాశవాది అబద్ధాలలా ఆమె కనులు సొగసుగా తీర్చిదిద్ది ఉన్నాయి.'

'అతను రెడ్డిగారికి బుజ్జింక మీసంలాంటివాడు, చెప్పుల్జతలాటివాడు, గొడుగులాటివాడు, లవుడు స్పీకరులాటివాడు.'

'నువ్వు నిజయితీకి హెడ్డాఫీసువి.'

'సర్వేనాయక జనాస్సుఖినోభవన్తు.'

'శాపం తగిలిన మినీస్ట్రు.'

**రాజకీయ నిఘంటువు**

మ్యునిసిపాలిటిక్స్, పాలిట్రిక్కు, జనస్వాములు, మినిష్టరుగిరీకి రూకలు చెల్లటం, బిల్లు తయారుచేసి దాన్ని చట్టం కట్టడం, రాజకీయ వ్యాపారం, ఎలక్షన్లో కాస్త డబ్బుతిప్పడం, లంచాలు, వారసులు–బేవారసులు, రారాజధాని, ఊహాగాన సభలు, పొజిషన్‌లోవాళ్లు అపొజిషన్‌లోవాళ్లు, రాజాజీనామాలు, ఎలక్షన్ ఋతువు, లాజిత్తు, చుక్కెదురు పార్టీలు హెచ్చెరుగ్గా, బరువు (లంచం)

**సాహిత్యసినీ రాజకీయాలు**

రాసేది రాజకీయాల గురించైనా సాహిత్యం మీద, సినిమాలమీద విసుర్లు యిందులో కూడా వున్నాయి.

దినపత్రికలు వార్తలు 'కవర్' చేసేప్పుడు తమకు అనుకూలంగా వున్నవాళ్లని ఆకాశానికెత్తటం, వ్యతిరేకుల్ని పాతాళానికి తొక్కడం కద్దు.

'చౌదరిగారు ఎన్నికయినట్టు మర్నాడు పేపర్లలో పడింది. ఇష్టం వున్న పేపర్లు 'ఏకగ్రీవంగా' అని రాశాయి. లేనిది 'పోటీలేకుండా' అని రాశాయి.'

రవణ 'ఇరుసునబెట్టని కందెన'లో లంచానికి పర్యాయపదంగా వాడిన 'బరువు' అన్నపదం కథానాయకుడు చిత్రంద్వారా ప్రేక్షకుల్ని చేరి ఈనాడు 'లంచం' అనే పదానికి బదులు 'బరువు' అని నిఘంటువులో రాసుకునేటంత తీవ్రంగా ప్రచారం పొందింది.

## ‘విశ్వ’రూపదర్శనం

రామిరెడ్డి సుబ్బరాజుకి చేయించిన విశ్వరూప దర్శనం కవితాత్మకంగా సాగి సాహిత్యంలో మరచిపోరానంతటి మహోపన్యాసంగా రూపొందింది. సాహిత్య చరిత్ర రాసుకునేప్పుడు ఫలానా రచయితల పాత్రలు, ఫలానా ఫలానా ‘పేరా’లు ప్రపంచ సాహిత్యంలో చోటు చేసుకోదగినవి అనుకుంటే ఆ వరసలో చేర్చటానికి రామిరెడ్డి ఉపన్యాసానికి అన్ని అర్హతలూ వున్నాయి.

అక్షరాలా యిది రాజకీయగీత! ప్రతిమనిషీ రాజకీయాల్లో దిగినా దిగకపోయినా మననం చేసుకోవాల్సిన మంత్రాక్షరాలు!

“అలాగంటే ఎలా? ఆళ్లంతా దగాజేస్తన్నారని తెలిసి, అదేమో తప్పని దెలిసి నివ్వు మాటాడకూరుకుంటే అదిమాత్రం తప్పుగాదా? నీపని నివ్వుజేసక పోవాల. ఫలితం వదిలెయ్. నివ్వొక్కడివే దేశాన్ని బాగుచేస్తానని ఎందుకనుకోవాలి? నీ లాగెంతమందో యెలక్షన్లలో నిలబడి నెగ్గి నిర్వాకం చెయిగా చెయిగా ఎప్పటికో దేశం బాగుపడుద్ది.

“రాజధానిలో అదేపనిగా గోతుల్దవ్వుతారనుకోకు. ఒక్కోసారి ఓ గ్రూపుకి శోషొచ్చేస్తది. ఒక్కోదఫా ఎవుడికీ తెలీకుండా అయికమత్యం వచ్చేస్తది. స్టేటుమెంట్లివ్వ డానికి పాయింట్లుండవు. ఎత్తిపొడుపులి కిసులుబాటుండదు. అలాటపుడేం జేస్తారు? గవర్నమెంటు పని చూడక తప్పదు. ప్రజాసేవ అలాంటపుడే జరుగుద్ది. ఆ కాసేపూ చేసేదేనా సజావుగా జరగాలిగదా! అందాకా కొట్టుకులాడుతూ ఆలోచన లేకుండా వున్నందువల్ల సమస్యలెదురైనపుడు ఏదో వోతీర్మానం జేసెయ్యాలి. మాటవొరసకి విద్య వుందనుకో – అదే విద్యకాదు. కాదు గదా! అందుకని దేశవంతా బళ్లు వేయించి అందరికీ బడి చెబితే యామయింది? బ్రిటిషోళ్లు పెట్టిపోయిన గుమాస్తాచదువు చదివేసి ప్రెతోడూ ఉద్యోగవంటాడు. పొలం దున్నడం నామోషి. యాపారం చెయ్యడం బయం. అందుకే వొందరాళ్లు చేతికొస్తాయిగదాని ఉద్యోగం కోసం బస్తీ పరుగులు. చూశావా! విద్యాసమస్య అంటారే అది పరిష్కరించబోతే నిరుద్యోగసమస్య – దాన్నెంటబెట్టుకుని అవినీతిపన్లు – ఉన్నాడిని పీకించేసి ఇంకోడు దూరడం, ఉద్యోగాలమ్మడం, కొనడం, మావోడు మీవోడు, మాకులం, మీకులం అని పీకులాడ్డం బయల్దేర్తాయి. మద్యనిషేదవని పెడితే కాపుసారా, కామాపుసారా, దొంగరవాణా, కల్తీ సరుకులు, హెచ్చు ధరలు ఇయ్యన్నీ వస్తన్నాయి. దొరల్దేశంలో ప్రొహిబిషను పెట్టబోయే దొరకు పెద్ద పెద్ద రాకెట్లు లేచాయి. దేవాంతకుల్లేచారు. అరాచకం అయిపోయింది.



చివరికి మనకతెట్టా తయారయిందీ అంటే, సారాయాపారం జేసేవోడే మద్యనిషేదం వుండాలని వాదించేదాకా వచ్చింది. అదే నలుగురికి లాభసాటిమరి. తాగేవోడిక్కూడా దొంగసారా రుచి ఎక్కువ.

అదిగో అటేపుజూడు. నమ్మిన జనాన్ని తప్పుదారి పట్టించీ, చానాదూరం తీసుకుపోయాక తప్పని దెలిసి నాలిక్కరుసుకుంటున్న నాయకులూ ప్రవక్తలూను, ఆళ్ల సంగచ్చెప్పు. ఆళ్లు తప్పని తెలీకనే తప్పుదారిన పట్టించారనుకో. ఇప్పుడు తెలిసినా పబ్లీకున తప్పొప్పుకుందుకు మనసొప్పదు. దేశం మంచికన్న, తమమాటే ముఖ్యవని ఆళ్లనమ్మకం.. ఆలాటోళ్లనేం జేస్తావు.. అదిగో ఆడచూడు. లంచాలమారి డిపాట్రుమెంటు మధ్యనో మంచోడున్నాడు. ఆడికిష్టంలేదుగాని ఆడు తీసుకోపోతే కడవాళ్లందరికి అవుమానం. లంచందీసుకోపోతే బదిలియో బర్తరఫో అవుద్ది. అలాటోడికి సాయంజెయ్యవూ? నీకు జాల్లేదూ? అదేటంతకన్న పెద్దయున్నాయి చూడు. మందు మాకులు మంచియొచ్చి మరణాలసంకె తగ్గడంతో జనాభా పెరిగిపోద్దని అరుగో ఆళ్లకి బయ్యంగామోసు. అందుకని మందుల్లో కల్తీ చేసేస్తన్నారు. ఆ కంపెనీలమీద చెయి జేసుకున్నోణ్ణెర్రెంకన్న కింద జమకడతారు. నివ్వు ఎర్రెంకన్నగా వుండకుండా పోటాడాలి.

అడుగో ఆ యమ్మెల్యేజూడు. ఆళ్లూరు ఆవాడా ముఖ్యవాఁ దేశమ్ముఖ్యవాని తేలక గింజుకలాడుతున్నాడు. దేశవందరికోసం అని వోటేస్తే తనూళ్లో అంతా తిట్టుకున్నారు. తనూరుకోసం అని చూసుకుంటే పార్టీవోళ్లు మొట్టికాయలేస్తారు. అలాటోళ్లకి దారిచూపవూ? యెమ్మెల్యే అనేవోడు దేశాన్ని పాలించడంలో తనూరి తరపున పనిచేసేవోడా, కాపోతే ఉత్తినే తనూరి తరపున రాయివకీల్లాటోడా? సరుకు రవాణా సరిలేకపోతే పరిశ్రమలు యాపారం అన్నీ దెబ్బతింటాయని గూడ్సు పెట్టెలకే ముందర యెక్కూడబ్బు కేటాయించి, ప్రయాణీకుల సదుపాయాలు తరటేస్తే నివ్వుజేసేది నిజమైన దేస్సేవ. కాని దానివిలవ ప్రజలందరికీ తెల్దుమరి. లేకపోయినా సరేనని దేస్సేవజేస్తావా?తరవాతేమైతే నాకేవని ప్రయాణీకుల వసతుల్జూసి పేరు దెచ్చుకుంటావా? ఈ సంగతి తేల్చి నాయకులకి చెప్పవో? రాబడిపన్ను ఎగేసేవోళ్లు ఎక్కువగా వున్నారని సర్కారోడు నివ్వు వొందంటే వెయ్యికి పన్ను కడతన్నాడు. ఆడలా చేస్తాడని నివ్వు వెయ్యికి పన్ను కట్టదలిస్తే వందకే కడతానని పద్దుజూపిస్తన్నావు. అబద్ధాలాడకుండా నివ్వుపద్దువేసి పన్ను కడతానంటే ఆరిపోతావు. అంచేత న్యాయంగా ఉంటానిక్కూడా అన్యాయంగానే నడుచుకోవాలి. వొజ్రాన్ని వొజ్రంతోనే కొయ్యాలన్నట్టు అన్యాయాన్ని అన్యాయంతోనే ఎదుర్కోవాలి. నివ్వింకో కొత్తదారి చూపించవూ? అదుగో అటుచూడు. తిమి, తిమింగిలం, తిమింగిలగిలం చిన్ని చేపని పెద్దచేప, దాన్నింకా పెద్దచేప, దాన్ని

చిన్న తిమింగిలం, దాన్ని పెద్ద తిమింగిలం మింగేస్తన్నాయి. ఈటిలో దేనిమీద జాలిపడతావు? దేన్ని జెయిల్లో ఏస్తావు? వర్కరు జీతం చాలదనేడుస్తున్నాడు. కంపెనీవోడు లాబం చాలటం లేదంటన్నాడు. నాగరీకం వొచ్చిందని పేరేగాని అడివిలో జంతువులపన్లే ఊళ్లో మనవూ చేస్తన్నావింకా. మన మాట వినక తలొగ్గనోణ్ణి ఓడించడానికి చంపడం పూర్వకాలం పద్ధతి ఈనాటికీ దాన్నిమించిన సాధనం కనుక్కోలేదు. నివ్వు గోదాలో దిగి కనుక్కోరాదూ? జనం ఇంకా బయపడి, ఆశపడి, తికమకపడి, మొహమాటపడీ, కంగారుపడీ ఓట్లేస్తన్నారని దేశాన్ని, దేశాన్నేలేవాళ్ళనీ ఏలేవోళ్లు ఎప్పటిమల్లే ఉన్నారనీ అంటన్నారు. నివ్వు గోదాలో దిగి సరుదుబాటు చెయ్యవూ? నూర్రూపాయల జీతగాడికి పదిరూపాయిలు పైకం దొరికితే అది పవుడర్లూ బైస్కోపులకీ పోతుందంట. ఇబ్బందిబ్బందిలాగే ఉందంట. మనదేశం యెగుమతి దిగుమతి యాపారాల అంతరం కాస్త తగ్గి ఎగుమతులు పెరిగితే ఆవారకి అమాంబాపతు కరుచులు సర్దుకుంటన్నాయంట. కష్టాలు కష్టాల్లాగే ఉన్నాయంటన్నారు. ఇయ్యన్ని సరుదుబాటు చెయ్యవూ ఆ!..."



ఓ ఇంటి భాగోతం – డైరెక్టర్ దేవదాసు కనకాల, ఎమ్వీయల్, బాలు, మ్యూజిక్ డైరెక్టర్ జి.కె. వెంకటేష్, ప్రొడ్యూసర్ నవతా కృష్ణంరాజు గార్లు



విక్రమార్కుడి మార్కు సింహాసనం కథలు



# విక్రమార్కుడి మార్కు సింహాసనం

### విక్రమార్కిజం

ఒరిజనల్ భోజరాజు సింహాసనం అధిష్టించబోతుంటే మెట్టు మెట్టునా వున్న అమ్మడిబొమ్మ ఒకోకథ చెప్పటం అతడి అర్హతల్ని నిగ్గుతేల్చటం జరిగింది.

వెండితెరకెక్కిపోటం అంటే విక్రమార్కుడి సింహాసనం ఎక్కటమంత కష్టం అన్నమాట. అందుకే భోజరాజులాటి వరహాల్రాజు తెరకెక్కిపోటానికి తొరపడి పోతూంటే 'వెండితెరోపజీవు'లంతా తలో కధా చెప్పారు.

ప్రతివాడు భోజరాజుని బొమ్మ అడిగినట్లే రాజునీ అడిగేవారు 'నీకింత బుర్రుందా' అని.

రాజు అడ్డంగా తలతాటించి లేదు అనేవాడు.

కాని అనుకోనివిధంగా ఈ నవల ఆఖరి ఛాప్టరు 'స్వర్గారోహణ పర్వం'లో వరహాల్రాజు తెరకెక్కిపోయాడు. అతను కన్న కలలు ఫలించాయి. అవును. అతను కన్న కలలు ఫలించాయి.

నవల మొదట్లో ఇది ఇలా? కలా? తలా? వలా? అని గిల్లి చూసుకోవలసినంత అనుమానం వచ్చే కల వచ్చింది.

అవును కలే వచ్చింది.

**'కల' ప్రకారము**

వరహాలరాజు అతని మిత్రుడు ముత్యం కలిసి మొవ్వారం టెంటులో సినిమాచూస్తూ హీరోనీ రేలంగినీ స్టడీచేసి మ్యూజిక్కు, సంభాషణలు సంతృప్తికరంగా ఉన్నాయో లేదో డైరెక్షను చప్పగా ఉందో లేదో, సౌండు ఫరవాలేదో అవునో పరిశీలిస్తున్న సందర్భంలో తెరమీద నటుడు హఠాత్తుగా తూలి నేలటిక్కెట్టులో మహారాజ పోషకుల మధ్య పడ్డాడు.

'ఆణి ముట్టుకునేవు బుల్లోడా సినిమా వెల్టి కరెంటు షాకిత్తాది.' అని అంతా వెనకాడుతున్నప్పుడు రాజు ముత్యం ముందాడి కాలుజారిన తెరవేలుపు శ్రీకుమార్ కోరికపైన మళ్లా సినిమా వేయించి అదేసీనులో ఏర్పడిన ఖాళీలోకి తోసి చేతులు దులుపుకున్నారు.

ఇలా మొదలెట్టిన నవలని స్వర్గారోహణపర్వంలో యిదే సీనుతో ముగించి సుఖాంతం చెయ్యటంలో రహస్యం తెల్లారుజామున వచ్చిన కలలు నిజమగును అన్న వాక్యాన్ని నిజం చెయ్యటానిక్కావచ్చు, లేకపోతే మనిషిలో అణగారిన కోరికలు అలా బుర్రలో గిర్రున తిరుగుతూ కునుకట్టినప్పుడు కలలుగా (కట్టకపోతే పగటికలలుగా) తర్జుమా అవుతాయని ఫ్రాయిడు చెప్పింది వింటంవల్ల రైటవటంవల్ల కావచ్చు రవణ అలా ముగించటం జరిగింది.

'తెల్లారుజాము కల నిజమాయెగా' లేక ఫ్రాయిడు సిద్ధాంతము సంగతెలావున్నా కథ ఎత్తుగడ ముగింపు రచయిత శిల్పానికి, అనల్పమైన రచనాశక్తికి ఉదాహరణముగా భాసించును.

కల కథ 'ఫేడౌట్'



**ప్రకాశకం**

మరి వరహాల్రాజుకి కథల్జెప్పి పెట్టే 'బేడా' వూడ్చేసి 'నీకు బుర్రలేదు నువు సినిమాలకి పనికిరావు' అని చెప్పినవాళ్ల జోస్యం జోస్యంగా మారి రాజు తెరవేలుపు ఎట్లాయెను?

ఎట్లాయెననగా కథల్జెప్పిన సరుకు నూనెసరుకన్నమాట. విక్రమార్కుడి సింహాసనం మోసే మెట్లబొమ్మల అమ్మళ్లలా నేతిసరుకు నీతిసరుకు నిజాయితీసరుకు కాదన్నమాట.

కనకనే అంతాలిసెంగానైనా వరహాల్రాజు తెరకెక్కిపోయాడు. లేకపోతే 'మసిపూసిన మాణిక్యం'లా లాస్టుఛాప్టరు వరకు ప్రకాశించకుండా వుండడు.

**చిత్రభారతం**

సినిమా ఫీల్డుకథ భారతంలా బోల్డుంటుంది. రోల్డుగోల్డు వస్తువు లెక్కువ గనక నిగ్గుతేల్చటం కష్టం అన్నవిషయం చటుక్కున స్ఫురించేట్లు నవల చివర విశ్వరూప సందర్శనం, స్వర్గారోహణపర్వం ఏర్పాటు చేశాడు రచయిత.

**'ట్రెడిషన్'**

రాజకీయ కథలు చెప్పినా, చలన్చిత్ర కథలుచెప్పినా చివర విశ్వరూప ప్రదర్శన తప్పకుండా ఏర్పాటు చెయ్యటంవల్ల ఈ రెండు మార్కెట్టులకివున్న విలువ, వైశాల్యం, వైభోగం తెలియజెయ్యటమే రవణ ఉద్దేశం. (ఇవి కేవలం రచనలు కాబట్టి 'మాయాబజారు'లాగా విశ్వరూప ప్రదర్శనలో బాక్సాఫీసు రహస్యాల్లేవు). ఈ నామకరణం, అధ్యాయాల విభజన వాటిపేర్లు రవణకు సాహిత్యంలో ట్రెడిషన్ మీద వుండుకున్న భక్తికి, ఆసక్తికి నిదర్శనం.

**ప్లాటోసినిక్**

రాజకీయ కథల్లాగే ఈ సినీ రాజకీయాలుకూడా కథల అవతారమే ధరించాయి. ఎన్ని కథలు చెప్పినా కథ ఎంత కదలకుండా మనం వదలకుండా మన్ని వదలకుండా చెప్పినా యిందులో వస్త్వైకం వుంది.

జస్టె మినిట్!

సాంఘిక పిక్చర్లో క్లాసికల్ మూజిక్కులా, పౌరాణికపిక్చర్లో రాకెన్రోల్లా, కృష్ణుడినోటంట గ్నాపకార్థంలా ఈ 'వస్త్వైకం' అన్న పదం మరోపుస్తకంలోది జారిపడింది. అయినా పడిందిగనక ఫస్టెయిడ్ చేసి పమ్మించే బాధ్యత మందేగదా!

పూర్వం కృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్తమాల్యద' వగైరాల్లో కథలు కథలుగా వుండటంవల్ల అందులోపల వస్త్వైకం లేదని విమర్శకులు దుమ్మెత్తిపోశారు. ఏ కథ

కా కథగావున్నా 'విష్ణుభక్తి' అనే ప్రధానసూత్రం విడివిడిగా పడివున్న ఆ కథలనే ముత్యాల్ని దండగుచ్చి పెడుతోంది. కనక ఆ వస్త్వైకం అనగా 'యూనిటీ ఆఫ్ ప్లాట్' వున్నట్టే అని మరి కొందరన్నారు.

ఆ మరికొందర్ని పిలిచి చదివి వినిపించకుండానే విక్రమార్కుడి మార్కు సింహాసనంలో వస్త్వైకం వుంది యిది అక్షరాలా నవల కథల సంపుటి కాదు, (కథల సంపుటి నవల యగునా గాదా? ఆంధ్రా యూనివర్సిటీ ఎం.ఏ. బరీక్షాబత్రము నందొకప్రశ్న – 1971 మే.) అని మనం చెప్పుకోవచ్చు. కారణం ఈ నవలకు కథానాయకుడైన వరహాల్రాజు ప్రతి కథలోనూ బ్రాటోవరవుతూ నేన్లేపోతే మొత్తం ఫ్లాపవుతుందన్నంత ఓవరాక్షను చేసేస్తూ వుండటమే!

## పొట్టికథ పొడుగుతనం

సామాన్యంగా వారం వారం ఫీచర్‌గా వారపత్రికలో రాసే రచనలపట్ల రచయితలకి శ్రద్ధాభక్తులుండవు. ఏవారాని కావారం చక్కగా తెలుగు సినిమా కథలో సంఘటనల్లా విడివిడిగా రాస్తుంటారు. కాని రవణ అలాటి సీరియల్ రచన చేస్తున్నప్పుడు కూడా సీరియస్‌గా ఆలోచించి ముందు వెనకలు (బిగినింగు ఎండింగు) పరిశీలించి 'ప్లాట్' అల్లుకోవడం, అందులోంచి కథలు నొల్లుకోవటం వగైరా జాగర్తలు తీసుకున్నట్టు విక్రమార్కుడి మార్కు సింహాసనంలో కనబడుతుంది. ఒక్క ముందు వెనకల విషయంలోనే కాకుండా ప్రతి కథనీ ఓ మంచి 'షార్టుష్టోరీ'గా రాయాలన్న తపన రవణ రచనల్లో కనబడుతుంది.

మచ్చునకు మూడుదాహరణల్జెప్పేసి వరహాల్రాజు దిగ్రేట్ హీరో ఆఫ్ టెలుగు సిల్వర్ స్క్రీన్‌ని పరిచయం చేస్తాను.

## ముత్యం ఒకటో కథ

వరహాల్రాజు మొదట కలగంటున్నప్పుడు 'తెరమీద తుపాను చల్లారింది. తరవాతి దృశ్యంలో తెల్లారింది' అని కలకు మంగళం పాడి '...... తెల్లారింది.' అని ఇలకు స్వాగతం పలకటం రచయిత రచనా కదనశక్తికో ఉదాహరణ.

## రెండో కథ

కొలంబస్సూ, వరహాల్రాజూ టాక్సీకి డబ్బు ఎలా ఎగ్గొట్టాలాఅని తెలుగుపుస్తకాల పబ్లిషర్లా ఆలోచిస్తున్నప్పుడు,

'హ్వామ్మయ్య. నువ్వొద్దు. వేండా. నాన్ మొయ్యారే. నేనే మోస్తాలే' అంటూ బరువు మొయ్యడాన్ని అభినయించి కారులో కూర్చున్నాడు కొలంబస్సు.

'ఫో నేరాఫో' అన్నాడు.



కొంతసేపటికి దీపాలు వెలిగాయి.

'అంగెనిల్లు' అన్నాడు కొలంబస్సు. ఇక్కడ 'కొంతసేపటికి దీపాలు వెలిగాయి అని చెప్పటంలో సినిమాటెక్నిక్‌లో కథ చెప్పటం కనబడుతుంది.

కారు కదలబోతుంటే 'ఎలక్ట్రీ స్తంభాన్ని వెలగని బల్బుని' చూపిస్తాం. కాస్సేపాగి 'ఎలక్ట్రీలైటు' హఠాత్తుగా వెలగటం చూపిస్తాం. కెమేరా కిందకి దించితే స్తంభం పక్కన కారు వుంటుంది. అంటే కారు పగలుచాలాసేపు ప్రయాణించి చీకటిపడ్డాకగాని ఒకచోట ఆగలేదన్నమాట. ఇలా చెప్పటం వల్ల – కారు పరిగెత్తటం, 'బ్యాక్ ప్రొజెక్షను' బోల్డు డబ్బు, అంతే బోల్డు టైము 'ఆధా' చెయ్యొచ్చు. అదిన్నీగాక డైరెక్ట్రు 'బలే అయిడియా ఏశాడ్రా' అని ప్రేక్షకులు పొంగిపోయే అవకాశం కూడా కల్పించవచ్చు.

## ముత్యం మూడోకథ

రాజూ రాయుడూ కూచుని వుండగా (స్క్రిప్టుమీన కాదు, నేలమీనే) పనిపిల్ల వచ్చి అమ్మగారు పిలుస్తున్నారంది. 'శిద్దరొస్తున్న' రాజు దాన్ని గసిరేశాడు.

'దవడపల్లు ఊడగొడతారంటండీ' అని అది యజమానురాలి సందేశాన్నందించింది.

'ఎవరివీ' అనగానే

'కనుకొత్తానుండండి' అంది స్వామిభక్తితో. ఆనక రాజుకి స్పృహవొచ్చి లోపలికి పరిగెత్తాడు లక్షింనరసు గుర్తొచ్చి.

'నాకు భయం వేస్తోంది. నీకు సాయం ఉండనా' అన్నాడు రాయుడు పనిపిల్లతో. షార్టుస్టోరీకి కొసమెరుపివ్వటం ఏవిటో తెలిసిన పనివాడిపిల్ల

'పల్లు రాలగొడతాను. ఈసారి ఒవురియో కనుక్కురానక్కర్లేదు బుల్లోడా' అనేసింది మిసెస్ ఓ హెన్రీలాగా.

## చిత్రలోకం

సినిమా ఫీల్డులో తటస్థపడే మనుషులకు యిందులో తారసపడే నర్సయ్య, వీరభద్ద్రావు, సుబ్బన్న, లక్షింనరసు, దిల్రుబాల, రోక్రాని, గిరిధర్ లాల్ వగైరాలు నమూనా పాత్రలు. ఇందులో అందరూ దుర్మార్గులూకారు, అందరూ సన్మార్గులూకారు. అన్ని మార్గాలవాళ్లూ వున్నారన్నమాట. రాజకీయాలైనా, సినిమాలైనా మరోటైనా మంచీ చెడూ, వెలుగూ నీడా, ధనం ఋణం క్లోజప్పు లాంగ్‌షాటూ వుంటాయిగదా! అందుకే రవణ విక్రమార్కుడి మార్కు సింహాసనంలో అమాయకులైన వరహాల్రాజు, ముత్యంలాంటివాళ్లకి చోటిచ్చాడు. వీరభద్దరావులాటి ప్రొడ్యూసరు బామ్మర్దులకీ చోటిచ్చాడు. దిల్రుబాలలాంటి బతకనేర్చిన కథానాయికలున్నట్టే చేనేత చీరలా సాదాగా

కనబడే లక్ష్మింనరసులాంటివాళ్లున్నారు. సినిమా ప్రపంచమైనా ప్రపంచంలో ఒక భాగమే కదా! ఇక్కడున్నవన్నీ అక్కడా వుంటాయి. కాకపోతే సినిమా ప్రపంచం అక్షరాలా 'మీనియేచర్ ప్రపంచం' అనిపించుకునే అర్హతలు సంపాయించుకుంది, అనతి కాలంలో!

**పుల్లద్రాక్ష**

కాని సినిమా ప్రపంచానికి సంబంధించి నవలలు, నాటకాలు రాసిన చాలామంది రచయితలు ఆ రంగం కుళ్లిపోయినట్టు అవినీతి, అన్యాయం అక్కడ కూడుగూడు సంపాయించుకుని కాపరం చేస్తున్నట్టు, అందులోకి వెళ్లిపోయినవాళ్లు చెడిపోయేట్టు దుష్ప్రచారం చేస్తూవచ్చారు. కుళ్లు ఎక్కడ లేదు? అవినీతి, అన్యాయం ఏ రంగంలో లేదు? ఈ రచయితలు సినీరంగం గురించి అలా రాయటానిక్కారణం అసూయ, చేతగానితనం, ఆ వైపు గ్లామరు వదలకపోవటం.

**సినీమః**

రవణ ఈ రచనలో మోసాలూ, కావేషాలూ, వేషాలూ చూపించినా సుఖదుఃఖాల వెలుగునీడల పొరలలో కనబడే సజీవమైన వ్యక్తులరూప చిత్రణే చేశాడు. సినిమారంగంలోని అమాయకత్వమూ చూపించాడు. గిరీశం లెక్చర్లలో సినిమాలపై ప్రయోగించిన ఘాటైన సెటైరు కిందులో చోటివ్వలేదు. అది ఆ రంగంపట్ల రచయితకి గల సానుభూతికి తార్కాణం!

**ప్రజా ప్రతినిధి**

సినిమా రంగంలో ఏదో రకంగా చేరిపోవాలనుకునే అశేష ప్రజానీకానికి ఏకైక సాహిత్య ప్రతినిధి వరహాల్రాజు.

రాజు 'తడకమీద అంటించుకున్న తెరవేలుపుల వదనారవిందాలు చూచి ఆనందించి మళ్లీ కళ్లు మూసుకుని అరచేతిలో 'నర్గీస్' చుట్టుకుని కళ్లకద్దుకుని,కళ్లు తెరచి ఫోటోజెనిక్‌గా ఆవలించి 'హాయ్‌రాజ్' అనుకుని కాని నిద్దర్లేవడు.

అతను 'ఒక్కో పత్రికకి ఒక్కొక్క స్టారు అడ్రసు అడుగుతూ రాసి జవాబు తెప్పించి అవన్నీ పోగేశాడు.' అతనికా అడ్రసులన్నీ కంఠతా వచ్చు. అదేకాక ప్రతి సినిమా చచ్చు సంభావన అరడజనుసార్లన్నా చూసి అన్ని 'టెక్నికల్ డిపార్టుమెంట్లు' జాగర్తగా స్టడీ చేస్తాడు.

'ఏదో అలవాటైపోయి ఎప్పుడు సంభాషణలు చేసినా రాసినా సంతృప్తికరంగానే ఉన్నాయి. సౌండు ఫర్వాలేదు' అనిపించుకున్నాడు. అతనప్పటికి బోల్డు ట్రంకుపెట్టెడు ఫిలిం స్టోరీలు, డైలాగులు, త్రీ థౌజండు సాంగ్సూ రాశాడు.

ఇవన్నీ బుర్రలో విష్ణుచక్రాల్లా తిరుగుతుండడంవల్ల రాత్రిళ్లు కలర్కలలు పగళ్లు సినిమా 'స్కోప్' కలలు కంటుంటాడు.



ఆ కారణంగా (నరసు ఏడిచినప్పుడు) 'ఎందుకో తెలుసులే ఊరుకోబెడతాచూడు' అని అప్పుడప్పుడూ ఆత్మతో సంభాషిస్తుంటాడు. (సినిమాల్లో అల్లా ఆత్మ, అనాత్మ కలిసి సంభాషించాల్లే నీకు తెలీదు.)

మాంఛి ట్రాజిక్కు దృశ్యంలో కూడా 'ఏడవకు నరసూ ఏడవకు ...ఇందాక ఊరికేనే అలా అన్నాను...నీతో నిజంగానే హీరోవేషం వేస్తాలే.. ఏడవకు' అంటూ పవర్‌ఫుల్ బాక్సాఫీసు కనకవర్షం డైలాగు చెప్పగల్డు.

విచారభయపడినప్పుడుకూడా 'ఇందరు గొప్పవాళ్లు – వణుకుతున్నాయి నా కాళ్లు' అని బ్రిలియంటు డైలాగు తప్ప 'అంటు' డైలాగు (ఎంగిలైందన్న మాట) అనడు.

'మహాబలిపురంలో షూటింగుతీసి స్టుడియోలో యాక్టర్లని మళ్లా వేరే షూటింగుతీసి ఆనక రెండూ కలిపేస్తారు.' ఆ టెక్నిక్కులన్నీ రాజుకి తెలుసు.

ఈనాడు పల్లెటూళ్లో వేలిముద్రగాళ్ల దగ్గర్నించీ బస్తీలో ఎమ్మేలు చదివేశామనుకునే వాళ్లదాకా రామారావుకి నాగేశ్వర్రావుకి వయస్సులో ఆర్నెల్లు తేడావున్న వైనం గురించి, అల్లప్పటి సినిమాలో ఫలానా తారామతి చీరె కట్టుకుందా, అసలు – కోలేదా అన్న విషయం గురించి విపులంగా తీరిగ్గా గంటల తరబడి చర్చించుకుంటుంటారు.

ఈ సినీమానియాలకి 'సినీరిప్రెజెంటేటివ్' వరహాల్రాజు.

ఆంతెందుకు సినిమాజీవితం తప్ప అతనికి మామూలు జీవితం లేదు. 'వీరు మనుషులా? నటులా?' అన్న సందేహాలంకారానికి సరైన ఉదాహరణ వరహాల్రాజు.

అతను మంచివాడు. ఆరు సాంఘిక నాటకాల్లో హీరోగా వేశాడు. మాయా మర్మం తెలీనివాడు. తప్పులైనా యింగ్లీషూ, హిందీ ధైర్యంగా మాట్లాడగలవాడు. కనకనే కంకర్రాళ్లలాటి కష్టాలరోడ్డుమీద నడిచి నడిచి నడిచి కడకు స్వర్గారోహణ చెయ్యగలిగాడు. తెరమీదకెక్కి పోగలిగాడు.

రవణ 'ప్రేమించిచూడు' చిత్రంలో వరహాల్రాజుకి వేషం ఇప్పించాడు. చలం వేషం వేసుకున్న వరహాల్రాజు సినీభక్తుడు గనక 'వరహాల్రాజకపూర్' అని పేరుపెట్టుకుని ప్రొడ్యూసర్ డైరెక్టరాక్టర్ కావటానికి ప్రయత్నించాడు కాని–

క్రూరుడయిన రచయిత పడనివ్వలేదు. పిటీ మిస్టర్ వరహాల్రాజకపూర్!

**చిత్రాలంకరణ**

సినిమా మనుషులతో సినిమా కథలతో సాగిపోయే ఈ రచనలో పదాలకు, వాక్యాలకు పేరాలకు అలంకారాలకు చివరికి వ్యాకరణానిక్కూడా సినిమా మేకప్ వుండటం రవణ అలంకరణ శక్తిని చాటుతోంది.

‘రామచామిది భారీ విగ్రహం. తెలుగు సినిమా అంత – ఆ మాటకొస్తే దాదాపు అరవ సినిమా డైలాగంత పొడుగ్గా వుండేవాడు. కాగా సగటు భారతీయ హీరోయిన్ అంత లావుగా ఉండేవాడు.’

ఈ సినీ అలంకారాలలో కూడా సినిమా పరిశ్రమకి సంబంధించిన వివిధ దోషాలను ఎత్తిపొడవటం వున్నా లేకపోయినా ఎత్తిచూపటం మాత్రం రచయిత వదల్లు.

ఋణానందలహరిలో ‘చిమచిమ నవ్వులు, దోబుసలు, తుసాబుసాలు’ వినబడితే యిందులో ‘విలన్ నవ్వులు, నంబియార్ నవ్వులు, ఫోటోజెనిక్ ఆవలింతలు’ వినబడతాయి.

రవణ కథల్లోను యితర రచనల్లోను కనబడే మధ్యతరగతి నిరుద్యోగి దుర్యోగం యిందులో వరహాల్రాజులోనూ ప్రతిఫలిస్తుంది.

అతని ‘కడుపులో కామేశ్వరరావు హల్లో అంటున్నాడు. జేబులో ధనపతిరావు నిల్లో అంటున్నాడు అని.

సామాన్యంగా సినిమాల్లో భాషాభేషజం లేకుండా సోలో పాడుతున్న నటుడు బి.జి.యమ్. పూర్తయేవరకు అది వింటూ కూచుని అదికాంగానే మళ్లా పాడటం – అలాగే డ్యూయట్లలో హీరోయిన్ పాడుతుంటే అదయ్యేవరకు విని ఆనక హీరో తరవాత చరణం అందుకోవటం స్టేజి నాటకాల్లోలాగా నేటికీ జరుగుతోంది.

‘డ్యూయెట్ సీనులో ‘హీరోయిన్ పాట వినుట’ను నటిస్తున్న హీరోలాటి మొహం పెట్టాడు రాజు’ అనటం అలాటి సన్నివేశాలపై కొరడా ఛెళ్ళుమనిపించటానికే!

‘హొరైజన్‌లోకి వెళ్లిపోతున్న హీరోకిమల్లే’ – అన్నదికూడా చిత్రీకరణపై వేసిన బాణం.

‘ఏపుగా పండిన జొన్నచేలో కంకుల బరువుకి తలవాల్చిన మొక్కలా, అయిడియాల భారంతో దాదాపు నడ్డివరకూ ఆయన వంగిపోయాడు.’

‘తలత్ మహమద్ కంఠంలా గజగజ వణికిపోయాడు.’

### సినీకథనం

ఇలా ఉపమానాల్ని, కొలమానాల్ని వాడుకోవటమే కాకుండా కథ, కథనంకూడా సినిమా పద్ధతిలోనే నడుస్తుంది.

రాజు మొవ్వారం టెంటు సినిమాలో చూసిన లేక చూశాననుకుంటున్న విచిత్రాన్ని కలగంటున్న సందర్భంలో అది కలో? కలకావలో? తేల్చుకోలేక తనలో తనే సంభాషిస్తూ అనుకున్నాడు.



‘అసలు రెండూ జరిగాయా జరగలేదా? మతి ఉందా పోయిందా?...’ అని ఆలోచించుకుంటున్నప్పుడు రాజు మనసులో పరిపరిభ్రమిస్తున్న అదే డైలాగుని పుచ్చుకుని,

‘ఒరే అబ్బీ నీకు మతుందా పోయిందా’ అంటూ ప్రవేశిస్తాడు అతని చెలికాడు ముత్యం.

హీరోవాళ్ళ గూడెంలో (అదే–కూటంలో లేక గుడారంలో) హీరో బాకుని యాపిల్ కాయకిగుచ్చి లేచి నిలబడి,

‘వాడు నన్ను ప్రాణాల్తో పట్టుకోలేడు’ అంటాడు.

ఫ్రేమ్ టిల్ట్ అయి

విలన్ వాళ్ల గూడెంలో తేలుకుట్టినట్టు హఠాత్తుగా లేచిన విలన్

‘ప్రాణాల్తో పట్టి తీర్తాను’ అంటాడు. ఇలాంటిదన్నమాట పై ముత్యం డైలాగు.

### కలం కెమేరా

అలాగే కొలంబస్సూ రాజూ టాక్సీదిగి ఖాళీపెట్టె టాక్సీలో వదిలేసి అర్జెంటుగా ఒక యింట్లోకి వెళ్లి దొడ్డిదోవగుండా ఫేడౌట్ అయిపోయారు.

‘పెట్టె వాడికీ బేడ మనకీ’ అనుకుంటూ రవణ మళ్లా కలం కెమేరాని టాక్సీవాడి దగ్గరకు తీసుకొచ్చి టాక్సీవాడి మానసిక సంచలనాన్ని చిత్రీకరించి ‘ఇది నమ అదిష్టం’ అని వెనకసీటులో పెట్టెకేసి ఆప్యాయంగా చూస్తున్న టాక్సీవాడి ఎక్స్‌ప్రెషన్ మీద షాట్ క్లోజ్‌చేస్తూ ఫుల్‌స్టాప్ పెడతాడు.

### సినీభారం

రాజు సుబ్బన్న దయవల్ల లక్షింనరసు ప్రేమానురాగాలవల్ల ప్రొద్యూసరయిపోయి సెట్టుమీదకెళ్లాడు ‘సాయంగా’ అన్నీ చూచుకుందామని. అక్కడున్న డైరెక్ట్రుని డైరెక్టుగా అడిగాడు నేనూ పాటలు రాస్తానని. ఆ డైరెక్టరుగారు భోరున ఏడ్చేసి అప్పటికే తన బామ్మర్దితో పాటలు రాయించేశానని చెప్పి ప్రొద్యూసరు టాలెంటు వృథా అయిపోతున్నందుకు బెంగెట్టుకున్నాడు.

రాజు త్యాగమూర్తిలా చూసి త్యాగమూర్తిలా నవ్వి ‘పోనీ నేను శాంగ్సు రాయకపోతే పాయెగాని, రాసినవాటిలో ఎక్కడేనా ‘ఆర్ణవము’ అనేమాట పెట్టించండి. అది భలేవరుదు లెండి. నాకుచాలా యిష్టం.’ అన్నాడు.

కవిబామ్మర్ది కుదర్దన్నాడు. కాసేపు ముగ్గురూ సంప్రదింపులు జరుపుకుని ముగ్గరూ త్యాగమూర్తులయిపోయారు. అక్కడ రవణ కథనం సినిమా చిత్రీకరణచేస్తూ సినిమా చిత్రీకరణకు ‘పారడీ’గా నడిచింది.

బావమరిది ముందు బిక్కమొహం పెట్టి ఆనక దుఃఖసముద్రంలో మునిగిపోయాడు.

ఇదంతాచూసి రాజుకి ఏడుపొచ్చేసింది. భయంవేసింది.

'ఛీ! నామూలాన కదా కుటుంబకలహం వచ్చింది. ఆర్నవంకోసం కుటుంబచ్ఛిద్రం అయిపోతే నా హృదయభాండం భరించలేదు. సార్! ఆర్నవం మానెయ్యండి' అన్నాడు భోరున ఏడుస్తూ, స్టూడియో ఆకాశంలోకి చూస్తూ.

డైరెక్టరుగారికీ ఈ సీను చూసేసరికి గుండె దుఃఖం పొంగి పొరలిపోయింది.

అప్పుడు ముగ్గురూ ఏడిచేశారు. డైరెక్టరుగారూ, ప్రొడ్యూసరూ, కవీను.

కాసేపు ఏడిచాక 'ఆర్నవం ఎలాగో అలా పెట్టెయ్' అన్నారు డైరెక్టరు కళ్ళు తుడుచుకుంటూ.

'పెట్టేస్తాను బావా' అన్నాడు బావమరిది ఎక్కిళ్లు ఆపుకుంటూ.

'ఒద్దు' అన్నాడు రాజు ముక్కు చీదుకుంటూ.

**మాణిక్యాలు – మసిబొగ్గులు**

సినీమా లోకంలో అభిభాషణల్లోను సంభాషణల్లోను కూడా ఒక పదానికి యింకోపదం వాడటం గమనించవచ్చు. ఇది కేవలం 'అగ్నానం' చేతనే.

వరహాల్రాజుకి ప్రథమ సోపానంలోనే ఎదురుదెబ్బలా పరిచయమైన నర్సయ్య రైల్లో టోకరాసురుడి కథ చెబుతాడు.

అందులో 'ఓ చోట గ్రీటింగు కార్డులు ప్రింటుకొట్టించి శాంపులు కాపీలిమ్మని ముందస్తుగా నాలుగు పుచ్చుకు చక్కావచ్చాను' అంటాడు.

'విజిటింగు కార్డ'ని నర్సయ్య భావం. అలా పొరపాటు మాట్టాడ్డమే కాకుండా అది వరహాల్రాజుకి వివరించి మరీ చెబుతాడు.

'గ్రీటింగ్ కార్డ్స్' అంటే తెలుసుగా, మనపేరు డిగ్రీ డిగ్రీ ప్రింటు చేస్తారులే' అని.

వరహాల్రాజుకి పరిచయమైన మరో బంగారుబాబు అంటాడు.

'వాడెవడో అన్నట్టు 'తివిరి కుందేటి కొమ్మున తైలంబు తీయవచ్చు. వాడి దుంపతెగ చిన్న డైలాగులో మూడుసార్లు 'త' పెట్టి రాశాడు.'

'తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు.

తిరిగి కుందేటికొమ్ము సాధించవచ్చు' అనే రెండువాక్యాలు కలగాపులగంచేసి కొత్తవాక్యం తయారుచేశాడు బాబు.



అలాగే సినిమారంగంలో చాలామందికి ఉహూ యింగ్లీషు మాట్లాడెయ్యాలన్న తపన వుండి మాట్లాడగలమన్న నమ్మకంతోపాటు మాట్లాడుతున్నామన్న అనుమానం కూడా వుంటుంది.

'ఇఫ్‌యూ డోంట్‌కేర్ గివ్‌మీ – కాఫీ తాగాలండి. ఓ బేడకావాలి. మళ్లీ ఇచ్చేస్తాను' అన్నాడు వరహాల్రాజు.

'ఇఫ్‌యూ డోంట్ మైండ్' అన్నది అంటున్నానని అతని ఆశాభావం.

నిజానికి యిలా ఒకదానికొకటి ప్రయోగించటం వాక్యాలు పదాలు కలగాపులగం చేసివాడటం హాస్యరసోత్పత్తికి రచయితలు చేస్తారు. దీన్ని ఆంగ్లంలో 'స్పూనరిజం' అనీ, 'మాలెప్రాపిజం' అనీ అంటారు.

స్పూనర్ అనే విశ్వవిద్యాలయాధ్యాపకుడు క్లాసులో కుర్రాళ్లని నవ్వించడానికి యిలా మాట్లాడేవాడు. దానికే స్పూనరిజం అనేపేరు వచ్చింది. 'షెరిడాన్' అనే నాటక కర్త 'రైవల్స్' అనే నాటకం రాశాడు. అందులో మిసెస్ మాలెప్రాప్ యిలా మాట్లాడుతుంది. ఒకమాటని దానికున్న అర్థంలో కాక యించుమించు దానిలాగే వుండే యింకో మాటయొక్క అర్థంలో వాడడం – దీనికే 'మాలెప్రాపిజం' అనేపేరు వచ్చి షెరిడాన్ సృష్టించిన ఆపాత్ర సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోయింది.

సంస్కృతంలో 'మృచ్ఛకటికం' నాటకంలో శకారుడు పొరపాటు వాక్యాలు మాట్లాడి నవ్వు పుట్టిస్తాడు. 'సీతను చెరపట్టిన దుశ్శాసనుడిలా' అంటూ.

సామాన్యంగా మనం చేసే పొరపాట్లే సాహిత్యంలోకెక్కి యిలా వేషాలు వేస్తుంటాయి. సినిమారంగంలో అంతా వేషాలు వేసేవాళ్లే గనక యీ పొరపాట్లు ఎక్కువచేస్తారు. ఎవడికి వాడు తను గొప్ప పండితుడ్ని అనుకుంటూ ఎదటవాడిని నమ్మించాలని ప్రయత్నిస్తాడు.

త్యాగయ్య చిత్రంలో రచయిత 'మసిపూసిన మాణిక్యం' అని రాశాడు. మసిపూసి మారేడుకాయ' అనీ 'మట్టిలో మాణిక్యం' అనీ అంటారు. రచయిత ఆ రెండూ కలగలిపి 'మసిపూసిన మాణిక్యం' అని రాయటం జరిగింది. ఇది నవ్వు పుట్టించటానికి వాడిన వాక్యం కాదు. కేవలం రచయిత అజ్ఞానం వల్ల పుట్టిందే.

శ్రీశ్రీ ఆనందవాణి పత్రిక వారం – వారం శీర్షికలో ఈ త్యాగయ్య 'మసిపూసిన మాణిక్యం' గురించి 'అవాక్కులు' అనే వ్యాసంలో రాశాడు.

వరహాల్రాజుకి రైల్లో పరిచయమైన బైరాగికూడా యధాశక్తి కథలు చెప్పాడు.

"అదుగో ఆ ఒకడు లేడూ.. వాడు అలా ఉన్నాడుగాని నివురు గప్పిన నిప్పు, మసిపూసిన మాణిక్యం" అంటాడొకచోట.

రవణకూడా త్యాగయ్య సినిమాలో వినబడిన ఆ ప్రౌఢ ప్రయోగాన్ని దృష్టిలో పెట్టుకునే యిది ప్రయోగించాడనిపిస్తుంది.

'సాహిత్యంలో ఇలా మసిపాతనికట్టిన మాణిక్యాలెన్నో ఉన్నాయి. వాటిని సినిమాలో మసిపూసి మారేడుకాయ చెయ్యవచ్చును.' అని శ్రీశ్రీ అన్నమాట సత్యదూరం కాదు.

మాలెప్రాపిజం సినిమావ్యక్తుల భాషలో సర్వసాధారణంగా గోచరిస్తుంది. సినిమారంగాన్నే కాక వ్యక్తుల వేషభాషల్ని చాలా జాగ్రత్తగా పరిశీలించి 'విక్రమార్కుడి మార్కు సింహాసనం' రాస్తూ ఈ 'మాలెప్రాపిజం' కూడా ప్రవేశపెట్టటం రవణ నిశిత పరిశీలనకి, అగాధమైన విజ్ఞానానికి నిదర్శనం.

**'కలయో వైష్ణవమాయయో'**

జీవితంలో జాగరూక స్థితికెంత ప్రాధాన్యత వుందో 'కలల' క్కూడ అంత ప్రాముఖ్యత వుంది.

'కలలు నిజమవుతాయి' అన్నది ఆశావాది వాక్యం.

'కలలు నిజమవుతాయా' అన్నది నిరాశావాది మాట.

'తెల్లారుఝాము కలలు నిజమవుతాయి' అన్నది సంప్రదాయజ్ఞుని మూఢనమ్మకం.

నిజస్థితి విషాదంగా వున్నప్పుడు దిక్కుతోచని మానవుడు కలల్లోకి జారిపోతాడు. పగటికలల్లోకి పారిపోతాడు. అక్కడ ఆనందాన్ని వెతుక్కుంటాడు. 'పగటి కల' మనిషి తెలిసిన స్థితిలో వెతుక్కునే ఆనందానికి గుర్తయితే 'రాత్రికల' మనిషికి తెలిసీ తెలియని స్థితిలో వెతుక్కునే ఆనందానికి చిహ్నం. అణగారిన కోరికలు ఆశయాలు కలల్లో పంటకొస్తాయి. జీవితంలో పెట్టుకున్న ఆశల్నీ, ఆశయాల్నీ ప్రతివాడు తప్పనిసరిగా కలగంటాడు – పగలో – రాత్రో!

వరహాల్రాజుకి సినిమాల్లో చేరాలన్నది అందమైన కల. తీరని కోరిక. ఎలాగో అలా తెరమీద కెక్కిపోవాలని అతడి కాంక్ష. ఈ కోరికల్నీ, ఆశల్ని అప్పుడప్పుడు కలలు కంటుంటాడు. అతనికేకాదు సినిమా పరిశ్రమ ఈనాడు ప్రతివాడికీ తీయని కల. పగలో–రాత్రో, తెలిసో–తెలియకో కల నిజపరుస్తూనో – నిజాన్ని కలగంటూనో సినిమా పరిశ్రమ గురించి కలలు కనటం తప్పనిసరి. లోకంలో కల 'కలాకారుల' ఆకారమే వరహాల్రాజు.

అందుకే విక్రమార్కుడి మార్కు సింహాసనం 'వరహాల్రాజు కలతో ప్రారంభించాడు రవణ. ఇది మంచి టెక్నిక్! నిజానికి ఏదైనా రచన మొదలు పెట్టేప్పుడు కొంతమంది రచయితలు అది ఎలా అంతమవుతుంది అన్నది ఆలోచించరు. దాని మానాన అది పోతుంటుంది ప్రఖ్యాత రచయిత్రి సీరియల్లాగా. అలా కాకుండా గొప్ప రచయిత



ఎప్పుడూ తన రచనమొత్తం మనసులో ముద్ర వేసుకుని దానినో అందమైన ప్రారంభంతో యింకా అందమైన ముగింపుతో రాస్తాడు. నవల మొదట్లో తెరలోంచి ఎవడో వూడిపడ్డట్టు మళ్లా ముత్యంసాయంతో అతగాణ్ణి తెరమీద కెక్కించేసినట్టు కలగన్నాడు వరహాల్రాజు. నవల చివర అచ్చు అతగాడిలాగే తనుకూడా తెరమీద ఖాళీస్థలంలోకి ఎక్కిపోయి నటుడయిపోయాడు.

మనకో అనుమానం వస్తుంది. మొదటిది కలా? రెండోది కలా? అని. రవణ జవాబివ్వడు. కలో వాస్తవమో తెలుసుకోగలిగితే మాయ పొరను తొలగించుకుని బ్రహ్మజ్ఞానం పొందినట్టే లెక్క. అది తెలీకే 'కల' లాంటి ఈ 'ఇల'లో వాస్తవం కోసం వెతుక్కుంటూ తిరుగుతుంటారు జీవులు – అంటే మనమే నన్నమాట.

ఇంతకీ వరహాల్రాజు నిజంగా నటుడయ్యాడా లేక తెరకెక్కి నటుడయి పోయినట్టు మరో తీయటికలగని కమ్మగా పడుకున్నాడా అన్నది బ్రహ్మజ్ఞానం అంత కఠినమైన సమస్య!

వరహాల్రాజు చివరి సన్నివేశం కలే అయితే,

'సినిమా పరిశ్రమలోకి ఎంటరవటం కల' వరహాల్రాజులాంటి భోజరాజుకి అందులోకి ప్రవేశం లేదు అనుకోవాలి.

చివరి సన్నివేశం నిజమే అయితే 'తివిరి కుందేటి కొమ్మున తైలంబు తీయవచ్చు' అని మనం మననం చేసుకుంటూ,

'కల నిజమాయెగా

కళ నిజమాయెగా' అనుకోవచ్చు.

వరహాల్రాజు నిద్రలోనే కాదు మెలకువవచ్చి అరచేతిలో 'నర్గీస్' చుట్టుకుని కళ్లకద్దుకుని 'హాయ్‌రాజ్' అని ఆవలించింతరువాత కూడా యింకా కలలు కంటూనే వుండగలడు.

మళ్లా సినిమాష్టార్ల లైఫ్ గురించి కలగని కాస్తలో తప్పిపోయింది గదా ఛాన్సు అని ఉలిక్కిపడ్డాడు.

'రాత్రి జరిగింది కలా నిజమా? అసలు తను సినిమాకి వెళ్లాడా లేదా? వాడు ఊడిపడ్డాడా పడలేదా?' ఇన్ని అనుమానాలొచ్చేశాయి.

అవన్నీ కలలో అసంగతాలే అనుకున్నా 'వాడితోపాటు తనూ తెరలోకి ఎక్కిపోయుంటే బాగుండేద'న్న తియ్యటి ఆలోచన మాత్రం అతన్ని వదల్లేదు.

రాత్రి జరిగింది కలా? కల్లా? అని మళ్లా అనుమానంలో పడ్డాడు. పదో పేజీలో మొదలైన ఆ అనుమానం అతన్ని డెబ్భయ్యారో పేజీదాకా వదల్లేదు.

డెబ్భయ్యారో పేజీలో రామనాథం (ధన్) తటస్థపడినపుడు కాసేపు గుంజాటన పడి తెగించి అడిగేశాడు రాజు.

'మీరెప్పుడైనా మొవ్వారం టెంటు సినిమాలోంచి ఊడిపోయారా' అని.

కావాలనుకున్న కలలో మరోటికూడా జరుగుతుంది. సగం గుర్తు తెలిసీ, సగం తెలియక సీక్వెన్స్ గడిచిపోతుంది. వరహాల్రాజు కూడా ఈ స్థితిని అనుభవించాడు ఒకటి రెండుసార్లు.

'సదరు సదుపాయాలవల్ల చురుకైన రాజుబుద్ధి నిద్రలో చిన్నసైజు 'డ్రీం సీక్వెన్సు' తయారుచేసింది. గుర్తు తెలీని హీరోయిన్‌తో కంఠతా పట్టి కాపీకొట్టిన హిందీ ట్యూన్‌లో డ్యూయెట్ పాడుతూ, టాపులేని హాలులో గొల్ల స్తంభాలాటలా పరుగెడుతున్నాడు రాజు.'

ఇది ఫరవాలేదుకాని యింతకంటె అవమానం జరిగేలా, తన కలలు ఎదటివాడి కళ్లకి కనబడిపోయేలా ఓ సంఘటన జరిగింది రాజుకి.

సినిమా గేటనుకుని రైల్వేగేటు దగ్గర కనబడ్డ గుర్ఖాకి రూపాయి లంచం యిచ్చేసి 'కలా వలా తలా' కాని స్థితిలోకి జారిపోయాడు రాజు.

'అయితే ఇందాకలది కలకాదన్నమాట. నేను మూర్ఛపోలేదన్న మాట. ఈ రూపాయి నాదేనన్నమాట. గూర్ఖాచేతిలోంచే తీసుకున్నానన్నమాట. మీరు చూపుడువేలు ముందుకు పెట్టారన్నమాట.' అన్నాడు రాజు రామనాథంతో.

'కొన్నిరైట్లు కొన్ని తప్పులూ కొన్ని నాకు తెలీదులు. మీరు గూర్ఖా చేతిలో రూపాయి పెట్టి పరుగెట్టి మళ్లీ లాక్కున్నారు! వాడు కాస్తా బెదిరిపోయాడు, మీకు వేపకాయంత వెర్రిఉందని. కరుస్తారని భయపడి కాబోలు లాగి లెంపకాయ కొట్టాడు. ఆ దెబ్బకి మళ్లీ మీరు అర్జంటుగా రైలుగేటు దగ్గరికెళ్లి జేరబడ్డారు. నేను ఇదిచూసి మీ దగ్గరకి వచ్చేసరికి అలా వలా తలా అంటున్నారు' అన్నాడు రామనాథన్.

ఇలాటి వ్యక్తావ్యక్త స్థితిని ఈ నవల చివరి పేజీవరకు అనుభవించాడు వరహాల్రాజు. చివరిపేజీ తరవాత కూడా అనుభవిస్తూనే వుంటాడని నా అనుమానం.

సినిమా పరిశ్రమలో చాలామందికి ఈ కలలే కడుపు నింపుతాయనటానికి ఆధారంగా 'గేటుకాపరి కథ' చెప్పాడు రవణ.

'మధ్యాహ్నం హీరో చిరునవ్వుకో తల తాటింపుకో అర్థం, భావం అంటకట్టి కమ్మగా కలలు కని, అవేతిని పడుకుని లేచి మళ్లీ రెండో షిఫ్టు మొదలెట్టేవాడు' గేటుకాపరి అనే సినిమాఛాన్సు కాపరి. కనకనే కలకి, కళకి వున్న అక్షరమైన సంబంధాన్ని సైంటిఫిగ్గా, సినిమాటిగ్గా చిత్రించాడు రవణ ఈ రచనలో.



**సినీ భాష**

సినిమా పరిభాషతో కథకతికిపోయే పదాలు, వాక్యాలు సృష్టించటం గమనించండి.

'శాపంవల్ల ఛాన్సు దొరకని మహానటులు.'

'దురదృష్ట దేవత నా కంపెనీలో షేరుకొని తినెయ్యడం మొదలెట్టింది.'

'ఘూర్ఖాని ప్రసన్నుణ్ణి చేసుకోవడం, స్టార్ వాల్యూ లేని పిక్చరుకి డిస్ట్రిబ్యూషన్ సంపాదించటం అంతటి కష్టం.'

పదాలు కాయిన్ చెయ్యటం – 'డొస్ట్రిబ్యూటరుడు, సొంతడబ్బా, పరడబ్బా, పరస్పరడబ్బా, లాట్రీ కొట్టడం (తిండి లేకపోవటం) ఫిట్టింగులు, తాకట్టు పారిశ్రామికులు, కడుపులో కామేశ్వర్రావు, జేబులో ధనపతిరావు, అదనీమణి, కొసరు తారడు, టెలిగ్రామ్య భాష, గ్రంధసాంగ్సు, పెట్టేబేడా, జనాంతికంగారు, శాన్స్క్రిటీక, క్రిటీకా తాత్పర్యాలు, సెక్స్ట్రా రిహార్సులు, సెగ్జయిట్‌మెంటు, సినిమాపేట, దేవరాజారావులు, కాడిలాకియర్.

**కథా కాకరకాయా!**

ఇందులో సినిమాలమీద విసిరిన చెణుకుల్లో ఎక్కువ సినిమాకథల మీదేవున్నాయి. మిగిలినవి నాయికానాయకులమీద, సినిమా రచనమీద కనబడతాయి.

'నువ్వు గొప్పవాడివై పత్రికలవాళ్లు ఇంటర్వ్యూ చేసినపుడు మరుపూ గిరుపూ చెలాయించు ఇపుడుకాదు.'

'మాటమాటకి నూటొక్క అర్థాలుండాలి.'

'డైరెక్టరుకి ఇంకొంచెం ఒడ్డూ పొడుగూ ఉండాలి.'

"రామాయణం ఎండింగులో ఏమౌతుంది? సీత దొరుకుతుందా?

'ఏం చెప్పగలమండి మీరు ఇలా హఠాత్తుగా అడిగితే? స్క్రిప్టుని బట్టి ఉంటుంది."

'కథ డిస్ట్రిబ్యూటరులమీద, హీరోయిన్‌ల గార్డియన్‌లమీదా ఆధారపడి ఉంటుంది. ఇంతకీ పిక్చరు సగమన్నా కాకుండా కథ ఏమిటో ఎవరు మాత్రం చెప్పగలరు?'

'సినిమా కథలు వారఫలాలవంటివి. గ్రహబలాలనుబట్టి మారతాయి.'

'హీరోయిన్ డైలాగులకి అర్థం ఏమిటి?'

'పిచ్చరు త్తియ్యకుండా స్టోరీ ఏమిటండీ మీరు మరీ విట్టీగా మాటాడుతారు! భలేవారే!'

## గ్రాంధీభాష

సినిమా గురించి రాస్తున్నా సాహిత్యంమీద, ముఖ్యంగా వ్యాకరణం ఛందస్సులమీద ఛలోక్తులు విసరటం రవణ మరచిపోదు–

కాలదోషం పట్టిన గ్రాంధికభాషని రెండుసార్లు స్పృశించటం జరిగింది.

నర్సయ్య కథ చెబుతానని

'శ్రీ కరంబును, తారలకాకరంబును, పేదలకు భీకరంబుననగు బొంబాయి నగరంబొండుగలదు...' అన్నప్పుడు వరహాల్రాజుకి చిరాకేసింది.

'మేష్టారూ! చిన్నసంగతి... మామూలుగా లైట్ టెలుగులో చెప్పలేరాండి.' అన్నాడు.

మరోకథ 'ప్రపంచతంత్రం' కూడా అలాగే మొదలుపెట్టేసరికి రాజు భయపడ్డాడు నర్సన్నకి తనమీద కోపంవచ్చి శిక్షగా 'గ్రాంధికభాష' ప్రయోగిస్తున్నాడని. ఆ భాషమీద కోపంగాను, నర్సయ్యని ప్రాధేయపూర్వకంగాను అన్నాడు.

'మళ్లీ నామీద కోపం వచ్చినట్టుంది. మనిద్దరికీ అరగని తిరగలి భాషలో పడ్డారు' అన్నాడు రాజు.

సంఘంలో సాహిత్యపరంగా వస్తున్న సమకాలికమైన మార్పుల్ని, సమస్యల్ని గుర్తించి వాటిని తన రచనల్లో పదిలపరచటం రవణ కలవాటని చెప్పటానికి ఈ 'గ్రాంధిక వ్యావహారిక' వాదం ఒక ఉదాహరణ.

'హాలీవుడ్డులో హరనాథ్‌బాబా' వున్నాడని నరసన్న చెప్పాడు.

'హాలీవుడ్‌లో హరానాథ్‌బాబా యెలా ఉంటాడండీ? మీ బొందలా వుంది' అన్నాడు రాజు.

'ఎందుకుండడు? యతికోసం చచ్చినట్టు పుచ్చిన కుక్కలా వుంటాడు.' అన్నాడు నరసన్న ఛందశ్శాస్త్రవేత్త గనక.

ఛందస్సులాగే వ్యాకరణంమీద కూడా రెండు విసుర్లున్నాయి.

'ఆ బీడీ నాకిచ్చేదు బాబ్బాబూ' అనేసరికి ముట్టించబోతున్న బీడీ ఆపళంగా తీసేసి బిక్కమొహంపెట్టి ఒక్కసారి నాకి ఇచ్చేశాడు ఆ యువకుడు.

'నాకు+ఇచ్చేద్దూ' అన్న అతగాడి వ్యాకరణాన్ని 'నాకి+ఇచ్చేదూ' అని అర్థం చేసుకున్నాడు యువకుడు.

ఉత్వసంధి చేసి మాట్లాడినందుకు స్వగతంలో చెంపలేసుకున్నాడు పెద్దమనిషి.

ఇదికూడా గ్రాంధిక భాషమీద సున్నితమైన చురక.



'రెండు సెపరేట్ ఒళ్లులు అన్నమాట' అన్నదో గొంతు ఆశ్చర్యంలో పొరపాటున.

'ఒళ్లులు అన్న శబ్దంలేదు. అలాటి బహువచనం ఎక్కడా కనబడదు' అన్నాడు కొలంబస్సు చిన్నయసూరిలాగా.

'మీ గ్రామరు తగలేసిరి. ఛస్తుంటే సంధి మంత్రంలా' అన్నాడు విద్యార్థిలాటి శ్రోత.

## అవుటాఫ్ ఫోకస్

పుస్తకం అంతా సినిమాకబుర్లతో కిక్కిరిసిపోయినా వరహాల్రాజు, లక్షింనరసు, వీరభద్రరావు, సుబ్బన్న వగైరా అందరి కళ్లుగప్పి 'పాల్టిక్సు'కి సంబంధించిన వాక్యం ఒకటి యిందులో జొరబడిపోయింది.

'డెమోక్రసీలో లంచగొండితనం చెల్లినంతకాలం అంతా బాగానే ఉంటుంది. బయటపడితే మటుకు అంతా వెలేస్తారు.'

## కవితాకదనం

రచన కొన్నిచోట్ల ముఖ్యంగా కళ్ళకు కట్టేట్లు, మనస్సుకు నాటుకొనేట్లు చెప్పే సందర్భంగా వచనం వేషం వేసిన కవిత్వం రాయడం రవణ కలవాటు.

రాయుడు రాజుకి హితబోధచేస్తూ చెప్పిన నాలుగువాక్యాలు మహాకవి కలంలోంచి వచ్చిన వచన కవిత అనటానికి ఎట్టి అనుమానం కలగదు.

'చూడు రాజా చూడు. చూసి నేర్చుకో. రంగులు కలపడం, మార్చడం నేర్చుకో. పసుపుమీద నీలం వేస్తే ఆకుపచ్చ. నిజంమీద అబద్ధం చరిస్తే కల్చరు అవుతుంది. అదిగో ఆయనచూడు ఆయనకి మన వెనకాయనంటే మంట. అయినా నవ్వుతున్నాడు భక్తితో ..అసూయ మీద ప్రేమ అలికితే బిజినెస్ ... విను.. ఈ పాతాయన ఆ కొత్తాయనని మెచ్చుకుంటున్నాడు. బాధకి చాలీచాలని రీవిని కప్పితే దైన్యం. ఎదటివాడి దైన్యంమీద హేళన ఒంపితే హైన్యం. విషాదంమీద చిరునవ్వు తెరవేస్తే కరుణ'.

రా.భే. పంచవింశతికలాగే ఈ రచనలోకూడా చివర సినీవిశ్వరూప ప్రదర్శన చేయడం జరిగింది. సామాన్యంగా 'సినిమా ప్రివ్యూ' రోజున అన్నిరకాల మనుషులు ఆహూతులు, అనాహూతులు అంతా వస్తారు. లోకంలో ఎన్నిరకాల మనుషులుంటారో అంతమందిని ఒకోరుగా 'స్పెసిమన్' చొప్పున ఈ ప్రివ్యూ సందర్భంగా చూడవచ్చు. ప్రపంచం యొక్క సంక్షిప్తరూపం సినీప్రపంచం పోగుపడినట్టు కనబడే ఈ 'ప్రివ్యూ' ప్రదర్శనతో రవణ చలనచ్చిత్రకథలు పూర్తిచేశాడు.

రాయుడు ప్రదర్శించగా రాజు దర్శించిన విశ్వరూపం అందరూ కనీ వినీ తరించాల్సిన అత్యద్భుత ప్రదర్శన. అక్షరరమ్యం. సుఖదుఃఖాదిక ద్వంద్వాంతీత

మమోఘమగాధ మచింత్యమమేయంఏకాంతం ఏకైకం క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం బ్రహ్మానుభవం' కలిగించే అపూర్వ అవకాశం.

## సినీ విశ్వరూపం

ఎదురుగా గేటుమీద 30 అడుగుల ఎత్తున నిలబడ్డ హీరోయిను బొమ్మ ఔట్‌ఆఫ్ ఫోకస్‌లోకెళ్ళి మసకబారి మళ్ళీ మెల్లిగా రూపుదేలింది. కళామతల్లి రాజాకి కనిపించింది.

"ఆమె సినీ–దేవతా వస్త్రాలు కట్టుకుంది. 'పుల్లద్రాక్షలు' పొదిగిన కిరీటం ధరించింది. రెండు చేతుల్లో రెండు గిన్నెలున్నాయి. ఒకదానిమీద కళ అని రాసి ఉంది. రెండోదానిమీద బాక్సాఫీస్ అని ఉంది. వాలఖిల్యుల పరిమాణంలో (అచ్చ తెలుగులో లిల్లిపుట్‌లన్నమాట) ఉన్న మనుషులు గిన్నెలచుట్టూ సందడిగా తిరుగుతున్నారు. కొందరు కళ ఉన్న గిన్నెవేపు మరికొందరు బాక్సాఫీసు పాత్రవేపూ వెళ్తున్నారు. కొందరు కళవేపు పోతున్నవారిని బాక్సాఫీసు పగ్గాలతో వెనక్కి లాగుతున్నారు. బండలా పడిఉన్న కొందరు ఎవరి కాలో తగిలి దిగ్గునలేచి పరుగెడుతున్నారు. నవ్వుతున్నారు. నవ్వుకుంటున్నారు. ఏడుస్తున్నారు. ఏడ్చుకుంటున్నారు. కొందరు పొట్టివాళ్లు పొడుగువాళ్లమీదకి పొట్టివాళ్ల నిచ్చెనలు వేసి ఎక్కుతున్నారు. కొందరు పొట్టివాళ్లు పొడుగు నటిస్తున్నారు. వాళ్ళని చూసి ఎవరో చప్పట్లు కొడుతున్నారు. వాళ్లని ఎవరో వెక్కిరిస్తున్నారు. కొందరు అటువాళ్ళని ఇటులాగుతున్నారు. పునాదులులేని ఒక తెల్లగోడ మీద గొలుసుల బొమ్మలు ఆడబోయిన బొమ్మల్ని చిటుకు చిటుకు కుడుతున్నాయి. కొన్నిటిని ముద్దెట్టుకుంటున్నాయి. కొన్నిటిని హైపో డెర్మిక్ సిరెంజి షాట్‌లు ఇచ్చి మత్తెక్కిస్తున్నాయి. బోలెడు జనం ఆ గోడకేసి చూసి నవ్వుతున్నారు. వెక్కిరిస్తున్నారు. కొందరు అందుమీదకి ఎగబాక చూస్తున్నారు. కొందరు జారిపోతున్నారు. అందుకెవరో ఏడుస్తున్నారు. వాళ్ళనెవరో రూపాయి కిరాయికి ఓదారుస్తున్నారు. ఈ రహస్యాన్నెవరో అరుస్తున్నారు. వాళ్ళనెవరో కరుస్తున్నారు. ఎవరో కొందరికి వళ్లు మూస్తున్నారు. ఇంకొందరికి కళ్లు మూస్తున్నారు. జీవితం ఆక్సిడైజ్ కావడానికి ఇంధనమైన ధనం మహాత్మ్యాన్ని తెలిపే ఉద్గ్రంథం చెక్కుబుక్కును శ్రద్ధగా చదువుకుంటున్న ఒక సినీమార్కు ద్రౌపది దరిజేరిన ఒక దుశ్శాసనుడు పైట దిగలాగేస్తున్నాడు. మరో చండశాసనుడు అది వల్లకాదని ఎగలాగుతున్నాడు. ఆవిడ ఇదేం పట్టించుకోకుండా బుద్ధిగా బుక్కు చదువుకుంటోంది.

ఈ సమ్మోహనకరమైన మనోహరమైన బీభత్సమైన భయంకరమైన చలన్చిత్ర విశ్వరూపం చూసి దిగ్భ్రమచెంది, రెండుచేతులు పైకెత్తి నమస్కారం పెట్టి మైకంకమ్మి పడిపోతున్న రాజుని రాయుడు పట్టుకున్నాడు. ఆ సన్నివేశాన్ని మంద్రస్వరంలో వ్యాఖ్యానించాడు రాయుడు.



"రాజా! అదే జనులపాలిటి ఆకర్షణ, వికర్షణ, ఆనందదాయిని, అనారోగ్యకారిణి, జీవనప్రదాయిని, కళావని, రసధుని, ప్రకాశని, నాశని, శని, అని, ఖని అయిన చలనచిత్ర పరిశ్రమ విచిత్ర చిత్రం. దర్శించి తరించు. ఓ రాజా! ప్రపంచంలో అన్నిరంగాలలో ఉన్న చైతన్యం యావత్తు ఇక్కడ పుంజీభవించింది. జీవననాడి ఇక్కడ ఉధృతంగా స్పందిస్తుంది. ఇది బొత్తిగా కళాకాదు. ఉత్తిడబ్బా కాదు. జీవితం..దానికి బెల్జియం అద్దం.. పెద్ద అబద్ధం. గొప్పనిజం. లక్షపొరలు కమ్మిన నిజం. లక్ష రూపాలు ధరించగల జీవన ఖనిజం. వెలుగూ నీడ, నిజం అబద్ధం, దురాశానిరాశా, డబ్బూకళా, సోలో డ్యూయెట్, లాంగ్‌షాట్ క్లోజప్, బుర్రాగర్రా, కామిడీ ట్రాజిడీ, ఫేడిన్ ఫేడవుట్, శాంతం కోపం, కృతజ్ఞత–ఘ్నత, స్తుతీ–నింద, కుడి ఎడమ, ఎక్జయిట్‌మెంట్ సెక్జయిజ్‌మెంట్, ప్రేమ ద్వేషం, నీతి నాతి, అచ్చులూ హల్లులూ, అలా వలా – కలా ఇలా, కళా తలా తిలా అన్నీ వుంటాయి. శ్రీనివాసులూ స్రీనివాసరావులూ స్రీకినివాసమూర్తులూ ఇంకా అనేకరకాల కచటతపలూ ఉంటారు. భూలోకంమీద మజిలీకొచ్చిన మానవుడు ఈ ఛాయలకొస్తే మిగతా స్థలాలలోకన్న ఎక్కువ అవతారాలెత్తుతాడు. కష్టసుఖాలతో, గుణావగుణాలతో సంఘర్షణపడి అతడి హృదయం సానపట్టిన వజ్రం అవుతుంది. మనసు పక్వం అవుతుంది. జీవితం ఆరముగ్గుతుంది. ఇక్కడే జీవనరాగ సుధ రుచి తెలుస్తుంది. జీవనరాగం కనిపిస్తుంది, వినిపిస్తుంది. అనుభవానికి దొరుకుతుంది. మందగించిన చైతన్యానికి చైతన్యం అబ్బుతుంది. ఓ రాజా! ఇక భయపడకు. లే ముందడుగు వేసి మందిలోకిరా... ఇంకో నిమిషం తరవాత వదిలిపొమ్మన్నా పోవు. నీలో భయం బయటపడడానికి భయపడుతుంది. ప్రతి పనికీ నువ్వు పనికిరావని సన్నాయి నొక్కులు నొక్కే నీలోని సంకోచం సంకోచం చెందుతుంది. నీ ఆత్మవిశ్వాసం కాలరెత్తుకు బయటికి వస్తుంది. ఈ తెరవేలుపుల స్వర్గసీమలో ప్రవేశించడానికి మార్గంలో వాతావరణం ఎలాటిదో దాని ప్రభావం ఏమిటో తెలుసుకోడానికి నన్ను స్ఫుట్నిక్కుగా వాడుకో. నా వెనకాలే రా. షార్క్‌స్కిన్ చొక్కా, గాబర్డిన్ లాగూ, రిస్టువాచీ ఉంగరం సర్దుకో. ఆవే ఈ వాతావరణం నీకు హానిచెయ్యకుండా రక్షించే కవచకుండలాలు. జేబులో పర్సే నీకు షాకు ఎబ్సార్బరు. లే. కాలరెత్తుకో. మొహాన టెక్కు తగిలించుకుని టెక్కెంగాఎగరెయ్ – చిన్నవాళ్లు ఎదురైతే హంగుచెయ్యి, పెద్దలయితే తగ్గిపోయి స్నేహం నటించు. పద రాజా నీకు జయమగు గాక."

## రాజు = చార్లీ = లైఫ్

"విక్రమార్కుడి మార్కు కథలు వినోదంకోసం కాదు. అవి పుట్టింది విజ్ఞానం కోసం. వాటిలో వేడి, వెలుగు రెండూ ఉన్నాయి. దేశభాషలన్నిటిలోను వర్ధిల్లిన

కధాసాహితికి శోభ చేకూర్చినవి కట్టుకథలు. ఈ కట్టుకథల్లో రసపట్టు అయిన కధావస్తువులు కస్తూరి ఘుమాయిస్తూ వుంటాయి.

అవి నాటకాలాడినా, తెరకు అనువదించినా నటనకు కావలసినంత చోటు దొరుకుతుంది. నాటకీయత నిండిన ఈ నాటక కధలన్నీ ఏదో సందేశం కడుపులో పెట్టుకున్నవే.”

అని ‘భట్టి విక్రమార్క’ చిత్రాన్ని పత్రికలో సమీక్షిస్తూ తను రాసినమాటలు అక్షరాలా పాటిస్తూ విక్రమార్కుడి మార్కు సింహాసనం రాశాడు రవణ.

ఇలా చదివేసి అలా విసిరేసే పుస్తకం కాదిది. వరహాల్రాజు నవ్వుతాలుగా కనబడినా అతని తపన, అమాయకత చూస్తే జాలేస్తుంది. ఒకోచోట కంట నీరు తిరుగుతుంది.

చార్లీ చాప్లిన్ లాటి మనిషిని సాహిత్యంలో సృష్టించిన ఘనత రవణకే దక్కుతుంది.



కార్తీకదీపం శతదినోత్సవ వేడుక - ఎన్.టి.ఆర్.తో ఎమ్వీయల్



# బుడుగు



## బాలసాహితి

**బుడుగో బుడుగు**

రవణ సాహిత్యం అంతా ఒక ఎత్తు. బుడుగు ఒక్కటి రెండెత్తులు. రవణ స్వయంగా సృష్టించుకున్న బాలనటుడు బుడుగు. చిన్నపిల్లల తత్వాన్ని అద్దంలోలాగా ఈ అక్షరాల్లో చదువుకోవచ్చు. దాంతోపాటు తన కందుబాటులోకి వచ్చిన వ్యక్తులపై, సంఘటనలపై బుడుగు విసిరే చమత్కారాలు వినవచ్చు. అందుకే బుడుగు రెండెత్తులు.

తెలుగులో బాలసాహిత్యం బాల్యదశను దాటి ఎదగలేకపోయింది. ఏ వయస్సు పిల్లలకు మనం రాస్తున్నాం? వాళ్లకి ఏ అక్షరాలు, ఏ పదాలు, ఏ భావాలు తెలుసు? వాళ్లకి తెలియనివి వస్తే ఎలా వివరించాలి? అన్నది ఒకరిద్దరు రచయితలు తప్ప పట్టించుకోలేదు. వారైనా బాలురకు పనికివస్తాయనుకున్న రచనలు చేశారుగాని ఓ కుర్రాడ్ని స్టడీచేసి అతన్ని అక్షరాల్లోకి తర్జుమా చెయ్యలేకపోయారు.

అఖిలాంధ్ర బాలలసంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకొనబడిన (ఏకగ్రీవం అంటే తనను తానే ఎన్నుకోటంగాని లేపోతే మిగిలినవాళ్ల నోళ్లు నొక్కేసి జై అనుకోడంగాని) బుడుగు తెలుగులో బాలసాహిత్యం చదివి తెలుగు భాషని నేర్చుకోలేదు.

**బుకురుకుగుకు**

అతనిది బుడుగుభాష. అదేకాక యింకా అతనికి చాలా భాషలు వచ్చు. ఉంగాభాష, పిచికభాష, చికభాష, భాష, ష అవన్నీ తెలుసు. ఇవికాక కలకత్తా రెయిల్లో మెద్రాసు వెళ్తున్నప్పుడు సీగాన పెసూనాంబ కా భాషకూడా నేర్పింది. ఇది నేర్పినందుకు ఆ పిల్లకు కృతగ్నతలు చెప్పాడు బుడుగు. ఈ బుడుగు భాష తనంతట తను కష్టపడి నేర్చుకుంది. కొన్ని తెలీనివి (చాలా కుంచెం అన్నమాట) పెద్దవాళ్లు చెప్పారు. ఒకోసారి వాళ్లకి తెలీక తప్పులు చెప్పేవాళ్లు. అందుకని వాళ్లలా చెబుతారని తెలిసి తనంతట తనే అర్థాలు ఆలోచించుకునేవాడు బుడుగు.

"నన్ను ఎవరూ తిట్టకూడదు. కొట్టకూడదు. కొట్టితేపాపం. అసలు నేను చిన్నవాడిని. నానెత్తిమీద దేముడుంటాడు. నన్నుకొట్టితే వాణ్ణి కొట్టడం అన్నమాట" అని తననెవరూ కొట్టకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకున్నాడు బుడుగు.

అలా అని బుడుగుని నువు కుర్రవెధవ్వి అంటే కోపం వస్తుంది.

"బుడుగూ బొబ్బ పోచుకుందుగాని లా ఆమ్మా" అనీ "బువ్వ పెత్తనా బులుగూ అనీ అంతాలు. నేనుప్పుడిసార్లు చెప్పాను. చిన్న వెధవలికీ చితక వెధవలికీ చెప్పినట్టు అలా బొబ్బా, బువ్వా అని నాతో అనొద్దని. స్తానానికి లేవరా అనీ, బోంపెట్టుతాను రారా" అని పిలవాలనీ చెప్తుతాడు.

బుడుగు చిన్నవాళ్లలో పెద్దవాడు, పెద్దవాళ్లలో చిన్నవాడు అన్నమాట. చిన్నపిల్లలు మల్లెపువ్వుల్లాటివారు. మంచుబొట్టుల్లాటివారు. స్వచ్ఛత, స్పష్టత తప్ప కల్మషం, వంకరతనం తెలీవు. ఈ విషయం తన భాషలో చాలా తేలిగ్గా చెప్పాడు బుడుగు.

"ఛాలా చిన్నపిల్లాడిని అడిగితే వాడు ఉంగా అంటాడు. అస్సలు వాడు అబద్ధం చెప్పాలన్నా చెప్పలేడు. ఎందుకంటే వాడికి తెలుగు రాదుగా మరి! తెలుగొస్తేనే అబద్ధం చెప్పొచ్చు."

తెలుగు భాషని ముఖ్యంగా బాలసాహిత్యాన్ని చదువుకోని బుడుగు తనకు తెలిసిన విషయాల్ని తన భాషలో మనకు చెబుతాడు. తెలియనివి తెలీదంటాడు. తనకు బాగా తెలుసనుకోండి "శిక్ష అంటే చిన్నపిల్లల్ని బళ్లో పెట్టెయ్యడం అన్నమాట" అని అర్థం చెప్పేస్తాడు. ఒకవేళ తనుకాక ఎవరైనా అర్థం చెబితే ఆ చెప్పిన పెద్దవాడిపేరు కృతగ్నతతో చెప్పేస్తాడు (తెలుగు సాహిత్య పరిశోధకులకన్నా బుడుగే నయం) "నీతి అంటే కోత



అని బాబాయి చెప్పాడు." అస్సలు అర్థం తెలీదనుకోండి "ఊరుకుంటే లోకువ కట్టేస్తారు. లోకువ కట్టడం అంటే అర్థం తెలుసుగా! నాకు తెలీదు" అంటాడు ఎంథో నిజాయితీ ప్రదర్శిస్తూ.

**బుడుగుభాష**

బుడుగు భాషకో ప్రత్యేకత వుంది. ముందు అతను వాడే పదాల స్వరూపాన్ని పరిశోధించి తరవాత వాక్యనిర్మాణం సంగతి ఆలోచిద్దాం.

"అస్సలు, అగో, ఇగో, నిఝంగా, ప్రపంచకం, ముహం, ముగుడు, దేముడు, మూర్ఖోలు, అవుతే, ఫెషల్‌గా, ఇంసల్టు, ఖోపం, కొఠేస్తాడు, క్రోపం, క్రాపింగు షాప్రింగు, ఇంఖా, ఘుబుక్కున, పఠేస్కున్నాడు, రక్షించాలని, పజ్జెం, బళువు, దంబిడీలు, భోగిపండుగ, అప్పురాబాసం, హడ్డిలిపోయాడు, పరిగేరుకెళ్లి పోయాడు, వింజిను, ఛ్చీన్నపిల్లలు, రోఝు, డైరెట్కర్, ఘుడియో, ఎలప్కను, డికెప్టి, కుఠో ఖష్టాలు, ఉంకోటి, కుడుకు, గ్రుహ."

**భాషాపరిశోధన**

చిన్నవాళ్లయినా చితకవాళ్లయినా మాట్లాడిన పదం వ్యర్థంగా రాదు. అర్థం లేకపోతే పోవచ్చు, అదివేరే విషయం. భాషా పరిశోధకులు చెప్పినా, మనస్తత్వ పరిశోధకులు చెప్పినా వాళ్లు శోధించి, పరిశోధించి, సాధించింది యిదే విషయం.

భాష మనసులోని భావాన్ని బయటకి వ్యక్తం చేస్తుంది. మనసులోని భావంయొక్క బరువునిబట్టి బయటికి వచ్చే భాష ఆకారం ఏర్పడుతుంది. సున్నితమైన భావాలకు సున్నితమైన పదాలు, కటువైన భావాలకు కఠినమైన పదాలు లేక అక్షరాలు వాడటం జరుగుతుంది. ఇదేసూత్రం కవిత్వంలో ప్రవర్తిస్తే వాడు మహాకవి అంటాం. మామూలు ఉపన్యాసం అయితే మహావక్త అంటాం. ఎవడైనా ఖోపంతో మన్ని తిడుతుంటే వ్వెధవ వ్వాడికి మాట్టాడ్డం రాదంటాం.

సామాన్యంగా మనసులో మనం అనుకున్న భావం బరువంతా మొయ్యలేక ఒకోసారి పదం ఊగిపోతుంది. పెద్దవాళ్లయితే ఆ బరువు నాలుగయిదు పదాలకో, వాక్యాలకో సర్దుబాటు చేసి మాట్లాడతారు. మాంఛి దగాకోర్లయితే మనసులోని వెధవాలోచన్లు పదాల్లోకి జారకుండా జాగర్తపడి వాక్యం వెనకాల అలా దడికట్టేస్తారు.

చిన్నపిల్లలకి భాష అసలే తక్కువ. ఆ వచ్చిన భాషని కూడా యింకా పొదుపుగా వాడతారు మహాకవుల్లాగా. దాంతో మనసులోని భావాల బరువుని మొయ్యలేక వాళ్లువాడే పదాలు వంకర్లు తిరిగిపోతాయి.

‘అస్సలు నిఝంగా’ అంటాడు బుడుగు వీలయినంత నొక్కుతూ. అది మనని ఒప్పించటానికి పడే తాపత్రయం. కోపం వచ్చిందన్న విషయాన్ని ‘ఖోపం’ అని వ్యక్తం చేస్తాడు.

కొట్టేస్తాడు అన్నపదం కలిగించే గాభరాని ‘కొఠేస్తాడు’ అని పదంలోకి పఠేస్తాడు!

‘పఠేస్కున్నాడు’ అనటంలో ఆ వేగం కనబడుతుంది. అలాగే ‘ఘుబుక్కున’–

‘పరిగేరుకెళ్లి’ అని దీర్ఘం తియ్యటంలోను ఒత్తక్షరం వాడటంలోను పరిగెత్తటం కళ్లకు కట్టిస్తాడు.

‘ఛీన్నపిల్లలు’ అంటే ఎంత చిన్నపిల్లలో వేరే చెప్పక్కర్లేదు.

‘రోఝూ’ అంటే ఒక్కరోజుకూడా ఖాళీ లేదన్నమాట.

‘ఖష్టాలు’ అనటంలో ఆ బాధ, జాలి వ్యక్తం అవుతాయి. అలాగే ‘హడ్డిలి పోయాడు’

ఇది చిన్నపిల్లల భాషలోనేకాదు పెద్దవాళ్లలో కూడా కనబడుతుంది.

‘పరుగేత్తుకెళ్లిపోయాడు’ అంటాం. ‘గే’ అని దీర్ఘం తియ్యటంలో భావాన్ని పొదుగుతూ.

‘చా...లా’ అని దీర్ఘం తీస్తాం.

‘అస్సలు’ అన్నది అందరూ వాడతారు. అలాగే ‘ఘుబుక్కున’ ‘ఘాబరా’ ‘దూరాభారం’ ‘ప్ఫీడ విరగడయింది’ అనట గమనించవచ్చు. మనసులోని ఆవేదన, ఉద్వేగం అలా అక్షరాల్లోకి వస్తుంది. ఇది సహజం.

మానవ సహజమైన ఈ లక్షణాన్ని ఆయా సంఘటనల్లో వ్యక్తం చేసే అవకాశం, అవసరం వచ్చినా చాలామంది రచయితలు గ్రామరు నెమరేసుకుని తప్పులు రాస్తున్నామన్న భయంతో రాయడం మానేస్తారు. (గ్రాంధిక రచయితలకిలా రాసే అవకాశం అస్సలు లేదు ఖదా!) అంటే సహజత్వానికి, సజీవత్వానికి రచయితలు ఎంత దూరమైపోతున్నారో ఊహించుకోవచ్చు. రవణ ఋణానందలహరిలో జ్మ, త్మ అని వాడినా మిగిలినరచనల్లో కొట్టేస్తాడేమో నిఝంగా అనివాడినా ఈ సహజత్వాన్ని సాహిత్యంలో నిక్షేపించాలనే!

‘అగో, ఇగో’ అన్నది చిన్నపిల్లల ఉచ్చారణ అయినా ‘మూడ్రోలు’ నాల్రోలు’ అని పెద్దవాళ్లే అంటారు. అంతెందుకు సూర్య నారాయణుని యధాతథంగా పలికేవాళ్లెవరూ వుండరు. అంతా ‘సూన్నాణ’ అనే అంటారు. కాకపోతే రచనల్లో సంబోధించాల్సి వచ్చినపుడు రచయితలు మడికట్టేస్కుని ‘సూర్యనారాయణగారూ!’ అనే పిలుస్తారు ప్పాపం!



## పెద్దల దోషాలు

కొన్ని పదాలు పెద్దల ఉచ్చారణ వినడం మూలంగా అలాగే అనటం జరుగుతుంది. అలాటివి ‘ప్రపంచకం, అవుతే, ఉంకోటి, పజ్జెం’, వగైరాలు. రాసుకునేప్పుడు ‘పద్యాలు’ అంటాంగాని అనేప్పుడు ‘పజ్జాలు’ అనే అంటాం గదా! పెద్దవాళ్లు స్పష్టంగా, శ్రావ్యంగా మాట్లాడుతున్నాం అనుకుని మాట్లాడే తప్పులు కొన్ని వుంటాయి. ‘అవుసరానికి’ అంటారు. అలాటి పదాల ప్రభావం పిల్లలమీద తప్పనిసరిగా పడుతుంది. ‘బ్రహ్మ’ అని రాసినా అనేప్పుడు ‘బ్రమ్హ’ అనే అంటాం. అలాగే ‘బ్రామ్హణులు’ ‘బ్రమ్హాండం’ అనీను. రవణ తన రచనల్లో ‘బ్రమ్హాండం గురూగారూ’ అనే రాస్తాడుగాని ‘బ్రహ్మాండం’ అని రాయడు. ఈనాడు వీరవ్యావహారికవాదులం అనుకునేవారు కూడా రాసేప్పుడు ‘వ్రాస్తున్నాను’ అనే రాస్తున్నారు. హాచ్చర్యం!

ఇవికాక కొన్నిపదాల ఛాయలు పడటంవల్ల కూడా కొన్నిపదాల ఉచ్చారణ రూపాలు మారిపోతాయి. ‘మధ్యాహ్నం’ అన్నపదం ‘మఝ్ఝాన్నం’ అనే ఉచ్చరిస్తాం. దీని ప్రభావం ‘పద్ధెనిమిది’ మీద పడి ‘పఝ్ఝెనిమిది’ అయి వూరుకుంది. అలాగే ‘ఎలుగుబంటి’ ఆనేది స్పష్టంగా పలకాలన్న సదుద్దేశంతో చాలామంది ‘వెలుగుబంటి’ అంటారు. అలాటిదే యిందులో ‘వింజను’ అన్న బుడుగు పదం. అతనలా అనటంలో తప్పు లేదు. మనం అనటంలా ‘విస్త్రీ’ అని.

కొన్ని పదాలు ఒకరిని అనుకరించటానికి, స్పష్టంగా మాట్లాడ్డానికి చేసే ప్రయత్నంవల్ల ఏర్పడతాయి, కొన్ని ఉచ్చరించటంలో చూపే అశ్రద్ధవల్ల ఏర్పడతాయి. దీనిమీద సంస్కృతం ప్రభావం కొంత, విదేశీ భాషల ప్రభావం కొంత కూడా కనబడుతుంది. ఇసుక అన్నది ‘విసుక’ అనటం ఇస్త్రీ అన్నది ‘విస్త్రీ’ అనటం కాకుండా ఒత్తక్షరాలు ఎక్కువ పెట్టినా రకారాలు పెట్టినా స్వచ్ఛత వస్తుందనుకుని భ్రమపడే పెద్దలు చాలామంది వుంటారు. చదువుకున్నవాళ్ళుకూడా ఉత్తరాలలో ‘భావగారు’ అనే రాస్తారు. ‘బావగారు’ అంటే ఎక్కడ గౌరవం తగ్గిపోతుందో అని. మనం ‘మెషిన్’ ని ‘మిషన్’ అంటాం సామాన్యంగా. విశాఖపట్నంలో వున్న ‘రామకృష్ణ మిషన్’ ని స్పష్టంగాను, చదువుకొన్నవాడిలాగాను పలకాలన్న ఉద్దేశంతో బస్సుక్లీనర్లు, కండక్టర్లు ‘రామకృష్ణ మెషీన్’ అనే అంటారు.

బుడుగు వాడిన ‘గ్రుహ, క్రోపం’ అలాటివే!

‘క్రాపింగు షాప్రింగు’ అనటం పక్కనున్న క్రాపింగు ప్రభావం! ‘బళువు’ అన్న పదం పెద్దవాళ్లు కూడా అంటారు. బరువు, సుళువు అనే పదాల్లో ‘ళ’ కారం ప్రభావం జాస్తి అయి ‘బళువు’ అన్నది ఏర్పడింది.

**బాల్యవ్యాకరణం**

ఉచ్చారణలో అచ్చులకి చాలా శక్తి వుంటుంది. పదం చివరవున్న అచ్చుపదం ముందరున్న అచ్చుని మార్చేస్తుంది. పందిరి+లు అని వుంటే పందిరిలు అనలేం – పందిరులు అంటాం. దీన్నే వ్యాకరణం పందిరిలు అన్నది పందిరులు అవుతుందోయ్ అని చెబుతుంది మనకు తెలియనట్టు. అలాగే బుడుగు 'కొడుకు' అనలేక 'కుడుకు' అంటాడు హాయిగా. బుడుగు అన్నట్టే కుడుకు అన్నమాట. కాదంటారా? ఇంకా అతని ఉచ్చారణలో ప్రత్యేకతలు దంబిడీలు, అప్పురాబాసం, రప్పించాలని అనేవి.

తను పొరపాటు మాట్లాడ్డమే కాకుండా ఇతర్లని సరిదిద్దాలన్న బాధకూడా మానవసహజం.

"ఇప్పుడు సంకురాంతిరి వచ్చిందిగదా. బామ్మ సంకురాత్రి అంటుంది. బామ్మకి తెలీదనుకో. ఇంగ్లీషుకూడా రాదు బామ్మకి. మరి నేను పెద్దాడిని అవుతే కలకటేరు అవుతాడు అంటుంది బామ్మ."

కలకటేరు అంటే యింగ్లీషు. అస్సలది కలట్‌కర్ అన్నమాట. బామ్మకి తెలీదనుకో. అందుకని కలకటేరు అంటుంది యేం చేస్తాం?"

అలాగే ఎలప్కను, డైరెట్కరు, డికెప్టి అన్నవే కరెట్కని బుడుగు అభిప్రాయం!

డిప్టీ కలెక్టరు కూడా ఈనాడు డిప్టీకలెక్టరు అనే అంటాడు. అలాక్కాదోయ్ డిప్యూటీ కలెక్టరు అనాలంటే నీ కింగ్లీషు రాదంటాడు. అలాగే 'సూపర్నెంటు, సూపరింటెండెంటు' అన్నవి కూడా.

ఈ ఉచ్చారణ ఒకోసారి మన్ని మోసంకూడా చేస్తుంది. పొరపాటుగా వినబడిన పదమే పదిసార్లు వింటే అదే కరెట్కనిపిస్తుంది. 'దివగంతులు' అలాటిది. 'దంతావధానం' అలాటిది.

**ఫలితార్థం**

సజీవమైన తెలుగు భాషలో రచన చేస్తున్నాననుకునేవారు ఆ సజీవమైన పలుకుబడిని పట్టుకుని పాత్రోచితంగా రాయాల్సిందే. అలాకాక నేను ఎం.ఏ. చదివాను. పదాల సుష్టురూపం, దుష్టరూపం నాకు తెలుసు. బారసాల తప్పు బాలసారె అనాలి నేనలాగే రాస్తానంటే ఊరుకోరు. టెక్ట్సుబుక్‌గా పెట్టించేసి అవి ఎవరూ కొనకుండా, చదవకుండా శపించి చావగొట్టి చెవులు మూసేస్తారు.

**లోకోపకారార్థం**

బుడుగు తనకు తెలిసిన పదాల్ని, తను పెద్దవాళ్ళ వల్ల తెలుసుకున్న పదాల్ని మనకు తెలుసో తెలీదో అని అర్థం చెబుతాడు. బాలసాహిత్య రచయితలు



పెద్దవాళ్ళకూడా బోధపడని పదాలు బాలసాహిత్యంలో రాసేస్తుంటారు. వాళ్ళ పాండిత్యం ప్రదర్శించటానికి అంతకంటె చోటు దొరకనట్టు (ఇప్పుడుదాహరణ లెందుకులెండి. ఒకరి పేరు చెప్పి అవమానించామన్న బాధకన్నా మిగిలినవాళ్ళ పేర్లు చెప్పలేకపోయామన్న బాధ ఎక్కువవుతుంది).

బుడుగు బాలసాహిత్య రచయితల్లా కాకుండా తనకు తెలిసిన పదాలు తెలిసినట్టు చెప్పేస్తాడు. బుడుగు భాషకదా యిది! మన కర్థం కావచ్చు, కాకపోవచ్చు.

రవణ ఈ బుడుగు నిఘంటువులో సెటైరు పేల్చాడు, హాస్యం మిళాయించాడు, అమాయకత ప్రదర్శించాడు, స్వచ్ఛతను సందర్శించాడు.

బుడుగు పదాలకు బుడుగర్థాలు, బుడుగు నిర్వచనాలు చదివేముందు పదానికి అర్థం వుండటం గురించి బుడుగు అభిప్రాయం వినండి.

"యస్ అంటే ఇంగ్లీషు అన్నమాట. నాకు ఇంగ్లీషు ఇంకా బాగా రాదు. అయినా ఆ మాటలకి అర్థాలున్నాయట. ఎందుకుండవు? తెలియాలి అంతే. నాకు కోపంవస్తే జాటర్‌ఢమాల్ అంటాను. అది ఎవరికీ తెలియదు. నేను అలా అంటే నాన్న జడ్డి వెధవా అంటాడు. ఆ మాటకి అస్సలు అర్థం లేదంటారు. ఎందుకు లేదు? ఉంటుంది. తెలియాలి అంతే. జాటర్ ఢమాలు అంటే అర్థంలేదూ అని అర్థంఅన్నమాట."

అందుకని ప్రతిపదానికి ఏదో అర్థం వుంటుందని బుడుగు అనుమానం. ఫలితంగా (అంటే ఆ కారణాన) ఏదో ఒక అర్థం చెప్పేస్తాడు.

"ప్రైవేటు చెప్పడం అంటే తిట్టడం అని అర్థం."

"అపార్థం తెచ్చుకున్నారన్నమాట అంటే కోపం తెచ్చుకోవడంట."

"అనుభవం అంటే టెంకిజెల్లలు, మొట్టికాయలు తినడం."

"లోకులంటే కాకులు. ఇలా అని బామ్మ అంటుంది. బాబాయి ఫ్రెండ్లందర్నీ బామ్మ కాకుల్లా ఎండలో తిరుగుతారని కోప్పడుతుంది. అందుకు."

"ఫలితం అంటే కారణం"

"లేదు అంటే ఇవ్వనని అర్థం."

"తమిడి అంటే జేబులు వెతికి కాణీలు లాక్కోడం."

"ఉపాయం అంటే అబద్ధం."

"రూల్సు మార్చడం అంటే అన్యాయం చెయ్యడం."

"టోకరా అంటే కూడా అబద్ధం చెప్పడమే."

"డేంజరు అంటే పిన్నిగారూ, మా బామ్మా పోట్లాడుకోడం."

"కోపం అంటే భయం. పిన్నిగారికి నేనంటే కోపం."

"సంకురాతిరి అంటే బోగి. బోగి అంటే బోగిపళ్లు పొయ్యడం."

"బెత్తంటే మనకి ఇంచక్కా ఉండేది. ఇంకోళ్ళకి కోపం ఒచ్చేది. ఇలా అని బాబాయి చెప్పాడు."

"శిక్ష అంటే చిన్నపిల్లల్ని బళ్లో పెట్టెయ్యడం అన్నమాట."

"సంపాదించటం అంటే చిట్టిగాడు లాటి చిన్నపిల్లలకి రేగిపళ్లు ఇచ్చేసి వాళ్ళదగ్గర ఫ్రదణాలు లాక్కు పారిపోవడం. రేగిపళ్లు వద్దంటే మొట్టికాయలు ఇచ్చి తీసుకోవచ్చులే."

"అరటిక్కెట్టు అంటే ఇలా చింపి చిన్నముక్క యిస్తారు."

"ధైర్యం అంటే పోలీసుతో మాట్లాడ్డం."

"ధైర్యం అంటే సుబ్బలక్ష్మితో మాట్లాడ్డం అనికూడా అర్థంట. ఇలా అని బాబాయి చెప్పాడు.

ధైర్యం అంటే బుడుగ్గాణ్ని బజారుకి తీసికెళ్ళడం అనికూడా ఇంకో అర్థం ఉందిట. నాన్నకి ఇలాటి అర్థంలేదు. ఇలా అని అమ్మ అంటుంది.

"ఉంగా అంటే ఒద్దు అని. లేదు అని కూడా అర్థం ఉంది."

"నీతి అంటే కోత. అని బాబాయే చెప్పాడు."

"అయిడియా అంటే ఆశ అని అర్థం."

"అలవాటంటే మన్ని ఉత్తినే తిట్టడం, నడ్డిమీద చంపెయ్యడం అని అర్థం."

"బడి అంటే అర్థం లేదూ అని బాబాయి చెప్పాడు. కాని గుడి అంటే ఆడబడీ అని అర్థం ఉందిట."

"ఎలష్కను అంటే మంతిరి అవడం. ఇలాని బాబాయి చెప్పాడు."

"సలహాలు అంటే కోతలుట. ఇలాని బాబాయే చెప్పాడు."

ఈ నిఘంటువులో 'అపార్థం, అనుభవం, లోకులు, కృతఘ్నత, ఫలితం, ఉపాయం, రూల్సు, టోకరా, డేంజరు, బెత్తం, శిక్ష, సంపాదించటం, అరటిక్కెట్టు, ధైర్యం, ఖాతరు, నీతి, అయిడియా, అలవాటు, ఎలష్కను, సలహాలు,' పదాలు బుడుగు వయసుకి తెలియవు. తెలియాల్సిన అవసరం కూడా లేదు. ఇవన్నీ తెలుసుకోవలసింది సినిమావాళ్లు, పొలిటిక్సువాళ్లు, లౌక్యులు. బుడుగులాటి పసివాడి కనవసరం. అందుకని బుడుగు తనకు పరిచయమైన సంఘటనల్తో ఆ పదాలకి అర్థాలు రాశాడు. ఇంక ప్రైవేటు, బడి అంటే బుడుగు వయసుకి కోపం, బాధ, చిరాకు, అసయ్యం కనక ప్రైవేటు అంటే తిట్టడం అని నిర్వచించాడు.



**వ్యాకరణం**

పదాలే కాకుండా వాక్యనిర్మాణం కూడా చిన్నపిల్లలకి తగినట్లే వుంటుంది.

"వీడు మంచివాడు కాదు అంటే చెడ్డవాడు. అసలు వీడే కాదు. ఈ ప్రైవేటు మాష్టర్లు అందరూ అంతే." అన్నవాక్యం ఒకొకటి ఒకటి రెండొకట్లు రెండు అన్నతీరులో వుంటుంది.

వాక్యాలు తప్పుగా వున్నా అవి కూడా ఒక పద్ధతికి కట్టుబడే వుంటాయి. అంటే అవి బుడుగు వాక్యాలన్నమాట.

'మేష్టరంతవాడు వాడు; నా అంతవాడు నేడు.'

'నా దగ్గర పది మాస్టర్లు పనిచేశారు.'

'మా నాన్నంతవాడు వాడూ, నా అంతవాడు నేడూ.'

'ఎందుకు మనచేత అనవసరంగా నిజం చెప్పడం?'

చెప్పించడం అన్నరూపం బుడుగు తయారుచెయ్యలేదు.

'సరే మీ గానపెసూనాంబని నేను పెళ్లాడుతావురా లెండి అని చెప్పేశాను.'

'హోరి నువ్వా పిడుగూ అంది.నా పేరు బుడుగు,నువ్వే హోరిపిడుగు అని చెప్పాను.'

తను వింటున్న వాక్యాల్ని ఎక్కడివక్కడ దొరకబుచ్చుకుని అనెయ్యటం తప్ప ఇక్కడ గ్రామరు తప్పుందేమోనని బుడుగు ఆలోచించడు. విదేశీయులెవరైనా తెలుగు నేర్చుకోవటానికి వచ్చినా సరిగా ఇలాటి వాక్యాలే ఎదురవుతాయి.

'లు' అన్నది బహువచనం అని తెలుసు. పదిమందిని ఉద్దేశించి మాట్లాడాలంటే 'లు' వాడాలని తెలుసు.

అందుకే 'సినిమావాడులారా' అంటాడు విదేశీయుడైనా, బుడుగైనా.

మన గ్రామరు నిర్మాతలు, దర్శకులు కూడా మన విద్యానాటక రంగంలో తరిఫీదయ్యే నటులకి గ్రామరు ఇలా చెబితే తేలికగా వస్తుంది. అలాక్కాకుండా ఏ బీయస్సీ చదివేవాడ్నో చెవులు పట్టుకు కూచోపెట్టి హడలేసి గ్రామరు చెప్పేస్తే జీవిత నాటకరంగంలో అది వాడికెందుకు పనికొస్తుంది? ఎందుకూ పనికిరాదని తాత్పర్యము.

బుడుగు వాడే తప్పులు సరిదిద్దగలిగితే చాలు పిల్లలకి గ్రామరు ఎలా రాయాలో ఎలా చెప్పాలో తెలుస్తుంది.

**వాచకముల భాష**

బుడుగు వయసు పిల్లలు వాచకాల్లో సామాన్యంగా నీతి కథలే చదువుతారు. ఆ వరవడి బుడుగు బుర్రలో గిర్రున తిరుగుతూ వుండి వుంటుంది. తన కథల్లో కూడా చివర్న నీతి చెప్పటం అలవాటయిపోయింది.

బుడుగువాళ్ళ నాన్న గోపాళం, మరో పెద్దమనిషి పోట్టాడుకున్న ఘట్టాన్ని వివరించి చివర్న 'దీనికంతా ఫలితం ఆయనకి గుండువుండటమే గదా?' అంటాడు.

కథనం కూడా చిన్నపిల్లలు చెబుతున్నట్లే సాగుతుంది. బుడుగులు మన కేదేనా చెబుతుంటే ఏయే పదాలు వాడతారో, మన్ని ఎలా ఆకట్టుకుంటారో గమనించండి.

'ఓ సారేం బలేగా అయిందిలే' అంటాడు మన దృష్టిని ఆకర్షించటానికి.

'లావుపాటి పిన్నిగారి ముగుడుగారూ లేరూ? వాడేమో ఓసారి రోడ్డుమీంచి వెళ్తున్నాడు.

కాదు. ముందస్తుగా, ఓ కుక్క వచ్చింది.'

ఇందులో చెబుతూ మధ్యలో 'కాదు' అంటాడు తనని తనే సరిదిద్దుకుంటూ, పాతకథ నెమరేసుకుంటూ.

'యేం? ఒకరోజున నాన్న ఆఫీసుకు తీసుకువెళ్ళలేదూ' అంటాడు. ఆ విషయం అంతకుముందే మనకు తెలిసినట్లు. ఇలాటి వాక్యాలు బుడుగుల్లోనే కాకుండా రైలుపట్టాల సంభాషణచేసే ఆడవాళ్ళ దగ్గరకూడా దొరుకుతాయి.

'అప్పుడు మావారు బొంబాయి వెళ్ళలేదూ – అప్పుడు కొన్నదన్న మాట ఆ మరచెంబు' అంటుందో పిన్నిగారు ఆవిడ తాలూకు వారుగారి రాకపోకల వివరాలు దినపత్రికలో పడుతున్నట్లు, మనం జాగ్రత్తగా ఫాలో అవుతున్నట్లు.

ఈ రకమైన కథనంలో రవణ చిన్నపిల్లల మాటల్నే కాక వాళ్లు కథలు చెప్పటాన్ని కూడా ఎంత బాగా స్టడీ చేశాడా అనిపిస్తుంది.

### పిల్లలు దేవుని చిరునవ్వులు

చిన్నపిల్లలు దేముళ్లలాంటివాళ్లుగదా! వాళ్లకళ్లని ఎవళ్లూ మోసగించలేరు. మనిషిని చూడగానే ఒక అభిప్రాయం వాళ్ల మనసుల్లో ఏర్పడిపోతుంది. దాన్ని పెద్దవాళ్లెవరూ కూడా తుడిచెయ్యలేరు ఏం చేసినాసరే!

బుడుగుకి వాళ్లమ్మ దేవత. అతనికంటికి వాళ్లమ్మే అందగత్తె. లోకంలో యింకెవరూ అందంగా వుండరు. చిన్నపిల్లలందరి అభిప్రాయం ఇలాగే వుంటుంది. "అమ్మ అలా నవ్వితే భలే బావుంటుంది. ససి మళ్లీ నవ్వుతుంది. అదినవ్వితే బాగానే ఉంటుందనుకో. ఎలాగేనా అమ్మంత బాగా ఉండదు. ఏ పాపాయికేనా సరే వాళ్ల రాధ అంటేనే ఎక్కువ యిష్టం. రాధంటే అమ్మ. నాన్నకన్న బామ్మకన్నా, పిచికకన్నా బొమ్మకన్నా, సీ. గానపెసూనాంబకన్నా రాధంటేనే ఎక్కువ ఇష్టం అన్నమాట."

అమ్మని ఎవరూ ఏమీ అనకూడదు. 'అమ్మజెడ పెద్దదికాదు' అని పిన్నిగారంటే బుడుగుకి ఖోపం వచ్చేస్తుంది.



'అమ్మని ఎందుకలా అనాలి అని.' అమ్మంటే అంత యిష్టంఉన్నా ఒకోసారి బామ్మకి గొప్పతనం కట్టబెట్టాల్సి వస్తుంది. బడి ఎగ్గొట్టడానికి తలనొప్పి వచ్చిందని "ముందస్తుగా బామ్మకే చెప్పాలి. అమ్మకి చెబితే లాబంలేదు."

బాబాయి చాలా గొప్పవాడని, వాడిదగ్గర బోల్డు అభిప్రాయాలు, అయిడియాలు వున్నాయని బుడుగు నమ్మకం. అందుకే బాబాయి ఏ పని చెప్పినా శిరసావహించేస్తాడు. తరవాత శిరసా టెంకిజెల్లలు తిన్నాసరే, ఆఫీసుల్లో పనిచేసే గోపాళాలు చాలామంది ఆఫీసరు గురించి రకరకాల జోకులు వేసుకుంటారు. బుడుగు వాళ్ళ గోపాళం తన ఆఫీసరుకి విగ్గులేని ఎముదు అని పేరు పెట్టుకున్నాడు. ఆ ఎముదు ఎంత దుర్మార్గుడో బుడుగుకి తెలీదు. ఎముదంటే విగ్గుండాలని తెలుసు. విగ్గుంటే ఎముడెలా వుంటాడో తెలుసు. ఒకసారి ఆఫీసుకివెళ్ళి ఎముడ్ని ఇంటర్వ్యూ చేసేస్తాడు బుడుగు.

"ఓ గదిలో కూచున్నాడు వాడు. వాణ్ని చూస్తే అస్సలు ఎముడిలా లేదు. భయం వెయ్యలేదు.

వాడు నన్ను చూసి పిల్చాడు నవ్వుతూ. తరవాత బిస్కట్టు పెట్టాడు.

అప్పుడు ఎముదంటే వీడు కాదు అనుకున్నాను."

వాడు బిస్కట్టు పెట్టకపోతే మాత్రం వాడు యముడేనని తేల్చేసుకునేవాడు బుడుగు. అది వేరే విషయం.

లావుపాటి పక్కింటి పిన్నిగారు కూడా బుడుగు మనసులో లావుపాటి ముద్ర వేసుకుంది. చిన్నపిల్లలకెందుకో కొందరు నచ్చరు వాళ్లెంత మంచివాళ్ళయినా సరే! వాళ్ళ పసిమనసుల్లో పడిన రూపురేఖల ముద్రలు ఒక పట్టాన చెరగవు.

### బాలమనసులు

పెద్దవాళ్ళకి కూడా తోచని ఊహలు ఒకోసారి పిల్లలకి వస్తాయి. వాళ్లు వేసే ప్రశ్నలకి పెద్దలే తలకిందులవుతారు సమాధానాలు చెప్పలేక. విసుగొచ్చి కొంత, తెలియకకొంత, చిన్నపిల్లల ముందు వెలితిపడతామని కొంత 'సిడౌన్స్, నోర్మూస్కో' అంటారు తెలుగు మాష్టర్లాగా.

బుడుగు సామాన్యంగా ప్రశ్నలడగడు. అడగడం నామర్దాగదా! కాని అన్ని విషయాలు సొంతంగా ఆలోచించి నేర్చేసుకుంటాడు. పిల్లలందరికి కలిగే అనుమానం పిల్లలెట్లాపుడతారని. దానికి పెద్దలు చెప్పే సమాధానం 'దేవుడు తీసుకొచ్చి యింట్లో పడేస్తాడు' అని.

"పుట్టార్టండం అంటే మనం ఎక్కడో దొరకడం అన్నమాట. అంటే దేవుడు మన్ని తెచ్చి మాయింటో పడేస్తాడు, అమ్మానాన్నా కుంచెం రోజులు పెంచుతారు.

తరువాత పెంకిభడవకానా, బుడుద్ధాయీ అంటారు. అప్పుడు గబుక్కున అప్పురాభాసం చేసి బళ్లో పెట్టేస్తారు.”

ఇదీ పిల్లలు పుట్టడం – పెంపకం గురించి బుడుగు అభిప్రాయం.

పిల్లలకి ఇష్టాయిష్టాలున్నట్టే ఆశలూ, ఆశయాలూ కూడా వుంటాయి. అవి కూడా ఒకంతట వదలవు. బుడుగుకూడా తన ఆశల్ని ఆశయాల్ని రక్షించుకుంటూ అవి తీరటానికి ప్రయత్నిస్తుంటాడు.

అతని ఆశ, ఆశయం జటకా తోలాలని, రైలింజన్ డ్రైవరు కావాలని. ఆ ఉద్యోగాలు గొప్పవని ఉద్దేశం. ఇంతమందిని యింత తొందరగా ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్ళిపోయేవాళ్ళంటే ఎవరికిష్టం వుండదు?

ఆ జటకావాడు, డ్రైవరుకూడా ఒక ఆకారంతో కనబడి బుడుగు మనసుకి హత్తుకుపోయారు.

‘జెటకాబండి తోలినప్పుడు చెవిలో పెట్టుకోడానికి’ బీడీలు జాగ్రత్త చేశాడు బుడుగు – అవి బామ్మ వత్తులు పెట్టెలో దాస్తాడు భద్రంగా.

ఓసారి మద్రాసు వెళ్ళినప్పుడు కూడా బుడుగు తన ఆశయం నెరవేర్చుకోటానికి తీవ్రంగా ప్రయత్నించాడు.

‘నేను పరిగేరుకుని వింజను డైవరు దగ్గరి కెళ్ళిపోయా.

ఛధి బీడీలిస్తాను నన్ను రైలు తోలనిస్తావా అన్నాను.’

కాని వాడిదగ్గర చాలా సిగరెట్టులే వుండటంతో బుడుగుకి బేరం కుదరలేదు.

ఒకటి రెండుసార్లు జెటకా తోలుకు రావటానికి, తోలించుకు రావటానికి కూడా సిద్ధపడి టెంకిజెల్లలు తింటాడు బుడుగు.

ఆశయసాధనలో కష్టములు తప్పవుగదా!

ఎలప్కనువాడు వచ్చినప్పుడు అందరూ తలో వరం కోరుతుంటే తనూ ఒకటడిగాడు.

‘మరి నన్ను జెటకా తోలనిస్తావా’ అని.

పిల్లల మనసుల్లో అణగివుండే ఈ కోరికలు బాగా బుద్ధి తెలిశాక గాని పోవు. బుద్ధి తెలిశాకకూడా ఒకోసారి జెటకాగాని, రైలింజనుగాని తోలాలనిపిస్తుందిగాని అప్పటికే కాలంమించిపోయి నలుగురికీ జడిసి ఆ కోరికను బైటికి రాకుండా అణిచెయ్యటం జరుగుతుంది.

ఈ మనస్తత్వాన్ని నిశితంగా పరిశీలించిన రవణ ‘లోకయాత్ర’ అనే కథలో రాధాయితో కూడా అనిపిస్తాడు.



“తను పెద్దవాడైతే ఎప్పుడూ సెకండు క్లాసులోనే వెళ్తాడు. సెకండు క్లాసేమిటీ ఆ మాటకొస్తే ఇంజను డైవరైతే ఎంతో స్పీడుగా రైలు నడుపుతూ ఉంటే ఎంత బావుంటుందో!”

పిల్లలకి అన్ని ఆటలలోకి కారాట, రైలాట ఇష్టంగా కనబడతాయి. ఈ తత్వం బుడుగుకి బాగా వంటపట్టింది. అందుకే బీడీలు పోగు చేస్తున్నాడు పెద్దయ్యాక జెటకా తోలాలంటే చెవిలో పెట్టుకోడానికి, వింజను డైవరయితే కాల్చడానికి.

**బుడుగు ‘ది క్రిటిక్’**

రవణ రచనలన్నిటిలోలాగే బుడుగులో కూడా డబ్బుకి, సినిమాకి, పాలిటిక్సుకి సంబంధించిన అభిప్రాయాలు బుడుగు భాషలో వున్నాయి.

“నాన్న దగ్గర డబ్బులు అయిపోతే నేను నిద్దరపోయినప్పుడేమో, నా వుండీలో డబ్బులు అప్పు తీసుకుంటారుట, మళ్ళీ డబ్బులొచ్చాక అందులో ఆ డబ్బులు వేసేస్తారుట.”

ఈ ‘పొసెసివ్ ఇన్‌స్టింక్టు’ చిన్నప్పట్నించి వుంటుంది. గోళీలు, బీడీలు, బొమ్మలు, రకరకాల వస్తువులు, పాత టిక్కెట్లు అన్నీ దాచుకుంటారు పిల్లలు. అవి వాళ్ళ ఆస్తి. వాటిని ఎక్కడికి వెళ్ళినా వదిలిపెట్టరు.

“అవన్నీ బూడుసు రైల్లో వస్తాయి. అలా అని చెప్పాడు నాన్న. కాని నాన్నకేం తెలుసు? అలాటివి బూడ్సురైల్లో వేస్తారా?

అందుకని, నేనే నాన్నకి చెప్పకుండా వాడి పెట్లో నా సామానులు సద్దేసి, నాన్న కోట్లు పుస్తకాలూ అవీ బోషాణంలో దాచేశాననుకో.

కావలిస్తే అవే బూడుసురైల్లో వస్తాయి.”

పిల్లల మనసుమీద ఎక్కువ ప్రభావం కనబరచేది సినిమా. మన పెద్దవాళ్ళు కూడా మూడోయేడు నించే సినిమా పాటలూ, నాగేశ్రావు, సావిత్రి మొదలైన పేర్లు వాటితో అప్పురాభాసం చేసేస్తున్నారు. పూర్వం వాటి స్థానాల్లో ఓం నమశ్శివాయ సిద్ధం నమః అవి ఉండేవి. అవన్నీ మారిపోయాయి.

బుడుగు మనసుమీద కూడా ఆ ముద్రలు పడ్డాయి.

“అంటే యిప్పుడు బాలరాజు సినిమా, జయసింమ్మ సినిమా ఉన్నాయి గదా! నాగేసరావు, ఎం.టి. రామారావూ ఇలా నించుంటారా చెట్టుదగ్గిర. అప్పుడు అంజలీయేనా సావిత్తిరియేనా వస్తుందిగదా’ అంటాడు బుడుగు. అతన్ని స్టంటు సినిమాలు ఆకర్షించినట్టుగా మరేవీ ఆకర్షించవని అనిపిస్తుంది. ఇప్పుడయితే వాటిబదులు పిల్లల్నెక్కువగా ఆకట్టుకుంటున్నవి ‘డిష్యుం, డిష్యుం’ సినిమాలు.

పాలిటిక్సు గురించి బుడుగుకి అట్టే తెలియదుగాని 'ఎలష్కను అంటే మంతిరి అవడం' అని మాత్రం నేర్చుకున్నాడు బాబాయి దగ్గర.

అలాగే ఆట పాటలు.

"మా అబద్ధం వూళ్లో చిట్టిగాడు వాళ్లూ నాతో వస్తామన్నారు మెడ్రాసు. నేను వాళ్ళకి ఉత్తుత్తి టిక్కెట్లిచ్చాను ముందు. కాణీకి రెండు పెట్టి కొనుక్కున్నారు..."

ఈ ఆటతోపాటు 'కా' భాషతో మాట్లాడుకోవటం కూడా పిల్లలకొక ఆటే!

'కభాష' సీగాన పెసూనాంబ నేర్పింది. బుడుగుకి తెలుగుబాష కుంచెం వచ్చు. బుడుగు బాష బోల్డుబోల్డు వచ్చు.

**కకకలకలు**

పిల్లల ఆశలెంత వింతగా వుంటాయో వాళ్ల కలలంత విచిత్రంగా వుంటాయి. జాగ్రదవస్థతోపాటు పగటికలలకు, పలవరింతలకు, ఆశయాలకు నిత్యజీవితానికి వున్న సంబంధాన్ని లోతుగా ఆలోచించి వరహాల్రాజు కథ రాసిన రవణ ఆ మనస్తత్వాన్ని బుడుగులో కూడా విశ్లేషించి ప్రదర్శించాడు.

బుడుగుకి అలాడీను హీరో, ఆదర్శపురుషుడు. ఆ కథ చెబుతుంటే తన్మయం చెందుతాడు. అలాడీనులా అయిపోవాలని అనుకుంటాడు. అయిపోయాననే అభేద భావాన్ని కూడా పొందుతాడు ఒకోసారి.

'యేం! వాడు ఓరోజున వీధిలో ఆడుకుంటున్నాడా మరి! అపుడేమో బుడబుడకలవాడు వచ్చాడు.

వురేయ్ అలాడీనూ! నువ్వు గోపాళం వాళ్ల కుడుకువిగదా అన్నాడు. అపుడు అలాడీను నీకెందుకుపోరా అని చెప్పాడు."

అక్కడ్నించీ కలలో అలాడీను వేషం బుడుగువేసి కథనడిపేస్తాడు. ఆ సాయంత్రం బాబాయి చెప్పిన అలాడీను కథ ఫలితం అన్నమాట ఆ కల. అంత విలువైన అలాడీను కలలోకూడా రాచ్చసుడు పక్కింటి లావుపాటి పిన్నిగారికంటే లావుగా వున్నాడన్న విషయాన్ని బుడుగు మరిచిపోడు.

బుడబుడకలవాడు నాతో వస్తావా మిఠాయి పెట్టుతాను అంటే

"మిఠాయి వద్దూ. మరేమో నారాయణ కొట్టులో వేడి పకోడీలు కొనిపెట్టితే వస్తానూ లాపోతే రానుఫో అని చెప్పేశాడు అలాడీను."

కలనీ, కలవరింతనీ మెలకువనీ యింత మెలకువతో జతచేసి చెప్పటం రవణ సొత్తు!



**నావెల్టీ**

మంచి నవలల్లో దొరికే థ్రిల్లింగ్ సీక్వెన్సులు బుడుగులో కూడా దొరుకుతాయి.

'నువ్వు యముడిలా లేవు' అని, అలావుంటావని మా గోపాళం చెప్పాడని బుడుగు ఆఫీసరుతో అంటుంటే గోపాళం, సుబ్బారావు భయంతో చేతులు కట్టుకుని–

"వుండరండీ. అసలు మీరు ఎముడిలా ఉండనే ఉండరు. విగ్గు కొన్నా సరే."

"మరే అసలు ఎముడికీ మీకూ పోలికలు లేవు."

అని అంటున్న సంఘటన సస్పెన్సు పోషిస్తూ సరదాగా వుంటుంది.

**దానుసులంటే**

మన సినిమాల్లో హీరో హీరోయినూ పాటలు పాడుకుంటూ పరిగెడుతూ వుంటారు. దానికే సినిమావాళ్లు 'దానుసులు' అని పేరు పెడతారు. అదే అనుమానం బుడుగుకీ వచ్చింది.

"ఈరో కూడా పరిగెడుతాడుగా! పరిగెడతారు అనకూడదుట. దానుసు అనాలి అని బాబాయి చెప్పాడు." అని సినిమా డాన్సుల మీద చురక వేశాడు.

**డిఫెక్టివ్ కథలు**

తెలుగులో వస్తున్న నాటు డిటెక్టివుల మీద కూడా ఒక విసురు విసిరాడు రవణ.

బుడుగు బాబాయికీ (ఒక్క వాళ్ళ బాబాయికేవిటీ, ఆ వయస్సువాళ్ళకి) డిటెక్టివులంటే పిచ్చి ఆరాధన.

బుడుగు వాళ్ళింటికి వచ్చిన డికెక్టివాడికి మీసాలు, భూతద్దం వగైరా ఆడంబరం తప్ప సరుకేం లేదు. నాటు డిటెక్టివుల బుర్రల్లో ఎంత మట్టి వుంటుందో చెప్పటానికి ఒక సన్నివేశం కల్పించాడు రవణ.

ఆడది పిలుస్తోంది అని చెప్పేశాడు డికెష్టిరావు అటుకేసి బయంగా చూస్తూ.

మా అమ్మ అని చెప్పాడు బుడుగు, ఔను మా వదిన అని చెప్పాడు బాబాయి.

'అయితే రొండు గొంతుకలన్నమాట. చూశావా! ఒక్క కూనీలవాడు ఒక్క టుపాకితో నించుని రొండు గొంతుకలతో పిలుస్తూన్నాడు. ఈకేసు చాలా చిత్రంగా ఉంది' అని చెప్పేశాడు డికెష్టివాడు.

"కాదు ఒకటేరా, మావదినే వాళ్ళమ్మకదా" అన్నాడు బాబాయి.

"యేమో! హంతకుడు దొరికితేకాని ఆ సంగతి చెప్పలేను అన్నాడు డికెష్టివాడు అద్దం ముక్కలోంచి చూస్తూ."

ఇలాటి డిటెక్టివుతో జమిందారు చిత్రంలో రేలంగి వేషం వేయించాడు రవణ.

దోచుకుపోవటానికి వచ్చిన హంతకుణ్ణి సగౌరవంగా చూస్తూ అడుగుతాడు రేలంగి–

"మీరెన్ని హత్యలు చేశారుసార్! మీ ఆటోగ్రాఫ్ ఇస్తారా" అని.

**రాజకీయాకారం**

ఈ సన్నివేశంలోనే ప్రవేశించిన ఎలప్కనువాడు డికెష్టిలాగే వంగిపోయి వస్తాడు. అసలా డికెష్టివాడు సిసలైన అప్పారావు. అదీ ఎలప్కనువాడే పోల్చాడు.

(నీతి : అప్పారావు, డికెష్టివాడు, ఎలప్కనువాడు ఒక్కలా వుంటారు.)

బుడుగుకి, డికెష్టివాడికి వరాలిచ్చేస్తూ ఎలప్కనువాడు చెప్పిన రెండు డైలాగుల్లో రెండు వందల పేజీల సెటైర్‌ని పొదివి పట్టుకున్నాడు రవణ.

"నన్ను జెటకా తోలనిస్తావా" అని అడిగాడు బుడుగు.

"ఓ! మీ నాన్న నాకు ఓటిస్తే తప్పకుండా తోలుతావు" అని హామీ యిచ్చాడు పాలిటీషియను నిజాన్ని అనుకోకుండా ఒప్పేసుకుంటూ.

"నాకు డికెష్టింగు కేసులు ఇస్తారండీ" అన్నాడు డికెష్టివాడు.

"నాకు ఓటిస్తే నీకు బోల్డుకేసులు" అని వాగ్దానం చేశాడు రాజకీయ వాది అనాలోచితంగా అబద్ధం చెప్పలేక.

బామ్మగారు మూర్తీభవించిన గృహరాజకీయవాదిలాగా ఎలప్కనువాణ్ణి ఒక కోరిక కోరుతుంది.

"నువ్వు మంతిరివి అయితే మరి మా యింటికీ పక్కింటి పిన్ని గారింటికీ వెల్ల వేస్తావా అని అడిగింది బామ్మ.

ఓ! అన్నాడు ఓట్లువాడు.

మళ్లీనేమో అల్లా ఎదురింటికి వెల్ల వెయ్యకూడదు మరి? అంది బామ్మ. ఓ! అన్నాడు ఓట్లువాడు."

ఇక్కడ పల్లెటూరి గృహరాజకీయాలకి మారురూపంగా బామ్మని చిత్రించాడు రవణ.

**ప్రశ్నావళి**

రేడియోవాళ్ళని, పత్రికలవాళ్ళని విజ్ఞానదాయకమూ, సలహాపూరితమూ అయిన ప్రశ్నలడుగుతుంటారు పాఠకులు. సామాన్యంగా తెలుగు భాషలో అలాటి అమాయకుల్ని



జవాబులిచ్చేవాళ్లు మాయచేసి సంతృప్తి పరుస్తుంటారు. ఈ పద్ధతిని 'పారడీ' చేస్తూ రవణ రాశాడు.

బుడుగుకి (చాలా గొప్పవాడు కదా మరి) చాలామంది పిల్లలు సలహాలడుగుతూ ఉత్తరాలు రాస్తుంటారు. "సలహాలంటే కోతలనీ, అవి మనదగ్గిర లేకపోయినా ఇవ్వాలనీ" బుడుగుకి తెలుసు కాబట్టి అందరికి సలహాలిచ్చేస్తూ వుంటాడు.

వాళ్లకిచ్చిన సలహాల్లో విలవైనవి చూడండి.

"జెరంరాగానే పరగేరుకెళ్లి చెప్పాలి. లాపోతే జెరం చల్లారిపోతుంది."

"తలనొప్పి అని ముందస్తుగా బామ్మకే చెప్పాలి. అమ్మకి చెపితే లాబం లేదు."

"పుస్తకాలు రాసెయ్యి అంటే నాకు తెలీదు. అయినాసరే మనం రాసెయ్యొచ్చు. డబ్బులు కావాలికదా మరి!"

"ఈ పెరపంచకంలో ప్రెవేటు లేకుండా మనకి యేంరాదుగదా!" అన్నవి పిల్లలూ పెద్దలూ కూడా మెచ్చే వాక్యాలు.

**విమానంకథ**

బుడుగుకాక బాలసాహితి శీర్షికకు రవణ మరొక రచన చేశాడు. అదే 'విమానం కథ'. ఈ సైన్సు కథను కూడా సరళంగానే పిల్లల కర్థమయ్యేట్లే చెప్పుకుపోయాడు. ఈ రచనమీద ఆసక్తి కలిగించటానికి ఒక కథలాగా ప్రారంభించాడు.

"గాలి రివ్వున వీస్తోంది. నల్లటిమబ్బులతో ఆకాశం అంతా నిండిపోయింది. నాగరాజు బడినించి వస్తూనే సావిట్లోంచి గది మంచంమీదికి పలకా పుస్తకాలు విసిరేసి మరీ పరిగెత్తబోయాడు ఆడుకోడానికి. వాళ్లమ్మ కేకేసి ఆపింది. వానొస్తుంది వెళ్లొద్దుబాబూ అంది ముద్దుగా. నాగరాజు మామూలుగానే గునిశాడు అమ్మపెట్టేనాలుగు అందుకోవడం కోసం. అందుకోసమే వాళ్లమ్మకూడా కోపం తెచ్చుకుంది. గుమ్మం కదిలితే కాళ్లు విరగ్గొడతానంది."

గదిలో బందీ అయిపోయిన నాగరాజు ఆలోచనలు రెక్కలు టపటపలాడించ కుండా నిశ్చలంగా ఎగురుతున్న డేగమీదికెళ్లాయి. రవణ అక్కడ్నించి విమానం కథమీదికొచ్చేస్తాడు.

కాని కథలోకి వచ్చేముందే నాగరాజు వాళ్లమ్మ చేగోడీలు, నాలుగు చివాట్లు పెట్టింది." అనే వాక్యరచన చెయ్యటం మరచిపోలేదు.

అమ్మ 'కిందకి వెళ్ళిపోయింది కామోసు. ఇంక ఎలాగా వినబడదు ఏడ్చినా. అందుకని నాగరాజు ఏడుపు మానేశాడు.' అనే మనస్తత్వ విశ్లేషణ చేయటం మానలేదు.

'ఎదురింటి వాళ్లింటిమీద గెద్దవాలింది. ఇంటిమీద గెద్ద వాలకూడదట. వాలితే ఇంట్లోంచి వెళ్లిపోవాలి.' అని పెద్దలు చెప్పిన మూఢనమ్మకాలు నాగరాజుతో నెమరువేయించటం మానలేదు.

కిటికీగుండా పకోడీలు తింటూ వస్తున్న బండరాముడు కనబడ్డాడు. వాడిచేతిలో వేడి పకోడీలు నారాయణకొట్టులోవి (బుడుగు ఫేమ్) చూడగానే నాగరాజుకి నోరూరింది. తనెలాగా తీసుకోలేడు. అందుకని ఒక దురూహ కలిగింది.

"నాగరాజుకి కోపం వచ్చింది. ఎదురింటిమీద గెద్ద వీడిచేతిలో పొట్లం తన్నుకుపోవాలమ్మా. అలాచేస్తే 70 వేల 2 వందల 19 కొబ్బరికాయలు కొడతానమ్మా అని మొక్కుకున్నాడు నాగరాజు" అని చెప్పటంలో పిల్లల తత్వాన్ని అక్షరాల్లో పొదగటం రచయిత మానలేదు.

అక్కడ్నించి "చాలాఏళ్ల క్రితం చాలామంది కుర్రాళ్లకి ఇలాగే బోలెడు సందేహాలు వచ్చాయి." అని చెప్పి జేమ్స్‌వాట్ గురించి, న్యూటను గురించి, సరదాగా వాళ్లకి కలిగిన సందేహాలు సైన్సుకెలా ఉపయోగపడ్డాయో వాటి గురించి చెప్పి విమానంకథలోకి దిగుతాడు రచయిత.

### గ్రాంధిక సైన్సు

కెటిల్‌మూత ఎలా ఎగిరిపడుతోంది అని జేమ్స్‌కి సందేహం వచ్చింది. "ఆవిరి మూలమున ఎగురుచుండెను అని నువ్వు ఇపుడు చెప్పగలవనుకో" అనే రచనలో వ్యావహారికం హల్వాలో ఇంగువపలుకులా తగిలే గ్రాంధికవాక్యం మీద, పిల్లలకి సైన్సుకూడా హాయిగా నడిచే బాలభాషలోకాక బాధభాషలో చెప్పటంమీద చమత్కరించటం రవణ మరిచిపోడు.

న్యూటన్ కథకూడా "ఒక ఆపిల్ గబుక్కున అతని నెత్తిమీద పడింది. సుబ్బరంగా తినేసిపోవచ్చుగా" అంటూ చెప్పటంలో పిల్లలకి ఆసక్తి కలుగుతుంది.

### పాతకథ

ఈ రెండు కథల తరవాత పిల్లలకు తెలిసేది మనదేశంలో జరిగిన సిద్ధార్థుడికథ చెబుతాడు రవణ. "ఇంతపెద్ద భూలోకం తయారుచేసి అందులో ఇంతమంది మనుషుల్ని పెట్టిన దేవుడు మళ్లీ వాళ్లకి కష్టాలు ఎందుకు పెట్టాలి? ఎందుకు జబ్బుచెయ్యనివ్వాలి? ఎందుకు చచ్చిపోనివ్వాలి?" అంటూ అతనికి ఆలోచన కలిగిందని చెప్పడంవల్ల పిల్లలు ఆలోచనాశక్తిని పెంచుకోవటానికి ప్రయత్నిస్తారు.



### అశాస్త్రీయం

ఈ కథలోనే మనపెద్దవాళ్లు చెప్పే పెద్దపెద్ద అబద్ధాలు పిల్లల మనసుల్లో తిష్ఠవేసి శాస్త్రీయదృక్పథాన్ని నిరోధిస్తాయన్న ఉద్దేశంతో వాటిసంగతికూడా ప్రస్తావించాడు రచయిత.

"మనిషి ఎగరవచ్చుననీ, విమానాలనేవి మనుషుల్ని మోసుకు ఆకాశంలోకి పోతాయని మన పురాణాలలోనే ఉంది (మనుషులు వాళ్లంతట వాళ్లు ఇంకా ఎగరటం లేదనుకో) ఇలా అంటే ఇప్పుడు నవ్వుతారనుకో. ఇప్పుడు ఈ విమానాలూ బాంబులూ అవన్నీ మనకి ఎప్పుడో తెలుసునని కొందరు గొప్పచెబుతారులే."

సైన్సు విషయాలు వరసాగ్గా చాలా వచ్చేసినప్పుడు పిల్లలు కంగారు పడకుండా ధైర్యం చెబుతాడు రచయిత. "ఇవన్నీ కంఠతా పట్టాలి కాబోలని కంగారుపడకు ఏం?" అని.

మరోచోట కూడా గ్రాంధిక భాషలో ఒకప్రశ్న ఒక సమాధానం వుంది.

'విమానముల నెవరు గనిబెట్టిరి?'

'రైటు సోదరులు.'

అని ఫస్టుఫారంలో రాస్తే ఆన్సరురైటేనని ఒకమార్కు పడేస్తారు మేస్టారు. ఇలా అంటే సెకండు ఫారంలో ఈ జవాబు తప్పు అని కొట్టేస్తారనుకోకేం!"

### నీతివాక్యము

రచన ముగించేముందు ఇందలినీతి అని చెప్పినట్లు "విమానం కథలో నువ్వు గుర్తుంచుకోవలసింది ఇంకోటి కూడా ఉంది" అని ఒక నీతి చెబుతాడు రచయిత.

"నువ్వేదైనా పని చేసేటపుడు అది మంచిపని నీకు చేతనవునని నువ్వు అనుకున్నప్పుడు మిగతావాళ్లు నవ్వినా వెక్కిరించినా అది పోలీసువాళ్లుకూడా చెయ్యలేరన్నా, నువ్వుమాత్రం ప్రయత్నం చెయ్యి. ఓసారి సరిగా రాకపోతే మళ్లీ చెయ్యి మళ్లీ చెయ్యి."

అని చెప్పి అలా పిల్లలు జిజ్ఞాసువులు కాబట్టే ఈనాడు శాస్త్రీయ విజ్ఞానం పండి లోకం సుభిక్షంగా వుందని రచనకు భరతవాక్యం పలుకుతాడు రవణ.

"పూర్వకాలంలో చిన్నచిన్న కుర్రవాళ్లు, పెద్దవాళ్లుకూడా అలా చెయ్యబట్టే ఇవాళ రైళ్లు నడుస్తున్నాయి. రేడియోలు మోగుతున్నాయి. దీపాలు వెలుగుతున్నాయి. సినిమాలు ఆడుతున్నాయి. విమానాలు ఎగురుతున్నాయి."




# గిరీశం లెక్చర్లు

***ది ఎలెవెన్ కాజెస్ ఫర్ ది***
***రీజెనరేషన్ ఆఫ్ గిరీశం***

కారణజన్ముడు ఒకసారి కాదు అవసరమైతే పదిసార్లు పుడతాడు. గిరీశం కారణజన్ముడు. అందుకే ముళ్లపూడివారింట నవ్వుల కలలపంటగా మళ్లా పుట్టుకొచ్చాడు.

**'చేత'కాని మాటకారి**

అలనాడు కన్యాశుల్కం విషయమై, నాచ్చికొశ్చన్ విషయమై గురజాడ వారింట తొలిసారి జన్మనెత్తిన గిరీశం ఎన్ని లెక్చర్లిచ్చాడు! సాంఘిక దురాచారాలు పెచ్చుపెరిగి మూఢనమ్మకాలు మూడారుగా వికసించి దేశం ఒక మహాత్ముని సందేశంకోసం ఎదురుతెన్నులు చూస్తున్నప్పుడు గిరీశం లాటి జ్ఞాని పుట్టక తప్పదు. అతనికేవో దురలవాట్లూ, అబద్ధాలు (అవసరానికే) ఆడే సంప్రదాయం, చిల్లరమల్లర మోసాలుచేసే ఆచారం వుంటే వుండుగాక! నీతిబోధలు చేసే ప్రవక్తలలో డిటో అలవాట్లు ఎవరికి లేవు గనక?



**అనేకపాత్రాభినయం**

ఈనాడు సినిమాలలో ఏర్పడిపోయిన 'డీజెనరేషన్' చూసి బాధపడి గుండెలు బాదుకుని, సినీరంగాన్ని ఆదుకొని తద్వారా ఆంధ్రదేశాన్ని ఉద్ధరించాలన్న ఉద్దేశంతో గిరీశం మళ్ళీ అవతారం ఎత్తాల్సి వచ్చింది. కన్యాశుల్కంలో పదిమంది పాత్రల పక్కన తనెంత డామినేట్ చేసినా పక్కవాళ్ళ అభిప్రాయాలు భరించాల్సి వస్తుంది గనక ఈ అవతారంలో కేవలం లెక్చర్లివ్వటానికే కంకణం కట్టుకున్నాడు. ఇదీ 'లెక్చర్ల గిరీశం' చరిత్ర.

**లోకబంధు**

గిరీశానికి తెలీని విషయంలేదు. ఏ ఫీల్డయినా సరే బోల్డు విషయాలు తెలుసు. అతనెదురుగా ఎవరూ నోరెత్తటానికి వీల్లేదు. అవసరార్థం అతనే తగ్గి ఎదటవాడికి ఛాన్సిస్తే తప్ప సామాన్యంగా గిరీశం సంభాషించటం జరగదు. ఎప్పుడూ అభిభాషిస్తూనే వుంటాడు. ప్రపంచంలో ఎవరూ అతన్ని మించినవారుండరు. అందరూ అతని స్నేహాన్ని, సాన్నిహిత్యాన్ని కోరుకుంటారు. అలా అనిపిస్తుంది గిరీశం లెక్చర్లు వింటే.

**గిరీశం గిరీ**

కాని జాతకరీత్యా ఏ జన్మలోనైనా గిరీశం జీవితం 'అడ్డం తిరగటం' తోనే ముగుస్తుంది. గిరీశాన్ని సృష్టించిన బ్రహ్మ గురజాడ అప్పారావు గారు అతని నొసట అలాటి రాత రాశారు. అందుకే ముళ్లపూడి వారింట మరోజన్మ ఎత్తిన గిరీశంకూడా ప్రతిలెక్చరు చివరా తప్పనిసరిగా తెల్లమొహం వేస్తాడు.

మాటలోను, చేతలోను గురజాడ గిరీశానికి అచ్చుకట్టినట్లు కనబడతాడు ముళ్లపూడి గిరీశం. ఏదైనా గిరీశాన్ని చూస్తే బాధే కలుగుతుంది. ఎక్కడికక్కడ ఎదురుదెబ్బలు తగులుతున్నాయే అని జాలేస్తుంది. హియీజే ట్రాజిక్ హీరో, లెటజ్ హియర్ అండ్ సింపతైజ్ హిమ్.

**ప్రపంచశీల**

'గిరీశం లెక్చర్లు' అనే పుస్తకంలో అయిదే విషయాలమీద లెక్చర్లున్నాయి. గిరీశం ఏంచెప్పినా పంచభూతాల సాక్షిగా చెబుతాడు. పాంచభౌతికమైన లోకశ్రేయస్సు అతని లక్ష్యం.

'మైగాడ్! పుస్తకాలు కొనడమా! బార్బేరియస్' అన్నది ఒక లెక్చరు. సినిమా సెన్సారింగుమీద ఒక లెక్చరు. కొటేషన్లివ్వడంమీద ఒక లెక్చరు, గురజాడ అప్పారావుగారిది కేవలం శబ్దాశ్రయహాస్యం అన్న 'అపహాస్య బ్రహ్మ' వాక్యానికి

సమాధానంగా ఒక లెక్చరు. సినిమా కథలమీద, ప్రొడ్యూసర్లమీద, డైరెక్టర్లమీద మిగిలిన లెక్చర్లు.

**అగ్రహారీకుడు**

అన్ని లెక్చర్లలోను గిరీశం భాషే వుంటుంది. ఇజినారం పలుకుబడి కొట్టొచ్చినట్టు కనబడుతుంది. 'సుళువుగా ఒళిపోస్తాయి' 'చెపాయించే స్తానినా'. 'రొక్కం గాదాయించి విసిరేస్తే' 'ఆపాటి ప్రతాపం ఈపట్టెన గొడ్డు పోయిందా?' 'ఒఘాయిచ్చం' వగైరా చూస్తే గురజాడ గిరీశాన్ని ముళ్లపూడి ఎంతబాగా అర్థం చేసుకుని తన సబ్జెక్టులకి, తన భావాలకి ఉపయోగించుకున్నాడా అనిపిస్తుంది.

**బైయింగ్ బుక్సు = సెల్లింగ్ గరల్స్**

'బుక్స్ ఆర్ ది బెస్ట్ కండక్టర్స్' అన్నాడు విద్యుచ్ఛాస్త్రకారుడు. వాటిద్వారా లవ్ లెటర్స్ గట్రా అద్భుతంగా బట్వాడా అవుతాయి. ఎవరి పుస్తకం వారు కొనుక్కొని ఎరువడగడం మానేస్తే యింక ప్రేమకలాపాలెలా సాగేట్టూ? అవి ఆగితే సృష్టి స్తంభించిపోతుంది'.

పుస్తకాలు కొనటం బార్బేరియస్ అన్న విషయం రుజూచెయ్యటానికి పై పాయింటేకాక యింకా చాలా చెబుతాడు గిరీశం. పేపర్లో తలో ముక్కా పుచ్చుకుని 'సంఘపఠనం' చెయ్యటం, పుస్తకాలు కొనకుండా చదవాలని ఒట్టుపెట్టుకోటం ఎంత అమర్యాదకరమైన విషయమో చెప్పటానికి రవణ ఎదురుతిప్పి లెక్చరిప్పించాడు గిరీశంచేత. ఇలా ఎదురు నరకటానికి తగిన పాత్ర గిరీశంతప్ప మరొకరు 'భూస్థలమంతయు వెదకిన దొరకరు.'

**'------'**

గిరీశం రూరిటేనియా వెళ్లి రాజాగారితో రెస్ట్ తీసుకుంటుంటే దొరలిన రాంగ్ కొటేషన్లకి బట్లరుబాబు నవ్వేశాడు. 'తప్పులో కాలేసి'న విషయం గమనించిన గిరీశం 'ఫస్టెయిడ్' వాడు చెప్పిన 'సేఫ్టీఫస్ట్' అన్న వాక్యం మననం చేసుకుని కొటేషన్లివ్వడం విషయంలో ఒక నిర్ణయానికొచ్చేశాడు. 'షేక్స్పియర్' అన్నవన్నీ బైహార్టు చెయ్యడంకన్న అనని నాలుగు ముక్కలూ ముక్కున తగిలించేసుకోవడం ఈజీగా వుంటుంది. కొటేషను వాడి బాబు సొమ్ముగాదుగా – వాడిసొమ్మే!

**చిత్రహింస**

తెలుగు సినిమాలెంత అసందర్భంగా వుంటున్నాయో తెలుగు సెన్సారింగు కూడా అంత అసందర్భంగానూ వుంటోంది. 'రాణిసంయుక్త' చిత్రంలో సహగమనం సీను



సెన్సారువారి అడకత్తెరకు గురయింది. సంయుక్త సహగమనం చేస్తే మటుకు సినిమాలో చూపించటం తప్పు కాదూ! అన్నారు సెన్సారంగధరులు.

**తాకితే తప్పేముంది?**

'పెళ్లి జరుగుతున్నపుడు కూడా పుస్తెలతాడుకి మూడోముడి పడేవరకు పెళ్లికొడుకు వేళ్లు పిల్లదాని జడగ్గాని, మెడగ్గాని తగల్రాదని సెన్సారు శాసనం. ఈలోగా 'లవ్ సాంగ్' వుంటే పొదలచుట్టూ దుబ్బుల చుట్టూ, స్తంభాలచుట్టూ తిరుగుతూ హీరోగారు కూతవేటు దూరంలోనే వుంటూ అభినయం పట్టాలి. ఒకళ్లనొకళ్లు తాక్కోగూడదు.'

**బహుపతివ్రత 'సిఫార్సు'**

పరమ దుర్మార్గాలు చేసిన విలను పదహారో రీల్లో క్షమించు పార్వతీ లేక సుశీ లేక ప్రేక్షకులారా లేక పోలీసులారా అంటే అతగాడి జతకత్తె మహాపతివ్రత కనక ఆవిడ సిఫార్సుచూసి సెన్సారువాళ్లు వదిలేస్తారు.

**సినీతి మార్కు**

సెన్సారప్పక్షంగా వుండాలని బుద్ధిగా ప్రతివాడూ 'సెన్సారక్షుడ'యి సినిమాతీస్తే చివరికి సినిమాల్లో 'నీతులూ ఆవాలూ, నీతులూ మెంతులూ, నీతులూ జబ్బులూ, నీతులూ ఏడుపులూ, అపోహలు నీతులూ' తప్ప మరేం మిగలవని గిరీశంగోల.

**జాతశత్రువు**

మొదట్నించీ గురజాడ అప్పారావుగారి విషయంలో శత్రువుల కంటే మిత్రువు (?) లే ఎక్కువ ద్రోహం చేశారనిపిస్తుంది. మొన్నటికి మొన్న గురజాడే గిరీశం అని కొందరు 'కాదని కొందరూ మళ్లా అవునని కొందరు కొన్ని వారాలపాటు విచికిత్స చేశారు. కన్యాశుల్కం చదువుతూనే వున్నారు. నాటకంవేస్తే చూస్తూనే వున్నారు. నవ్వుకుంటూనే వున్నారు. సమకాలిక సమస్య తీసుకుని రాసిన నాటకమైనా, శాశ్వతమైన విలువలు సంపాయించుకుందని మెచ్చుకుంటూనే వున్నారు. తెలుగు సాహిత్యంలో 'అదోనాటకం' అనకుండా 'అదీనాటకం' అని అంటూనే వున్నారు. అయినా సరదాకో, చమత్కారానికో, కారానికో, మిరియానికో ఎవరో ఒకరు గురజాడమీద ఒకరాయి విసురుతూనే వున్నారు. ఆయనది శబ్దాశ్రయ హాస్యం అన్నది ప్రస్తుతం గిరీశానికి తగిలిన రాయి.

**హాస్యాంతకం**

"కన్యాశుల్కంలో హాస్యం ఇంగ్లీషు తెలుగు మాటల కలయికవల్ల పుట్టింది. అది తెలుగు హాస్యంకాదు." అన్నది ఆ హాస్య సైద్ధాంతికుని తాత్పర్యం.

గిరీశానికోపం వచ్చి యికపై తనమాటలకు నవ్వితే 'మీకు హాస్యం తెలిసినంతొట్టు. రేడియో నాటకాలకీ, తెలుగు సినిమాకథలకీ తలా తోకా ఉన్నాయనుకున్నంత ఒట్టు.' అని ఒట్టుపెట్టేసుకున్నాడు.

**కళా కళాకారులు**

నిన్నూ నన్నూ దేశాన్నీ ప్రపంచాన్నేకాక సర్వోదయావాళ్లని మురార్జీని రాజాజీని కూడా విపరీతంగా ఆకర్షించింది సినిమా. మంచైనా, చెడైనా సినిమావేపు మొగ్గటం జనం మానలేదు. జీవితంలో ప్రతిక్షణం మీద తెలిసో తెలియకో సినిమా ప్రభావం పడుతోందన్నది కనబడుతోంది. ఇంత విలువైన పరిశ్రమని సద్వినియోగం చేసుకునేవాళ్లున్నట్లే దుర్వినియోగం చేసేవాళ్లు వుంటారు. ఏ కళలో లేరుగనక!

**అకారణ జన్ములు**

ప్రజల విజ్ఞానానికి, దేశాభివృద్ధికి, సాహిత్యసృష్టి చేసేవాళ్లు ఓపక్క వున్నట్లే, ప్రజల అజ్ఞానానికి దేశ అనభివృద్ధికి ద్రోహదం చేసేవాళ్లు మరో ప్రక్క వుంటారు. కాని ఓ పక్క దిగజారిపోయే పన్లు చేస్తూ దానికి పెద్దమనిషి బురఖావేసేసి 'మేమే మహా గొప్పవాళ్లం'. ఈ యుగ 'ప్రవక్తలం' అని చెడామడా తిరిగేసేవాళ్లే సిసలైన దుర్మార్గులు. వీళ్లని రెండుకళ్లా కనిబెడుతూ వుండాలి. లేకపోతే కారం జల్లేస్తారు.

**వీ'ఐ'పీస్**

గిరీశం పరిశ్రమకి ద్రోహంచేసేవాళ్లని క్షమించడు. అవసరమైతే కుండొకటితెచ్చి బద్దలుకొట్టి మరీ మాట్లాడేస్తాడు.

నిర్మాత 'ఏదోబద్ధకంకొద్దీ, పని తొందరకొద్దీ ఒక్కో డిపార్టుమెంటు కొక్కొక్కణ్ణి వేస్తాడు. అంతేతప్ప వారికి తెలీకనా! ఇవేవన్నా బ్రహ్మవిద్యలా' అని అన్నిట్లోనూ చెయిదూర్చే నిర్మాతకో చురకవేస్తాడు గిరీశం.

'రోవింగ్ డైరక్టరుగారు నెక్స్‌ట్ షాటు ఎలా తియ్యాలో ఫోన్'లో చెబుతారు.

కవిగారు బిజీరైటరు. 'అందరికీ ఒకే డైలాగులు రాసిస్తాడు. అందుకే అజ్ఞాతవాసం చేస్తాడనుకోండి.'

**కథానాయిక**

'కథ ఎండింగు గురించి పేచీపెట్టలేదు. గ్లామర్ డ్రెస్‌తోటి డ్యూయెట్లు రెండు చాలవనీ, మూడుండాలనీ, ఓ సోలోసాంగు పిక్చరైజు చెయ్యాలని బలవంతపెట్టలేదు.' అంటే హీరోయిను పిక్చరుమీద ఇంట్రెస్టు చూపించటం లేదన్నమాట. ఇదీ పరిశ్రమలో ప్రధానవ్యక్తుల పరిచయం.



**వేదాంగాలు**

'ఈ విధముగా హౌనాట్‌టు మేకేఫిల్మ్? అనగా ఏ విధముగా ఒక సినిమాను తీయరాదు. హౌనాట్టురైట్ యాక్టు? ఎట్లు వ్రాయరాదు, నటించరాదు అన్న ప్రశ్నలకు జవాబులుగా ఒక్కొక్క చిత్రం ఒక్కొక్క క్లాసిక్కుగా ఉద్గ్రంథంగా తీసేస్తున్నారు మనవారు. ఇంత అపారమైన అపురూపమైన గ్రంథ సంపద వేదాల తరువాత మనకొచ్చిందేమిటి?'

ఇదీ పరిశ్రమ పడిన శ్రమకి గిరీశం కట్టినవెల!

అందరూ ఎల్లప్పుడూ ఒకటే కథనే సినిమా తీస్తారు. ఒక్క హెడ్డింగు మినహా మన సినిమాలలో మిగతావన్నీ ఒహటే విధంగా ఉంటాయి.

**సహగమనం**

విడో మేరేజి గురించి యిందరు యుగకర్తలు, ప్రవక్తలు జీవితాలు ధారపోసి ప్రయత్నాలు చేసినా సినిమావాళ్లదేం పట్టించుకోలేదు. ఏ రోజీజె రోజీజె రోజ్ అన్నట్లు ఏ విడో యీజే విడో యీజే విడో అని 'ఏం చేస్తాం ఎలాగో బతుకువెళ్లమార్చుకో' అని ఓదారుస్తూ పిక్చర్లు దీస్తున్నారు. ఈ తిరోగమనతత్వం మన కథలనిండా పుష్కలంగా వుంటోంది. సెంటిమెంటూ, తద్వారా ఏర్పడే మెలోడ్రామాయే ప్రేక్షకుల్ని కట్టకట్టి ఆకట్టుకుంటోంది. విడోకే గనక మళ్లా మేరేజీ చేసేస్తే మెలోడ్రామాకి ఛాన్సెక్కడిది? ఇహ ఉహు! డ్యూయెట్లు పెట్టాల్సిందేగా! సినిమాలో బరువైన సీనుకి, డైలాగుకీ, పాత్రకీ అవకాశం లేకుండా పోతుందికదా అని పరిపరి విధాల విచారిస్తారు సినిమావాళ్లు. కూడబలుక్కున్నట్టుగా అంథా ఒకే బాటన నడుస్తారు.

**<u>టైప్‌రైటర్లు</u>**

ఇంక డైలాగులు చూస్తే అచ్చు ఉపన్యాసాలే! సినిమా అంతా ఐపోయినా కథలో పాయింటేమిటో పట్టుకోలేనివాళ్లు కొన్ని లక్షల మందుంటారు. లెక్చర్లద్వారా వారికి కథను జ్ఞాపకంచేసి అబ్బీ! నువ్వు దీనిద్వారా గ్రహించిన నీతి ఇదిస్మీ అని చెప్పటానికి ఉపన్యాసాలుపయోగపడతాయి.

ఉదా:– 'అమ్మమ్మా! నాక్కొంచెం చింతకాయపచ్చడి వెయ్యి – కొంచెం చింతకాయపచ్చడి వెయ్యి.' 'నేనింతావకాయ వేసుకోను సుశీ, నేనింతావకాయ వేసుకోను.' వగైరాలు డిటో డైలాగులు.

మెలోడ్రామా కోసమన్జెప్పి చాలా అల్పమైన విషయంమీద బరువైన సీను బిల్డప్ చెయ్యటం.

ఉదా:– 'అగ్గిపెట్టి దొంగిలించిందని మావగారు కోడల్ని వెళ్లగొట్టడం.' లాంటివి.

**హీరోహిజం**

తమిళంలో దేవర్ సినిమాలుంటాయి. కిందటి సినిమాలో సింహాన్ని పెట్టాం. ఈసారి ఏనుగుని పెడదాం. కిందటిసారి సౌత్‌లో తీశాం. ఈసారి నార్త్‌లో తీద్దాం. కిందటిసారి హీరోహీరోయినూ ఒకేవూళ్లో వుంటారా, ఈసారి రెండూళ్లలో వున్నట్టు పెడదాం. అన్నా (యం.జి.ఆర్.) కాల్షీటిచ్చాడు; రైటరూ కథరాయి. ఇదీ పద్ధతి. ఇలాటి సినిమాలు తెలుగులోనూ వచ్చాయి.

**శివాజీగణేశను = రామారావు**

పరిశ్రమలో 'కాపీరైటు' వున్నట్టు కాపీకొట్టడమే కాకుండా మరో రకం దోపిడీ జరుగుతుంది. అరవసినిమా డబ్బింగు చేస్తున్నప్పుడు ఒరిజినల్ సినిమా టెక్నీషియన్స్‌ను పూర్తిగా మర్చిపోయి అదేదో మేం సొంతంగా నిర్మించాం అన్నట్లు నటిస్తారు డబ్బింగు నిర్మాతలు.

'అరవ పిక్చరు పాటలుచేసిన మ్యూజికు డైరెక్టరు పేరుని తెలుగులో రీ రికార్డింగ్ చేసినవాడి పేరులోకి ఎంత షోగ్గా తర్జుమా చేస్తున్నారూ!'

అలాటి నిర్మాతలకి గిరీశం ఒక సలహా యిచ్చాడు. అమలుపెడితే మంచి లాభసాటిగా వుంటుంది.

'అందులో శివాజీ గణేశనూ, పద్మిని నటిస్తే పబ్లిసిటీలో రామారావు అంజలీదేవి అవటాని ట్రాన్స్లేట్ చేసి అఘోరించవచ్చుగా.'

**భాషావిప్లవం**

రవణ గిరీశం లెక్చర్లలో కూడా ఒకపక్క గురజాడకి విధేయంగా వుంటూ తనదైన బాణీలో ఉపన్యాసాలిప్పించాడు. పదాలు, వాక్య విన్యాసాలు అన్నీ ముళ్లపూడి మార్కులు వేసుకుని డిస్టింక్షన్ వచ్చిన విద్యార్థిలా వెలిగిపోతుంటాయి.

'టెలుగూస్, విద్యుచ్ఛాస్త్రకారుడు, సిగార్స్‌ఫన్డ్, వానరమానవుడు బ్రిలియంట్ల వెధవలు, కాళిడోస్, క్రిటీకా తాత్పర్యాలు, టెక్నికల్ హంగారమా, మిస్చీఫ్ మినిష్టర్లు, కంఠశోషలిజం, మురార్జీ దేశాయివారు, పొగరుమోతుబర్లు, హేళన సప్తాహోరాత్రులు, కామన్‌ధేనువు, తెర వేలుపులు, భర్త కంట్రోలు."

అలాగే భాషను కుదించి మదించి మరీ పదాల్లోకి పట్టుకోడం, వ్యవహారంలో వున్నట్టే రాయటం చూడండి. "గుంట తనపిక్కుర్లు, ష్ హమ్మయ్య, షమ్మయ్య, ఘొవిటోసార్, కౌరంపించాడు, అర్ధాంత్రంగా ఆమర్ఘున, దై చేసి, పాండిచ్చేవూ౦"

"చిద్గగనాంతాన గురుసాక్షాత్కారంకోసం విశ్వనాథగారిలా!"



అన్న ఉపమానంచూస్తే రవణ సాహిత్యభూమి వదిలి హాస్యానికూడా సాము చెయ్యడనిపిస్తుంది. రవణ వేసిన గిరీశం మార్కు సామెతలు ఆమెతలూ వున్నాయి. అవికూడా వినేసి గిరీశంతో మళ్లా కలుద్దాం అనిచెబుదాం (లేపోతే వదల్డు)

'తప్పులో కాలేశావోయ్'

'బ్యూటీ ఫస్టన్నారు.'

'ఒక్క దెబ్బకి రెండు పిట్టలెగిరిపోయాయి.'

'వెయ్యి పిక్చర్లాయుష్మ శతపిక్చర్ ప్రాప్తిరస్తు.'

'నీ యిల్లు రాఫిల్మ్యగానూ! నీకెప్పుడూ ఒక్కలాటి వేషాలే దొరకా! నీ పిక్చరుకు ఒరిజినల్ మ్యూజికు జమపడా!'

'నీకు బ్యూటిఫుల్ యంగ్ విడోతో మారియేజ్ కానూ!'

భాషలోను, భావంలోను, శైలిలోను, సెటైర్‌లోను యింత ముందడుగు చూస్తూంటే రవణ పుస్తకాలు చదవటమే ఒక ఎడ్యుకేషన్ అనిపిస్తుంది. కొందరి పుస్తకాలు చదవకపోవటమే ఎడ్యుకేషనయినట్టు.



ఎమ్వీయల్, రావు గోపాలరావు, రమణ గార్లు



ఎమ్వీయల్, రావు గోపాలరావు




# ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ

**నిర్వచనీయం**

'ప్రేమ అనగా రెండు హృదయములు ఒకే పంధాన నడవటం'

పొలిటిక్సు అనగా రెండు హృదయములు రెండు పంధాలలో నడుచుట. సీత వీర్రాజు అనే జంటయొక్క జంట హృదయములున్ను, రామారావు సుబ్బలక్ష్మి అనే జోడు యొక్క జోడు హృదయములున్ను ఒకే పంధా అనబడే రెండు పంధాలలో నడిచే కధని నడిపించే కథే "ఇద్దరమ్మాయిలు-ముగ్గురబ్బాయిలు"

బంగారయ్య సూరయ్య అనే రెండు హృదయాలు రెండు పంధాలలో నడవడమే పొలిటిక్సు. నడిచెడివారు వీరిద్దరయినా నడిపించెడివారు మునసబు కరణాలు.

ప్రేమ పొలిటిక్సుల పంధాలను అర్ధం చేసుకోవటానికి ప్రేమ పొలిటిక్స్‌మీద విజయం సాధించి, మూడో అబ్బాయి హొరైజన్‌లోకి వెళ్లిపోయి ఇద్దరమ్మాయిలూ ఇద్దరబ్బాయిలు చేతులూ మనసులూ కలుపుకోటానికి పూర్వరంగం కొంత వుంది.





ఈ కధకు రంగస్థలం భారతదేశంలో తెలుగునాట ఒక 'మోడల్ విలేజి.' పేరు చెబితే ఒక ఊరిని అవమానించారన్నదానికన్న మిగిలిన ఊళ్లని వదిలేశామే అన్న బాధ కలుగుతుంది అని రాజకీయ భేతాళ పంచవింశతికలో రవణ చెప్పిన మాటని రవణే మననం చేసుకుని ఊరి పేరు చెప్పటం మానేశాడు.

"కధా కాలంనాటికి పెళ్లీడు ఆడపిల్లలు యిద్దరు. పెళ్లీడు హీరో అతని చెలికాడూ కాక మిగతా ఆరుగురు పెద్దమనుషులు. వీళ్లుకాక కొత్తగా కాపరం వచ్చిన కుర్రవాడు సుందరంతో కలిసి మొత్తం జనాభా ఏడువందల ఒకటి. అయినా శ్రీ ప్రభుత్వంవారు ఈ గ్రామస్తులు ఎన్ని మహజర్లు పెట్టుకున్నా పంచాయితీ ఏర్పాటు చేయించలేదు. పంచాయితీయే కాదు ఐక్యరాజ్యసమితి కూడా ఇక్కడే స్థాపించవచ్చు ఆ గ్రామంలో పార్టీలూ కక్షలూ పుష్కలంగా వున్నాయి."

నాగరికత లేదనకుండా ఈసరయ్య హొటలు, ఒక ఏకోపాధ్యాయ పాఠశాల, లేహ్యాలు చూర్ణాలు యిచ్చే దేవరగారు కాకుండా పోస్టుద్వారా ఉమాపతీ నేర్చుకున్న వైద్యుడు, మూడురోజుల కొకసారి టపా, కాలవరేవుకి నెలకోసారి ఉప్పుదోనె, పట్నం వెళ్లటానికి రావినాయుడి గుర్రబ్బండి, ఐదు సైకిళ్ళు యివీ ఊరికిగల అదనపు సౌకర్యాలు.

రామనాధంగారనే పెద్దమనిషి వున్నవాడుండక ఆస్తిపాస్తులమ్మేసి నాలుగువేల రూపాయిలు రామాలయం కట్టడానికి కరణం మునసబులకిచ్చి దేశాంత్రం వెళ్లిపోయాడు.

ఊళ్లో జనం అలవాటుప్రకారం ముందర రెండు పార్టీలయిపోయి బంగారయ్య అనే పెద్దమనిషికీ సూరయ్య అనే యింకో పెద్దమనిషికీ మీసాలు దువ్వి, కరణం మునసబులతోపాటు కైంకర్యానికి మూడో పెద్దమనిషిని నిలబెట్టారు. బంగారయ్యకి నోరుమంచితనం వల్ల వూరు మంచిదైంది. ఆయనకి మునసబుగారి అభిమానం వుంది.

సూరయ్యగారు కధానాయకుడు రామారావుకి మేనమామ, యింటికి మొగదక్షత, పెద్దదిక్కు. కరణంగారు ఈ పెద్దదిక్కుని దువ్వటానికి కారణం పెళ్లీడుకొచ్చిన రామారావుకి సూరయ్య గార్డియన్ కావటమే.

'ఇందులో బోలెడు రాజకీయాలున్నాయి. ఎన్నో సమస్యలున్నాయి.'

## ప్రేమాయణం

రామారావు సుబ్బలక్ష్మిని గాఢంగా ప్రేమించాడు. వీర్రాజు సీతని మరింత గాఢంగా ప్రేమించాడు. ఇద్దరి గాఢ ప్రేమలు పంటకి రాకుండా పాలిటిక్సు అడ్డుపడుతున్నాయి.

ఇదిగో ఆ యొక్క సూరయ్య రూపంలోను, మరోసుందర్రావు రూపంలోను.

ఇది పచ్చి రొమాంటిక్ స్టోరీ. అలాగని యిందులో కేవలం ఓ నాయికా, నాయకుడు వాళ్లిద్దరి మధ్య విలన్‌లా ఓ విలనూ ఉన్నారనుకోకూడదు.

'ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ' అనే పచ్చి రొమాంటిక్కథలోనూ పాలిటిక్సు, ఎకనామిక్సు చోటుచేసుకున్నాయి. ఇహపోతే సినిమాతోనే నవల ప్రారంభమవుతుంది.

'ప్రేమ' అని ఆశ్చర్యపడ్డాడు హిందీ సినిమాని ఆంధ్రప్రేక్షకులకి అనువదించి పెడుతున్న దుబాసి.

'ప్రేమ అనగా రొండు హృదయములు ఒకే పన్ధాన నడుచుట.' అని అతనే నిర్వచించాడు.

ఆ నిర్వచనాలు కలిగిన సినిమాని అనిర్వచనీయానందంతో చూస్తున్న హీరో రామారావు అతని సైడ్ హీరో వీర్రాజు సీత గురించి సుబ్బలక్ష్మి గురించి సినిమాహాల్లోనే తీవ్రంగా మాట్లాడుకున్నారు.

## పాత్ర పరిచయం

రామారావు విలాసాలలో విద్యాభ్యాసం ఒకటి. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పోషకుడు. చలనచిత్ర పరిశ్రమకు మహారాజ పోషకుడు. (నల్లులు – చలనచిత్రముల గురించి చాలా విస్తారంగా పరిశోధన చేశాడు) సినిమా పత్రికలకు రామారావు రాజపోషకుడు. తండ్రిలేని రామారావు ఆస్తికి తాళాలు అమ్మచేతిలో వున్నా ఆ తాళాలకు తాళాలు మావయ్య చేతిలో వుంటాయి. వీర్రాజు అంటే రామారావుకి నేస్తం. ఇతనూ విద్యాసంస్థలనీ, కళనీ పోషిస్తాడు. కొంచెం ఆస్తి, ఓమాదిరి అందం, బోలెడు తెలివితేటలూ. అమ్మా, ముసలిబామ్మ ఉన్నారు.

హీరో, సైడ్‌హీరో కలిసి తమకుండుకున్న తెలివితేటల్నుపయోగించి విలన్ సుందర్రావుని బెదరగొట్టి రాముడు ఎండ్‌కో దొంగల ముఠానుపయోగించి పాలిటిక్సు బుర్రల్ని రామకీర్తన పాడించి కథ సుఖాంతం చేసుకోటానికి ప్రయత్నించారు. అంతలోకే రామనాధంగారు తిరిగివచ్చి రామాలయ నిర్మాణం యావత్తు స్కూలు మాస్టరు శంకరయ్యకి అప్పగించటంతో సూరయ్యకి కరణంగారికి పరస్పరం ప్రేమ కరిగి



పాలిటిక్సు నీళ్లుగారిపోవటంతో రామారావు సుబ్బలక్ష్మిని, వీర్రాజు సీతని ఉద్వాహం చేసుకోగలిగారు. ఈ మధ్యలో చాలా పిట్టకథలు ఒకటి రెండు పిల్లకథలు జరిగి కథ రంజుగా పుంజుకోవటానికి తోడ్పడతాయి. అవన్నీ విని, కని, లేక చదివి ఆనందించాలంటే ఇద్దరమ్మాయిలూ, ముగ్గురబ్బాయిలూ చదువుకోండి. ఈలోగా రచయితగా రవణ పేల్చిన ప్రేమాయణ ప్రెజ్ఞ పిడకల వేటల్లోకూడా ఎలా ప్రకాశించిపోయిందో పరిశీలిద్దాం.

## ప్రేమకదనం

నవలలో సంఘటనల్తక్కువ. ప్రేమలు పెళ్లిళ్లుగా మారటం అనే విషయం ప్రధానంగా దానిచుట్టానే మిగిలిన రాజకీయాలూ తిరుగుతుంటాయి.

ప్రస్తుతం జీవితంమీద సినిమా ప్రభావం చాలావుంది. కొంత కాలంపాటు ప్రేమలూ, విరహాలూ, పెళ్లిళ్లు ఆగిపోవడం యివన్నీ మామూలు పద్ధతిలోకాక సినిమా ప్రభావం వల్ల బెంగాలీగాడిలో పడికొట్టుకుపోయే పరిస్థితి కూడా ఏర్పడింది. పాదధూళి, ప్రేమత్యాగం, జీవితాంతం, వగైరా వీసెడు మాటలు మణుగుమాటలు జీవితంలోకి చొచ్చుకుని వచ్చేశాయి. సినిమాలు చూసి ఆ పద్ధతిలో యివన్నీ అనుకరించటం అలవాటయిన వ్యక్తులు, ఘట్టాలు లేకపోలేదు.

న్యాయం పడితే సినిమా జీవితం దగ్గరకి జరగాలి. పట్టకపోతే జీవితం సినిమా దగ్గరకి జరిగిపోతుంది. ఇప్పుడీ రెండోదే జరిగిపోతోంది అడ్డూ ఆపూ, భయం భక్తీ లేకుండా.

ముళ్లపూడి గిరీశం అన్నాడందుకే "జీవితం ఇంతజోరుగా ఉత్సాహంగా సినిమా దగ్గరకి జరిగిపోతూ ఉంటే మన సినిమా జీవితానికి చాలాదూరం అన్న చెవలాయ ఎవడోయీ? అంట...." అని.

అందుకే రవణకి సినిమా అన్నా జీవితంలో సినిమా అన్నా చాలా యిష్టం. బాపు జోక్ వేసినట్టు బిడ్డపుడితే మగబిడ్డా ఆడబిడ్డా అనడానికి బదులు నాగేశ్రావా? సావిత్రా అనేంత నాగరికత మీరిపోయారు ప్రజలు. అడుగడుగునా, అణువణువునా సినిమా ఎఫెక్టుపడి జీవితం సినిమాట్రిగ్గా నడిచిపోతుంది. కనకనే ప్రేమకథను కూడా రవణ సినిమాహాల్లోనే ప్రారంభించాడు.

కథా ప్రారంభమే కాకుండా కథనంకూడా సినిమా బొమ్మల కదలిక లాగే సాగుతుంది.

వీర్రాజూ రామారావూ 'అవుటుపాసులు అమ్మేద్దాం సగం రేటుకి అని హాలు బయటకి వచ్చేశారు.

మామూలు కథయితే వాళ్ల వెనకే సాగాలి బుద్ధిగా. రవణ సినిమాటిగ్గా నడపదలచుకోబట్టి ఫ్రేమ్ మార్చేశాడు.

"ఇది యిలావుండగా ముందర మూడణాల తరగతిలో రామన్న భీమన్న అనే యిద్దరు తోడుదొంగలు నల్లుల్ని వేటాడుతున్నారు. సిట్టి అచ్చంగా యిలాగే వుంటది గదేస్ అన్నాడు రామన్న."

ఇలా పరిచయంచేసిన దొంగ పాత్రల్ని కూడా హాలుబయటకు లాగి రోడ్డెక్కించి ఆ ప్రేమజంటని, ఈ దొంగజంటని కలిపి కథ నడిపించేస్తాడు రవణ.

కథలో పాత్రలుకూడా సినిమా పరిభాషలోనే మాట్లాడుకుంటాయి. 'వాల్తేరులో ఉన్నప్పుడు లాంగ్‌షాట్‌లో చూసేవాణ్ణి. బొత్తిగా యింత క్లోజప్‌లో చూడ్డం యీ వూళ్లోనే అంటాడు రామారావు ఫోటోగ్రాఫిగ్గా.

అలాగే వీర్రాజు సినిమా పాటలపుస్తకాలు, ప్రకటన కరపత్రాలు చదవటం ఊహుఁ అలవాటయిపోయి సూరయ్య గురించి రామారావుకి చెబుతూ ఆ భాషలోనే మాట్లాడతాడు.

"ఆ పైన భాగోతం వెండితెరమీద చూడాల్సిందే. మావ ఇంకోలా అప్పు తీర్చగలడా! కంట్రాక్టరూ, శెట్టీ ఏం చేస్తారు? సుందరం సుబ్బలక్ష్మిని చేసుకోగలడా? కథానాయకుడు రామారావు ఏమవుతాడు? వాడి చెలికాడు వీర్రాజుగానీ కొంపతీసి సీతని పెళ్లాడేస్తాడా? మిగతా కథ వెండితెరపై చూడుడు."

చివరికి ఆడబడుచయిన సీతకూడా 'నువ్వు దీదార్ చూశావా రాజ్' అంటుంది పాచ్చింతకాయ పచ్చడి జాడీతో సహా అతని కందిస్తూ.

**పారడీ**

ఇందులో ఎక్కువగా 'వచనరచన'ను పారడీచెయ్యటం జరిగింది. పాతకాలం వచనం ముఖ్యంగా వెంకటపార్వతీశ కవుల డిటెక్టివునవలల్లా వచనం యిలా ఉండేదని చెబుతూ హాస్యానికి ఆ రచన వాడుకున్నాడు రవణ–

"చదువరీ ఒకపరి యిటురమ్ము. ఈ తెరువరు లిరువురి తెరగుల పరికింతము."

ఇలా రచయిత చొరవగా రచనలో జొరబడి చెయిచేసుకుని పాతకుల్ని పట్టుకుని లాక్కెళ్లడంతోపాటు పాతకాలం వచనరచనల్లోని వర్ణనల చందాన్ని అవహేళన చెయ్యటానికి అనుకరించాడు.

"తెల్లవారిందనే దురభిప్రాయంతో కోడి కూసింది. కాకులు మేలుకున్నాయి. ఈగలు డ్యూటీకి బయలుదేరాయి. దోమలు విశ్రాంతికి ఉపక్రమించాయి. దాలిగుంటల్లో



పిల్లులు బద్ధకంగాలేచి వళ్లు విరుచుకుని బయటకు నడిచాయి. ఆవులు అంబా అన్నాయి. పువ్వులు వికసించాయి."

మామూలుగా ప్రాబంధికంగా సాగే వర్ణనలు 'పద్మాలు వికసించాయి కలువలు ముకుళించాయి. కోకిలలు అలసిపోయాయి' వగైరా కంటికగపడని అబద్ధాల కవిసమయాల వర్ణనకిది మంచిపారడీ.

'ఈ సిగరెట్టుమీద ఒట్టు' అని ఒట్టు వెయ్యడానిక్కూడా పారడీ వాక్యం రాశాడు.

దుర్యోధనుడి 'మయసభావమానానంతర గాధ'ను పారడీచేస్తూ రామారావు స్వగతం ఒకటి రాశాడు రవణ.

"నేనేల ఈవేళ సినిమాకు రావలె? వస్తిబో మధ్యలో మా చవటకి లేచిపోవాలని బుద్ధి ఏల పుట్టవలె? పుట్టెబో నేనేల లేచిరావలె? వచ్చితిబో యిపుడు సైకిలేల దిగవలె? వేయేల మాలదైవమీలీల ననుబాములపాలు సేయనేల" అనుకున్నాడు గబగబా.

**ఎడిటింగ్**

రోడ్డుమీద తటస్థపడి తమని దోచుకోబోయిన రాములు అండ్‌కో దొంగలజంటను వీర్రాజు మెల్లగా బుట్టలోపెట్టి భయపెట్టి గుప్పెట్లో కప్పెట్టుకున్నాడు ఎప్పటికేనా పనికిరాకపోతారా అని. వాళ్ళిద్దరికీ ప్రామిస్ చేసిన సిలుకుచొక్కాలు గుప్పెడు రూపాయిలూ యిచ్చెయ్యటానికి 'పులి దగ్గరికి మాట తప్పని గోవులా' బయల్దేరారు రామారావు వీర్రాజు–

"పోషణేముంది? ఇప్పుడు వాళ్ల సైకిలు వాళ్లకిచ్చేస్తాం. ఆ పైన చెరో ఐదూ బయానా ఇస్తాం. ఎల్లుండి కనబడమందాం. ఎన్నికలు ఆదివారం నాడేగా! అరుగో రామన్నా, భీమన్నా – ఔను – ఏమోయ్ – కులాసానా! ఆలస్యం అయింది ఏమనుకోకండి.'

అనే వీర్రాజు డైలాగులో కథని స్పీడుగా లాగేశాడు రవణ. మధ్యలో దొంగలెదురయ్యారు, వీళ్లు సైకిళ్లు దిగారు వగైరా చెప్పకుండా సినిమాకంటె వేగంగా నడిచింది కథ.

**పిట్టమేకా**

రామనాథంగారు సాములారై తిరిగివచ్చాడు. ఆయన మాటలు వినడానికి పిల్లామేకాయే కాకుండా పిట్టామేకా కూడా నిశ్శబ్దంగా చెవులు రిక్కించాయని రవణ కథనం.

"జనం అంతా ఆయన మాటకోసం చెవులు రిక్కించుకు కూర్చున్నారు. చెట్టుమీద కూర్చున్న ఒక పిల్లకాకి తెలీక, బాల్యచాపల్యం కొద్దీ కావుకావు అంది. వాళ్లమ్మ

'హుఁ' అని గద్దించడంతో నోరు మూసుకుంది. ఇది చూసిన ఒక మేకపిల్ల 'మేమే' అని నవ్వ గబుక్కున తప్పు గ్రహించి, నాలుక కరుచుకుని చెట్టు చాటుకి తప్పుకుంది."

## విలేజ్ బ్యూటీ

పల్లెటూళ్ళో నడిచే (నిజానికి పరిగెత్తే) ఈ కథలో పల్లెటూరి రూపురేఖల్ని కళ్లకి కట్టేట్లు వర్ణించాడు రవణ. మహామహా మహాకవుల మనుకునేవాళ్లుకూడా మహామహా కావ్యాల్లోనే అంత అందమైన దృశ్యాల్ని ఫోటోగ్రాఫ్ చెయ్యలేదు. ఆ వర్ణన చదువుతుంటే 'పరిగెత్తి పాల్తాగే పట్టణాలు వదిలిపెట్టి పల్లెటూరికెళ్లి నీళ్ళు తాగుదాం' అనే నిర్ణయానికి వస్తారు ఎవరైనా!

"ముద్దబంతి పూలలా బొద్దుగా పచ్చగా ఉన్న అమ్మాయిలు పంచకల్యాణి గుర్రాలకు మల్లే శోభిస్తూ కళ్లు నులుముకుని కాటిక మరింత అందంగా పులుముకుంటూ, ముంగురులు సవరించుకుంటూ విడిపోయిన జడలల్లుకుంటూ అమ్మలచేతా, బామ్మలచేతా సున్నితంగా చీవాట్లుతింటూ యిళ్లు కలకలలాడేలా తిరుగుతున్నారు. కొందరు గుమ్మాలలో పేడనీళ్లు చల్లి సంక్రాంతి ముగ్గులు తీర్చిదిద్దుతూ, ముగ్గులంత అందంగా సజీవంగా నవ్వుతున్నారు. పదేళ్ల పిల్లలు గొబ్బి తట్టుతున్నారు. రౌడీ తమ్ముళ్లూ, రాలుగాయి కుర్రాళ్లూ లేచి గోడీ బిళ్లలూ, బొంగరాలూ, పిడకల దండలూ కులాసాగా ఉన్నాయో లేదో చూచుకుని చద్దన్నాలకి సిద్ధం అవుతున్నారు."

పల్లెటూరి స్వరూపం కళ్లకు కట్టేట్లు వీధుల్ని యిళ్లని, వాకిళ్లని ఎత్తరుగుల్నీ, చెరువునీ, దుకాణాల్ని, ఎండుతామరాకుల్లో యిడ్లీలు పెట్టే ఈసరయ్య హొటల్ని వర్ణించాడు రవణ. వీటితోబాటు కరణం, మునసబు, కంట్రాక్టరు, సెట్టి, బడిపంతులూ కథముందూ కళ్లముందూ తిరుగుతూ పల్లెటూరి మజాకా యిదీ అని నచ్చచెబుతుంటారు.

"మీ మామయ్య ఇంటికొచ్చి పెద్దమనుషులు, పెద్దమనుషులంటూ మీనాన్న బట్టలు తీసుకుపోయాడు – ఆయనే ఉంటే...' అని కంటతడిబెట్టింది రామారావుతల్లి సూరమ్మగారు. ఈ సెంటిమెంటు పల్లెటూరి గృహిణుల్లో కనబడి మనతో కూడా కంటతడి పెట్టించక మానదు.

రామాలయ నిర్మాణం సందర్భంగా, సూరయ్యతో మంతనాలకి జతపడిన కంట్రాక్టరు, ఈసరయ్య, సెట్టి ఎవరికివారు ఎదటివాడు పునాదిరాయిగా గాలిమేడలు కట్టేసుకున్నారు.

'ఏమోయ్! ఈసరయ్యా! నువ్వు దుకాణం హొటలూ కలిపి పెట్టావంటే ఆ పాక లాభంలేదు. కాస్త షెడ్డులాటిదుండాలి. షెడ్డు వేయించుకుని ఇటికలతో గోడ కట్టించాలి. ఎండా వానా వచ్చినా చెక్కుచెదరకుండా పడుంటుంది.' అంటాడు కంట్రాక్టరు.



ప్రేమించిచూడు చిత్రంలో గుమ్మడి కంట్రాక్టరు. చాలాకాలం తరవాత తన బాల్యస్నేహితుడు రేలంగిని కలుసుకుంటాడు. మొట్టమొదటిసారి ఇంట్లోకి రాగానే పిల్లలు వగైరాల గురించి కాదు గుమ్మడి అడిగేది. 'ఇల్లు బావుందిరా! ఎవడ్రా కంట్రాక్టరు' అని. మనిషి చేసే వృత్తి మాటలలోకి అనుకోకుండా వచ్చే మనోవృత్తిని రవణ పసిగట్టి రచనల్లో పెట్టాడు.

కరణం, మునసబు, సెట్టి, పూజారిగరవయ్య, కంట్రాక్టరు ఈసరయ్య కథలో కనబడి యీలా ఒకరినెత్తిమీద ఒకరు చెయ్యిపెట్టుకోవాలని ప్రయత్నిస్తుంటే పల్లెటూరిని 'నాగరీకపు' తంత్రాలు ఎలా లోబరుచుకుంటున్నాయో అవగతమవుతుంది. పల్లెటూరికి మూలస్తంభాలయిన ఈ పాత్రల్ని రవణ 'సాక్షి' చిత్రంలో వాడుకున్నాడు.

కన్యాశుల్కం తరవాత పల్లెటూరి వాతావరణాన్ని, మనుషుల్ని వాళ్ల బుద్ధుల్ని – నగర ప్రభావం ఛాయామాత్రంగా పడి రంగులు మారుస్తున్న ప్రబుద్ధుల్ని కథల్లో నిలబెట్టగలిగాడు రవణ.

## పల్లెమనసులు

పల్లెటూరిలో పాల్టిక్సుకూడా మరీ నాగరీకంగా కాకుండా – ఆస్తిపాస్తుల్ని కైంకర్యం చేసుకోవాలనుకున్నా, ఎలక్షన్లో నెగ్గాలన్నా సంబంధాలు చేసేందుకు, కలిపేసుకునేందుకు సరదాగా పదిమంది ఆనందించేందుకు తగ్గట్టుగానే వుంటాయిగాని చాపకింద నీరులా సాగవు.

రామారావుకి సీతనిచ్చి చెయ్యడంలో లాభాల్ని చెల్లెలికి వివరిస్తాడు సూరయ్య.

"మనలో మాటేస్మీ – ఆయనకి సీతమ్మ ఒక్కగాని ఒక్క కూతురాయె. రేపు ఆయనకాస్తా హరీమంటే ఆ ఆస్తికూడా రాముడే యేలుకోవచ్చు. ఏమంటావ్?"

చెల్లెలి యింటిమీద పడి బతికే సూరయ్యకి ఈ ఆలోచన వున్నంత మాత్రాన అతను దుర్మార్గుడనుకోడానికి వీల్లేదు. మేనల్లుడిపట్ల ఆత్మీయత ఆపేక్ష ఆయనకీ వున్నాయి.

"సూరయ్యగారూ–యీడి పోటీ తట్టుకోవాలంటే మనం సానిమేళం ఎట్టించాలి. బలేరంజుగా ఉంటది" అన్నాడు సుబ్బిశెట్టి.

ఎలెక్షన్లలో యిలాటి సాంస్కృతిక కార్యక్రమాలే తప్ప మనుషుల్ని దాచేసే తెలివిమీరటం ఆనాడు పల్లెటూళ్లలో కానరాదు. కేంద్రాన్నించి రాష్ట్రానికి, సమితికి, పంచాయితీకి పరిపాలన విస్తరించి ఈనాడు తెలివితేటలు బహుముఖాలుగా, బహురూపాలుగా కనబడుతున్నాయి.

## సమాస తప్పులు

తప్పుడు సమాసాల ప్రసక్తి తెచ్చి ఒక చెణుకు విసిరాడు రవణ. వ్యాకరణ యుక్తంగా రాయాలనుకోటం, చిన్నయసూరి మనసు నొప్పిస్తే నరకప్రాప్తి కలుగుతుందనుకోవటం కేవలం భాషా విషయంగా మనకున్న అజ్ఞానం. తెలుగు మాతృభాషయిన ప్రతివాడికి తెలుగు వ్యాకరణం వచ్చు. మాట్లాడ్డానికి, రాసుకోడానికి వ్యాకరణం తెలీనక్కర్లా. అంతా సలక్షణంగానే మాట్లాడతారు. కాకపోతే వ్యాకరణం శాస్త్రోక్తంగా నేర్పటం మొదలుపెడితే కంగారుపడిపోయి 'యొకడుండెను.' 'నుద్యోగము యెందుకు.' యిలా రాస్తారు ఈనాటి తెలుగు విద్యార్థుల్లాగా. ఈ 'గ్రామర్ కాన్షస్‌నెస్' మీద వ్యాఖ్యానం చేస్తున్నట్లు 'రాజకీయబుర్ర' అని వీర్రాజు అనగానే 'అదేంతెలుగురా చెవలాయా' అన్నాడు రామారావు తెలుగు మాస్టరులాగా. నిజానికి 'జన్మహక్కు' లాటి సమాసాలు చెయ్యటం మాములై పోయిందీనాడు. ఇలా రాయకూడదూ అలా అనకూడదూ అని కట్టడి చెయ్యటం ఎదుగుతున్న పసిమనుషుల్ని బిగపట్టి పిప్పిచెయ్యటమే!

ఈ తప్పు సమాసాలు కొన్ని కిర్రుమని వినిపిస్తాయి. అటువంటివి ఎలాగా ఎవరూ వాడరు. బా...గా చదువుకుని సినిమాపాటలూ గట్రా ఎట్సెట్రా రాయగలమనుకునేవాళ్లు హృదయపాట, వృద్ధతల్లి, పుష్పచెట్లు లాటివి వాడుతుంటారని రవణ హృదయబాధ.

## శరత్ చంద్రికలు

"తెలుగు సాహిత్యంలోని శరత్ ప్రభావం ధౌజండు వాల్టుల శక్తితో పడింది. దాని మూలాన మనుషులు, రచనల్లో పాత్రలూ కూడా శరత్ 'పాదధూళి'ని తలదాల్చుకోటం కనబడుతుంది. ఆ భాషను రచనల్లోవాడి తెలుగుతనాన్ని మసిచేస్తున్న రచయితలకి హెచ్చెరుగ్గా కొన్ని పదాలు సంభాషణలు పారడీ చేశాడు రవణ.

"మీరు సుబ్బలక్ష్మిని వివాహం చేసుకోండి. నేను సంతోషంగా వచ్చి శుభాక్షతలు వేస్తాను. ఆఁ నేను ఇవాళ చెప్పే ఈ మాటలు హృదయంలోంచి వస్తాయి సుందరంబాబూ' అన్నాడు రామారావు.

"రామారావుగారూ – మీ ఔదార్యానికి నిజంగా కృతజ్ఞుణ్ణి. మీ హృదయం ఎంతగా ద్రవించిపోతోందో నాకు తెలుసు–కానీ ఇంకొక్క నిజం చెప్పేస్తే నా మనసు ప్రక్షాళితమవుతుంది.' అన్నాడు సుందరం.

వీళ్లిద్దరూ యింకాసేపుంటే 'నిష్కృతి' అనికూడా అనేస్తారని భయపడ్డాడు వీర్రాజు.

నిజానికి యిలాటిరచన ఈనాడుకూడా కొనసాగిస్తున్న రచయిత్రులు, రచయితలు



వున్నారు. కొత్తగా శరత్ అనువాదాలు చదవటంవల్ల కలిగే దోషం యిది. ఈ దోషాన్ని సున్నితమైన 'సెటైర్' ఒక్కటే తుడిచిపెట్టగలదు.

రవణకున్న ఈ 'లిటరరీ కాన్షస్‌నెస్' గమనిస్తే సాహిత్య దుస్థితి చూసి అతని హృదయం ఎలా ద్రవించి ప్రక్షాళితమైపోతోందో తెలుస్తుంది.

## గ్రామభాష

ప్రేమకీ విలనీకీ హీరోయిజానికీ, విలేజీ నిజానికీ తగిన పదాల్ని వాక్యాల్ని వాటి విన్యాసాల్ని ప్రదర్శించాడు రవణ.

కథాకళీ ఆడడం, ఆస్థానచోరులు ప్రేమాయణం.

'ప్రియూనివర్సిటీలాగే బియ్యేకూడా అనేక తఫాలు తప్పాడు.'

'రామారావునిండా దీపాలు వెలిగిపోయాయి.'

'గత జీవితం అంతా మర్చిపోయాను. అంతా కడిగేసి ముగ్గులు పెట్టాను.'

'నోటి ఆగ్నేయమూలనించి చిన్న నవ్వు నవ్వుతూ నుంచున్నాడు.'

"తెలుకుల వీరయ్య సావిడిలో పెద్దదీపం వెలుగుతున్నట్టు ఇద్దరికీ కనబడింది. రామారావుకి కనబడిన దీపం పేరు సుబ్బలక్ష్మి. వీర్రాజుకి గోచరించిన దీపం పేరు సీతాలక్ష్మి."

'కళ్లు, ఎడంవేపు గుండెకాయ మినహా మిగతా శరీరం యావత్తు మరణిస్తుంది. మెదడు గడ్డకట్టుకుపోతుంది.'

'వంట్లో చాలాబలం, చెన్నపట్టణంలో పలుకుబడీ ఉన్నాయి.'

అలాగే ఉపమానాలు కూడా కొత్తవి కట్టటం జరిగింది.

'సూరయ్యగారి యింగితం పదో ఎక్కం అంత బాగావచ్చు.'

'దీపం వెలిగించిన గదిలాగా ధైర్యసాహసాలతో ఉత్సాహంతో వీర్రాజు భౌతిక శరీరం ఆపాదమస్తకం నిండిపోయింది.'

'ఇద్దరి మాటలూ వింటున్నాడు టెన్నిస్ ప్రేక్షకుడిలా.'

## క్రి ట్రిక్స్

సినిమాహాల్లో మొదలవటమే కాకుండా సినిమాకి సంబంధించిన రిఫరెన్సులు ఒకటిరెండు యిందులోనూ కనబడతాయి.

"ఆ న్యూస్‌పేపరు బుష్‌కోటూ, మూతిమీద ఈగవాలినట్లు మూడు వెంట్రుకల మీసం, గిరజాల వ్యవహారం చూసి సినిమావాడని గుర్తుపట్టేను."

సినిమాహాల్లో కాంప్లిమెంటరీల గురించి చెబుతూ అలా బేవారసులయిన కస్టమర్స్‌ని అష్టకష్టాలుపెట్టి హాలుకిరాకుండా చేయుటకు హాలు యజమానులు సీట్లలో నల్లులు పొయ్యటాన్ని గురించి విపులమైన థీసిస్ తయారుచేశాడు రామారావు.

మధ్యతరగతి మహారాజులూ, యువరాజులూ తిన్నగా ఉండరు. కథాగమనం 'కుంటుపడినచోట్లు', డైరెక్టరు మహాశయుడు 'పప్పులో అడుగేసిన సందర్భాలు', మ్యూజిక్ దెబ్బతిన్న సమయాలూ, సన్నివేశాలు పేలవంగా తయారైన ముహూర్తాలూ అసభ్యనృత్యాలు–కనిపెట్టి పత్రికలకి అభిప్రాయాలు రాసేస్తారు. దానివల్ల ఆరునెలలు ఆడే చిత్రం ఒక్కొక్కసారి ముచ్చటైన మూడోరోజునే డేరా ఎత్తేస్తుంది. అందుకని ఈ మధ్యతరగతి మహారాజులు, యువరాజుల (ఈ రెండుపదాలకి అర్థం తెలియాలంటే డిటోటైటిలు కథ చూడండి). మనసులు మళ్లించటానికి వాళ్ల సీట్లలో 'సమయస్ఫూర్తి' కలిగిన నల్లుల్ని వదుల్తారు.

మిగిలిన రచనల్లో సినిమా తీసేవాళ్ల కష్టాలు సుఖాలు లాభాలు నష్టాలు చెప్పిన రవణ ఈ రచనలో ప్రేక్షకుడ్ని, ఎగ్జిబిటర్ని చిత్రించాడు.

**రాజకీయం**

ఈ సినీ ప్రేమాయణ రామాయణంలో గ్రామాయణ పాలిటిక్సు, మహాభారత డ్రామాయణం కూడా సమపాళ్ళలో మిళాయించి వుంది గనక రాజకీయ వాసనగల వాక్యాలుకూడా ఈ రచనలో చోటు చేసుకున్నాయి.

"నల్లబజారు మనిషికి పాఠాలునేర్పి సిగ్గుతో, భక్తి ప్రపత్తులతో తలవాల్చేటట్టు చేయగలిగినంత రక్తదాహంగల జమాజట్టీల్లాటి శాండో, ఫైల్వానులవంటి నల్లులు."

"శివాలయంవుంది. పూజారిగారికో పార్టీ వుంది. మాటమాటా వచ్చి జనం రెండు పార్టీలయితే బలాబలాలు తేల్చేది పూజారిగారే."

పట్టణాల్లో డబ్బున్నవాళ్లు, తలలు మార్చేవాళ్లే పాలిటిక్సులో ప్రవేశిస్తారు. పల్లెల్లో తరతమ భేదాల్లేకుండా ప్రతివాడికి యధాశక్తి పాలిటిక్సభిరుచి వుంటుంది. ఇందులో పూజారి కన్యాశుల్కంలో గవరయ్యంతటి దేవాంతకుడు.

విద్యావిధానం, విద్యార్థుల విధానంమీద కూడా ఒక ఎర్రటి వాత పెట్టాడు రవణ.

"వీడికి పరీక్షల్లో మార్కులు తక్కువొచ్చాయి. వందరూపాయలిస్తే ప్యాసై పోతాడు."

**అమెరికాకులం**

మన దేశీయులకి 'సీమగడియారాలు అబద్ధం చెప్పవు' అని విదేశీ సరుకులమీద, విదేశాలమీద ఎంత మోజున్నదో ఆ మోజు ఎలా వెర్రితలలు వేస్తోందో నిరూపించటం



ఈ రచనలో కనబడుతుంది. చదువు ప్రసక్తి లేకుండా సంస్కారం సంగతి రాకుండా ప్రతివాడు విదేశాలని 'ఓహో' అని పొగిడేసి మనదేశాన్ని తీవ్రంగా విమర్శించేవాడే. అలాటి మనుషులకి గుర్తుగా ఒక పాత్రని పెట్టుకున్నాడు రవణ.

'అమెరికాకి' వీడి మావయ్య డియరెస్టు ఫ్రెండు వెళ్లొచ్చాట్ట. వాళ్ల మావయ్య స్వగ్రామం ఈజిప్టుట. అంటే చాలా రోజుల్నుంచి ఈజిప్టులో ఉంటున్నాట్ట. అక్కడ ఆయనకి ఓ ఫ్రెండు. ఆ ఫ్రెండు అమెరికా అవీ చూసొచ్చాడు. ఆ గోరోజనం యావత్తూ వీడికి అంటుకుంది. అందుకని ఇండియా సివిలైజ్డ్ కాదు. ఇండియాలో ఏం లేదు. వాడి బొందవుందట. వాడే అన్నాడు. 'ఇక్కడేముందండీ నాబొంద' అని.

**బ్రాటోవరు**

రవణ తన రచనల్లోని చాలా సంభాషణల్ని బోలెడు వ్యక్తుల్ని, వాళ్ల గుణావగుణ గణాల్ని తన సినిమాల్లో వాడుకున్నాడు. రచయిత లందరికీ ఆశయాలు అప్పడాలు వడియాలు వుంటాయి కాని సినిమా రచయిత కాంగానే అవికాస్తా బూజుపట్టి పోతాయి. ఆ రచయితకి ఏ పాత్ర వలన ఏ రచనవల్ల ఏ ప్రత్యేక సృష్టివల్ల పేరొచ్చిందో అదిచూసి సినిమా ఛాన్సిస్తారు. ఆ రచయితలు ఆ పూర్వరంగం తక్షణం మర్చిపోయి సినీరచన లారంభిస్తారు.

రవణ అలాకాక తన రచనల్లో ప్రత్యేకతలన్నీ సినిమాల్లోకి రాబట్టుకున్నాడు. కనకనే సాహిత్య జనాభామధ్యా, సినీ జనాలమధ్య కూడా 'రవణ మార్కు' అనేమాట వినబడుతుంది. వాటి వివరాలు సినీ రచయితగా రవణ అనే చోట వివరించ దలుచుకున్నాను గనక యిక్కడ విరమించుకుని ఈ రచనలోంచి తెరకెక్కిన రెండు విషయాలుమాత్రం చెబుతాను.

"ఖలుడెంత పవర్‌ఫుల్లో తెలుసా? ఆ మధ్య ఓ ఖలుడ్ని ఓ తేలు ఖలుడన్న సంగతి తెలీక కుట్టిందట – అంతే ఖలునకు నిలువెల్ల విషము గదూ! ఠారున చచ్చింది. అలాగే ఓ పాము. ఇంకా అలాగే నల్లులు, దోమలు...'

ఇది బంగారుపిచిక చిత్రంలో రాజబాబు నోట బంగారంలా రాణించింది.

రామనాధంగారు తను గుడికోసం ఇచ్చిన డబ్బుతో బడి కట్టించవలసిందిగా కోరారు. పోటీవాలాలకు, భేటీవాలాలకు రోటీకి మోసం వస్తుంది గనక గుడి కావాలని పట్టుబట్టాడు సూరయ్య. గుడి–బడి మధ్య సంఘర్షణ – అంటే సామాన్య విషయం కాదు. అజ్ఞానం – విజ్ఞానం మధ్య మూఢనమ్మకం – శాస్త్రవిజ్ఞానం మధ్య సంఘర్షణ. ఇక్కడ బయటపడిన ఖనిజంలాంటి నిజం బుద్ధిమంతుడు చిత్రంలో పదునుతేలి ప్రకాశించింది.

### యాంటీ. వి. రాఘవులు

రవణకి యిష్టమైన పాత్రల్లో బడిపంతులొకటి. ఈ పంతులు రిఫరెన్సు లేకుండా సామాన్యంగా అతని రచన ఏదీ వుండదు.

ఇందులో పార్టీలు పాలిటిక్సు, డబ్బు, పలుకుబడి, భస్మాసుర హస్తాలు అన్నిటినీ జయించి చివరికి నిలబడిన కథానాయకుడు మాస్టరు శంకరయ్య. రామానాథంగారు తన డబ్బు యావత్తు శంకరయ్య కిచ్చేశారు. మిగిలినవాళ్లని వాళ్లమానాన వాళ్లని పొమ్మని.

స్కూలు మాస్టరు శంకరయ్య యోగక్షేమాలు పార్టీలకు, గ్రామాలకు, నగరాలకు, రాష్ట్రాలకు, దేశానికి, టి.వి. రాఘవులికి పట్టకపోయినా – స్కూలు మాస్టరుకి మాత్రం గ్రామంలో అందరి యోగక్షేమాలు కావాలిగదా!

### చిరురుణాలు

సినిమా పరిశ్రమలో శాశ్వత ఋణం పద్ధతిలో డబ్బుపడేసి పట్టే లైజాను ఆఫీసర్లుంటే పల్లెటూళ్ళలో వాళ్ళకంటె తెలివితేటలున్నాయనిపించే పక్కింటి బామ్మలు, పిన్నులు వుంటుంటారు.

'ఇరవై ఇస్తానని పదిహేను చేతిలో పెట్టావు. నేను అడిగింది పాతికా నువ్వు యిస్తానన్నది యిరవై. తీరా చేతికిచ్చింది పదిహేనూనా' అని తూనీగలాగా ఎగిరిపోయాడు రామారావు వాళ్ళమ్మ సూరమ్మ దగ్గర్నించి.

'హౌరా! ఎంత నేర్చుకుపోయావురా మాటలు!' అంటూ ముక్కుమీద వేలువేసుకు విస్తుపోయింది సూరమ్మగారు.

ఆవిడ తన తనయుడ్ని, తనయుడి తండ్రిని, పక్కనే తనని గ్రూపు ఫోటోలా ఊహించుకుని ఆనందపడిపోయే ఘట్టంలో 'పొరుగింటి బామ్మ పాత్ర' పెద్దపాత్రతో కాఫీపొడి అప్పుకోసం ప్రవేశిస్తుంది.

'మరే. అచ్చం ముమ్మూర్తులా వాళ్ళ తండ్రి తీరే..పోలిక లెక్కడికి పోతాయి వదినా? అన్నగారంత చతురుడే వీడూను.. ఔగాని వదినా, మీ డబ్బాతో డబ్బాడు కాఫీపొడి ఉంటే యిద్దరూ చుట్టాలు దిగారు.' అంది పెరటి గుమ్మంలో నించున్న పొరుగింటి బామ్మగారు.

అప్పుడు సూరమ్మగారు కాదనలేదు కదా!









## వ్యూలు–రివ్యూలు

### సమీక్షల బాల'శిక్ష'

"పుస్తకాలపేర్లు మారుతున్నాయి గాని సమీక్షలు మారడంలేదు" అన్నది ఇంగ్లీషు జోక్!

ఇది చదివి నవ్వుకున్నాక అమ్మయ్య తెలుగులోనే కాదు ఇంగ్లీషులోనూ ఈ మూసకట్టు సమీక్షల దౌర్భాగ్యం ఉందన్నమాట అని నిర్భయంగా సంతృప్తిపడచ్చు.

పుస్తక సమీక్షలకన్నా మరోమెట్టు దిగజారిన స్థితిలో చిత్ర సమీక్షలుంటున్నాయి. విఠలాచార్య, నజీరుహుస్సేన్ సినిమాల్లాగా టైటిల్స్ మారతాయి – మిగతా కథ మామూలే! కథ చెప్పటం (వుంటే – వుందని తెలిస్తే) కమామిషు చెప్పటం (రచన గురించికాక మిగిలిన అన్ని వివరాలు అన్నమాట) అన్నీ యధోచితంగాను కన్నుల, వీనుల పండువుగాను ఉన్నాయనటం, కొత్త నిర్మాతైతే పర్లేదు పైకొస్తాడనటం, పాతవాడైతే స్థాయి దిగజారకుండా తీశాడనటం జరుగుతుంది.

కాస్త హాస్యం చిందిద్దామనుకుంటే 'వీరు మంచి సినిమాలు కాకుండా చెడ్డ సినిమాలు ఎప్పుడు తీశారు గనుక' అని ఓ జోక్ పారెయ్యటం కింద సంతకం మాత్రం విధిగాపెట్టటం.

'ఏవండీ! మీ సమీక్షలిలా వుంటున్నాయి. ఒకసారే కంపోజ్‌చేసి పునర్ముద్రణలు చేస్తున్నారా?' అని మీరు అడుగుతారనుకోండి.

"మీకేం తెలుస్తాయి మా కష్టాలు? సమీక్ష బాగా రాయకపోతే ఎడ్వర్టయిజ్‌మెంట్లు రావు. అవి రాకపోతే ఆఫీసులో మా ఉద్యోగాలుండవు. మీకేం కబుర్లు చెబుతారు." అంటున్నారు సమీక్షకులంతా బెజవాడ, మదరాసు, హైద్రాబాదునించి ఏకగ్రీవంగా.

ఇదీ పరిస్థితి!

ఈ సమీక్షలు రాసే పని రవణకూడా చేశాడు ఉద్యోగధర్మం వల్ల. ఇంగ్లీషు, హిందీ, తెలుగు సినిమాల్ని సమీక్షించాడు. వాటిని మనం సమీక్షించుకుందాం!

రవణ తన బాణీలో కొన్ని పదాల్ని సృష్టించుకున్నాడు రివ్యూల కోసం. వాటినీ వాటితోపాటు నడిచే సరికొత్త భావాల్నీ పరిశీలించి సమీక్షా విధానం చూద్దాం.

"పెంద్యాల రాగేశ్వరరావు, కథాశివబ్రహ్మం, రసపట్టుదల, ప్రగతి 'ఛాయ', సినీ కథోచితం, దుస్సంకల్పబలం, బాక్సాఫీసు శాపము లేక వరము, పేకాటవికులు, చిత్రశుద్ధి, ప్రచారాహుగ్రస్తుడు, గైరుహాజరినామా, పెద్ద చిన్నది, చిన్న చిన్నది, జనరంజకంగారుగా, సౌవర్ణ సుందరీయాలు, రీలాతీతం, ఖర్చు రాయించటం, సరసభూపాలురు, జావ తెలుగు, క్రూరంగారావు, శృంగారంగారావు, మధురసముద్రం, దొంగల దొర, నీతి బీరకాయలు, సరిగమ ఘుమఘుమలు, ఆర్టిస్టులు."

పదాలలాగే వాక్యాలుకూడా సమీక్షలకోసం ప్రత్యేకంగా కొన్ని ప్రత్యేకించాడు రవణ.

"ఉన్నవాటిలో జానపదం ఫక్కీలో ఉన్నపాట ఒకటి బాగుంది. అందుకు పరిహారంగా ఆ పాటను చిత్రించిన విధం వికారంగా ఉంది."

"కథా, నాయకీ పరిపరివిధాల తిరుగంగా."

"కళని డబ్బులోకి తర్జుమా చేయడం."

"ఈ చిత్రాన్ని బాక్సాఫీసు సూత్రాల పెద్దబాలశిక్ష అనవచ్చు."

"అతడు వచ్చేలోగా ఏ భాషారానివాడు జర్మన్ శాస్త్రీయ గ్రంధాన్ని ఫ్రెంచి వ్యావహారిక భాషలోకి అనువదించేటంత వేగంతో కథానాయకుడు శిలగా తర్జుమా అవుతుంటాడు."



"చిత్రం సగం కదనం సగం కథనంగా ఆద్యంతం బ్రహ్మాండమైన సెట్‌లమీద డాన్సు చేస్తూ సాగిపోతుంది."

"ఉత్తరాదినా ఇందమ్మటాకూడా సెన్సారు సర్టిఫికెటుమీద తారీకు తప్ప విడిచి కొత్తదేదీ ఉండదనీ, ప్రొడక్షన్ ఖర్చు తప్ప విడిచి పెరిగిందేదీ ఉండదనీ ఆ తరహా చిత్రాలు చూస్తే అనిపిస్తుంది."

మెచ్చుకునే పట్టులలో "ఆయా ఘట్టాలలో ఫ్రేం కంపోజిషనులు ఫ్రేములు లేకుండా ప్రేక్షక హృదయాలలో చిరకాలం నిలిచే చిత్రాలు."

"ఆ దృశ్యం – ఓల్డ్ మాస్టర్స్ వేసిన త్రివర్ణ చిత్రాలను వివర్ణం చేసేదిగా ఉంది."

రవణ చిత్రాలను విమర్శించటం చాలా సున్నితంగాను, సుందరంగాను వుంటుంది. ఒక చిత్రంయొక్క దోషాలు ఆ సంవత్సరానికి సంబంధించి వుండచ్చు. సినిమా చరిత్రకి సంబంధించి వుండచ్చు – ఆ రకమైన ఇతివృత్తానికి సంబంధించి వుండచ్చు లేకపోతే ప్రేక్షకులకి సంబంధించి వుండచ్చు. రవణ విమర్శ అన్నిటినీ దృష్టిలో పెట్టుకుని సమగ్రంగా సాగుతుంది. ఈ విమర్శలు అచ్చయితే ఆ పుస్తకం నిర్మాతలకు, చిత్ర విమర్శకులకు నిత్య పాఠ్యగ్రంథం కాగలదు.

"కృష్ణుడ్ని గురించి నాటికీ నేటికీ తుదీ మొదలూ పసిగట్టాలని చాలామంది తిప్పలు పడుతూనే ఉన్నారు ఆ రెండూ ఉండవని తెలిసినా – ఏ మాటకామాటే చెప్పుకోవాలి, ఋషుల తరవాత ఈ విషయమై గట్టిగా ప్రయత్నం చేసింది సినిమావాళ్లే."

"కృష్ణుడి నోట్లో భూగోళం (ఆస్ట్రేలియా ఇండియా వగైరా మ్యాపులతో) ఉండును."

"లోకోక్తులు పాలవంటివి. వాటిలో నీరు కలపలేదు. కలిపితే ఎలా తయారవుతాయో తెలుసుకోవాలంటే 'ప్యాసా' చిత్రాన్ని చూడవచ్చు."

"ఈ చిత్రంలో కథ గురించి మటుకు మనం ప్రాణాలుగ్గబట్టుకు కూర్చోనవసరంలేదు. తరవాత ఏం జరుగుతుందన్నదానిపై పెద్ద ఎత్తున పందాలు వేసుకోనక్కరలేదు."

"ఈ చిత్రం చూసి కథాప్రకారాన్ని మీరు పసిగట్టి సరిగ్గా చెప్పగలిగితే కొవ్వలివారు అది ఆధారంగా మరోనవల వ్రాయగలరు."

"ఆర్సన్ వెల్స్ అభిమానులకు కూడా ఈ చిత్రం చూస్తే సిగ్గేస్తుంది. చెత్త చిత్రాలు తీసే సామర్థ్యం, హక్కుగలవారు అనేకచోట్ల ఉన్నారని ధైర్యం కలుగుతుంది."

"షమ్మీకపూర్ ఆ ఛాయల్లో తిరుగుతూ గంతులు వేస్తున్నా ఆమె రాణించ గలిగిందంటే అది గొప్ప విషయం అనుకోవాలి."

సినిమాల్తీసేవాళ్లు, చూసేవాళ్లు కూడా పదికాలాలపాటు పాతిక సినిమాలపాటు గుర్తుంచుకోవలసిన వాక్యాలు కొన్ని దొరుకుతాయి ఈ సమీక్షల్లో.

"అసలు తెలుగు చిత్రాలలో నాయకుడు చిరంజీవి రవికి ఎప్పుడూ ధోకా ఉండదు.

మతిపోవడం వంటివి జరిగినపుడు ఊచిపుచ్చుకు చెంపకాయ కొడితే స్మృతి రావచ్చు. అతగాడు నిలుచున్న చోటుకు కాస్త అసింటా పిడుగు పడితే రావచ్చు, లేదా బుడగపేలినా రావచ్చు. ఇంకేదేనా కారణం కావచ్చు."

"భారతీయ సతికి భర్తతోడిదే లోకం – బి.ఏ. ప్యాసైనాసరే."

"ఒక విషయాన్ని కళాదృష్టితో చూచి చూపించినపుడు, భూతద్దం ఉపయోగించడం, అతిశయోక్తులు విరివిగా వాడడం పరిపాటే. కాని దానికైనా, ప్రాతిపదిక కట్టుదిట్టంగా ఉండాలి."

జయభేరి చిత్రం అత్యుత్తమంగా ఉందని చెబుతూ భారతం ధర్మ శాస్త్రజ్ఞులకు ధర్మశాస్త్రంగాను, ఆధ్యాత్మ నిధులకు వేదాంతంగాను, నీతి విచక్షణులకు నీతిశాస్త్రంగాను, కవి వృషభులకు మహాకావ్యంగాను వగైరా వగైరాలకు వగైరా వగైరాగాను కనబడుతుందని చెప్పిన పద్యాన్ని అనుకరిస్తూ మెచ్చుకోటంవల్ల ఆ చిత్రం యొక్క గొప్పతనంతో పాటు సమీక్షకుని సాహిత్యప్రజ్ఞ కూడా ప్రస్ఫుటంగా కనబడుతుంది.

"సంగీత ప్రియులు సంగీతచిత్రం అనవచ్చు. సాహిత్యాభిమానులు దీని ఘనత మల్లాది శాస్త్రిగారిదీ, ఆత్రేయదీ అనవచ్చు. చలనచిత్ర కళాభిమానులు సి.పుల్లయ్యగారు తీసిన ఉత్తమోత్తమ చిత్రం అని పొగడవచ్చు. నటనమీద గురిగలవారు ఇది పూర్తిగా నాగేశ్వరరావు చిత్రం అనవచ్చు."

సాంఘికమైనా, జానపదమైనా, పౌరాణికమైనా – అది హిందీలో వున్నా, ఇంగ్లీషులోవున్నా, తెలుగులోవున్నా ఉత్తమచిత్రం అయినప్పుడు అందులోని ప్రత్యేతకలన్నీ పట్టి పట్టి చూపిస్తాడు రవణ.

### చార్లీ స్పెషల్

చార్లీచాప్లిన్ నిర్మించిన లైమ్‌లైటు చిత్రాన్ని సమీక్షిస్తున్నప్పుడు సమీక్షకుని రచన ఆనందంతో పులకించిపోయినట్లు, సినిమాలో ప్రతి ఫ్రేమూ కళ్ళకు కట్టినట్లు, ప్రతి 'సంగీతపు ముక్క' చెవులకి వినబడుతున్నట్లు సాగింది. చాప్లిన్ గురించి, మూకీల గురించి, టాకీలగురించి చారిత్రకమైన అభివృద్ధిని చెబుతూ,



"రాజకీయ రంగు హంగుటద్దాలలోంచి కరుణాకరుడు చాప్లిన్‌ను 'అరుణా' కరుడుగా చూడబోయిన మెకార్థీలు అతడిని (అమెరికన్ కమిటీ) రాజకీయ సంబంధిగా బంధించబోయారు."

అన్న వాక్యంలో కళాకారుని ఉన్నతిని, సమాజం సంకుచిత దృష్టిని ఒక్క మాటలో చెప్పగలిగాడు రవణ.

"బేస్‌వయొలిన్ క్రింద షడ్జమంలో ఆగుతున్నప్పుడు టాప్‌వయొలిన్ పై పంచమంలో ఆరంభించి సాగిపోవడం – పిందె పుట్టడంతో పువ్వు వాడిపోయి రాలిపోవడం ఈ చిత్రంలో ముఖ్య సన్నివేశం."

అన్న వాక్యం రవణ నిశిత పరిశీలనకు, సమీక్షకుడి కుండాల్సిన సమగ్ర విజ్ఞానానికి, సమీక్షావిధానానికి నిదర్శనం.

ఇంత అందంగా ఇంత హుందాగా ఇంత హ్యూమరస్‌గా, అభిమానాలరంగు కళ్ళద్దాలు లేకుండా స్వచ్ఛంగా, స్పష్టంగా సాహిత్య స్పర్శతో సర్వాంగ సుందరంగా రాస్తూ, నిజాయితీని ప్రదర్శిస్తూ పరిశ్రమలోనివారికి నిర్మాణాత్మకమైన సూచనలిస్తూ చిత్ర సమీక్షలు రాసిన సినీ జర్నలిస్టు రవణ ఒక్కడే!

### సాటిలేని భమిడిపాటి

బాపుగీతలో వ్యక్తి వ్యక్తిత్వం ఎంత రూపు కడుతుందో రవణ రాతలో కూడా అంతగా బొమ్మ కళ్ళక్కడుతుంది. భమిడిపాటి గురించి రాసినా రేలంగి గురించి రాసినా ఆ వ్యాసాలు చదవగానే వారిద్దరి రూపాలు తుడిచెయ్యడానికి వీల్లేనంతగా మనసులమీద ముద్రపడతాయి.

హాస్య రచయితలలో (అసలా పదం తప్పు – ఆడ రచయితలు మగ రచయితలు అన్నంత తప్పు – లోకంలో రచయితలుంటారు తప్ప హాస్య రచయితలు, కరుణ రచయితలు, విప్లవ రచయితలు అని విడిగా వుండరు. ఆ పై పదం చెరిపెయ్యండి కొత్తదిరాసుకుందాం).

...రచయితలలో గురజాడ తరవాత రవణకి నచ్చిన రచయిత భమిడిపాటి కామేశ్వరరావుగారు. ఆయన పోయిన తరువాత 'సాటిలేని భమిడిపాటి' అని రవణ రాసిన ఈ వ్యాసం భక్తిపూర్వకంగా ఘటించిన అక్షరాంజలి. సారస్వత నీరాజనం.

"చంద్రుడూ, వెన్నెలా కనిపించి అనిపించినంత అన్యోన్యంగా బిరుదులూ వాటితాలూకు భర్తలూ తటస్థపడటం అరుదు.

ఒహ గొప్పవాడూ, తెలుగుదనమూ ఏర్పాటులో కలిసిపోయి నప్పి ఒప్పే రెండు తెలుగుమాటలు హాస్యబ్రహ్మ, భమిడిపాటీను. బిరుదుల్ని సామాన్యులు ధరిస్తారు.

మాన్యులు భరిస్తారు. ఈ రెండో కోవలో మొదట నిలబడగలవారు కామేశ్వరరావుగారు..."

"ఆయన హాస్య రచయిత మాత్రమేననీ అనుకునేవాడు – విశ్వనాథ సత్యనారాయణగారి మాటలలో వట్టి తెలివితక్కువవాడు. ప్రేమ, ఆపేక్ష, ఆవేదన, వాత్సల్యం ఉండడంవల్లనే హాస్యంలో మాట మాటకూ కండపుష్టి కలుగుతుంది."

"తన జాతిపట్ల తనకుగల అపేక్షకీ, ప్రేమకీ, గౌరవానికీ, గర్వానికీ, లజ్జకీ, దానికోసం ఆయనపడ్డ బాధకీ ఆయన రచనలన్నీ అక్షరానువాదాలు."

భమిడిపాటి పట్ల ఇంత గౌరవం వెలిబుచ్చాడు రవణ. నాలుగు మాటల్లో ఆయన గొప్పతనం ఇంత స్పష్టంగా క్లుప్తంగా చెప్పగలిగాడు. అంత ఎత్తున నిలబెట్టి ఆయన వ్యక్తిత్వానికి జోహారులర్పించాడు.

తెలుగువారు సామాన్యంగా ఒకర్ని, ముఖ్యంగా తెలుగువాడ్ని మెచ్చుకోరు. ఒక రచయిత మరో రచయితని మెచ్చుకోడు. తప్పనిసరై గురజాడ, భమిడిపాటి లాటి వాళ్లు ఎదురైతే 'పర్లేదు బాగానే రాస్తారు. హాస్యం రాశారు. నవ్వుకూడా వస్తుంది అనగలరు. భమిడిపాటి విషయంలో అక్షరాలా ఇదే జరిగింది. అందుకే హాస్యబ్రహ్మ అని బిరుదిచ్చి ఆయన్ని శాయశక్తులా అవమానించారు ఆంధ్రులు. రచయిత హాస్యం రాసినా మరోటి రాసినా తనదేశం, తనజాతి, తనభాష అని తపనపడతాడు. మానవతను ఆరాధిస్తాడు. ధ్యానిస్తాడు. కవిత్వంద్వారా సాధిస్తాడు సందర్శిస్తాడు. అలాటి ఉత్తమ రచయితలందర్నీ మహా కవులని సన్మానించుకోవాల్సిందే. వచనం రాసినా పద్యంరాసినా వచనపద్యం రాసినా 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' అని ఒక్క పాటరాసినా! ఆ దృష్టితో (తెలుగువా రేనాటికైనా చూడగలిగితే) భమిడిపాటి మహాకవి!

ఆయన గురించిన వ్యాసాన్ని ముగిస్తూ రవణ రాసిన చివరి వాక్యాలు చూస్తే ఒక వ్యక్తికి మరొక వ్యక్తిపై, శక్తిగల రచయితకి మరో రచయిత శక్తిపై ఎంత గౌరవం అభిమానం, ఆత్మీయత, అనురాగం ఉంటాయో తెలుస్తుంది.

"అద్దెకొంపని ఖాళీచేసి వెళ్ళినా ఆ మనిషిలో ఈ అరవైఏళ్లూ బస చేసిన మనీషి – మనందరికీ అర్థమైన మనని అలరించిన మనకోసం బాధపడిన వ్యక్తి – భమిడిపాటి కామేశ్వరరావుని గాని 'కాలంపోయినా, నిలిచే ఆయన మాట'నిగాని తెలుగునాట ఏనాటికీ ఏదీ ఏమీ చెయ్యలేదు..."

**రేలంగీ – వెంకటరామయా**

"అతనిలోని తపస్సూ, ఎప్పుడూ ఎదటివాళ్ళను సంతోషపెట్టాలన్న ప్రగాఢమైన ఆకాంక్ష, నిన్నటి విట్టు రేపు వెయ్యకూడదన్న నియమం– ఇవే రేలంగి నూరుచిత్రాలు



మనడానికి కారణం; ఇంకో నూరు చిత్రాలలో జయప్రదంగా వెలగడానికి కూడా అవే కారణం కాగలవు."

జర్నలిస్టు రవణ రేలంగీ–వెంకటరామయ్యా వ్యాసం రాయడానికి కూడా అవే కారణాలు. ఆ వ్యాసాన్ని ఏదో కాలక్షేపానికో, పేజీలు నింపడానికో 'మీ మీద ఓ వ్యాసం రాశాను సార్!' అని చెప్పడానిక్కాకుండా తెలుగుదేశం సగర్వంగా 'మంచి నటుడ'ని చెప్పుకోదగిన నటుడిపై సగర్వంగా రాసింది.

టెంపరరీ వాల్యూ, లైట్‌స్టఫ్ అని సామాన్యంగా సామాన్య జనులనుకోదగిన ఈ వ్యాసంలోనూ "స్వయంపాకం (నవ్వుకోడం, నవ్వించడం, నవ్వడం), 'కారు' కూతలు, 'పేరు' వాల్యూ, సెన్సార తాపత్రయం," వంటి మాటల్ని సృష్టించటం మరచిపోలేదు రవణ.

"జీవితంమీద స్వయంగా ఎగరడం ఆరంభించాడు."

"ప్రసాదాలూ చీవాట్లు తింటుండేవాడు."

"అప్పిచ్చువాడు కనబడలేదు, కనబడ్డవాడు అప్పివ్వలేదు."

"పాతాళ భైరవి వంటి చిత్రాలు పేరులో పెట్రోలు పోశాయి."

"కొన్ని చిత్రాలలో అతని పాత్రకు కథతో చుట్టరికం లేకపోవడం."

మొదలైన వాక్య రచనా విన్యాసాలను చేయటం రవణ మానలేదు.

ధగధగమని కిరీటాలూ, రంగులూ అవీ చూసి గుమ్మైపోయాడు రేలంగి..." అని వాక్యాన్ని 'కట్' చేసి ఫ్రేమ్ మార్చగానే......

"ఛ ఛ నువ్వు నాటకాలు వెయ్యకూడదు. వాళ్లు మర్యాదస్తులు కారు. వాళ్ళతో కలిస్తే నీకెవరూ పిల్లనివ్వరు. పెళ్ళికాదు తెలిసిందా" అన్నారు రామదాసుగారు మర్నాడు.

అన్న సంఘటన కథనం సినిమాటిగ్గానే వుంటుంది.

దిగుళ్ళను తీసిపారేసి, కష్టాలను తన ప్రవృత్తులను, జన ప్రవృత్తులను మటుకే తీసిచూసి ఆనందించడం అపుడూ యిపుడూ కూడా రేలంగికి అలవాటే. అదే హాస్యగాడిని తయారుచేస్తుంది. అదే వెంకట్రామయ్యలోంచి రేలంగిని తయారుచేసి యిచ్చింది."

'అదేకాదు. సి. పుల్లయ్యగారూ, కె.వి.రెడ్డిగారుకూడా–" అంటాడు రేలంగి.

అన్న కథనంచూస్తే రచయిత తను వ్యాసం రాయదలచుకున్న వ్యక్తుల సమాచారం, వాళ్ళతో చేసిన సంభాషణ ఎంత పొదుపుగా వ్యాసం అంతటా పేర్చుకుంటూ ఒకరకమైన ఆసక్తి, ఉత్సుకత కలిగేట్టు రాస్తున్నాడా అనిపిస్తుంది.

"బాక్సాఫీస్ హిట్' అన్నమాటకి సినీవర్గాలవారు ఆర్ ఇ ఎల్ ఎ ఎన్‌జిఐ అని స్పెల్లింగు చెబుతున్నారు."

మంచి వ్యాస రచయితకి స్పెల్లింగు ఆర్ ఎ వి ఎ ఎన్ ఎ అని రాయాలనిపిస్తుంది.

**తెలుగు వెలుగు**

వారపత్రికలో 'తెలుగు వెలుగులు' శీర్షికకి రవణ రాసిన వ్యాసాలు వ్యాసరచనకు వరవళ్లు. ఒక వాక్యంలో రాస్తున్న వ్యక్తి స్వరూపాన్ని స్వభావాన్ని వ్యక్తం చెయ్యటం, ప్రతివ్యాసం మనసుని ఆకర్షించేలా, ఆకట్టుకునేలా కొత్తగా ప్రారంభించటం, తెలుగువెలుగుకి ఏమాత్రం క్రీనీడ కనబడినా దాన్ని గుర్తుచేసి అది తొలగించుకుంటే బావుండునని ఆశపడటం ఈ వ్యాసాల ప్రత్యేకత.

**భానుమతి**

'ఆయాసం లేకుండా హాయిగా, శాటిన్ దారంమీద మంచి ముత్యంలా సాఫీగా, కొండమీద వాగులా చలాకీగా ప్రవహించే మధురగానం ఆమెకు అమూల్యమైన కంఠాభరణం.'

**కన్నాంబ**

'గ్లిసరిన్ లేకుండా కడవలకొద్దీ కన్నీళ్లు కురిపించగల తార అని మటుకే సినీ మనుషులు కన్నాంబను ఒకప్పుడు మెచ్చుకునేవారు. తరవాత కొన్నాళ్ళకి తెలిసింది గ్లిసరిన్ లేకుండా తను కంటనీరు పెట్టడమేకాక వేలాది ప్రేక్షకులను శోకావహుల్ని చేయగల ప్రజ్ఞ ఆమె సొత్తు అని అందరూ గ్రహించారని. ఆ తరవాత ఇంకొకటి తెలిసింది. కన్నాంబ కోపం నటిస్తే కథలో పాత్రలేకాక, సినిమా తీసేచోట సాటి నటీనటులూ సినిమా ప్రేక్షకులు కూడా భయపడతారనీను. తరవాత మరోటి తెలిసింది. కన్నాంబ మాతృవాత్సల్యం ప్రదర్శిస్తే ముగ్ధులు కాని ప్రేక్షకులుండరు అని.'

**బి.యన్.రెడ్డి**

'చలనచిత్ర నిర్మాణంలోని సర్వాంగోపాంగాలూ తన 'ఊహాచిత్రం'లో అందమైన రేఖలుగా, తను వినిపించే పాటలో స్వరాక్షరాలుగా ఇమిడేవరకూ, ఆకుమాటు పిందెలా, తల్లిచాటు బిడ్డలా, కృష్ణుడితో మురళిలా అమరేవరకూ స్వరానుస్వరాలలా, వాగర్థాలలా ఏకమయేవరకూ బి.యన్. అహోరాత్రాలూ పడే క్షోభ తపస్సే అనాలి'.

**ఎల్.వి. ప్రసాద్**

'నవ్విన ఊళ్లే పట్నాలవుతాయన్న నానుడి నీరసించిపోతున్నపుడల్లా ఒక ప్రజ్ఞాశాలివచ్చి దాన్ని ఆదుకుని ఆ మాట నిలబెట్టి 'ఇది ఉట్టి సామెతే'నని నిస్పృహ



చెందేవారికి ధైర్యం చెబుతూ ఉంటారు.'

**నాగయ్య**

'వెలుగుతున్నంతసేపు తార, వెలుగు తగ్గగానే ప్రమిద. ఈ మాట చలనచిత్ర రంగంలోని నటీనటులకు వర్తించినంతబాగా మరెవ్వరికీ వర్తించదు. కాన అప్పటికి ఇప్పటికి ఒకే తీరుగా ప్రకాశిస్తూ, యథాశక్తిగా వెలుగును తెలిగిస్తూ, ధ్రువతార అనిపించుకున్న నటుడు నాగయ్య.'

**రాజేశ్వరరావు**

'అనురాగ మనురాగాన్ని భువనమోహనంగా ప్రస్తరించి లతాంత లలితాలైన స్వరాలతో, ఉషఃకాలపు లేతరంగులతో మనోహరమయిన రూపకల్పనచేసి చూపిన సంగీత చిత్రకారుడు రాజేశ్వరరావు.'

**కె.వి.రెడ్డి**

'కె.వి. ముక్కుకు సూటిగాపోయే మనిషి. అయితే కె.వి. గడుసువాడు కాబట్టి బయల్దేరేముందు ముక్కును బాక్సాఫీసుకు గురిచేసి పెట్టి అప్పుడు దాన్ని పట్టుకుని సూటిగా వెళ్ళిపోతాడు.'

**సదాశివ బ్రహ్మం**

'తలా తోకా చటుక్కున పోల్చుకుందుకు వీల్లేనివాటిలో నిత్య శంకితుని భావాలూ, నూలుపోగూ, వానపాములూ, రెండుజడల పిల్లా, కొత్త కార్లూ వగైరా చరాచర పదార్థాలతోపాటు చెప్పుకోతగ్గ మరో జడపదార్థం తెలుగు సినిమా కథ అంటారు. అలాగే మిథ్యావాదాన్ని బలపరిచే ఉదాహరణలలో ప్రబంధనాయికల నడుమూ, ఎన్నికల వాగ్దానాలలో నిజాయితీ, అవకాశవాది నిశ్చితాభిప్రాయం, తెలుగు సినిమాలో కథ చెప్పుకోతగ్గవంటారు.'

**సి.యస్.ఆర్**

'అన్ని రంగాలలోను అజేయుడైన శ్రీ ఆంజనేయులు దర్శకుడుగా వేలుపెట్టి వెంటనే వెనుకకు తీసుకొన్నారు. పరిమితి తెలుసుకుని, ఉన్న పరిధిలో ఉజ్వలంగా ప్రకాశించ యత్నిస్తున్న విజ్ఞుడు ఆయన.'

ఈ వ్యాస పరంపర రచనకు ఒకోరంగానికి ఒకొకర్ని ఎన్నుకుని రవణని సినిమావాడిగా జమకట్టి సినీవ్యక్తులపైనే వ్యాసాలు రాయించారు. రవణ రాజకీయ సాహిత్య రంగాల్లోని వ్యక్తులపై రాయకపోవటంవల్ల తెలుగు పాఠకులు ఏం పోగొట్టుకున్నదీ ఒక్కసారి ఈ వ్యాసాలన్నీ చదివితే స్పష్టంగా తెలుస్తుంది.

## ఫిలింక్రి‘టీక’

ఫిలిం పరిశ్రమమీద రాసిన వివిధ వ్యాసాలతోపాటు ‘హాస్యనటులు’ అని రవణ రాసిన పెద్దవ్యాసం పుస్తకరూపంలో రావలసినంత ఉత్తమంగా వుంటుంది.

కామెడీల పుట్టుకదగ్గర్నించి మొదలుపెట్టి ‘కమెడియన్స్’ చరిత్ర తొలినుంచి నేటివరకు హాలీవుడ్డునించి ఆంధ్ర హిందీ చిత్రాలవరకు రచించాడు రవణ. అందులో మంచితోపాటు చెడ్డ చెప్పటం వుంది. పరిశోధన వ్యాసంలాగా అధికారికమైన వాక్యాలతో ఎవరూ వేలెత్తి చూపలేనంత పరిపుష్టంగా విశిష్టంగా వుంది.

ఈ క్రిందివాక్యాలు ఓరగంట గమనించినా ఆ మాటలు నిజమని అక్షరాలా బోధపడుతుంది.

“అన్యదేశాలలో హాస్య చిత్రాలకు మార్క్సవిండర్ ఒకవిధంగా మార్గదర్శి.”

“చాప్లిన్‌తో హాస్యంలో కొత్తయుగం ఆరంభమైంది. హాస్యానికి గౌరవం ఉన్నతమైన స్థాయి లభించాయి.”

“చాప్లిన్ అనుసరణయోగ్యుడు కావచ్చుగాని అనుకరణసాధ్యుడు కాడనీ, అనన్య సామాన్య ప్రతిభాశాలి అనీ లోకానికి త్వరగా వెల్లడయింది.’

“చిరాగ్గానే వాటిని మీటి పారెయ్యబోతాడు. అవి లొంగకపోతే దెబ్బతీస్తే మొండిగా ఎదురు తిరుగుతాడు. శౌర్యంకన్న మొండితనం వల్లనే విజయం సాధిస్తాడు. ఈ ప్రాతిపదికమీద ఫీల్డ్స్ అద్భుతమైన హాస్యసన్నివేశాలు సృష్టించాడు.”

“నాజూకైన మూర్ఖత్వాన్ని వస్తువుగా వాడుకుంటూ బడ్‌అబాట్ లోకాస్టిలో లాకాసైలోలు పైకివచ్చారు.”

“అమాయికత్వానికీ, ఆకతాయితనానికీ జెర్రీలూయిస్ ఏజన్సీ తీసుకున్నాడు.”

“నాటికీ నేటికీకూడా హాస్యం సినిమాలో అక్కడక్కడ మజిలీలాగే ఉంటూవచ్చింది. కథాహాస్యం తీర్థం ప్రసాదం కలిసిన రీతే కలుస్తున్నాయి.”

“కొన్ని సినిమాలు చూశాక ఇళ్ళకుపోతూ ఇందులో జానీవాకర్ ‘శుద్ధదండుగ’ అనీ, రేలంగి ఎందుకు వేసినట్టా అనీ అనుకుంటూ ఉంటారు.”

“శివరావు ఉచ్ఛదశ కొచ్చేవరకు ఆయన సంభాషణలలో రెండర్థాల మాటలు మెండుగా ఉండడం మామూలు అయిపోయింది.”

“మంచి ప్రేక్షకుల సహనాన్ని ప్రేమనూ మన సినిమా నిర్మాతలూ, రచయితలూ ఒక్కొక్కసారి హాస్యనటులూ దుర్వినియోగం చేసుకుంటున్నారనిపిస్తుంది. వాడికి పేరుందిగా అని డబ్బిచ్చే నిర్మాతలూ, వీడు డబ్బిస్తున్నాడుగా అనుకుని పేరుగల నటులూ జాయింటుగా కుట్ర చేసుకున్నట్టు ప్రేక్షకులను నిరుత్సాహపరుస్తున్నారు.”



ఈ వాక్యాలవల్ల సినీ చరిత్రను రవణ ఎంత జాగ్రత్తగా అవగాహన చేసుకుని ‘ఎస్టిమేట్ చేస్తున్నాడో తెలుస్తుంది.

ఈ వ్యాసంలోకూడా ప్రాచీన, ఆధునిక సాహిత్య తత్వాలను స్పృశిస్తూ రచన చెయ్యటం కనబడుతుంది.

“వెనకటికో పండితుడు తెనాలి రామలింగడి కథలు విని, ‘పాండు రంగమహాత్మ్యంలో పొట్ట చెక్కలయేలా నవ్వించే ‘విట్’లు కుప్ప తిప్పలుగా ఉన్నట్టు ప్రకటించి నానా హైరానా పెట్టినట్టు ఈ రోజున రేలంగి ఫలానా వేషం వేశాడు కాబట్టి అతని ప్రతిమాటలో చేష్టలో హాస్యం ఉండితీరాలన్న అనుమానంతో నవ్వవలసిన స్థితిలో పడుతున్నారు కొందరు మంచివాళ్లు.” అన్నవాక్యం చదివితే రవణ ప్రాచీన కావ్యాలనే కాక వాటిమీద వస్తున్న ‘అప్డేట్ విమర్శల్ని కూడా పరిశీలించి అవసరమైనచోట్ల సినీవ్యాసాలలో (లైట్‌స్టఫ్) కూడా వాడుకుంటున్నాడని తెలుస్తుంది.

మార్క్స బ్రదర్స్ హాస్యం సర్రియలిస్టు ధోరణిలో ఉండటంబట్టి సర్రియలిస్టు సాహిత్య మార్గాన్నికూడా తోడుచేసుకుని ఈ వాక్యం రాశాడు రవణ.

“మనం వాళ్ళని చూసి నవ్వబోతే వాళ్ళు మననిచూసి తెల్లబోతారు. ఇందులో నవ్వేందుకేముందీ అని. ఈ విషయంలో అధివాస్తవికవాదులకన్నా అతివాస్తవిక వాదులు వీళ్లేననిపిస్తుంది. గోళీకాయమీద నిలబడి గడ్డిమేస్తున్న గుర్రంబొమ్మ మనకి అర్థంకాకపోతే ఆశ్చర్యపోతాడు సర్రియలిస్టు మననిచూసి జాలిపడతాడుకూడా. వాళ్ళలా పడిలేచినా మనం హర్షించలేము. కారణం వాళ్ళది పూర్తిగా వ్యక్తిగతమైన భావన. ‘వేపకాయంతవెర్రి’ అనిపిస్తుంది అర్థంకానివాడికి. ఆ భావాన్ని వాళ్లు మనలో కలిగించలేరు. అందుకే సర్రియలిస్టులు. అలా దీన్ని మనమూ హర్షించగలిగితే అది మార్క్స బ్రదర్స్ మార్క్ అవుతుంది.”

రవణ సినిమామీద రాసిన వ్యాసాలు చదివితే పాఠకులు సాహిత్యం గురించి, రాజకీయాల గురించి కూడా కొంత నేర్చుకోగలరు. రవణ వ్యాసరచనా విధానం అన్నిరకాల పాఠకులను ‘ఎడ్యుకేట్’ చేసేట్టుగా వుంటుంది.

## సినీసిలబసు

ఫిలింనిడివి, సినిమా కాపీకొట్టడం, పాతకథలు పట్టుకువేళ్లాడ్డం, పాత్రల్ని ఎస్టాబ్లిష్ చెయ్యలేకపోవటం, హడావడి సంగీతం, కొత్త ముఖాలు, సంగీతంలో కాపీరాగాలు–ఇలా ఎన్నో విషయాలమీద విపులంగాను శాస్త్రీయంగాను, నిర్మాణాత్మకంగాను చర్చిస్తూ సెటైర్‌ని, హ్యూమర్‌ని మిళాయించిన వ్యాసాలు రవణ సినీజర్నలిస్టుగా తన బాధ్యతను నెరవేర్చాడనేందుకు నిదర్శనంగా కనబడతాయి.

ఈ వ్యాసాలలో కూడా రవణ సృష్టించిన కొత్తపదాలు తారసపడతాయి.

"తెలుగు మీరిపోవటం, చికిత్స (ట్రీట్‌మెంట్) అష్టాదశ సమస్యలూ, బంగారు పిచికలు (మిలియనీర్స్) నటాళి, సినిమావతి, దిలీప్ కుమారుడు, మీనా కుమార్తె, అపాత్రం, ఫ్లస్‌మార్కు పాలాస్తి ప్రమాదాలు, కథ రాజుకోవటం, భ్రమదాలు."

ఈ క్రింద వాక్యాలు నాలుగూ పట్టుకుచూస్తే రవణ వ్యాసరచన శైలి ఎంత పక్వంగావుందో తెలుస్తుంది.

"సినిమా పాటలో అర్థం పర్థం వెతికి పసికట్టవచ్చు. ఆస్తినాస్తి సందేహం కలిగించే ప్రబంధ నాయిక నడుముగురించి ఆరాతీసి ఉందని నిర్ధారణ చేయవచ్చు. తీస్తున్న సినిమాలో కథ ఏదారిన పోతుందో ఊహించవచ్చు. దిలీప్‌కుమార్‌ని వేళకి సెట్‌మీదకి తేవచ్చు. సౌతిండియన్ మ్యూజిక్ ప్రొడ్యూసర్ల చేత బాంబేమ్యూజిక్ కాపీకొట్టడం మాన్పించవచ్చు. కాని–కాని.

–కాని ప్రజాభిప్రాయం, ఫలానా సరుకుంటే ప్రజలు ఈ సినిమాని చూస్తారు అన్నది నిర్ధారణగా చెప్పలేము."

సెటైర్‌ని తొడుక్కుని మరీ సరళంగా హాయిగా సాగే ఈ వచన రచనలో రవణ సాధించిన అలవోకతనంతోపాటు పరిశ్రమ మంచి చెడులను వెలుగునీడలను ఆకళించుకున్న తీరుకూడా కనబడుతుంది.

"దిన దిన ప్రవర్ధమానమైన సినీ పరిశ్రమ జీవితంలో గాఢంగా అల్లుకుంటుంది. దాని ప్రభావాన్ని తమ బాధ్యతను ఎరిగి, మిగతావారు కూడా వాటిని గుర్తించాలనేవారు ఈ విషయాలను శ్రద్ధగా ఆలోచించాలి."

"మనవి కాని సన్నివేశాలకు మన చిత్రాలలో చోటున్నపుడే మరొక దేశపు సంగీతంకూడా చోటు చేసుకోడానికి వసతి కలుగుతుంది."

"అబద్ధం దగ్గర్నించి ప్రబంధంవరకు, అప్పు అడగడం దగ్గర్నించి అఖండంగా ఉపన్యసించడం వరకూ ఎలా చెప్పడం ఎక్కడ మొదలుపెట్టడం అన్నది పెద్ద ప్రశ్నగానే ఉంటూ వచ్చింది. దీన్నే కృత్యాద్యవస్థ అన్నారు."

"మూఢ నమ్మకాలకి వెనక హేతువాదం వెతుక్కొని ఆత్మవంచన చేసుకోడంలాటిది యిది."

"పరిశ్రమ పరిమాణం పెరిగినా ప్రమాణం ఆగిపోయింది."

ఈ వాక్యాలు ఆలోచించి రాసినవీ ఆలోచింపజేసేవీను!

"బాక్సాఫీసు తోకలు పట్టుకుని గోదావరి ఈదేవాళ్లు."



"అబూర్వ సిందామణి దగ్గర్నుంచి అంట్లుతోమే సెందామరై."

మొదలైన వాళ్ళనందరిని సానుభూతితో జాలితో ఓదారుస్తూ వాళ్ళని అవసరమైతే చీవాట్లేస్తూ 'మినిమమ్ గారంటీ' సూత్రాలు పురిలేని సూత్ర ప్రాయాలవుతున్నాయి అని నచ్చచెబుతూ 'కృత్యారంభానికి నాలుగైదు రీళ్ల ఖర్చు కానవసరంలేనినాడు చిత్రాలనిడివి వాటి ఖర్చులుకూడా తగ్గుతాయని సూచనలిస్తూ 'ప్రతి చిత్రం దేశానికిచ్చే సందేశాలు కోకొల్లలుగా వాచక పుస్తకాలలో నీతివాక్యాలలా నిర్బలంగా, నిరుపయోగంగా ఉంటున్నాయని వాపోతూ సూటిగాను, ఘాటుగాను రాసిన ఈ వ్యాసాలు పరిశ్రమ జీవులకు ప్రబోధాత్మకంగాను ఉపరిశ్రమచేయని జీవులకు కాలక్షేపంగాను సాగుతూ నేటికీ పచ్చగా కళకళలాడుతూ మళ్ళీమళ్ళీ చదివించే సరాగాలతో కూడుకొని వున్నాయి.

## ప్రమదావనం

జర్నలిస్టు రవణకి వనితావని శీర్షికకి కూడా వ్యాసాలు రాయక తప్పలేదు. సి.వి.వి. విజయలక్ష్మి పేరుతో యాభైఆరు ప్రాంతాన రాసిన ఈ వ్యాసాలు కూడా రవణ మార్కు వేసుకుని సాహిత్యాన్ని, సంప్రదాయాన్ని వదలిపెట్టకుండా సెటైర్‌ని, కొత్తపదాల వల్లెవాటుల్ని వేసుకుని పారడీ జరీ అంచుతో ధగధగా మెరిసిపోతూ వుంటాయి.

"పరధ్యానం జాతీయులు, చిరాకేశ్వరులు, బాలావ్యాకరణం, 'నై' తత్పురుష, మాట్లాట వెగటిస్తుంది" వగైరాలతోను

"చెప్పినట్టు వినకపోతే మా అత్తగారికి చెప్తాను జాగర్త అన్నారు. అప్పటికీ వినకపోతే ఖద్దరు చీరలూ బణార్సు చీరలు కట్టించి కాళ్ళకి కడియాలూ, గొలుసులు, ముక్కుకి నత్తు, పాపిటబంద్రీలూ, వడ్డాణం ఒంకీలూ చేయించి అవన్నీ పెట్టుకోమని ఫోటో తీయించి హాల్లో వేళ్ళాడకడతానన్నారు."

వగైరా వాక్య విన్యాసాలతోను వ్యాసాలు రాయటంతోపాటు సామాన్యంగా ఆడవాళ్లు వనితావని శీర్షికకి రాసే వ్యాసాలు అలా వుండకూడదని ఎత్తిచూపే పారడీ వాక్యాలుకూడా రాశాడు రవణ.

స్త్రీలు 'ఇది నా అభిప్రాయము' అని పదేపదే చెబుతారు, అభిప్రాయస్వామ్యం వుంచుకోవాలన్న తాపత్రయంతో. ఎలాగా ఆ అభిప్రాయాలు వాళ్ళవి కావు గనక అబద్ధం గోడకట్టినట్లుండాలి కాబట్టి అలా చెబుతారు. రవణకూడా ఈ వ్యాసాలలో 'నా అభిప్రాయము' అని పదే పదే రాయటం అలాటి రచనను అవహేళన చెయ్యటానికే!




# అనువాదాలు

### తెనుగుసేత

రవణ ఉద్యోగ ధర్మంవల్ల జూల్స్‌వెర్న్ రచించిన '80 రోజుల్లో భూప్రదక్షిణం' నవల అనువదించాడు. తరవాత నిరుద్యోగ ధర్మంవల్ల జేమ్స్. యం. బరన్స్ రాసిన 'జాన్ కెనెడీ జీవితచరిత్ర' అనువదించాడు.

ఈ అనువాదాలు కూడా చొరవగా తెనుగుమీరి చేసిన రచనలు. కథనంలోగాని, సంభాషణలలోగాని తెనుగునుడితప్ప అనువాదచ్ఛాయలు రేఖామాత్రంగాకూడా కనబడవు.



**80 రోజుల్లో...**

ఫిలియాస్‌ఫాగ్ "మితభాషి. ముభావంగా ఉండి సాధ్యమైనంత తక్కువగా మాట్లాడేవాడు. ఆ ముభావం ముభావంలా కనబడేదికాదు. ఇతగాడు రహస్యాల వల్మీకంలోదూరి కూర్చున్నాడనిపించేది, కాని అతని జీవితంలో దాపరికం ఏమీలేదు.

అతనికి సంసారంబెడద లేదు. ఉద్యోగ వ్యాపారాల గొడవలు లేవు. సమాజంలో సభ్యుడిగా సాటివారితో ఇచ్చి పుచ్చుకోడాలూ లేవు. జీవితంలో ప్రతివాడికీ కాస్తోకూస్తో మరొకడితో ఒరిపిడి తప్పదని అతనికి తెలుసు. అందుకే అతను ఎవరికీ ఢీకొట్టడు. పూసుకుతిరగడు. రాపిడికి ఆస్కారం ఇవ్వడు."

"ఎర్రసముద్రం సరసత్వానికి పెట్టింది పేరుకాదు. అది తరచుగా అల్లరిపెడుతూ ఉంటుంది. నిజానికది పెద్ద సముద్రంకాదు. సంకుచిత సముద్రంలాంటిది. బుద్ధీ అంతే. ఇటు ఆసియానుంచిగాని, అటు ఆఫ్రికా నుంచిగాని కాస్త ధాటీగా గాలివీస్తే సముద్రం ఎగిరెగిరి పడుతుంది. దాంతోపాటు వోడకూడా."

"దురదృష్టవంతురాలు అయూదా మరణానికి వేళ కావచ్చింది. ఒక్కసారిగా భారీతూర్యానాదాలతో దిక్కులు మారుమోగాయి. నిద్రా ముద్రితమైన జనానీకం జాగృతం అయింది. పునరుజ్జీవనంలా ఉంది ఆ దృశ్యం."

"సముద్రం అతలాకుతలంగా వుంది. తప్పతాగినవాడిలా తూలుతూ, తెప్పలా ఎగిరిపడుతూ ఊగుతూ నడుస్తోంది రంగూను. ప్రయాణీకులక్షోభ, కోపం ఇంతంతనరాకుండా ఉంది."

"ఆ దెబ్బకి అతని సిల్కుటోపీ చితికి, దానిలోపలి శిరోపరిభాగం ఒక్కమాటు ఉత్సాహంగా పెద్దగడ్డలా పొంగింది. దానాదీనా 'సిల్కు హేట్' సాదా టోపీగా ఆకారం ఫిరాయించుకుంది."

ఈ అనువాదవాక్యాలలో తెలుగు స్వతంత్ర రచన చేసేప్పటి తూగు వుంటుంది. ఎక్కువగా తెలుగు పదాలే తప్ప సంస్కృతపదాల జోలికి పోదు రవణ, సన్నివేశానికి అవసరమైతే తప్ప.

ఈ రచనలోకూడా తన శైలికి అనుగుణమైన పదసృష్టి చెయ్యకపోలేదు.

"ఈరోజున 'బ్రిటనీకృతం' లేక పాశ్చాత్యం అయిపోయిన ఈ దేశాన్ని చూచి."

"ఒక అమెరికన్‌లకే చెల్లేటంత ధాటీగా ఆరంభమై 'అంతన్నర' జోరుగా సాగిపోయింది."

ఈ వాక్యాలలో 'బ్రిటనీకృతం' 'అంతన్నర' రవణ శైలిని పట్టిస్తాయి.

## యాంటీ క్లాసికల్

సామాన్యంగా ఆంగ్లానువాదకులు గ్రాంధికాంధ్రంలోనే అనువాదం చెయ్యటం అలవాటు చేసుకున్నారు. రవణ సరళసుందరమైన వ్యావహారికాన్నే అనువాదవాహికగా ఎన్నుకొన్నాడు. కాని చమత్కారానికి రెండు చోట్ల గ్రాంధిక ప్రయోగాలు కనబడతాయి కావాలని చేసినట్లు.

“యజమానిని గౌరవించవలెను అనేతత్వం అతనిది.”

ప్రార్ధనలన్నీ సంస్కృత శ్లోకాల్లోనే జరగాలన్న నియమం ఉన్నట్లు నీతి వాక్యాలన్నీ గ్రాంధికంలోనే ఉండాలని మన వాచకపుస్తక రచయితల అభిప్రాయం. అందుకనే రవణకూడా ‘యజమానిని గౌరవించవలెను’. అంటాడు ఆ సంప్రదాయాన్ని పాటిస్తూ. అలాగే ఉపశీర్షికలు కూడా గ్రాంధిక భాషలో పెడతాడు ప్రాచీనశైలిని అవహేళన చేస్తూ పారడీ చెయ్యడానికి.

ఇందులో “అయుదా అపహరణము” అనే ఉదంతం వూహించుకుని డిటెక్టివ్ ఫిక్స్ కన్నకలల్లో ‘అయుదా అపహరణము’ అలాటి ఉపశీర్షిక.

## చొరవ

కధనంలోనే కాకుండా సంభాషణల్లోకూడా రచయిత హాయిగా సాగే భాషరాసి స్వతంత్ర రచన అనే భ్రమ కలిగిస్తాడు.

‘ఏం? వంతెన దాటొచ్చునంటారా?’

‘ఆహా! వంతెనమీదుగానే’

‘ఏదీ రైలుతోటేనంటారా?’

‘ఆహా! రైలుతోటే’

పాస్పార్తు గుడ్డప్పగించి ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటూ నిలబడిపోయాడు.

‘వంతెన కూలిపోయేలా వుందిగదయ్యా’ అన్నాడు కండక్టరు.

‘ఏం ఫరవాలేదు. రైల్ని గనక అది వెళ్ళగలిగినంత జోరుగానూ – ఫుల్‌స్పీడులో వదిలేస్తే వంతెనదాటే అవకాశాలు కొంతవరకు లేకపోలేదు’ అన్నాడు ఇంజనీరు.

‘నీ అసాజ్జెంకూల’ అని గొణుక్కున్నాడు పాస్పార్తు.

## కెనెడీ

‘జాన్‌కెనెడీ జీవితచరిత్ర’ అనువాదంలో రవణ పెట్టిన శీర్షికలు, ఉపశీర్షికలు రచనలోకి వెళ్లే ఉత్సుకత కలిగిస్తాయి.



‘అగ్రసింహాసనంపై..., బంగారం పిచికేకాని...., ధైర్యదర్శనం, ఉభయతారక సాధనం’ అన్నవి ప్రధాన శీర్షికల పేర్లు.

‘రాజకీయ చతురంగం, ఇంట గెలిచినవాడు, రాజకీయ సంప్రోక్షణ, పెద్దవాడైన కుర్రకుంక, లాకేత్వం దానికొమ్ము లేనిచోటు, ప్రేమాయణం, గోడమీదకుర్చీ, ధైర్యం తాత్పర్యం’ ఇవి ఉపశీర్షికల పేర్లు.

“ఆయనకు తనయెడల ఎంత నిర్మమతవుందో, బలాబలాలను అంచనా వేయడంలో ఎంత నిశిత దృష్టివుందో, సమయోచితంగా వ్యవహరించడంలో ఎంత నైపుణ్యంవుందో పరిశీలకులు పలుసందర్భాలలో పరికించారు.”

“తూర్పుబాస్టన్ రాజకీయరంగం బీరకాయపీచు వతుగా చిక్కగా దట్టంగా అల్లుకుని ఉండేది.”

అభానికీ శుభానికీ కూడా నలుగురుకలిసే ఏ సందర్భం అయినా, ఏ స్థలం అయినా పదిమంది కలిసి రాజకీయ చతురంగం ఒకర్నిమించి ఒకరు చతురంగా ఆడేవారు.”

ఎగువసభ “రకరకాల దృక్పధాల ధోరణుల సమ్మేళన కేంద్రం. చురుగ్గా, కరుగ్గా, మృదువుగా, హుషారుగా, బద్ధకంగా, సందడిగా, కంగారుగా, నిదానంగా, గంద్ర గోళంగా, గజిబిజిగా ఉంటుంది. అందుకు విరుద్ధంగా దానికి సవాలులా పొగరుగానూ ఉంటుంది. ఆఖరుకు ఆ పొగరులోకూడా ఒక దర్జా, ఒక శోభ ఉన్నాయి.”

గద్యానువాదం యిలా పద్యంలా సాగితే, పద్యానువాదం మరింత సుందరంగా వుంటుంది.

**‘మిషనరీ శిక్షణపొందిన నౌరూ ద్వీపవాసుల పాట –**

నన్నెంతో ప్రేమగా చూస్తాడు ఏసు
నాకు తెలుసు బైబిలు చెప్పిందీ ఊసు
సన్నకారు జీవాలన్నీ ఆ
సన్నుతుడి స్థిర చరాస్తులు..
నిర్బలుడా భయమువీడు; వేడు
నిను తప్పక కాపాడువాడు
నాకు తెలుసు నాకు తెలుసు ఏసు...”




## కథానాయకుడి కథ

**బాస్వెల్స్ లైఫ్ ఆఫ్ అక్కినేని**

జీవిత కథ రాయటం ఆత్మకథ రాసుకోటంకన్నా కష్టం. అందులోనూ జీవితకథ రాయటానికి సరిపడ్డ సమాచారం లేకుండా రాయటం అన్నది నిజంగా సాము చెయ్యటమే!

“1924 సెప్టెంబరు 20వ తేదీన తారాపథంలోగాని, చలనచిత్ర తారాపథంలోగాని పెద్ద సంచలనాలు కలిగినట్టుగాని, ఒకానొక కాబోయే గొప్ప నటుడి పుట్టుకను వ్యాఖ్యానిస్తూ 60 వాద్యాల ఆర్కెస్ట్రా నేపథ్య సంగీతం ఉద్ఘోషించినట్టుగాని ఎవరికీ గుర్తులేదు.”

గుర్తున్నట్లయితే నాగేశ్వర్రావు మిత్రులో బంధువులో అతను గొప్పవాడవుతాడని పసికట్టి భవిష్యత్తులో ముళ్లపూడి వెంకటరమణ అనే జీవిత కథకుడు పుస్తకం రాయటానికి వీలుగా ప్రతి సన్నివేశం ఫోటోలతో సహా జాగ్రత్తపెట్టేవారు.

అలా జరగకపోయేసరికి రవణ పదిమంది దగ్గర అక్కినేని జీవిత సత్యాలను సేకరించుకుని వాటిని చిత్రచరిత్ర అనే ఒరిపిడి రాయిమీద నిగ్గుతేల్చి జీవితకథగా రూపొందించుకోవాల్సి వచ్చింది.



ప్రపంచ ప్రఖ్యాతుడైన బయాగ్రఫర్ బాస్వెల్, జాన్సన్ జీవిత చరిత్ర రాయడానికి అతన్ని జీవితకాలంలో చాలాభాగం నీడలా వెంటనంటి వున్నాడు.

రవణకి అక్కినేనిని బాస్వెల్‌లా వెంటనంటి తిరిగే అవకాశం లేదు. కాని నాగేశ్వరరావు జీవితకథ రాయటానికి మరెవరికీ లేని అర్హత రవణకొకటుంది. అదే అతను జర్నలిస్టు కావటం. అందులోనూ, సినీ జర్నలిజానికో వరవడి దిద్ది పరిశ్రమలోని మంచిచెడ్డలు ఆకళించుకోవటం. జర్నలిస్టుగా అక్కినేని నటన విలువను తెలుసుకునే అవకాశం రవణకుంది. ప్రపంచ చలనచిత్ర చరిత్రగతి తెలుగుదేశంలో చలనచిత్రాలస్థితి ఒక పరిశోధకుని దృష్టితో దర్శించబట్టి ఆ చరిత్ర గ్రంథంలో నాగేశ్వరరావుకి ఎన్ని పుటలు కేటాయింపబడతాయో దానివిలువ ఏవిటో రవణ తేల్చుకున్నాడు. సినిమా నటనలో ఎక్కడన్నా లోపం కనబడితే అది ఎత్తిచూపినా ఏమనుకోని సహృదయత, విమర్శను ఆనందంగా స్వీకరించే ధైర్యం అక్కినేనికి వుందని గ్రహించాడు రవణ. సినిమాల్లోనే కాక జీవితంలోను ముఖ్యంగా సాంసారిక జీవితంలోను కనబడే వెలుగు నీడలు జీవితకథలో చిత్రించినా అభ్యంతరపెట్టని విశాలహృదయం అక్కినేనికి వున్నదన్న ధైర్యం వుండబట్టే ఈ జీవిత కథారచనకు పూనుకున్నాడు రవణ. ఇంత స్వాతంత్ర్యం సామాన్యంగా బయోగ్రఫర్‌కి లభించదు.

**ఒకటోరకం**

సినిమానటుని జీవితచరిత్ర రాయటం భారతదేశ చరిత్రలో తొలిసారి చేపట్టింది రవణ. చేపట్టడమే కాకుండా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఖ్యాతికూడా రవణదే. ఈ పుస్తకం తరవాత చాలామంది రచయితలు కొందరు సినీనటుల జీవిత చరిత్రలను వెలువరించారుకాని ‘కథానాయకుడు కథ’కు వచ్చిన పేరుప్రతిష్టలు, ఆదరణ మరేదీ పొందలేదు. ఈ ఫీల్డుకి సంబంధించినంతవరకు ఇదొక ‘క్లాసిక్’!

అందుకే ఈ జీవితకథనుకూడా ఒక మంచి నవలగా తీర్చిదిద్దాడు రవణ. ఎత్తుగడలోను ముగింపులోను, కథలోను, కథనంలోను పాత్ర చిత్రణలోను నవల లక్షణాలన్నీ సగర్వంగా సంపాయించుకుందీ రచన.

“ప్రతిభాశాలి జీవితంలా కళకళలాడుతోంది బెజవాడ రైల్వేస్టేషన్. బాక్సాఫీసు చిత్రం ఆడుతున్న హాలులా జనంతో కిటకిటలాడుతోంది. రైల్వే ప్లాట్‌ఫారంలాగే గంద్రగోళంగా ఉంది. ‘జనతా జనత’ బుక్ చెయ్యని సీట్లకోసం పరుగులు పెడుతున్నారు.

ఆ జనసముద్రం మధ్య ఒక చిన్న ద్వీపం. దానిమధ్య దీపంలా వెలిగిపోతున్నాడొక చిన్నవాడు.”

అని మొదలైన ఈ రచన

"ప్రతిభాశాలి జీవితంలా కళకళలాడుతోంది విజయవాడ రైల్వే స్టేషన్...

జనం సందడిగా పరుగులు పెడుతున్నారు బుక్‌చెయ్యని సీట్ల కోసం.

'బుక్ చేసిన సీటు నాజీవితం' అన్నట్టు ఒక పెట్టె దగ్గర ధీమాగా నిల్చున్నాడొక దీపంలాటి యువకుడు. అతనిచుట్టూ ఒక జనద్వీపం ఏర్పడింది.'

అని ముగుస్తుంది.

అన్ని రచనల్లాగే ఈ రచనకూడా చాలా 'ప్లాన్డ్'గా సాగిందనడానికి ఈ ఎత్తుగడ, ముగింపు చాలు.

చెయితిరిగిన చిత్రకారుని పనివాడితనం కనబడుతుందీ రచనలో. ఆరితేరిన దర్శకుడు ఫ్లాష్‌బ్యాక్ కథని ఎలా మొదలుపెట్టి ఎలా ముగిస్తాడో ఎంత మెత్తగా మనసుకు నచ్చేట్లుగా తీస్తాడో అంత టెక్నిక్ వుంది ఈ రచనలో.

ముఖస్తుతితో ప్రారంభమై బాలనటుడు, పిట్టకొంచెం, యూనివర్సిటీ విద్య, కథానాయకుడికథ, మృత్యుంజయుడు, ప్రేమకథలు, వివాహం, నటుడు, వ్యక్తి, అనే ప్రకరణాలతో రచనకో సమగ్రత ఏర్పడింది.

ఇది జీవితకథ. ఈ కథకు ముగింపులేదు. అందుకే చివరి ప్రకరణానికి 'మొదటి ప్రకరణం' అని పేరు పెట్టాడు రవణ. "ఇప్పుడు ఇంటర్వెల్‌కూడా కాలేదు. అందువల్లే ఈ పుస్తకానికి సంపూర్తిలేదు. దీనికి కథ ఆకారం లేదు. అయినది ఉపోద్ఘాతమే.

ఇది ఒకటో ప్రకరణం. 'నేర్చినదికాదు, నేర్వవలసింది చాలా వుంది. చేసిందికాదు చెయ్యవలసింది చాలావుంది.' అని అతను వినమ్రతతో అంటాడు.

అందువల్ల ఈ పుస్తకం ఈ వాక్యంకూడా అసంపూర్తిగా"

అని ముగించాడు రవణ ఈ పుస్తకాన్ని.

**చిత్రకథ**

'ముఖస్తుతి' ప్రకరణంలో హీరో ముఖస్తుతిని రచయిత డైరెక్టుగా చెయ్యడు.

"ఫేసు బాగుండది. గాసులైటు లాగుండది... ఓర్నీ... అసలు పిలవటానికి నాకే బయవేత్తే...' అన్నాడు రాములు. ఇప్పుడతను చుట్టూ వున్న జనాన్ని పట్టించుకునే స్థితిలో లేడు.

జనం అప్రయత్నంగా ఆ ముఖంకేసి పరిశీలనగా చూశారు."

అప్పుడు జనంచూసిన ముఖాన్ని రచయిత వర్ణిస్తాడు. సినిమాల్లో హీరో లక్షణాల్ని ఎవరితోనో చెప్పించి అల్లాంటి లక్షణ లక్షితుడైన హీరోని గుర్రంమీద దూకుడుగా రానిస్తూ చూచుకోండి అలా వున్నాడా లేడా అని పరిచయం చేస్తున్నట్టుంటుంది



రవణ రచన.

ఘంటసాల బలరామయ్యగారనుకున్నారు–

"ఇతను మన పిక్చరులో హీరోవేస్తే బాగానే ఉంటాడు' అని.

అలా అనుకుందికి ఆయనకి అధికారం ఉంది అర్హతా ఉంది.

ఆయన సినిమా నిర్మాత, డైరెక్టరు. ప్రతిభాపిక్చర్స్ అధిపతి. పేరు ఘంటసాల బలరామయ్యగారు...

అని బలరామయ్యగారి క్లోజప్‌లో ఛాప్టరు ఫ్రేము కట్ చేస్తాడు రవణ. తరవాత ఫ్రేమ్‌లో

'బాబూ..ఇలారా' అన్నారు బలరామయ్యగారు.

అల్లరి కుర్రాడు నాగేశ్వరరావు ఆయనకేసి వింతగాచూసి దగ్గరకు వచ్చాడు."

అంటే ఫ్రేమ్‌లో యిద్దరూ కనబడతారన్నమాట.

బలరామయ్యగారి క్లోజప్‌లో ఒకఛాప్టరు ముగించి బలరామయ్య గారు అక్కినేని ఫ్రేమ్‌తో మరో ఛాప్టరు మొదలుపెట్టటం రవణ సినిమా కథనానికి నిదర్శనం.

వాక్యాలలో కూడా సినిమా పరిభాషనే వాడాడు రచయిత.

"తినేవచ్చాను" అని ముక్తసరిగా లాంగ్‌షాట్‌లో చెప్పి వెళ్ళి పడుకున్నాడు అక్కినేని"

నవలలోలాగే యిందులోకూడా పాత్రచిత్రణను పరిపుష్టంగా చేశాడు రవణ. నిజానికిది అసాధ్యమైన విషయం.

హీరో అక్కినేనితోపాటు అన్నపూర్ణ, మధుసూదనరావు మొదలైనవాళ్ళ వ్యక్తిత్వంకూడా సంపూర్ణంగా రూపుకట్టేట్లు రచన చేశాడు రవణ.

ముఖ్యంగా గూడవల్లి రామబ్రహ్మంగారి గురించి చెప్పింది చూడండి.

"రామబ్రహ్మంగారూ అతన్ని కొడుకులాగే చూసుకునేవారు. తాళం చేతులు అతనికిచ్చేశారు.

'నా బిడ్డ. నేను వీణ్ణి పెంచుకున్నాను' అనేవారు నలుగురితో.

తమ బంధువుల ఇళ్ళలో మంచి పిల్లనుచూసి పెళ్ళి చెయ్యాలని కూడా సంకల్పించారు.

పల్నాటియుద్ధం ఆరంభించిననాడు బాలచంద్రుడినిచూసి ఎంతో మురిసి పోయారాయన.

'వీడిచేత వెంగళరాయుడు, అర్జునుడు వేయించాలి. నేను వేయిస్తాను' అనేవారు.

బాలచంద్రుడినే సొంతం చూడకుండా కన్నుమూశారాయన...”

చెప్పదలుచుకున్న కథకు బలాన్నిచ్చే సంఘటనే ఎన్నుకున్నా ఆ సంఘటనకో సంపూర్ణత అందులోని పాత్రలకో సమగ్ర చిత్రణ ఇవ్వటం గమనించవచ్చు.

**పడుగుపేకలు**

జీవిత కథలో మంచివైపు మాత్రమే చూసి తలొంచుకు ముందుకు పోకుండా నీడలవైపు చీకట్లవైపు కూడా రవణ చూశాడు.

“మొత్తంమీద ఇంట్లో కలతలు ఒక ఘట్టంలో భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు తెచ్చేదాకా వెళ్ళాయి’ అని నిజజీవితం గురించి చెప్పినా

“సంసారం”లో హాస్యం కూడా నటించగలిగాడు. అందులో అతను చూపిన నిగ్రహం, స్వచ్ఛతా దరిమిలాను పెద్దవాడయ్యాక చూపడంలో దెబ్బతిన్నాడేమో అని కూడా అనిపిస్తుంది. పెళ్ళిసందడి వంటి చిత్రాలలో అతను కామెడీ చాలా చులకన అయినట్టూ, దాన్ని తను అవలీలగా పోషించి అవతల పారేస్తున్నట్టుగా తేలికగా తీసుకుని కొంత హద్దు మీరాడు” అని నటజీవితం గురించి చెప్పినా బయాగ్రఫర్‌గా రవణలోని నిజాయితీ కనబడుతుంది.

“తెనాలి రామకృష్ణలో మహాకవిగా పాండురంగ మహత్మ్య కర్తగా రామకృష్ణ కవిని వారు చిత్రించలేదు. చమత్కారి, రాజనీతివేత్త అన్నట్లుగా చూపారు. ఉన్న అవకాశాన్ని బట్టే నాగేశ్వరరావు నటించాడు. బాధ్యతగల నటుడు కాబట్టి ఈ అసమగ్ర చిత్రణకు అతనూ బాధ్యత పంచుకొనక తప్పదు.”

‘ఈ చిత్రాలలో నాగేశ్వరరావు సమర్థంగా నడపనివి, పొరబాటు చేసినవి మొండిగా బాగున్నాయి అనేవి కొన్ని లేకపోలేదు. ‘పెళ్ళినాటి ప్రమాణాలు’ చిత్రానికి ఆ రకంలో అకాడమీ బహమతి ఇవ్వవచ్చు.’

అనీ రవణ నిర్భయంగా చెప్పగలిగాడు.

రవణ రచన కవిత్వంలాగా సాగుతుందనటానికి దాఖలాలు ఇందులోనూ వున్నాయి.

“జీవితం అనుభవాల ఉలులతో పదిహేనేళ్ళుగా శ్రమిస్తూ చెక్కి మలుచుకున్న శిల్పం అది.”

“ఆ కళ్లకి బాధ భాష తెలుసు. ప్రేమభాష తెలుసు. పరుష వచనాలు తెలుసు. అవి బహుభాషా వేత్తలు.”

“ఆ కళ్ళనీళ్ళతో తడిసిన అతని ముఖం అద్భుతమైన హావభావాలు పండించే సారవంతమైన నటభూమి.”



“అతను భాషకందని ఆనందంకోసం, ఆశయంకోసం చేతికందిన సుఖాలను వదులుకునేందుకు వెనకాడలేదు.”

**వచనశిల్పం**

కొత్తదారుల్లో సాగే వాక్య విన్యాసాలు, భావ విన్యాసాలు చూడండి.

“జీవితం ఒకరిని చలవచేసి నాగరికరీతిలో సాపు దీర్చింది.”

“అనురాగమనురాగాన్ని ప్రస్తరించి యువ హృదయాలను పులకరింప చేస్తున్నాయి.”

“తెల్లవారుఝామునలేచి కోడినిలేపి గొడ్లశాలకు వెళ్ళి పాడి తీసేవాడు.”

“ఎప్పుడైనా జ్వరంవచ్చి లంకణం చేసినప్పుడు ఒక పౌను తగ్గడం, చేతిలో పౌనురాయి పట్టుకు బరువుతూచుకున్నప్పుడు ఒక పౌను పెరగడం తప్పించి ఇన్నేళ్లుగా అతను అదే బరువు తూగుతున్నాడు.”

“అవకాశాలు ఆశపెట్టి ఎంత ఆకర్షించినా ఏ వ్యసనంకేసి కన్నెత్తి చూడలేదు. కన్నెత్తకుండా కూడా చూడలేదు.”

“నాగేశ్వరరావుకు రెండవఛాన్సు కన్ను గిలిపింది.”

“రాబోయే విమర్శల వర్షానికి జవాబుల గొడుగు తయారు చేయబోయారు.”

“నాగేశ్వరరావు ధైర్యంగా భయపడ్డాడు.”

“అమ్మాయి అతని అర్ధాంగి కావటానికి మౌనంద్వారా, అర్ధాంగీకారం సూచించింది.”

ఈ రచనకోసం ప్రత్యేకంగా సృష్టించుకున్న పదాలున్నాయి.

“ముఖస్తుతి, జనతాజనత, సకుటుంబరావుగారు, బుద్ధిమంతనం, చైత్రయాత్ర, సెట్ జనులు, భీరో, హీరోదాత్త నాయకుడు.”

**మరికొన్ని రసాత్మక వాక్యాలు**

“కలలన్నీ ఎప్పుడో అపుడు మెలకువలోకి కరిగిపోవలసినవే.”

“జీవితం ఏదో, నటన ఏదో, నిజమేదో, కల ఏదో, నిద్ర ఏదో, మెలకువ ఏదో తెలియక తికమకపడటం.”

“కొత్త నటుడికి బలమిచ్చి నిలబెట్టేవి మంచిపాత్రలు. వాటిని నటుడు ధరించడు. అవే నటుడిని ధరిస్తాయి.”

“సౌఖ్యం తోడివారితో పంచుకున్నప్పుడే ఆనందం అవుతుంది.”

### గ్రామీణం

నాగేశ్వరరావు రామబ్రహ్మంగారికి దండం పెట్టలేదు. అది సర్ది చెప్పటానికి మధుసూదనరావుగారు చెప్పిన జవాబు పల్లెల అమాయకతకు పట్టణంలోని అలవాట్లకు – పట్టణం పల్లెపై చూపుతున్న ప్రభావానికి నిదర్శనం.

"నిజమేనండి...పల్లెటూరి కుర్రాడు కాబట్టే దండం పెట్టాలన్న సంగతి తెలీదు. ఈ దండాలింకా పల్లెటి దిక్కులకి పాకలేదు."

అలాగే సినిమా పరిశ్రమలో పాతరోజులకు నేటిరోజులకు వున్న తేడాని బేరీజు వేసే వాక్యం చూడండి.

"ఆ రోజులు కథలరోజులు. దర్శకుల రచయిత రోజులు. నటులనుబట్టి పాత్రలను రూపొందిచడం, వారి రూపురేఖలనుబట్టి వాటిని సిండ్రెలాజోళ్ళ సైజుకు కత్తిరించడం జరగని రోజులు."

మామూలుగా ఒక మంచి రచన చేస్తుంటే అందులో రవణ ఏ దృక్పధాలను అనుసరిస్తాడో – ఏ దోషాలను ద్వేషిస్తాడో ఏ అభివృద్ధికి తలవంచుతాడో రచనలో ఏ శిల్పాన్ని ప్రదర్శిస్తాడో పాఠకులను దర్శింపజేస్తాడో అన్నీ ఈ రచనలోనూ చెయ్యడం చెయ్యగలగడం రవణ రచనాశక్తికి నిదర్శనం.



*గుంటూరు ఫిల్మ్ ఆర్ట్స్ అసోసియేషన్ వేడుకలో – బాలు, ఎమ్వీయల్*






# పాటలూ – పద్యాలూ

### ఏక్ ఝలక్

కవిగా రవణ తన కవిత్వాన్ని శాంపిల్ చూపించాడు పద్యాల్లోను, సినిమాపాటల్లోను. 'ఋణదా శరధీ కరుణాపయోనిధీ' పద్యాలు– ప్రేమించి చూడు చిత్రంలో ఒకపాట, పక్కలోబల్లెం చిత్రంలో ఒకపాట రవణను కవిగా పరిచయం చేస్తాయి.

'ఋణదాశరధీ కఋణాపయోనిధీ' పద్యాలు 'దాశరధీ కరుణాపయోనిధీ' అనే పద్యాలకు పారడీగాసాగి హాస్యానికీ, అప్పులకీ అంకితమయ్యాయి.

ఈ శతకం మొదట సంప్రదాయబద్ధంగా ప్రార్ధనశ్లోకం లాగా ఒక పద్యం వుంది. అదికూడా 'ఎవ్వనిచే జనించు' అన్న ప్రసిద్ధ పద్యానికి పారడీ.

"ఎవ్వనిచే జనించు ఋణ
మెవ్వనిచే భ్రమియించు లోకమం
దెవ్వని బుద్ధియే ఋణద
మెవ్వడు నవ్వుచు నప్పులిచ్చు దా
నివ్వగ జాలక, తిప్పనట్టి వా
డెవ్వడు – ఆ ఋణాత్ము, ఋణదేశ్వరు
నేను ఋణంబు వేడెదన్.

ఈ పద్యంలో 'భ్రమియించు' అనే పదం భ్రమపెడుతోందనీ తిరుగుతోందనీ రెండర్ధాలలో వాడాడు రవణ.

పద్యాల మధ్యలో వచనంకూడా ప్రాచీన సంప్రదాయానుసారంగానే వుంటుంది.

వ. ఋణ త ఋణవందన సహస్రంబాచరించి నా యొనర్పం బూనిన శతక ప్రకారంబు....

ఈ శతక రచన ప్రయత్నంలో కూడా 'నీ డబ్బుల నిత్తుగాని, యొక డబ్బది – ఈ యతివల్ల నిమ్ము' అని పద్యాల్లో యతులు మతులు పోగొట్టే సందర్భాల్ని ప్రస్తావిస్తాడు రవణ.

తన శతకానికి అధికారికమైన వరవడి రావడానికని పూర్వగాథాలహరిని పద్యాలలో ప్రవహింపజేస్తాడు.

వార్నిధి యప్పు బీల్చగా
నా కడలిన్ అగస్త్యముని యక్కట
పుక్కిట బట్టి నిల్పలేదా?" –

ఆ అధికారికమైన ఉదాహరణలలో మళ్ళా పేదా బిక్కీ నోరు తెరిచి అడిగినా ధనవంతులు చుక్క రాల్చరు, దమ్మిడీ విదల్చరు అన్నది మరచిపోకుండా గ్రంథస్థం చేశాడు రచయిత, అది రచయిత బాధ్యతగా గుర్తించి.

"సాగరు 'డప్పు' చేసి ఋణ సాగరు
డైనను నిచ్చు వాహినుల్
'నాగతి చూడవా'! యనెడు
నాగటి చాలున కీవు..."

నోరు తెరుచుకుని అడిగే నాగేటిచాలులో నీటితడి పడదు. అప్పటికే అప్పులు చేసి నిండా మునిగివున్న సాగరుడికే చేరుస్తాయి 'అప్పు' లన్నిటినీ నదులు. ఉన్నవాడూ వున్నవాడికే పెడతాడు మరి!



## అద్వితీయ గీతాలు

'ప్రేమించిచూడు' చిత్రంలో రెండోపాట రవణ రాశాడు. నిజానికది 'తమిళపాటకు అనువాదబాణీ.' ట్యూనుకూడా సహజంగా తమిళభాషకు అనువైనట్లే 'తమళపాకు నములుతూ దవళతో మాట్లాళు' తున్నంత వేగంగా వుంటుంది.

అంత వేగాన్ని అచ్చ తెనుగుతనంతోను రవణమార్కు పదాలతోనూ కట్టుకుని శ్రోతల్ని ఆకట్టుకునేవిధంగా రవణ రచన చేశాడు.

"మేడమీద మేడకట్టి
కోట్లు కూడబెట్టినట్టి కామందూ
కమాన్ – కమవుట్ రాముందూ
దిగిరా ముందూ."

'బుచ్చబ్బాయ్ పనికావాలోయ్' అనే పల్లవితో సాగే ఈ పాటలో 'కాసెపోసి' అనే తెనుగు నుడికారం సరసంగా మ్యూజికల్‌గా వొదిగి పోయింది.

ఆడపిల్ల మాటమీద
ఉద్యోగా లూడగొట్టు
ఆకతాయి కామందూ –
మీసకట్టు తీసివేసి
కాసెపోసి కోకచుట్టి
గాజులేసు కొమ్మందూ."

అంత్యప్రాసలతోను, అనుప్రాసలతోనూ తెలుగు నుడికారంతోనూ భావయుక్తంగాను రవణ స్వభావయుక్తంగాను పాట కుదరటం 'గీతపనివారల'లో చాలా అరుదుగా కనబడుతుంది.

'అందుకుంటె జుట్టుపట్టి
అందకుంటె కాళ్లుపట్టు కామందూ'

అనటంలో కొమ్మువాసి తేడాతో అర్థభేదం కలిగే పదాలని వాడుకోడం కూడా గమనించవచ్చు. కొమ్ములు తిరిగిన రచయితల్లో కనబడే ఈ రచనాగుణం రవణకి కొమ్ములు తిరగకుండా తొలిగీత రచనలోనే జమపడింది. కొమ్ములు తిరుగుతాయనే భయంతోనే కాబోలు మరోపాట రాసి 'గీత పనితనాని'కి దూరంగా జరిగాడు రవణ.

'పక్కలో బల్లెం' చిత్రంలో రాసిన ద్విగళగీతంలో కూడా చినదానా – వలచినదానా' అనే చమత్కారం చోటుచేసుకుంది ఆ కాస్త పాటలోనే–



# వెండితెర నవల

## నావెల్టీ

రవణ తెలుగులో పరిపుష్టంచేసి ప్రచారంచేసిన మరో క్రొత్త ప్రక్రియ వెండితెర నవల. అతను రూపొందించిన వెలుగునీడలు, ఇద్దరుమిత్రులు, భార్యాభర్తలు నవలలు పేరు ప్రతిష్టలు తేవటంతోపాటు చిత్రాలకు మంచి ప్రచారసాధనాలుగా ఉపయోగపడ్డాయి. కథ తనదికాకపోయినా, సంభాషణలు తనవి కాకపోయినా కేవలం కథనంలోనే తనముద్ర వేయగలిగాడు రవణ. పదసృష్టి దగ్గర్నించి పరిహాసోక్తుల వరకు ఈ రచనల్లోనూ కనబడతాయి. ఈ రచనల్లో సహజంగా ఒక కష్టం రచయితకి



తప్పదు. సినిమాలో భాష కంటే భావమే ప్రేక్షకుడికి ఎక్కువ కథ చెబుతుంది. ఆ భావం నటుడి దగ్గర్నించి రావచ్చు. దర్శకుని 'సింబాలిజమ్' నించి రావచ్చు, కెమేరామేన్ కోణాలనించి రావచ్చు, సంగీత దర్శకుని 'నేపథ్య వాద్యా'ల నించి రావచ్చు, ఇవేవీకాక ప్రేక్షకుల దృక్కోణం నించి రావచ్చు. అందువల్ల సంభాషణలు నవలారచయితకి ఒకవంతే ఉపయోగిస్తాయి. మిగిలిన మూడు వంతులూ టెక్నీషియన్స్ అందించే భావాలనే నవలారచయిత స్పందించాలి. కేవలం సంభాషణలవంకే చూస్తే ఆ సన్నివేశమే కాక ఒకోసారి కథే అర్థం కాకపోవచ్చు. తన రచనల్లో 'సినిమాటిగ్గా' కథ చెప్పే నేర్పును అలవరుచుకున్నవాడు కనకనే రవణ ఈ 'చిత్రరచన'ను కూడా అవలీలగా చేయగలిగాడు.

## వెలుగునీడలు

వెలుగునీడలు చిత్రం భారతదేశంలోని అతిక్లిష్టమైన సంధికాలంలో నిలబడిన పాత్రల జీవితాలకు రూపకల్పన. బ్రిటిషువారు వెళ్ళిపోయినా ఆ తత్వం వంటబట్టి వదలని రావుబహద్దర్లు "ఇంట్లో ఈగల మోత బైట పల్లకిమోత"గా కాలం గడుపుతున్నారు. కాలంతోపాటు మారడంలేదు. ఈ కథలో వెంకటరామయ్యగారు అంతే. ఈ సంగతి నవల మొదటే స్పష్టంగా చెప్పి కథాకాలాన్ని, కథలోని బలాన్ని సూచించాడు రవణ.

"ఆంగ్ల సామ్రాజ్యం మీద అస్తమించదనుకున్న రవి, చివరకు మాట దక్కించకుండా అంతపనీ చేసి ఊరుకున్నాడు. ఆయనటు దిగగానే ఇట్నించి తూరుపుఖండపు వారలమీద కొత్తసూర్యుడు ఉదయించాడు. రెండు వందల యేళ్లుగా నిద్రపోతున్న జాతి మేలుకొంది. జనులు తమ జీవితాలకూ, భావాలకూ పట్టినబూజు దులిపేసుకుని వెల్లవేసుకుని కొత్తగాలి పీలుస్తున్నారు. అంతకాలం వాళ్ళని జోకొట్టిన 'సర్'లు, 'రావుబహద్దర్'లు ప్లేట్లు ఫిరాయించారు. రావ్‌బహద్దరు ఆర్,.. వెంకటరామయ్యగారు మాత్రం ఇంకా 'రాజసేవే దేశసేవ' అన్న జోలపాటకి వరసగాని మాటవరసగాని మార్చుకోలేదు. ఆయన పేరుకి పట్టాకు వేళ్లాడుతున్న బిరుదును, పట్టుకు వేళ్లాడడం మానలేదు. ఆ బూజుభావాలు వదల్చుదల్చుకోలేదు."

అందుకే కథానాయకుడు చంద్రం ప్రెస్సు అధీనంలోకి తీసుకోగానే ముందు రాజసేవ పేరుమార్చి ప్రెస్సు బూజు దులిపిస్తాడు.

## వాల్మీకం

రవణ తన కథనం ఉపమానాలతో ముడిపెట్టి సాగిస్తాడు. అందుకని అతను వాడిన ఉపమానాల్ని, కథనాన్ని కలిపే చెబుతాను.

"శివరాం అంగవిన్యాసం ఐన్‌స్టీన్ సినిమాలాటిది – చెవిటివాళ్ళకూడా సంగతి తెలిసిపోతుంది."

"వేడినీట ముంచిన ధర్మామీటర్‌లో పాదరసంలాగ, వంటింట్లో ఉండి ఈ సద్గోష్ఠిని ఆలకిస్తున్న సుగుణకు అరికాలిమంట నెత్తికెక్కింది.

"గాలి ప్రియవచనంలా మృదువుగా, ప్రాణానికి హాయిగా వీస్తోంది. చంద్రం, సుగుణ కూర్చున్న పడవ జోలపాటకు లయలా, ఊయలలా, అలలా ఊగుతోంది."

"రోజులు పట్టుదారంమీద ముత్యాలలా సాఫీగా జారిపోతున్నాయి జీవనసూత్రం మీదుగా."

"అఖండ జలపాతం నెత్తిన పడుతుంటే కదలక కరగక నిలబడ్డ పాలరాతి బొమ్మలా కనిపిస్తోంది సుగుణ. ఇద్దరి కన్నీరూ ఏకమై వరద గోదావరిలా సుళ్ళు తిరుగుతూ హోరుమని ప్రవహిస్తోంది ఏ దుఃఖ సముద్రంలోకో."

"గది అంతా నిశ్శబ్దంతో, నిశ్శబ్దం అంతా విషాదంతో నిండిపోయి ఉన్నాయి. మాటలకి చోటులేదు."

"సుగుణ ప్రతిమలా నిలబడిపోయింది. అది సజీవ ప్రతిమ అనుకోవడానికి ఆధారం ధారాపాతంగా ప్రవహిస్తున్న కన్నీరే."

"నీలాకాశంలా మనసు నిర్మలంగా వుంది. చుక్కల్లా చక్కని భావాలు మిలమిలలాడుతున్నాయి. చంద్రబింబంలా పాట ఒకటి ఉదయించింది వాటిమధ్య."

"ట్రెడిల్ శిధిల యంత్రంలా ఉంది. మాసిపోయిన అభిప్రాయంలా ఉంది."

"కదిలిన అగ్నిపర్వతంలో అగ్నిచ్ఛటలా ఉద్రేకం ఆవేశమై పైకి విజృంభిస్తుంది. మనిషి ఆపాదమస్తకం కంపించిపోతున్నాడు. భూకంపం వచ్చినవేళ పర్వతాలలా అతని సహనం అదిరి కుంగిపోతోంది."

"కాలమేచెవులు రిక్కించి ఎదురుచూస్తోంది వరలక్ష్మి పలుకుకోసం. లోకమే కళ్ళువిప్పార్చి చూస్తోంది వరలక్ష్మి చూపుకోసం."

ఈ వాక్యాలలోని కవితాశైలి టెక్నీషియన్స్ ప్రదర్శించిన శక్తిని కూడగట్టుకుని హృదయంలో ముద్రవేస్తుంది.

**నచ్చని సంగతులు**

సినీజర్నలిస్టుగా రవణ సినిమాల్లో తనకి నచ్చని సన్నివేశాలు సంగతులు కుండ బద్దలుకొట్టినట్టు చెప్పేవాడు. ఆ అలవాటు ఈ సినిమా నవలలో కూడా మానుకోలేకపోయాడు. 'వెలుగు నీడలు' చిత్రం పతాక సన్నివేశంలో 'కొట్లాట'



అతికించినట్టే వుందికాని సహజంగా ఏర్పడలేదు. దానిమీద విమర్శను మాటుచేసుకున్న రచన చెయ్యకుండా ఉండలేకపోయాడు రవణ.

"తీరా పోలీసువాళ్ళొచ్చేసరికి వాళ్ళు అణచడానికి దొమ్మీ లేకపోతే బాగుండదు. వాళ్ళు చిన్నబుచ్చుకోవచ్చు. అందుకని రావుబహద్దర్‌గారి 'అనధికార సాయుధబలగం'లోని అసభ్యులు – గిట్టనివాళ్ళు వీళ్ళని గూండాలంటారు – నెమ్మదిగా, గుట్టుగా వర్కర్లలో కలిసిపోయి ఒక పాత వర్కర్ని కొట్టారు."

తెలుగు సినిమాల్లో క్లయిమాక్సులో కొట్లాట తప్పనిసరిగా వుండడం అంతా అయిపోయాక పోలీసులు తీరిగ్గా రావటం దృష్టిలో పెట్టుకుని పై వాక్యాలు రాశాడనిపిస్తుంది.

ఈ బాక్సాఫీసూత్రాన్ని ఈనాడు తనుకూడా పాటించక తప్పటంలేదు. తెలుగు చిత్రకథ 'రచయిత' మీద విజయాన్ని సాధించింది.

**ఇద్దరు మిత్రులు**

'ఇద్దరు మిత్రులు' చిత్రం నవలలోను 'సేవా' మందిరం (బార్), వాట్‌మన్ (తాగినవాడు) అనే పదాలను 'కాయిన్' చేశాడు రవణ. 'రాత్రి నిద్రపోతోంది' వంటి వాక్యరచన చేశాడు.

"ఏమీ ఎరగనట్టు ముఖానికింత గొప్పవాళ్ళ బద్ధకం, మార్నింగు చిరాకు పులుముకుని" అనే వాక్యంలో సెటైర్‌ని జతపరుచుకున్నాడు.

"ఫిట్‌లు రెండు విధములు (1) తమంత తాము వలచివచ్చునవి, (2) ఆపద్ధర్మముగా వచ్చి అవసరమునకు ఆదుకొనునవి."

అని ప్రఖ్యాత ఆధునిక ప్రాచీన తెలుగు మహాకవి వచన శైలిని పారడీ చేశాడు.

**వర్ణనీయాలు**

వర్ణన రకరకాలుగా వుంటుంది. మనం కడుపునిండి సౌందర్యారాధన ప్రారంభిస్తే దాని కనుగుణంగానే వుంటుంది. ఆకలేసి అందగత్తెను చూస్తే మరోరకంగా వుంటుంది. ఈ రెండురకాల వర్ణనల మచ్చు ఒకే చోట చూపించాడు రవణ.

"మరో మరో సమయంలో అయితే విజయ్ ఆ చక్కనిముఖాన్ని, సోగకళ్ళనీ, చిలిపిచూపుల్నీ బెంటెక్స్ ముత్యాలపేటనీ, దానికి ఉపమానంగా మెరిసిపోతున్న పలువరసనీ, చిరునవ్వుల్నీ వాటి వెలుగుల్నీ చూసి ముగ్ధుడై అజయ్‌బాబు అనుమతి అడిగి కన్నులవిందుగా అలా చూస్తూ కూర్చోబడిపోయేవాడే. కాని ఆ ముహూర్తం ఆకలి ముహూర్తం. కన్నులవిందు కన్న అర్జెంటయిన విందు, ముందు జరగాలి. అందుకని ప్లేటుమీద దృష్టి వుంచి ఆమె చెంపల్లా ఉన్న ఆపిల్ కాయలనీ, ఆ చెంపల్లోని

కెంపుల్లాటి దానిమ్మ గింజలనీ, మెత్తని తెల్లని వెన్ననీ, ఎర్రగా తన ఆకలిలా కరకరలాడుతున్న రొట్టెముక్కనీ ఆప్యాయంగా ముందుకు లాక్కున్నాడు.”

**జానక్యాః...**

కథనంలోని వర్ణనలో సంప్రదాయపు వెలుగు ప్రసరించిన సుందరమైన ఘట్టం ఒకటి ఈ నవలలో వుంది.

“కలువరేకులవంటి కనులలో మంచిముత్యాలలా మెరిసిన బాష్ప బిందువులు చీకటిలాటి, వియోగంలాటి, విషాదంలాటి కాటుక మీదుగా దిగుతూ నీలాలై మెరిసి, సిగ్గుతో ఎరుపెక్కిన చెంపలమీదుగా దిగుతూ కెంపులై వెలిగి దిగి భర్త పాదాలను అర్చించాయి.”

అన్న వర్ణన సీతారాముల తలంబ్రాల ఘట్టాన్ని వర్ణించిన ‘జానక్యాః కమలామలాంజలి పుటే’ శ్లోకంలోని భావాన్ని గుర్తుకు తెస్తుంది. కాటుకతో కలిసి ‘నీలాలు’గాను, చెంపలపై మెరిసి ‘కెంపుల్లా’ గాను, మంచిముత్యాల్లాటి కన్నీరు కనబడిందన్న ‘తద్గుణాలంకారా’న్ని చాలా అందంగా పొదిగాడు రవణ.

ఈ నవలలో సార్వకాలిక సత్యాలుగా రూపొందే వాక్యాలున్నాయి. నవల ప్రారంభిస్తూ అజయ్, విజయ్‌ల మార్పిడి భగవంతుని లీలగా భావించి రవణ రాసిన వాక్యం.

“పైనున్నవాడు బహుకొంటెవాడు. పెద్దంత్రం, చిన్నంత్రం లేకుండా అందరినీ ఆడించి, ఆడుకుంటాడు. అరక్క వీడూ, దొరక్క వాడూ అవస్థపడగా వీడికి వజ్రాలూ, వాడికి మరమరాలు యిస్తాడు. ఉప్పుకి కర్పూరంలా గుబాళించాలన్న ఉబలాటం కలిగిస్తే, కప్పూరానికి ఉప్పులా చవులూరాలన్న సరదా పుట్టించి తమాషా చూస్తాడు. జీవితం ఉప్పులా కరిగిపోయి, కప్పూరంలా హరించిపోయేవరకు ఈ తీరని కోరికలతో కాలక్షేపం చేయించేస్తాడు.”

**భక్తి = ఎస్కేపిజమ్**

రామనామస్మరణ చేసే రామదాసుని చూసి విజయ్‌గా నటించబోయే అజయ్ అనుకుంటాడు.

“ఇపుడు రుచి బాగా తెలిసిన ‘అమృతం’ ఒకటే వుంది. అది పుచ్చుకుంటే తనకీ ఆనందంతో ఒళ్లు తెలీదు. క్లబ్బుల్లో అమృతం తాగి ఆనందంగా వున్నవాళ్ళకి ఇంట్లో చీకూ చింతా లేనట్లేనా? కాదు. అవి వుండబట్టే ఈ దారిబట్టారు. అయితే ఈ భక్తులూ అంతే అయివుండాలి. జీవితంలో చీకూ చింతా మర్చిపోవడానికి ఈ రామానామామృతం సేవిస్తున్నారు.”



ఈ వాక్యం ప్రకారం భక్తిలోకి జారిపోయే వ్యక్తుల్ని కూడా ‘ఎస్కేపిస్టు’లు గానే భావించాడు రవణ అనిపిస్తుంది. ఈ ఆలోచన మరో ఆలోచనకు దారితీసి భగవంతుడిమీద రవణకు నమ్మకం లేదన్న విషయం రుజూ చేస్తుంది.

‘దేవుడు అనే భావాన్ని మొట్టమొదట కనిపెట్టినవాడెవడో గొప్పవాడు. గొప్పేమిటి వాడే దేవుడయుండాలి.’

సినిమా నవలల్ని కూడా ఇంత జాగ్రత్తగా రాయబట్టే ఈ రచనలు చదివిన వాళ్లు ‘ఇడ్లీకన్నా పచ్చడి బావుంద’ని మెచ్చుకున్నారు.



ఎమ్వీయల్ ‘కవన కదనం’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సి.నా.రె.



# చిత్ర రచన

### సాక్షి

"ఎం.కె. గాంధీజీగారి నాయకత్వమున ఉప్పు సత్యాగ్రహము... మా కొద్దీ తెల్లదొరతనము..మద్యపాన పిశాచము నిర్మూలనమునకై ఉద్యమము." జరుగుతున్న రోజుల్లో జరిగిన కధ యిది.

కాని ఈ కథకి రంగస్థలం అయిన దాచింపాడు ఆ ఉద్యమాల్లో పాల్గొనటం జరగలేదు. ఆ ఊళ్లోవాళ్లు అసత్యాగ్రహం చేస్తారు! దొరతనం లేకపోతే ఎలా అంటారు! మద్యపాన పిశాచాన్ని దేవతలా కొలుస్తారు!

పకీరు ఆ వూరికి మకుటంలేని మహరాజు. పబ్లిగ్గా కుప్పలు తగలబెట్టినా మరేంచేసినా అడ్డుకునేందుకెవడికీ దమ్ములేదు. పకీరు చెల్లెలు చుక్క చక్కనిచుక్క.



మునసబు కరణాలు తాడితన్నగల వీరులయితే వారి తల తన్నగలవాడు పకీరు. కరణం మునసబులు కులంచేత, ఆస్తిచేత పై అంతస్తువాళ్లు. కృష్ణ, అతని మేనమామ గవరయ్య, అతని రెండోభార్య మాలక్ష్మి, ఆమె సవతి కూతురు నర్సి కింద అంతస్తు మనుషులు. దొరల భాషలో పాలేరోళ్లు. ఈ రెండు కులాలమధ్య మరో రెండు దారం పోగులు పూజారి, షావుకారు. ఈ నాలుగు కులాల దారానికి ఆధారం ఆవూరి కొబ్బరితోటలు, కాలవ, మునసబుగారి లారీ.

వీటిని డబ్బుగా తర్జుమాచేసి దక్కనియ్యకుండా చేసే పకీరు పీడ తొలగించుకోవాలని మునసబు కరణాలు జరిపిన పావు గవరయ్య గుటుక్కుమనడంతో గత్యంతరంలేక అమాయకుడైన కృష్ణని అడ్డం పెట్టారు సాక్ష్యానికి. తీరా అతను సాక్ష్యంచెప్పి ఊరోళ్ళ ప్రాణాలు కాపాడి తిరిగి వచ్చాక ఆదరణ చూపినవాళ్లు లేకపోగా జైలునించి పారిపోయిన పకీరు చంపటానికివస్తే కృష్ణని ఆదుకున్నవాళ్లే లేరు. మనసిచ్చిన చుక్క తాళిబొట్టు గట్టితనంవల్ల కృష్ణ బతికి బయటపడగలిగాడు.

ఈ కథలో పకీరుతో మనువుకోసం ఉసురొదిలిన పడుచు నర్సి అయితే మనసునిచ్చి కృష్ణ ఉసురునిలిపిన పడుచు చుక్క. అవటానికి పై అంతస్తు మనిషయినా మునసబు చుక్కనుచూసి గుటకలు వెయ్యకా మానడు. చేజిక్కించుకోవటానికి ప్రయత్నం చెయ్యకా మానడు. మునసబు నెత్తిన చెయిబెట్టి బంజరుపొలం కాజేయాలని చూసే భస్మాసురుడు కరణం. ఈ యిద్దరూ పకీరుకంటె గూండాలు. అక్షరాలా గొంతులు కోసే తడిగుడ్డలు. ఈ మధ్యలో తిరిగే పూజారి, షావుకారు మతాన్ని సత్తేన్ని అడ్డం పెట్టుకుని నాలుగు డబ్బులు చేసుకో జూసేవారు.

ఈ సజీవమైన వ్యక్తులతో పల్లెటూళ్ళకు ప్రతిబింబంగా కనబడే వూరు దాచింపాడు. సత్యాగ్రహ కాలంనాటి పేదోళ్లు, పెద్దోళ్లు, పాలేరోళ్లు, పెద్దకులపోళ్ళు, పనివాళ్లు, పనికిమాలినవాళ్లు ఈ కథలో వున్నారు.

కృష్ణకి చుక్కమీద మనసుంది. చుక్కకీ తనమీద మనసుందని తెలుసు. నర్సికి తనమీదకాక పకీరుమీద మనసుందనీ తెలుసు. అయినా 'పెద్దోళ్ళు సెపుతావుంటే' అని మాలక్షమ్మ అనగానే నిస్సహాయంగా వప్పేసుకున్నాడు నర్సిని పెళ్ళిచేసుకోటానికి. చుక్క, కృష్ణ కలిసి తిరుగుతున్నారని చెప్పినా పట్టించుకోని మునసబుగారికి వాళ్ళిద్దరూ కేరింతలుకొడుతూ కనబడినప్పుడు తీరని తన కోరిక కళ్ళలో కారంగా మారింది. తనచేతికి చిక్కని చుక్కని కృష్ణనించి విడదియ్యాలనుకున్నారు.

"అదే అంటే మరీ యింత దారుణంగా వుందనుకోలేదు. మరీ యింత బరితెగించిపోయారనుకోలేదు.

యిదేం పూరనుకున్నారా అడివనుకున్నారా పరువు మర్యాదగల కుటుంబాలమధ్య" అని మాలక్ష్మిని కూకలేసి కృష్ణకి – నర్సికి ముహూర్తం పెట్టించేశారు.

మునసబుగారు పెద్దమనిషి!

**పల్లెసీమ**

కొబ్బరితోట, కాలవగట్టు, బల్లకట్టు, సోడాకొట్టు, గుడి, రేవు, రోడ్డు, బస్టాండు, కృష్ణాష్టమి సంబరాలు, నాటకాలు – ఇన్నిటితో పల్లెటూరి వాతావరణాన్ని పరిపుష్టంగా సృష్టించాడు రవణ! బంజరు భూమికోసం తాపత్రయపడే కరణం – అవునూ కాదనకుండా నెట్టుకొచ్చే మునసబు – పట్నం కబుర్లతో డబ్బా కెమేరాతో పటపటలాడించే వారి అల్లుడు రాజా – నూట పాతికరూపాయల్ని విలాసంగా బ్రాకెట్టాడేసే పకీరు – రూపాయి సోడా అమ్మగలిగే సోడాకొట్టు సుందయ్య, సిగరెట్ల పందెంతో పేకాటాడే బండాడు, సుబ్బులు – సాక్ష్యంచెప్పిన కృష్ణ భయపడి ఛస్తుంటే "మీ మావ రెండ్రూపాలు బాకీపెట్టి సచ్చాడు. అది మీ యత్తమ్మిస్తదా? నువ్వా?' అని పరామర్శచేసే షావుకారు – సమయం సందర్భంలేకుండా ప్రసాదాల విషయం ప్రస్తావించే పూజారి – పల్లెటూళ్ళ తత్వాలకి – పట్టణాల నాగరీకం పరుస్తున్న సాంఘిక, ఆర్థిక మేఘాల నీడలకీ ప్రతీకలు.

తనను సంపేత్తానని బెదిరించిన బండాడ్ని, సుబ్బుల్ని 'ఎర్రోళ్ళ'ని నమ్మే కృష్ణ – అతను తన అన్నకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడని తెలిసినా 'నీ యంటి దేవుడికి ఇల్లాలనిపించుకుంటే ఆ ఒక్క నిముసమే సాలు–' అనగలిగిన చుక్క, ఆఖరి క్షణంలో కూడా పకీరుమీద ఆశ వదలక 'మనమెల్లిపోదాం – ఎవరికీ తెలీని సోటుకెల్లిపోయి–' అనే నర్సి, అపశ్రుతి పాటయినా అదే ఆనందభైరవిలా కృష్ణపాటని ఆనందించి అతన్ని కాపాడితీరాలనుకునే పసివాడు గోపి – పల్లెటూరి మమతల చల్లదనం, అనురాగాల వెచ్చదనం వదలని వ్యక్తులు.

చాలా కాలంకిందట యిదే పేరుతో రవణ కలంనించి చిన్నకథగా వచ్చిన ఈ కథ సినిమాకి అనుగుణమైన మార్పులతో చలనచిత్రంగా రూపొందింది. కథకంటే పుష్టిని సంపాయించుకుంది.

**ఆది'పర్వం'**

కృష్ణాష్టమి సంబరంకోసం ఊరంతా ఉత్సాహపడటంతో కథ ప్రారంభమవుతుంది. ఆ ఉత్సాహం పకీరులారీ రావడంతోగాని మొదలు కాదు. ఆ లారీకోసం ఎందరు ఎలా ఎదురుచూస్తున్నదీ అయిదు సన్నివేశాల్లో చెప్పి ఊరంతట్నీ పరిచయం చెయ్యటంతోపాటు లారీకి – డ్రైవరు పకీరుకి వున్న ప్రాముఖ్యత తెలియజేస్తాడు



రచయిత. మనం పకీరుని చూడకముందే అతని సంగతంతా తెలిసిపోతుంది. కథకి కథానాయకుడు కృష్ణకంటె బలమైన పాత్రకాబట్టి అతనిమీద ఊరందరితో పాటు రచయితకూడా దృష్టిని కేంద్రీకరిస్తాడు మొదట్లోనే.

సినిమా మొదలయిన పది నిమిషాల్లో కథలోని ప్రధాన వ్యక్తులంతా పరిచయం కావటంతోపాటు వారి తత్వాలుకూడా స్పష్టంగా చెప్పటం, కథ నడవడానికి బలమైన బీజాన్ని మొదటి సన్నివేశంలోనే వెయ్యటం, అది మొక్కగా మారి ఫలితానికి వచ్చేవరకు వుండే ప్రధాన ఘట్టాలను వదలకుండా కలుపుకురావడం రవణ ప్రత్యేకత.

**మాట – మనిషి**

ఒక్కమాటలో పాత్ర స్వభావాన్ని పట్టివ్వడం ఈ రచనలో కనబడుతుంది.

"మన చేతులకి మట్టంటుకోకుండా పగవాడిని పడగొట్టడం"లో కరణం కుయుక్తి.

"రావఁ రావఁ! నాకేం తెలీదోయ్ – నేనసలు ఊళ్లో లేందే! ఏదో డబ్బు కావాలనన్నావుగదా, ఎంత కష్టంలో వుండడిగావోనని, నాకాడ దస్తు లేపోతే – మద్దినాళ పొరుగూరెళ్ళి నోట్రాసి దెచ్చా..." అనే మునసబు మెతకతనం, పిరికితనం.

"నాదారి కడ్డొస్తే లారీ ఎక్కించి మట్లో కలిపేస్తాను" అనే పకీరు పరుషత్వం.

"సంపినా సరే, నరికినా సరే, పకీర్నే పెల్లాడతాను" అనే నర్సి పట్టుదల.

"గటనెలాగుంటే అలా జరుగుతాద"నే కృష్ణ అమాయకత్వం.

"దేవుడక్కర్లేదు. మన్ని కాపాట్టానికి మడుసులున్నారు. ఇదేం అడివికాదు." అనగలిగే చుక్క ధైర్యం.

"ఇంత నిందొచ్చిపడ్డాక రేపేమొగం పెట్టుకు తిరగాలే! ఇంతకన్నా సావేనయం" అన్న గవరయ్య నిశ్చయం.

"ఆ ప్రసాదాల గొడవ న్నామీద పడెయ్యండి – కల్తీలేని చవక సరుకు తెచ్చుకుని శ్రద్ధగా చేయిస్తానూ" అనే పూజారి కక్కుర్తి.

"ఒరే పిరికిసన్నాసి బయమెందుకురా" అనే పిరికి షావుకారు.

"స్టేషన్ హెడ్ నాకు బాగా తెలుసు. పిక్‌పాకెట్ ననుకుని రెండుసార్లు నన్ను తన్నాడు. అప్పట్నించీ నేనంటే అతి మర్యాద."

అనే నాగరీకపు అల్లుడు రాజు వెర్రితనం పాత్రల స్వభావాల్ని నిక్కచ్చిగా చూబిస్తాయి. ఆ గీతలు దాటి ఎక్కడా ఒక్కమాట కూడా మీరకుండా ఒద్దికగా నడుచుకునే పాత్రలతో కథ నిర్ణీతమైన గమ్యంవైపు సూటిగా సాగిపోతుంది.

**ఆకారాలు అలంకారాలు**

పట్నానికి పదిసార్లు తిరిగే పకీరు నల్లకళ్ళజోడు సర్దుకుని, రుమాలుతో ముఖం అద్దుకుని పరిచయం కావటంలో అతని నాగరీకత కనబడుతుంది. అయినా అతనిలోని రాక్షసత్వం "రావణాసురుడిలా నిన్నెగరేసుకు పోవాలనిపించింది" అనే ఉపమానాన్నే అనిపిస్తుంది.

రాత్రిపూటకూడా నల్లకళ్ళజోడు పెట్టుకునే మునసబుగారి అల్లుడు రాజా "హుయిజ్ ది లాఫర్? నవ్వేవాడెవడని" ఇంగ్లీషుతప్ప తెలుగు మాటాడ్డు.

ఈ వేష భాషలతోపాటు కాలవగట్టు వాతావరణం, 'లారీసీటు కిందేసుకు కూచుని క్లీనర్లు పేకాడుకోవటం – సింగర్ మిషన్ పాట హమ్‌చేస్తూ చక్కిలాలు నవలటం' ఎంత సహజంగా పరిశీలించాడో "తోటలో గునపాలు తిరగేసి కొబ్బరిబొండాలు కొట్టి పీచుతీసి ఆ పీచు నీళ్ళలో వెయ్యటం – బండలమీద వేసి కర్రసుత్తులతో చితగ్గొట్టటం' కూడా అంత సహజంగా వర్ణించాడు రవణ.

**వాతావరణం**

నర్సిబతుకు బండలవుతుందన్న విషయం సూచించటానికి పకీరిచ్చిన అద్దం ముక్కలయినట్టు చెబుతాడు రచయిత. పగిలిన అద్దంలో ముఖం వికృతంగా కనిపించి కెవ్వున కేకవేస్తుంది నర్సి. లారీకిందపడి అంత వికృతమైనచావూ నర్సికి తప్పలేదు చివరికి.

సంబరం దగ్గర ప్రారంభమైన డప్పులమోత మునసబు చుక్కను బలవంతం చెయ్యటం, పకీరువచ్చి మునసబుని చావగొట్టటం వరకు వినబడుతూనే వుంటుంది, సన్నివేశానికి తగిన వేడిని కలిగిస్తూ.

మునసబు చుక్కమీద మోజుపడి వంటరిగా సరసం చెయ్యబోయినప్పుడు కృష్ణ 'రంతుల్ మానుము కీచకాధమ' అని పద్యం పాడుకుంటూ వస్తాడు.

ఇలా సన్నివేశాన్ని, పాత్రల భావాలను, అలవాట్లనుకూడా కథకు మలుచుకుంటూ నడిపించుకుపోవటం సాక్షిలో కనబడుతుంది.

**అడుగుజాడ గురజాడ**

'సాయంకాలవైంది' అని ప్రవేశించే గిరీశం ఎంత కథ తనమీద వేసుకు ప్రవేశిస్తాడో "అయ్యా మునసబుగారూ – చూడండా పోరంబోకు భూమి – దిక్కుమాలి పడేదుస్తూంది. ఇంట్లో మా పెద్దగాడిద వాడో పోరంబోకులా తిరుగుతున్నాడు" అని ప్రవేశించే కరణం.



"అందువల్ల – పప్రసాదాల విషయం నామీద పడేస్తే య్యేది... ఆ తంటాలు నేపడతా" అనే పూజారి శేషయ్య ఎంతో కథ నెత్తిమీద వేసుకుని కనబడతారు.

ఈ రకమైన రచన సినిమాకి నిండుతనాన్నివ్వటంతోపాటు క్లుప్తత, గుప్తత కూడా ప్రసాదిస్తుంది.

**మాట వాడితనం**

కృష్ణని సాక్ష్యానికి వప్పించటానికి మునసబు కరణాలు చేసే ప్రయత్నంలో డైలాగులు, పూర్వగాథలు, పల్లెటూళ్ళల్లో మాటల వాడితనంతో పాటు మనుషుల తత్వాలు కూడా బట్టబయలు చేస్తాయి,

**కర :** "ఆఁ! అంతే. నీకెందుకురా భయం? రేపు కోర్టులో ఖూనీ ఎక్కడ, ఎలా ఎవరికోసం జరిగిందీ ఉన్నదున్నట్టు చెప్పేసెయ్. ఒకేళ నీ బుర్ర బంజరు పర్రయితే నన్నడుగు. నేచెప్తా.

**మున :** అయ్యా! మీకిది తగదు. మీయిష్టం అన్నానుగా.

**కర :** దేవుడు సాక్షి. ఒరే అబ్బాయ్! (కరణం కొడుకు ముందుకొస్తాడు)

**క.కొడుకు :** నమస్కారమండీ! మీ శలవైతే రేపణ్ణించీ లాయకీ చేసుకుంటానండి. మంచిరోజు కూడా.

ఈ డైలాగుల్లో కరణం బంజరుభూమి గురించి అడిగినట్లు మునసబు గతిలేక తప్పనిసరై సరే అన్నట్లు వాళ్ళిద్దరికే తప్ప అక్కడున్న ఎవరికీ తెలియదు. పల్లెటూరి కరణాలు ఎలాటి సన్నివేశాల్లో ఎలా ఉచ్చు బిగిస్తారో, పీకలమీదికి తెస్తారో ఉదాహరిస్తుందీ సన్నివేశం.

ఫోటో తీస్తే పొగరు పోద్దని నమ్మే పకీరు పల్లెటూళ్ళ మూఢవిశ్వాసాలకి ప్రతిరూపం. మునసబుని 'నాన్నగారూ' అనే కృష్ణ పిలుపు పల్లెటూళ్ళ బంధుత్వాలకి, ఆత్మీయతలకి, పై అంతస్తువాళ్ళ అహంకారాలకి ఆకారం.

రచనలో పాత్రోచితమైన వ్యావహారికం చూడండి.

"రిబ్బనీలు, దూటబిళ్ళలాటి రూపాయలు, ఆయ, నాన్నగారూ, పదిరూపాలు (రూపాయ్‌లు) పెతాపకం, అంచేత, ఇంచేపా, ఎసందోశావన్నమాట, కాపణ్నీ సెప్తా' అన్నవి.

పకీరు కెమేరా లాక్కుని ఫిలిం పాడుచేశాడని మునసబుగారి అల్లుడు ఏడుస్తుంటే "చింపేశాడా? నా ఫోటోకూడా పోయినట్టేనా" అంటాడు షావుకారు.

గవరయ్య,పకీరు మాటా మాటా అనుకుని శ్రుతిమించిన సమయంలో మునసబు కంగారుపడుతుంటే "బాబూ ప్రసాదాల విషయం' అంటాడు పూజారి వచ్చి.

ఆ పాత్రల తత్వాలలాంటివి. వాళ్ళగొడవే తప్ప సమయం సందర్భం పట్టించుకోరు. వాళ్ళని ప్రవేశపెట్టడం, వాళ్ళతో ఆ మాటలు అనిపించటం మంచి రచనకు ఉదాహరణ.

'మావాఁ! సెర్లో వొక్క సిన్నబెడ్డేస్తే అలపుట్టి సెరువు సివరకంటా పోతోంది. సూడుమావా! మనందరం సెర్లో నీరంటోళ్ళం. ఒక్కబొట్టు కదిల్తే నీరంతా కదులుద్ది. మంచి మడిసిని కొడితే వూరంతా తగులుద్ది. నిన్ను కాదని వూరు బతకలేదు. వూర్నికాదని నువ్వూ పోలేవు. ఎందూరం పోయినా సెర్లో సేపలా సెర్లోనే. యాడికిపోయినా ఈ మడుసులే. మంచోళ్లు సెడ్డోళ్లు అంటూ యిడిగావుండరు మావా. మంచీచెడ్డా కలిత్తేనే మడిసి.'

"అమ్మోరూ! యములాడొస్తన్నాడు. ఇప్పుడు పెద్దకూనీ జరుగుద్ది. అంత పెద్ద కల్లేసుకు అలా సూడమోక. సూస్తే సాచ్చం జెప్పాల. సెపితే నాలాగవుద్ది. ఎవరూ నిన్నాదుకోరు. మూసుకో... కల్లుమూసుకో...'

అనే డైలాగులు చూస్తే రవణ భాషని, భావాన్ని, ఉపమానాల్ని, ఊహల్ని కూడా తను సృష్టించిన వాతావరణాన్ని దాటనియ్యక తనపాత్రల తత్వాలకు మించిపోనివ్వక రాస్తాడని తెలుస్తుంది.

పల్లెటూరి కథ అంటే ఒక దుర్మార్గుడైన ధనికుడు, వాడికి ఎదురు తిరిగే పేదవాడు లేక ధనికుడి మేనల్లుడు – అనీ కథలో వుండే పాత్రలన్నిటికీ ఏదోరకం బంధుత్వం వుండాలని, వుండకపోతే చివరికి తప్పిపోయిన కూతురే కథానాయిక అని రక్తసంబంధం కలిపెయ్యాలనీ నమ్మే తెలుగు సినిమా నేతిబీరకాయలాటి దనడానికి ఈ రచన సాక్షి. దుర్మార్గులు, సన్మార్గులు విడిగా రెండు కులాల్లాగా వుండరని–పకీరు వూరికి దుర్మార్గుడైనా చుక్కకి మంచాడనీ ప్రతి మనిషిలోనూ మంచీచెడూ వుంటాయని– అలా చూపించటమే రచయిత చెయ్యాలిగాని ధనికుడి పక్కనో దరిద్రుడి పక్కనో నిలబడిపోయి ఉపన్యాసాలు దంచడం రచన కాదనీ నిరూపించటానికి ఈ రచన సాక్షి.

సినిమా కథకి హీరో ప్రబంధ నాయకుడిలా వుండక్కర్లేదని మనిషయితే చాలనీ, ఏ కులంలో పుట్టినా ఫరవాలేదనీ బల్లపరుపుగా కాకుండా అవసరానికి వెర్రెత్తో, ఆవేశం వచ్చో ముందడుగు వేయగలిగితే చాలనీ చెప్పటానికి ఈ రచన సాక్షి.

## బుడ్డిమంతుడు – బుద్ధిమంతుడు

బుద్ధిమంతుడు చిత్రంలో ప్రధానంగా కనబడే సంఘర్షణ అజ్ఞానానికి, విజ్ఞానానికి, మూఢనమ్మకాలకీ శాస్త్రీయ విజ్ఞానానికి, వాటి ప్రతిరూపాలైన గుడి–బడి ఆధారంగా ఈ సంఘర్షణ జరుగుతుంది. ఈ కథకు ఛాయ యిద్దరమ్మాయిలూ – ముగ్గురబ్బాయిలు



నవలలో కనబడుతుంది. రామనాధంగారిచ్చిన నాలుగువేలు కైంకర్యం చెయ్యటానికి గుడి ట్రస్టి ఎన్నిక పెడతారు. ఇది తెలిసిన రామనాధంగారు గుడి నిర్మాణం మానుకుని స్కూలు మాష్టరు శంకరయ్యకా డబ్బిచ్చి బడి బాగుచెయ్యటానికి వినియోగించమంటారు. ఈ వాక్యం చుట్టూ సర్వ జనరంజకంగా అల్లుకున్న రవణ మార్కు కథే బుద్ధిమంతుడు.

అన్న మాధవాచార్యులు గుడివైపు, తమ్ముడు గోపాలాచార్యులు బడివైపు నిలబడ్డారు. కారణాలు ఏవైనా, వాటికి దారితీసినవారు ఎవరైనా చివరికి సంఘర్షణలో నిలబడే పాత్రలే రెండే! నిజానికి ఈ పాత్రలు రెండుకావు. ఒక్కటే!

## అద్వైతం

దేవుడులేడు అనే నాస్తికభావం, ఉన్నాడు అనే ఆస్తికభావం ప్రతివాడిలోనూ వుంటాయి. అది పరిస్థితుల ప్రభావంవల్ల మనిషిలోని బలాన్నో బలహీనతనో ఊతంచేసుకుని పైకివచ్చి నిలబడతాయి. శుద్ధ ఆస్తికుడైన రామదాసుకూడా కష్టాల్లో భగవంతుణ్ణి ప్రశ్నించాడు నిలదీసి, యిందులో మాధవాచార్యులులాగే! దేవుణ్ణి ప్రకృతిని సవాల్‌చేసే ప్రయోగాలు చేస్తున్న శాస్త్రవేత్తలే సర్వశక్తి ఒకటుందని నమ్ముతున్నారు. ఎంతటి నాస్తికుడిలోను అంతరాంతరాళాల్లో ఆస్తికభావం వుంటుంది. కాకపోతే పరాయివాడి ముందు బయటపడదు. ఈ విరుద్ధ శక్తుల సంఘర్షణ ప్రతి మనిషిలో జరిగేదే! దీన్నే బయటకులాగి రెండు శక్తులకి రెండు రూపాలు ప్రసాదించి కథ నడిపాడు రవణ. రెండు శక్తులు ఒక రూపంనించే వచ్చినవిగనక రెండు పాత్రలను ఒకే వ్యక్తితో పోషింపజేశాడు దర్శకుడు. ద్విపాత్రాభినయానికి ఈ కథలో ఉన్న సార్థకత తెలుగు చిత్రసీమలో మరే కథకీ లేదు.

## వస్తునిర్దేశం

మనసా వాచా కర్మణా భగవదారాధన తప్ప అన్యమెరుగని మాధవాచార్యులు దినచర్యతోను, అతనిపట్ల ప్రజానీకానికి గల గౌరవ భావప్రదర్శనతోను ప్రారంభమైన ఈ కథ "మన పాపపుణ్యాలను దేవుడి పేరిట సరిపెట్టుకోవటం పొరపాటు. మనచేత తప్పు చేయించేది – లేనిది కావాలన్న దురాశ, వున్నది పోతుందన్న భయం, క్షమించేది – సాటి మానవుని మంచితనం...' అని మాధవాచార్యులకు గుర్తింపు కలగటంతో ముగుస్తుంది. మానవసేవే మాధవసేవ అని తీర్పు యిస్తాడు రవణ.

వైష్ణవతత్వానికి, ఆరాధనకి అంకితమైన శ్రీకృష్ణాపురం అనే గ్రామంలో జరిగిన ఈ కథలోని వ్యక్తులందరికి విష్ణు సంబంధమైన పేర్లు పెట్టడం రవణ ప్రత్యేకత.

"మాధవాచార్యులు, గోపాలాచార్యులు, రాధ, కస్తూరి, కామాక్షమ్మ, కావేరమ్మ, కోదండరామయ్య, శేషాద్రి, కృష్ణప్రసాద్, రామలింగం, రంగశాయి."

చిత్రం మొదటి సన్నివేశంలో నీలాటిరేవులో దిగి మాధవాచార్యులు అర్ఘ్యం విడుస్తుంటాడు. ఆయన గట్టు చేరేవరకు నీటికి వచ్చినవారు, ఇతరపన్లమీద వచ్చినవారు నీటిలో దిగకుండా నిలబడిపోయి వుండటం ఆయనమీద ఊరివారికిగల గౌరవానికి నిదర్శనం. ఆ సన్నివేశంలోనే గుడి పూజారిని భగవత్స్వరూపంగా భావించే పాతతరం బడిపంతులుతోపాటు కథనడవడానికి ముఖ్యాంగమైన స్వార్థపరుడు శేషయ్యని "నీకూ నాకు పూజారికి, ఆఖరికి ఆ గుళ్లో దేవుడికియ్యాడా ఇంత ముద్ద ప్రసాదించేవారు శ్రీ మన ప్రెసిడెంటు శేషాద్రిగారు. ప్రత్యక్షదైవం" అని పరోక్షంగా పరిచయంచేసే రామలింగంకూడా కనబడతారు. ఆ మాట అన్న వెంటనే రామలింగం కాలుజారి నీళ్ళలో పడటాన్ని చెప్పి శేషాద్రి, రామలింగాలకు జారుపాటు తప్పదని మొదటే సూచిస్తాడు రచయిత.

**బతకలేక బడిపంతులు**

రవణ రచనలు చాలావాటిలో కనబడే బడిపంతులు యిందులోనూ వుంటాడు.

'ఒరేయి చిట్టాడా, నువ్వు కరణంగారి ఇంటికెళ్ళి కాసింత కరేవేపాకు రెబ్బాను, ఉంటే పుల్ల చల్లాను యిమ్మన్నానని అడుగు" అనే డైలాగుతో పంతులుగారి బడి పరిస్థితి సూచిస్తాడు.

"బ్రతకలేక బడిపంతులన్నారు. నేను బడిపంతులై కూడా బతకలేకపోతున్నా' అని విచారించటం తప్ప బడిమాన్యానికి ఏం చెయ్యాలో ఆలోచించలేని దైన్యాన్ననుభవిస్తాడు కోదండరామయ్య.

**భ్రాంతిమంతుడు**

ఈ రచనలోని అన్ని పాత్రలకన్న విభిన్నమైన సృష్టి మాధవాచార్యులది. రవణ ప్రతిరచనలోను ఎక్కడో అక్కడ కనబడే కలల కలవరింతల మనస్తత్త్వ ప్రసరణ ఈ రచనలో ఈ పాత్రలో పరాకాష్ఠకు చేరింది. మాధవాచార్యులు శ్రీకృష్ణుడితో సంభాషిస్తూ వుంటాడు. ఇది ఊరంతటికీ తెలుసు. ఆయన మాట్లాడుతుండగా చూసిన యిద్దరు "ఏమో! ఆరిక్కనబడతన్నారేమో!' అనుకుంటారు.

కాలవొడ్డున కనబడిన రామలింగం మాధవయ్యను ఎగతాళి చెయ్యాలని "మన ప్రెసిడెంటుగారి పొడుంకాయ పోయింది. ఈ పూట దేవుడితో మాట్లాడినప్పుడు కనుక్కుని చెప్పరాదూ" అన్నప్పుడు "మంచిదిబాబూ! అలాగే అడుగుతాను. ఈలోగా మానవయత్నంగా మీరూ వెతకండి - పూజయ్యాక నేనూ వెతుకుతాను" అనే అమాయకుడు మాధవయ్య.



శ్రీకృష్ణుడు "రెప్పయినా వాలకుండా అలా ఎంతసేపు చూస్తావ్ విసుగులేదూ? అని అడిగినప్పుడు "తనివితీరనివాడికి విసుగెక్కడిది స్వామీ!" అన్న మాధవయ్య సమాధానం అతని ఏకాగ్రతను తెలియజేస్తుంది.

కృష్ణుడెన్నిసార్లు కనబడినా మాధవయ్య కోరికలు తీరిన దాఖలా కనబడదు. ఆస్తిపాస్తులు యధావిధిగా కైంకర్యం అయిపోతూనే వుంటాయి. శేషాద్రి మాధవయ్య దగ్గర తాళాలు లాక్కుని గుడికి దూరం చేసినప్పుడు కూడా దేవుడు మాధవయ్య పెరటికే వచ్చాడుగాని తలుపులు తెరిచి భక్తుడ్ని తన చెంతకు చేర్చుకోలేకపోయాడు. అలాగే గోపురం మీద కలశంలేచి మహిమ చూపించాల్సి వచ్చినప్పుడు కూడా మానవయత్నం చేసి గోపి కలశాన్ని లేపాడే కాని కృష్ణుడు చెయిచేసుకోలేదు.

అంటే శ్రీకృష్ణుడు కేవలం మాధవయ్య భ్రమేనన్నమాట! ఆ మాట ఆయన నోటితోనే అనిపించాడు రవణ.

"ఈ రూపం అంతా నీవు ఊహించి కల్పించుకున్నదే కదా! నేను నీ భ్రమనేకదా!"

"అవునయ్యా! నేను నీ కలని-భ్రమని. నీ ప్రశ్న, నా జవాబు కూడా నీ ఊహే కావచ్చుగా." అంటాడు కృష్ణుడు.

చివరి ఘట్టంలో మహిమను ప్రదర్శించమని మాధవయ్య అడిగినప్పుడు,

"మహిమలు మానేశానయ్యా. ఈ అవతారంలో కొన్ని చేసి తేలిక అయిపోయాను" అని కృష్ణుడితోను,

"అయ్యయ్యో! అంతమాటనకు. ద్వాపరంలోకన్నా కలియుగంలోనే మహిమలకి విలువ యెక్కువ" అని మాధవయ్యతోను అనిపించి అటు భగవంతుడిమీద, యిటు సమాజంమీద చురకలు వెయ్యగలిగాడు రవణ.

మాధవయ్యకి భార్యావియోగం కలిగింది. తాను నమ్మిన దేవుడికి ఆరాధన, అర్చన సరిగా జరగటంలేదు. తమ్ముడు గోపి భ్రష్టుడైపోయాడు. ఇల్లు జరిగే అవకాశం నానాటికి జారిపోతోంది-తానా అశక్తుడు. నోరుతెరిచి అడగలేడు. ఆ మూగస్థితిలో మాధవయ్య మనసు విప్పి మాట్లాడుకునేది, మాట్లాడుకోగలిగేది ఒక్క రాతిబొమ్మతోనే. అందుకే అతనికా భ్రమ. కాని మాధవయ్య మంచివాడు కావటంవల్ల తన భ్రమని 'క్యాష్' చేసుకోలేదు.

పగటి కలలకు, కలవరింతలకు జీవితంలో వున్న విలువ, అవసరం మాధవయ్య పాత్రలో సరిగ్గా నిరూపించాడు రవణ. పైగా కనబడని దేవుడ్ని ఆరాధించటమే ఒక కల. అందుకే మాధవయ్య బతుకు కలకు, భ్రమకు అంకితమైపోయింది.

**మణిపూసలు**

ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని రవణ రాసిన కొన్ని మాటలు మాత్రం చాలా విలువైనవిగా రూపొందాయి.

**కృష్ణుడు :** "నన్ను నమ్మనివాడికి నేనెలా కనపడగలను చెప్పు? నా మాట ఎలా వినిపిస్తుంది?"

"మానవా! నీకెంత అహంకారమయ్యా! నీకన్నా అందమైన రూపం లేదనేగా దేవుణ్ణి నీ ప్రతిరూపంగా తీర్చిదిద్దుకున్నావు?

**మాధవయ్య :** "నీ దశావతారాల తత్వం యిప్పుడు బోధపడింది స్వామీ! మత్స్య కూర్మావతారాలు ఎందుకెత్తావో, నరసింహుడివి ఎందుకయ్యావో, రాముడివై, పరశురాముడివై, కృష్ణుడివై సర్వ కులాల్లో ఎందుకు జన్మించావో అర్థమైంది. అన్ని జీవులలో, అన్ని జాతులలో, అందరిలో నువ్వేనని, అంతా ఒకటేనని మాకు చెప్పావు."

"భగవంతుడు కూడా మహిమలు చేసినపుడు – రాముడై పరశురాముడై – కృష్ణుడై, మనిషిగానే పుట్టి మనిషిగానే చేశాడు. మనిషికి మనిషే సాయపడాలని మనకి చెప్పడానికే అలా చేశాడు. యీనాడు నీ ద్వారా యీ మహిమ జరగడం సహజం."

**గోపి :** "శేషాద్రిలాంటి కిరాతకులు నీలాటి అమాయకుల్ని అడ్డుపెట్టుకుని ప్రజల్ని దోచుకుతింటున్నారే – అలాటి ద్రోహుల పక్షం వహిస్తాడా దేవుడు? చెప్పన్నయ్యా! నీ స్వామి ఎందుకు పలకాలి? మహిమ ఎందుకు చెయ్యాలి? అన్నయ్యా! నేను మనిషిని–చదువూ సంస్కారాల్లేని సామాన్యుడ్ని. దేవుడున్నాడో లేడో అని విమర్శించేశక్తి లేనివాడ్ని– నాకు తెలిసిన దేవుడు నా అన్నయ్యే."

ఈ పాత్ర సృష్టిలోను, కృష్ణుడు ప్రత్యక్షం కావటంలోను, రవణ కత్తి అంచుమీద సాము చేశాడనిపిస్తుంది. పదునైన అతని మాటల వెనక నడిచిన గంభీరమైన భావాలే ప్రజలకి ఆ సాము నచ్చేట్లు, మెచ్చేట్లు చేసినశక్తి.

సాక్షి చిత్రంలోలాగే యిందులోనూ పల్లెవాతావరణం కళ్ళకు చల్లగా కనబడుతుంది. 'నీలాటిరేవు, గుడి, బడి, పొలంగట్లు, గడ్డివాములు, తోటలు. మందువాయిళ్లు, ఎడ్లబళ్లు, పడవలు పల్లెటూరిని సమగ్రంగా ప్రత్యక్షం చేస్తాయి.

**పలుకుబడి**

పల్లెలో మనుషుల మాటలుకూడా వారి స్థాయికి తగిన పదజాలంతో నడుస్తాయి.

గోపి తల్లి కామాక్షమ్మగారు వైష్ణవతత్వం వంటబట్టిన పెద్దావిడ.



"చాలు. చాలు. విప్రవినోదాలు చాలు. అన్నయ్య వచ్చే వేళయింది ఒక్క ఘడియ ఆగరాదూ..." అంటుంది.

"విన్నావా రాధా! వారి ఉనికిన మంచి సంబంధాలున్నాయి" అంటుంది రాధ తల్లి కావేరమ్మ.

"గోపాలా! ఆయన్ని గురించి అవాచ్యాలు పలికితే కళ్లుపోతాయి. ఈపాటి ప్రసాదంకూడా దొరకదయ్యా" అంటాడు మాధవయ్య.

"రంభలా నువ్వుండగా కలుపుగడ్డి మేస్తాట్ట" అంటాడు శేషాద్రి తనకు తెలిసిన భాషలో.

రామలింగాన్ని చూసి "ఈ దుబ్బులో ఆ డబ్బు యెలా మొలిచింది?"

"ఏమిట్రా యీగడ్డి జేబులో మొలిచింది" అనీ అంటాడు.

శేషాద్రి అనే వాక్యాలలో 'గడ్డి' అన్నదిరాక తప్పదు అతని బుద్ధికి తగినట్లు. కామాక్షమ్మ అన్న 'విప్రవినోదాలు' కావేరమ్మ అన్న "వారి ఉనికిన" మాధవయ్య అన్న "అవాచ్యాలు, ప్రసాదం" పదాలు ఆ వ్యక్తుల మాటల్లోనే రావాలి.

**మరుపురానివి**

ఈ చిత్రంలో గుర్తుంచుకోవలసిన డైలాగు మరొకటి.

"రాధా! నీటిబొట్టు ఇసుకలోపడితే యింకిపోతుంది. సముద్రంలో పడితే ఆనవాలు తెలీకుండా పోతుంది. ముత్యపు చిప్పలో పడితే ముత్యమై ప్రకాశిస్తుంది. నిజమనేది కూడా అంతే! సమయం సందర్భాన్ని బట్టి రాణిస్తుంది."

శేషాద్రి గుమ్మడికాయ ఆధారంగా గడ్డివామిచాటున సరసమాడుతూ గోపి కళ్లబడతాడు. అక్కడ్నించి చిత్రం చివరివరకు 'గుమ్మడికాయ మీద ఒట్టు' అన్నది గోపీకి, రామలింగానికి వదలలేని పదమైపోతుంది. రవణ రాసిన ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ నవలలో 'పకోడి' అన్నపదం సుందరాన్ని ఎలా బెదరగొడుతుందో యిందులో 'గుమ్మడికాయ' అలా శేషాద్రికి సింహస్వప్నమవుతుంది.

రవణ ఈ చిత్రంలో రామలింగానికి వాడిన 'అమ్యామ్యా' కథానాయకుడు చిత్రంలో 'బరువు'లాగే లంచానికి పర్యాయపదమై ప్రచారం పొందింది.

సాహిత్యంమీద, రాజకీయాల మీద, విద్యావిధానంమీద విసుర్లు విసరడం ఈ సినిమా రచనలోకూడా రవణ మరచిపోలేదు.

**గోపి :** "చిన్నప్పుడు దేవుడంటే యిష్టమే! కానీ యీ మధ్య ఆయనకి నాకన్నా చెడు సావాసాలు ఎక్కువైపోయినాయి. ప్రెసిడెంట్లు, మేనేజింగు ట్రస్టీలు, దేవాంతకులు.."

**శేషాద్రి :** "అవతల జిల్లా పరిషత్తువాళ్ళు మూడేళ్ళనించి ఊళ్లో ఆస్పత్రి పెడతామంటే ఆపలేక చస్తున్నాను. ఇదిగో మా అబ్బాయి డాక్టరు అయిపోవచ్చిందీ అంటూ."

**కాంతమ్మ :** "స్కూలు గ్రాంటుపెట్టి వాడికి వైద్యం చదువు చెప్పిస్తే, ఆస్పత్రి గ్రాంటుతో నాకు నగలడిగితే తప్పా!"

**కృష్ణ :** "చదువుచెప్పే మాస్టర్ల జీతాలకి నిశాని దస్కత్తులు తీసుకుంటావా! నీకు బుద్ధుందాని."

**శేషాద్రి :** "ఈ డీయీవోలకి బొత్తిగా మతిలేకుండా పోతోంది. తిన్నది అరగక, స్కూళ్ళమీదపడి తనిఖీలని, గినిఖీలని ప్రాణాలు తీస్తున్నారు. పెద్దమనిషిని నేను స్వయంగా సంతకంపెట్టి స్కూలు మహారాజులా నడుస్తుందని వ్రాశాక కూడా వస్తాడాని."

"వారు తెలుగుపండితులండి. అన్ని క్లాసులకి వారే."

**సెక్సు సాహిత్యం**

అన్నిటిమీద విసిరిన చెణుకులకంటె బలమైనది, విలువైనది అందరూ ఒక్కసారి దృష్టిని కేంద్రీకరించాల్సింది ఒకటుంది. అదే సెక్సు సాహిత్యంమీద రవణ అభిప్రాయం. ఇందులో కృష్ణప్రసాద్ సెక్సు పుస్తకాలు తెచ్చి అమాయకురాలైన కస్తూరితో చదివించి ఆమె బతుకు నాశనంచేస్తాడు. అదే అస్త్రాన్ని ప్రయోగించి రాధను కూడా పాడుచెయ్యటానికి ప్రయత్నిస్తాడు.

బుడుగులో డిటెక్టివుల పిచ్చిమీద దండెత్తిన రవణ కలం ఇందులో లైంగిక సాహిత్యంమీద దండయాత్ర చేసింది.

మన దేశంలో పిల్లల మనసుల్ని కలుషితంచేసే ఈ చీడ సాహిత్యం పీడ వదిలించాలన్న ప్రయత్నం రవణ సినిమా రచనలో కూడా మానకపోవటం గమనించాల్సిన విషయం

**దాగుడుమూతలు**

రవణ చలనచిత్ర రంగంలో ప్రవేశించింది 'దాగుడుమూతలు' చిత్రంతో. మొదట రచన చేసిన సినిమా యిదే అయినా ముందు విడుదలయింది 'రక్తసంబంధం'.

మొట్టమొదటి రచన, పైగా స్వంతకథ కాబట్టి 'దాగుడుమూతలు' చిత్రంలో కొన్ని ప్రత్యేకతలున్నాయి.

**అమూల్యం**

డబ్బుతో ఏదేనా కొనవచ్చునన్నమాట నిజమేకాని కొన్ని సమయాల్లో డబ్బుకి విలువలేకుండా పోతుంది. లక్ష రూపాయలిచ్చినా ఎడారిలో మంచినీళ్లు పుట్టవు.



కోటి రూపాయిలు కుమ్మరించినా సముద్ర మధ్యంలో మంచినీటిచుక్క దొరకదు. పదికోట్లు పారేసినా అమెరికాలో నీ డబ్బుకి విలువరాదు. అక్కడి కరెన్సీవేరు.

ఈ విషయం రవణ చాలా రచనల్లో ప్రవేశపెట్టి సరదాగాను, గంభీరంగాను, కరుణరసాత్మకంగాను చెప్పటం అలవాటు చేసుకున్నాడు.

డబ్బుకంటె మానవత్వానికి విలువ ఎక్కువ. మంచి మనసుకు చల్లదనం ఎక్కువ. మంచిమాటకు రుచి ఎక్కువ.

తన కథల్లోను, తన సంభాషణల్లోను రవణ పొదిగివుంచే జీవిత సత్యం యిది.

'ఈశ్వరేచ్ఛ' కథలో టోకరాసురుడిగా పేరొందిన గజపతితో డబ్బుకి విలువలేదని, అవసరానికి ఆసరాయిచ్చే మంచి మనసుని ఏర్పాటు చేసుకోమని బోధిస్తాడు గుర్నాథం. ఈ హాస్య కథ వెనక ఎంతటి 'కోటీశ్వర్రావూ' మరో మనిషి సహాయసంపద లేకపోతే చిల్లుగానికి చెల్లదన్న ముత్యంలాటి సత్యం మిలమిల మెరసిపోతుంటుంది. ఇదే కథ 'బంగారు పిచిక' చిత్రంలో రాజబాబు కథగా అవతరించి ఖరీదైన హాస్యాన్ని అందిస్తుంది.

తన తొలిచిత్రం దాగుడుమూతలు కథ ఈ సత్యాన్నే ఆధారం చేసుకుని అల్లుకున్నాడు రవణ.

కాఫీ హొటలు సుందయ్య జమిందారు విశ్వసుందర్రావుగారి మనవడని తెలిశాక కోటీశ్వరుడవుతాడు. ప్రాణమిత్రులు చిత్రంలో రవణ రాసినట్టు "నువ్వు నన్ను కూడా నమ్మరాదు. ఎవర్నీ నమ్మకపోనూరాదు. డబ్బుగల వాడిచుట్టూ ఉన్నంతమంది దేవుడిచుట్టూ కూడా వుండరు. అయినా అంతటి ఏకాకి మరోడు వుండడు."

ఇదే పరిస్థితి సుందయ్యకు ఎదురవుతుంది. కాకుల్లా బలగం చేరినా అతను ఏకాకి. పక్కనుంటుందనుకున్న సుబ్బులు హఠాత్తుగా వదలి వెళ్ళిపోయింది. కాకులన్నీ కుట్రచేసి దొంగవిల్లు సృష్టించి భయపెట్టి, బాధపెట్టి పొడిచి పొడిచి హింసపెట్టాయి. ఆ హింస అతన్ని వెర్రెత్తించింది. కాకులు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పిచ్చివాడు ఆస్తి వారసత్వానికి అర్హుడు కాదని ఆస్పత్రిలో పెట్టించాయి. పోలీసుల కట్టడి చేశాయి. సుబ్బులేమైందోనన్న ఆత్రుత అతనికి ఊపిరి సలపనివ్వలేదు. పదిమందిని సింహంలా విదిలించి కొట్టి బయటపడ్డాడు. ఈ చర్య అతను పిచ్చివాడేనన్న అనుమానాన్ని నమ్మకంగా మార్చింది. ఊరికి దూరమై ఆత్మీయతకు దూరమై అన్నపానాలకు దూరమై దెబ్బతిన్న సింహంలా అడవిలో పడ్డాడు.

"సిట్టబ్బాయ్! నాకు పిచ్చిలేదు ఒట్టు. నీతోడు. నన్ను దాచరా! ఇయాలొక్క రాత్తిరికి దాస్తే రేపొద్దుటేలే మిల్లు, బంగళా, నాయాస్తంతా నీకు రాసిచ్చేస్తాను." అన్నమాటలు సిట్టబ్బాయిలో భయాందోళనలు కలిగించాయి. సుందయ్య పిచ్చివాడు. లేకపోతే ఆస్తిరాసిస్తాననంటాడా! అనుకున్నాడు.

సుందయ్య దాహంతో అంగలారుస్తూ పోతూ వుంటాడు. ఒక పడుచు చంకన కుండపెట్టుకు నీళ్లు తీసుకు వస్తుంటుంది. సుందయ్య అటూ యిటూ చూసి జేబులోవున్న నోట్ల కట్ట పైకి తీస్తాడు. ఆమె దగ్గరకురాగానే హఠాత్తుగా ఎదురు వెళ్తాడు.

**సుంద :** అమ్మా...మంచినీళ్ళు... దాహం.

**స్త్రీ :** ఆ! ఎవర్నువ్వు?

**సుంద :** నేను పిచ్చాణ్ణి కానమ్మా! ఇదిగో ఈ రూపాయలిస్తాను.

**స్త్రీ :** (ఏడుస్తూ) ఆం! అయ్యబాబోయ్! పిచ్చాడా–

దయనీయమైన ఈ సన్నివేశాలను డబ్బుకున్న విలువను తెలియ జెయ్యటానికి రాశాడు రవణ. ఆ పరిస్థితిలో సుందయ్యచేతిలో లక్షలున్నా పనికిరావు. బాపు 'బంగారం–సింగారం' కార్టూన్‌కథలో వాళ్ళ ప్రయాణంలో ఒకోచోటు మారగానే కరెన్సీ మారిపోతుంది. వీళ్ళ దగ్గరున్న కరెన్సీకి విలువ వుండదు. అనంతమైన కరెన్సీ యాత్రలో చివరికి వాళ్లు తెలుసుకునే సత్యం "దురాశ దుఃఖానికి చేటు" అని.

తనకు నచ్చిన ఈ జీవిత సత్యాన్ని తొలిచిత్రంలోనే చాటగలిగే అవకాశం రవణకు కలగటం అదృష్టమే!

### పాపాయి భాష

రవణ ఈ చిత్రంలో పిల్లల సన్నివేశాల్లో వాళ్ళ మనుసుల్ని అందంగా ప్రస్తరించాడు.

పద్మనాభం వేషం వేసిన పాపాయి అమాయకుడైన పిల్లడు. తెలివితేటలన్నీ అమ్మ సూరమ్మ కేకల్తో హరించుకుపోయి సొంత బుర్రమీద నమ్మకం పోగొట్టుకున్నాడు. వాచక పుస్తకాల్లో వాక్యాలే, ఆ భాషే అతనికి వచ్చు. పుస్తక (గ్రాంధిక) జ్ఞానం తప్ప ప్రపంచజ్ఞానం శూన్యమైనవాళ్లు ఎలా ప్రవర్తిస్తారో ఎలా మాట్లాడతారో అనటానికి పాపాయి మంచి ఉదాహరణ.

"తాతయ్యలకు బోల్డు ఆస్తివుండును. దానిని వాళ్లు మనుమలకు ఇచ్చెదరు. అంతవరకు మనము అమ్మడిని పెళ్ళిచేసుకోరాదు అని అమ్మ చెప్పును" అన్న వాక్యంతో పరిచయమవుతాడు పాపాయి. అతనికి ఆ భాషని ఆ వాక్యాన్ని రాయటం రవణ టెక్నిక్.

సుందయ్య వారసుడవగానే సూరమ్మగారికి ఉష్ణం వచ్చేస్తుంది. అమ్మడు, పాపాయి కలిసి సుందయ్యకి జరిగే గౌరవాల ధర్మామీటరుతో సూరమ్మ జ్వరం డిగ్రీలు కొలుస్తుంటారు.



**అమ్మ :** 115 డిగ్రీలు.

**పాపా :** బుట్టెడు రిస్టువాచీలు, తట్టెడు బూడ్సులు, సెంట్సులు.

**సూర :** ఆం–

అమ్మడు మళ్లా ధర్మామీటరు పెట్టిచూసి : అమ్మబాబోయ్! బెజవాడంత వచ్చేసింది.

**సూర :** బెజవాడేమిటే?

**అమ్మ :** అవునత్తయ్యా $118^0$ వుంది.

**సూర :** అమ్మో! అయిసు బాబో అయిసు. అయినా 118 డిగ్రీలుంటే మనుషులు బతుకుతారటే!

**అమ్మ :** ఆం! బెజవాడలో మనుషులు బతకటంలేదా?

**పాపా :** ఇంక లాభంలేదు. నీకిక్కడ ఐసు చాలదు. హిమాలయాలకి వెళ్ళిపో! పనిలో పని చైనావాళ్లు హడలి పారిపోతారు.

దొంగవిల్లు పాపాయి కంటబడుతుంది.

**పాపా :** అమ్మడూ...మరీ...మా అమ్మా మీ నాన్నా ఖైదుకెళ్తున్నారే ... మనిద్దరం వుండగలమా!

**అమ్మ :** అదేమిటి బావా?

**పాపా :** మరి దొంగవిల్లు రాశారుగా ఇద్దరూ...

అమ్మ : దొంగ విల్లేమిటి బావా?

పాపా : ఏమోనమ్మా నా కదంతా తెలీదు. అనగనగా ఒక దొంగవిల్లు.. అందువల్ల అమ్మకి నాన్నకీ జేలు...

హిమాలయములలో మంచు వుండును, అక్కడ చైనావారు ఆక్రమించిరి అనీ – అనగా అనగా దొంగవిల్లు అని వాచక పుస్తకాల భాష తప్ప పాపాయికి మరోరకం తెలుగురాదు. ఈ రకం తెలుగు మాత్రమే నేర్చుకుంటున్న విద్యార్థులు యిలాగే తయారవుతారని రచయిత బాధ. అందుకే బహుళ ప్రచార సాధకమైన సినిమాలో సెటైర్ ద్వారా ఈ సందేశం పొదిగాడు.

సుందయ్య చెల్లెళ్ళలో చిట్టి సుబ్బుల్ని చూసి దొంగ అనుకుంటుంది.

**చిట్టి :** అక్కా– అక్కా – దొంగొచ్చింది.

**సీత :** నీ మొహం – గ్రామరు తప్పు – దొంగొచ్చాడు అనాలి.

అని కరెక్ట్ చేస్తుంది తన వ్యాకరణ జ్ఞానం ప్రదర్శిస్తూ.

పాపాయిని పట్టుకు శిక్ష వేసినప్పుడుకూడా వాళ్ళ దృష్టిలో కష్టమైన పనులన్నీ పాపాయిని చెయ్యమంటారు పిల్లలు. గుంజీలు తియ్యటం, బెంచెక్కటం, గోడకుర్చీ వెయ్యటంతోపాటు వాటికంటె కష్టమైన పదమూడో ఎక్కం చెప్పమంటారు పాపాయిని.

దొంగవిల్లు పిల్లల కంటబడినప్పుడు అది వాళ్ళకర్థంకాదు. రాసిందే రాసేప్పటికి కాపీలు రాసుకుంటున్నారు పెద్దవాళ్ళనుకుంటారు. 'ఆస్తి యావత్తు ఏమిటి యావత్తు, కావత్తు' అని అనుమానం వస్తుంది ఆ పసిమనసులకి.

సుబ్బులు వెళ్ళిపోతుందన్న కోపంతో తమ ఖోపాన్ని క భాషలో చెబుతారు సుందయ్యకి.

"కసుకబ్బుకలు కవెకళ్ళికపోకతోంకది" అని.

పిల్లల మనస్తత్వాన్ని, పిల్లడిలాటి పాపాయితత్వాన్ని హాస్యంతో పాటు కథకీ అన్వయించుకోవటానికి తగిన అవకాశం రవణకి దాగుడుమూతలు చిత్రంలో బాగా లభించింది.

**పాత కథ**

విశ్వసుందర్రావుగారికి మందిచ్చే ఘట్టంలో ఏడుగురు రాజకుమారులు చేపల కథలాగా నేరం ఒకరిమీంచి ఒకరిమీదికి తోసేస్తారు బలగం అంతా. ఈ పాతకథ టెక్నిక్ ఎలా వాడుకున్నాడో అలాగే బలగాన్ని పరిచయం చెయ్యటానికి కొత్తటెక్నిక్ వాడుకున్నాడు రవణ.

**కొత్త టెక్నిక్**

మీ సంగతి చూసేవాళ్లెవరూ లేరా అని డాక్టరు అనగానే "ఎందుకులేరూ.... ఉన్నాం ఉన్నాం – మేమంతా వున్నాం... మేం చేస్తాం మేం చూస్తాం" అంటూ గుంపంతా బిలబిలమంటూ వస్తారు. ఆగండి అనే కేకతో ఎక్కడివాళ్ళక్కడ బొమ్మల్లా నిలబడిపోతారు. రచయిత కామెంటరీతో వాళ్ళ సంక్షిప్త పరిచయం చేస్తాడు. వారసులు బేవారసులు అందరి సంగతీ చెప్పి "డాక్టరుగారి చాదస్తమే తప్ప ఎందుకుండరూ.. వున్నారు... వుంటారు... బోలెడుమంది" అంటాడు రచయిత అవహేళనతో కసిగా.

**ఉపమానాభిమానాలు**

"ఏంది రాజూ! బకాయి మొక్కుజుట్టులా పెంచేస్తున్నావు" అన్న సుందయ్య డైలాగులోను,

"ఆ యొక్క పాయసంలో గరిటలా" నిస్వార్థంగా వున్నానని చెప్పుకునే నక్కజిత్తుల భూషణం డైలాగులోను ఉపమానాల్ని ఎంత అందంగా వాడాడో – విశ్వసుందర్రావుగారి



దుఃఖం కళ్ళకు కట్టేట్లు అంత బరువైన వాక్యం రాశాడు రవణ.

"ఈ కన్నీరు నాదికాదు. నా బిడ్డది. నా కోడలిది. వాళ్ళకి వాళ్ళ బిడ్డకి నేను చేసిన అన్యాయానికి..వాళ్లు నా కంటితో దుఃఖిస్తున్నారమ్మా."

ఆస్తికి వారసుడయ్యాక "ఎదవడబ్బు..ఎదవాస్తి...ఎదవ తెలివితేటలూ..." అని తిట్టుకున్న సుందయ్య పేదవాడిగా వుండగా తనకు తన చిన్న చెల్లెళ్ళకి సుబ్బులు పెన్నిధిలా దొరికిందనుకున్నాడు. ఆమె ఉద్యోగానికి వెళ్ళిపోతానంటే అతను పడే బాధ, వేదన, దైన్యం, నిరాశ, కోపం అన్నీ తేలిక మాటల్లోకి అత్యద్భుతంగా తర్జుమా చేయగలిగాడు రవణ.

**సుంద :** "ఎవడాపాడు, ఎవడొద్దన్నాడు? ఈపాటిదానికీళ్ళతో ఎందుకు సనువుగుండాల...ఎందుకని? ఎందుకాశ పెట్టావని... ఈడే వుంటానని ఎందుకూరించావని.. ఎవడు చెయ్యమన్నాడిదంతా... ఇంకా ఎల్లలేదేం? ఎల్లు–

రేపు మేమందరం బెంగెట్టుకు సిక్కిపోతే, సచ్చిపోతే నీకేటి? పోతేపోతాం – ఎల్లండి – ఎవరెవరి కెల్లాలనుందో ఆళ్ళంతా ఎల్లిపోండి–

ఒటేలాడింటో వూరికే వుంటం బాగోదంటే బిల్లుకట్టి వుండచ్చుగా! అది కుదర్దుమళ్ళీ – సత్తురూపాయికే దిక్కులేదు – ఎల్లెల్లు. గాత్రం కేసులు మాకెందుకు – ఎల్లు... పిల్లలు బెంగెట్టుకేడుస్తారు... సుందయ్యగాడు మతోయి యీదులెంటపోతాడు... ఆ వోటలు కాస్తా మూతపడుద్ది. టిపినీ దొరక్క మిల్లాళ్లు పోతారు. మిల్లూపోద్ది. నీవుజ్జోగమూ పోద్ది – అపుడు మళ్లా వుజ్జోగం కావాలంటా నువ్వే ఈడకొస్తావ్– ఎవడుంటాడిక్కడ?"

ఇందులో సుందయ్య ఉద్వేగంతో అనే మాటల్లోనే "పిల్లలు బెంగెట్టు కేడుస్తారు... సుందయ్యగాడు మతోయి యీదులెంటపోతాడు" అని జరగబోయే కథకు సూచనగా బీజం వేస్తాడు రచయిత.

**'పద్మశ్రీరస్తు'**

పద్మశ్రీవారి 'ప్రాణమిత్రులు' చిత్రం మంచి రచనకో ఉదాహరణ. ఈ చిత్రానికి ప్రాణభూతమైన వస్తువును 'బెకెట్' అనే ఆంగ్ల చిత్రం నించి తీసుకున్నా, ఆ ప్రాణం పంచప్రాణాలలో ఒకటి మాత్రమే. ఆవేశకావేషాలతోను, ఆత్మీయత అనురాగాలతోను సజీవంగా రూపొందిన పాత్రలు, విశాఖపట్టణం ఓడరేవు కల్పించిన వాతావరణం, వడిగానడిచే కథనం మిగిలిన మూడు ప్రాణాలు.

ముఖ్యమైన అయిదో ప్రాణం సన్నివేశ కల్పన. రెండో కన్నుగా చూసుకుంటున్న చిన్నను తల్లి వెళ్ళగొట్టే సన్నివేశం, బాబు తన అనురాగ బంధంతో అతన్ని వెళ్ళకుండా

కట్టేసే సన్నివేశం, విద్యాధికుడైన చిన్న – దివానును హఠాత్తుగా అదరగొట్టే సన్నివేశం, ప్రాణానికంటె అధికమైన సుమిత్రను తనకు అంకితం చెయ్యమని బాబు అడగటం, చిన్న ఆచరించటం, ఆ సన్నివేశమే బాబులో మార్పురావడానికి కారణం కావటం, బాబు వివాహంనాటి రాత్రి బాబు, చిన్న, పద్మ, సుమిత్ర అనుభవించిన మూగవేదన చిత్రించే సన్నివేశం, చిన్న నిండైన మనిషిగా మారటం, బాబుకి ఎదురొడ్డి నిలవటం – మొదలైన ఈ సన్నివేశాలన్నీ ప్రతి ప్రేక్షకుడ్నీ కదిపేసి, కుదిపేసి, గుండెలకు పట్టేస్తాయి. ఇన్ని 'కింగ్ షాట్స్' చాలా తక్కువ చిత్రాలలో జమపడతాయి.

తను రాసుకున్న ప్రాణమిత్రులు స్క్రిప్టుని 'పద్మశ్రీరస్తు' అని ప్రారంభించాడు రవణ. ఇలాటి జోకులు సినిమాలోకి రాకపోయినా తనకోసం రాసుకున్నట్లే స్క్రీన్‌ప్లే కూడా తనకు బొమ్మ కళ్ళకు కట్టేట్లు – దర్శకునికి తన రచన మార్గదర్శకమయ్యేట్లు రాసుకోవటం రవణ కలవాటు. ఈ మూడు దృశ్యాల రచన చూడండి.

### దృశ్యం 1

"రావు బహద్దర్ రామచంద్ర అప్పారావుగారి రాజ ప్రాసాదం. భవనం ఎదురుగా చౌకులో ఎవరో మహాపురుషుడి శిలావిగ్రహం ఠీవిగా నిలబడి వుంది. అప్పుడే దానికి ఆవిష్కరణోత్సవం జరుగుతోంది. దీప తోరణాలతో భవనం, ప్రాంగణం, సభావేదిక శోభాయమానంగా వెలిగిపోతున్నాయి. హర్షజయధ్వానాలు మారుమోగుతున్నాయి.

### దృశ్యం 2

అదే స్థలం. అర్ధరాత్రి. భవన ప్రాంగణం గేటుపై ఇరువైపులా దీపాలు నౌకల ఆకారంలో నిర్మించినవి రెండు, శిలావిగ్రహం దగ్గర నాలుగు మినహా అంతా మెత్తటి పల్చటి చీకటి. అంతటా నిశ్శబ్దం.

ఒక వ్యక్తి భవన సింహద్వారం తెరచుకుని బరువుగా నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వస్తున్నాడు. ఇనపగేటులో చిన్నగేటు తెరచుకుని బయటకు వచ్చాడు. శిలావిగ్రహం వున్న వేదికను సమీపించాడు. ఒక్కసారి చూశాడు.

### దృశ్యం 3

పల్చని పొగమంచు తెరలో విగ్రహం మసక మసకగా కనిపిస్తోంది.

ఆ వ్యక్తి – బాబు.

నిట్టూర్చి మెట్లమీద కూలబడ్డాడు. 'చిన్నా' అని రెండు చేతులలో తలదాచుకుని ఒక్కసారిగా భోరున ఏడ్చాడు."



**కవితావతరణం**

సంభాషణలు ఒకోచోట కవిత్వంలాగా పదునుగాను, పసందుగాను సాగుతాయి.

**చిన్న :** బాబూ! గోదావరివంటి అఖండమైన నదికూడా కొండలమీద ఆడుకున్నంతసేపు ఆడుకుని, మైదానాలలో నిండుగా సాగి సాగరం చేరేముందు ఏడు పాయలై నడిచి మళ్ళీ కలిసింది. జీవితంకూడా అంతేబాబూ....

ఇలాటిరచన సంభాషణలలోనే కాకుండా మామూలు సన్నివేశంలో కూడా, "బాబు పక్కున నవ్వాడు. అది చిన్నకెంతో యిష్టమయిన నవ్వు. చిన్నకెంతో అర్థమయ్యే నవ్వు. ఏడుస్తున్న చిన్న కళ్ళల్లో కన్నీటి తెరల వెనక నవ్వుల దీపాలు వెలిగాయి" అని రాస్తాడు రవణ. పాటలుండాల్సిన సన్నివేశంలో పాటల రచయితలకు సూచనగా వుండేట్లు సన్నివేశం నడక సుందరంగా వుంటుందని ముందు తన మనసుకు నచ్చేట్లు రాసుకోవటం రవణ స్క్రిప్టుల్లో కనబడుతుంది.

చిన్న బాబుకి మేలుకొలుపు పాట పాడుతున్నాడు.

"సాయంకాలం అయింది. నీలాటిరేవు దగ్గరకి అమ్మాయిలు వస్తున్నారు. పిల్లగాలులు, మల్లెవాసనలు, మబ్బుకన్నెలు సేవించడానికి సిద్ధంగా వున్నాయి. మేలుకో బాబూ! కళ్లుతెరిచి చల్లని వెన్నెలలతో లోకాన్ని వెలిగించు."

**సుమిత్ర పాట**

సుమిత్ర నిద్రనటిస్తున్న చిన్న మీదికి వాలి చూపుడువేలుతో సుతారంగా అతని కనురెప్పలమీద తట్టింది.

"తలుపు...తలుపు... తలుపూ" అంది.

మెత్తని పలుకు తీయని పాటై జాలువారింది.

"వలపుల తలపులలో గుండె కిటకిటలడుతోంది. కనుల తలుపులు తెరుచుకు రావాలని తహతహలాడుతున్నాయి స్వామీ! కలువ కనుల తలుపు తెరచి వాటిని రానీ... అవి సిగ్గుపడితే పోనీ నేనేనా వస్తా... జాగు చేయక తలుపు తెరు.

వనిత తనంత వలచి వచ్చినదని తెలుసా? దోచుకుపోతుందని భయమా? నాకా అధికారముందిలే. ఎన్నాళ్ళనించో నాపై దాచినవీ తలపులు...

బుగ్గలు ఎర్రబడ్డాయే! మగవాడికి సిగ్గేల? కాదా! ఇది అలుకా! కాక ఆనాటి చిరుదెబ్బ ఎరుపులేనా?

దొంగా! నన్ను తప్పించుకు ఎక్కడికి పారిపోతావు? ఎంతదూరం పోతావు? ఎంత పరుగెత్తినా నా వలపు కోవెల మునివాకిలి దాటిపోలేవు.

గోపాలా... ఇంకా కోపం పోలా! ఆనాటి చెంపదెబ్బ చెంగుపట్టి లాగినందుకు కాదు సుమా! బజారులో అల్లరి పెట్టినందుకు – నన్ను మన్నించు – చేరదీసుకో."

ఈ రచన సినిమాలో కనబడకపోయినా, కనిపించదని తెలిసినా రచయిత తనకోసం, తన ఆనందంకోసం చేసుకున్నాడనిపిస్తుంది.

**చిత్ర జీవితం**

రవణ యిప్పటికి ఇరవైచిత్రాల వరకు రచన చేశాడు. అందులో పదిహేను చిత్రాలకు సంభాషణలు, మిగిలిన అయిదు చిత్రాలకు కథలు సమకూర్చాడు. ఎనిమిది చిత్రాలు తనురాసిన కథలతో రూపొందించబడినాయి.

దాగుడుమూతలు చిత్రంతో ప్రారంభమైన ఈ చిత్ర జీవితంలో తన సాహిత్య జీవితంలో సంపాయించుకున్న మణులను కొన్నిటిని భద్రపరుచుకోగలిగాడు. కొన్నిటిని మెరుగుపెట్టుకోగలిగాడు. కొన్నిటిని అందరు సినిమా రచయితల్లాగే జారవిడుచుకున్నాడు.

తను సాహిత్యంలో సృష్టించిన అప్పారావుని, రెండుజళ్ళ సీతని 'రక్తసంబంధం' చిత్రంలోకి బ్రాటోవరు చేసుకున్నాడు.

"నీ స్నేహితుడు రాజు లక్షాధికారయ్యాడు. వాడిదగ్గరకు వెళ్ళి...." అని తల్లి చెబుతుంటే

'వందో వెయ్యో అప్పడుగు' అంటాడు అప్పారావు కటిక్కిన. 'నిన్నటిదాకా నాతో పనిచేసినవాడిదగ్గరకు వెళ్ళి ఉద్యోగం అడగడమా' అని బావగారు కటకటపడుతుంటే.

"అందుకే అప్పడగమన్నాడు అప్పారావు" అంటాడు మళ్ళీ తన ఊహకు తానే మురిసిపోతూ–

రెండుజళ్ళ సీతని వశపరచుకోటానికి జలంధర్ ఉంగరం అచ్చిరాకుండా పోయాక సీత కుక్కని సంచిలోకి పట్టి ఎత్తుకొస్తాడు అప్పారావు. అందులోంచి పిల్లాడి ఏడుపు రావటంతో

"సంచిలో కుక్కపిల్ల తెలుగులో అయ్యో అని అరచుట."

"కుక్కపిల్ల కుర్రకుంకగా మారుట."

అని ప్రకటనలు చేస్తాడు అప్పారావు, ఋణానందలహరిలో ఉపశీర్షికల్ని అనుకరిస్తూ–

హాస్యసంభాషణలేకాక, వర్కర్లను వెనకేసుకొచ్చిన ఆనంద్‌తో రాజు– "నువ్వు నీ జీవితానికి పునాదులు వాళ్ళ పతనానికి గోతులు తవ్వుతున్నావు" అన్న బరువైన సంభాషణలు చిత్రమంతటా ధ్వనించి చిత్రానికి నిండుతనాన్నిచ్చాయి.



"గుడిగంటలు" చిత్రంలో పాతికవేలిస్తేగాని కోడల్నింటికి రానివ్వనన్న భద్రయ్య పరాకుగా వుండగా ఒకసారి కిష్టయ్య అడుగుతాడు.

**కిష్ట :** నాన్నా! నాకో పాతికవేలియ్యవూ?

**భద్ర :** ఎందుకుబాబూ!

**కిష్ట :** బటాణీలు కొనుక్కుంటా (అంటాడు ముద్దుగా.)

సరదాగా ప్రారంభమయ్యే ఈ చిత్రం ఒకో మలుపుకి బరువుని పెంచుకుంటూ ట్రాజి–కామెడిగా సాగుతుంది. కథలో ప్రధాన వ్యక్తి అయిన కస్తూరి హీరో వాసుతో చెప్పే మాటలు చూడండి.

"పెదవులమీది చిరునవ్వు అల్పమైన సుఖానికి, సంతోషానికి పుడుతుంది. ఇట్టె చెరిగిపోతుంది. ఈనాడు మనసారా మీకు సేవ చేయటంవల్ల కలిగే ఆనందం గాఢమైనది. అది హృదయంలో పుడుతుంది. అక్కడే ఉంటుంది. పెదవులదాకా రాదు."

బంగారు పిచిక, దాగుడుమూతలు చిత్రాలలో ఆర్థిక విధానం మీద, సాక్షి చిత్రంలో అర్బనైజేషన్‌మీద ఎలా సెటైర్ రాశాడో అలాగే బాలరాజు కథలో విదేశాలమీద వుండే మోజును ప్రస్తావించాడు రవణ.

**బాల :** అమ్మా! మిస్ – మీరు దొరగారండి?

**రాణి :** నో నో – తెలుగావిడే!

**ప్రసన్న :** యా! అయామ్ తెలుగూస్...

**కనక :** మన కాకరుపర్రు పిల్లేనోయ్... కాపోతే వాళ్ళక్క అమెరికా వెళ్ళిందట.

అక్కణ్నించి బాలరాజు ప్రసన్నని మిస్ అమెరికా అని ఏడిపిస్తాడు.

బాలరాజు చిత్రంలో మల్లయ్యనోట పలికించిన 'పనిగండం' జనానికి బాగా పట్టింది.

తను రాసిన కొన్ని చిత్రాలు తమిళ చిత్రాలకు అనుసరణలైనా రవణ వాటిని తెలుగుతనంతో నింపుతాడు. 'పాశమలర్' చిత్రానికి అనువాదమైన 'రక్తసంబంధం'లో అప్పారావు, రెండుజళ్ళ సీతలకి వేషాలు రవణ చెయి జేసుకోవటంవల్లే వచ్చాయి. అలాగే 'ఆలయమణి' చిత్రంలో అంతగాలేని కిష్టిగాడి పాత్ర 'గుడిగంటల్లో' అప్పారావులాగే ఆడిపోతుంది.

ముఖ్యంగా 'వా రాజా వా' చిత్రం ఆధారంగా తీసిన బాలరాజు కథలో మల్లయ్య పాత్ర రవణ మార్కు సంభాషణలకి, సెటైర్‌కి చోటిచ్చింది. తమిళ చిత్రంలో కొంతసేపే కనబడే అన్నపూర్ణను తెలుగులో నిండైన తల్లిగా రూపొందించి, చిత్రంలో కరుణ రసాత్మకమైన సంఘటనలకి అవకాశం కల్పించాడు రచయిత.

### కులగోత్రాలు

సామాన్యంగా తెలుగు చిత్రాలలో ఒక కథలో కనబడే పాత్రలన్నిటికి ఏదోరకం చుట్టరికం వుంటుంది. అంతా ఒక కుదుట్లోవాళ్లే అవుతారు చివరికి.

చాలా చిత్రాలలో కులాంతర వివాహం సమస్య కాకపోవటం వల్ల దాన్ని అంతర్లీనంగా వుంచేసి బుద్ధిమంతుడి చిత్రంలో మాత్రం కులాంతర వివాహం గురించి కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు రవణ. గోపి రాధను చేసుకోవటం వర్ణసంకరమన్న మాధవయ్య మాటకు శ్రీకృష్ణుడే జవాబు చెప్పాడు. "నువ్వు చెయ్యటంలా వర్ణసంకరం? నా నైవేద్యం కళ్ళకద్దుకుని తింటున్నావు, నేను క్షత్రియులయింట పుట్టానని, గోపాలకుల యింట పెరిగానని యెరుగవా? మరచిపోయావా?" కులాలు, జాతులు మానవ కల్పితాలని, అంతా ఒకటేనని చెప్పటానికే భగవానుడు అన్నికులాల్లో, జాతుల్లోను అవతారాలెత్తాడని మాధవయ్య గ్రహిస్తాడు. కులాంతర వివాహాలను ఛాందసులతో వప్పించటానికి రవణ ఈ వాదాన్ని బాగా ఉపయోగించుకున్నాడు.



**రమణ, మోహన్‌బాబు, ఎమ్వీయల్**






# పంచరత్నాల కథ

ఆకలీ ఆనందరావూ, మహారాజు యువరాజు, ఛాయలు, జనతా ఎక్స్‌ప్రెస్, కానుక – మంచి ముత్యాల్లాటి అయిదు కథలు. పంచరత్నాలని అనుకున్నా–కోవచ్చు.

### మధ్యతరగతి మధ్య

మొదటి నాలుగు కథల్లోను మధ్యతరగతి మనుషులు పాత్రధారులు. అందరి ఆశలు కలలు, కోపతాపాలు, ఆవేశాలు, కావేషాలు, బాధలు బరువులు అన్నీ ఒక్కలా వుంటాయి. ఈ వ్యక్తులతో ఏ కథ రాసినా రవణ వారి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితిగతుల్ని దృష్టిలో పెట్టుకునే పాత్ర చిత్రణను, రచనకు పరమార్థాన్ని నిర్ణయిస్తాడు.

రవణే కాదు ఏ రచయిత మధ్యతరగతి జీవితాన్ని తీసుకున్నా ఆ పరిధులలోనే రాయాలి. ప్రస్తుతం వస్తున్న రచనలు ముఖ్యంగా నవలలు కిందితరగతిని మధ్యతరగతిని

పూర్తిగా వదిలేసి గాలిలో సాము చెయ్యటమే నేర్చుకుంటున్నాయి. ఈ వ్యాసరచనకు పరమార్ధం వాటి విమర్శ కాకపోవటం వల్ల నేల విడిచి సాము చేసిన సాహిత్య వ్యాసంగం వదిలి సుఖదుఃఖా లనుభవించే మనుషులకోసం సుఖ దుఃఖాలనుభవించే మనుషుల గురించి రాసిన రవణ కథలు పరిశీలిద్దాం.

ఈ మంచి ముత్యాలేకాక రవణ రాసిన మిగిలిన ముత్యాల్లాటి కథలు కూడా మధ్యతరగతి మనుషుల కథలే. వాళ్ళ ప్రేమలు, వాళ్ళ రాజకీయాలు, వాళ్ళ డబ్బు ఇబ్బందులు వాటివల్ల కొత్తగా అలవర్చుకుంటున్న తెలివితేటలు – ఫలితాలు వగైరాలే తప్ప 'ఈలోకమునందంతయు సుఖముగా నున్నది.' అనే కథ ఒక్కటికూడా రవణ రాయలేదు. ఆ కథల కథ మరోచోట వస్తుంది కాబట్టి ప్రస్తుతం ఈ అయిదు కథల విశేషాలు చూద్దాం.

మధ్యతరగతి మనుషులంతా మాజీ భూకామందులే. ముందు తరంలోనే ఆస్తులు కరారావుడి చుట్టుకుపోగా తాము తమ కొద్దిపాటి చదువులతో మిగిలినవారై ఎన్జీవోలగానో, మాస్టర్లగానో – నిరుద్యోగుల గానో కాలం గడిపేస్తున్నారు. కిందితరగతి వారికి వారిస్థాయికి తగిన కోరికలే వుంటాయి. అటు పైకెగరలేక త్రిశంకుస్వర్గంలో వేలాడే మధ్యతరగతికి చేతులకందని ఆశలెప్పుడూ నక్షత్రలోకంలో మిలమిల మెరుస్తూ వుంటాయి. వాటిపై ఆశ చావదు. చంపుకోటానికి మనసొప్పదు. చంపుకుంటున్నట్టు మరో కంటపడటంకూడా గిట్టదు. అసలీ మధ్యతరగతి జనాభాలో ఒకరిపొడ మరొకరికి గిట్టటం చాలా అరుదుగా జరుగుతుంది. అందుకనే ఆశలలోను, ఆశయాలలోను పోలికలుండవు. ఒకరికి కారుపై, మరొకరికి మేడపై, ఇంకొకరికి అమెరికాపై మోజు. ఆ మోజు తీరేది కాదు. ఫలితం కష్టాలు, ఒకర్నొకరు అసహ్యించుకోడాలు, ఎవర్నివారు అసహ్యించుకోడాలు, అసూయలు, కన్నీళ్లు.

ఈ దుస్థితి, అస్తవ్యస్త పరిస్థితి, మధ్యతరగతి కుటుంబంలో ప్రతి వ్యక్తీ అనుభవిస్తాడు. ఈ వెలుగునీడల పడుగుపేకల జీవితాలను దర్శించటానికి ప్రదర్శించటానికి రచయితకు అబ్జర్వేషన్ కావాలి, బాధ కావాలి, తపన కావాలి, జాలి కావాలి, నిజాయితీ కావాలి. అవన్నీ వున్న రచయిత రవణ.

**ఆకలీ ఆనందరావూ**

ఆనందరావు నిరుద్యోగి. ఆకలి అతని యింటిపేరు యంతమాత్రం కాదు. అతని తరవాత తరాలవారికి ఇంటిపేరుగా మారుతుందేమో ప్రస్తుతం చెప్పలేం!

"బజారులో భోజన హోటలు బోర్డుల నీడలో తొమ్మిది గంటల మీద ఇరవై మూడు నిముషాలమీద – ఇంక సరిగ్గా ఏడు నిమిషాలలో భోజన హోటలు మూస్తారు."



ఈలోగా అతనో రూపాయి సంపాయించి భోంచేశాడా చేసినట్టు లేకపోతే–

లేకపోతే మరేంలేదు. భోజనం లేకుండా గడిచిపోయిన రోజుల్లో ఆ రోజు కూడా జమపడి సంఖ్య నాలుగో అయిదో అవుతుంది. అతనేం నిరాహారదీక్ష పూనలేదు. అలా పూనుకునే తెగింపు, సత్తా వుంటే అతని ఆకలి ఏనాడో తీరేది. అయినా తీరేది కాదేమో!

"వెంటనే భోజనం ఏర్పాటు చెయ్యి" అన్నాడు కడుపులో కాముడు.

ఆనందరావు మొండి. ఇన్నేళ్ళ నిరుద్యోగ సర్వీసులో అతను నేర్చుకున్నది అదే! మొండితనం.

"నువ్వు బెదిరిస్తే ఇక్కడ ఝడిసేవాడు లేడు." అన్నాడు కాముడికి జవాబుగా.

ఒక మిత్రుడు కనబడి "వెరీసారీ. లేదండీ. ఇందాక మీరు సినిమాకు వెళదాం అన్నప్పుడు సందేహించానందుకే. నిజానికి నా దగ్గరున్నది అంటే ఇపుడు, ఆరుకానులు" అన్నాడు సగౌరవంగా.

ఆనందరావు దగ్గర అదికూడా లేదు. అయినా సరే సినిమాకెళ్దాం అని ముందు తనే అన్నాడు. అదే మధ్యతరగతి మనిషి ప్రదర్శించే డాంబికం. తెచ్చిపెట్టుకుని తిరిగే అహంకారం.

"ఫరవాలేదులెండి. కాని ఆ ఆరుకాన్లు ఇవ్వండి చెప్తా. మవుంటు రోడ్డులో ఒకడు డబ్బివ్వాలి. అక్కడికి వెళ్తా. థాంక్యూ. రేపు వస్తారుగా సినిమాకు? డబ్బు ఒకవేళ లేకపోయినా మానకండి. నాదగ్గర బోలెడుంటుంది" అంటాడు.

నిజానికి ఆనందరావు ఆ ఆరుకాసులు తీసుకుని ముష్టివాడికంటె హీనమైపోయాడు. అయినా ఆ సంగతి ఒప్పుకోడు. అది నిరూపించటానికే ఆనందరావుకి ఒక ముష్టివాడితో భేటీ ఏర్పాటుచేశాడు రవణ.

**అహంకారం**

"మూడు రోజులయిందండి భోంచేసి. మాదీ వూరు కాదండీ" అన్నాడు ముష్టివాడు.

ఆనందరావు గొణుక్కున్నాడు. నేనూ అంతేనోయ్ మాది ఈ వూరుకాదు అన్నాడు. అంతేకాని నేనూ భోంచేసి మూడురోజులయిందని చెప్పలేదు, చెప్పలేడు. 'మింగమెతుకు లేకపోయినా మీసాలకు సంపెంగ నూనె' రాయటానికి ప్రయత్నించే జాతి మనుషుల్లోంచి వచ్చాడు ఆనందరావు.

అతనికి మిగిలింది ఒకటే. నామమాత్రంగా వున్న ఆనందాన్ని కలల లోకంలోకి వెళ్ళి పట్టుకోవటం. కాసేపు కలలే భోంచేసి కలలే తేన్చి కష్టాలు మరచిపోవటం.

"బజారులో డ్యూటీకి ఏభై సెకండ్లు వ్యవధి వుంది. ఏభయి సెకండ్లలో ఏభయికోట్ల లోకాలు సృష్టించుకుంటాడు ఆనందరావు."

అంతలో అందమైన కారు, అందులో సీత కనబడ్డారు ఆనందరావుకి.

"కారు తలుపు తీసింది సీత. ఆనందరావు కారెక్కాడు. మెత్తగా, నిశ్శబ్దంగా అందమైన కారు ప్రవహించింది.

అందమైన సీత ఆనందరావును దగ్గరకు తీసుకుంది.

ఆనందరావు ఆనందం భరించలేకపోయాడు..

తనలో, తన సీతలో, సీతలో మునిగిపోయిన తనలో, మునిగి చనిపోయాడు."

**పిరికిమనిషి**

అలా ఆనందంగా చనిపోవాలన్నది అతని ఆశయం. ఆ చనిపోవటం కూడా కలల్లోనేతప్ప నిత్యజీవితంలో చెయ్యలేని పిరికివాడు, ఆశావాది ఆనందరావు. ఖరీదైన కలలు అతను చనిపోకుండా చేసే రక్షక కవచాలు, బంగారు పంజరాలు.

**కామేశ్వర్రావు**

హీరో ఆనందరావుతోపాటు సమానమైన పోర్షను ఈ కథలో 'కాముడి' కుంది. కాముడు ఆకలికి సింబాలిక్ నేమ్. వట్టి అమాయకుడు. అన్నమే కావాలని కాసేపు మొండిపట్టు పట్టినా టీ నీళ్ళతో నోర్మూసుకు పడుంటాడు.

**వాక్యావరణం**

కాముడు పాత్రసృష్టి కథకెంత కొత్త టెక్నిక్‌గా అమరిందో రవణ ఈ కథకోసం సృష్టించిన వాక్యాలు అంత అందంగాను అమరాయి.

"బజారు ఆవలిస్తున్నది."

"చిరునవ్వు పులుముకొన్నాడు మొహంమీద."

"మమకారం అనేపదానికి భాషలో తావిచ్చినందుకు చిరాకుపడ్డాడు."

"రోడ్‌మీద పోతున్న అమ్మాయిని సావకాశంగా చదువుకుంటూ.."

"హఠాత్తుగా రాజు చేతులు కట్టి వివేకానంద స్వామిలా నించున్నాడు, తన పల్చటి చొక్కాజేబులో రూపాయినోట్లు బయటకు కనబడతాయని గ్రహించి."

"మెత్తగా, నిశ్శబ్దంగా, అందమైన కారు ప్రవహించింది."

ఈ కథలో ఏడు నిమిషాలలో హోటలు మూసేస్తారన్నది ఒక సింబల్ మాత్రమే. ఆనందరావు ఏడు నిమిషాలు దగ్గరపడితేనేగానీ తీవ్రంగా ప్రయత్నం చెయ్యడు



తిండికోసం. ఆ మొండితనం, బద్ధకం – ఆఖరిక్షణంలో దొరక్కపోతుందా అన్న ధీమా – ప్రదర్శించటానికి రవణ పెట్టిన టైమ్‌బాంబ్ అది.

ఈ కథ మొదట ఆనందరావును పరిచయంచేస్తూ రవణ రాసిన పదివాక్యాలు పదునైన వచన కవితకు ఉదాహరణ.

**కసిత్వం**

"విద్యుద్దీపాల కింద నిలచివున్నాడు ఆనందరావు. తెల్లనైన చీకట్లను చూస్తూ... అపశ్రుతి సంగీతాలకు లయవేస్తున్న నిశ్శబ్దాన్ని వింటూ బజారు బీభత్సంలో బస్సుల రొదలో ప్రశాంతతను వెతుకుతూ...

విలువైన వలువల లోపల, శిలలైన గుండెలుగల జనారణ్యంలో విలాసంగా నిలచివున్న నీకు, తన ఉనికి చిరాకు కలిగించవచ్చుననే భయంతో, తన మాసిపోయిన జీవితంలో పాతిక సంవత్సరాల దొంతర కింద నలిగి మాసిన పాత చిరునవ్వు శిథిలాలను చూపించి, నిన్ను కానీ అడగడానికి వస్తున్న జీవచ్ఛవం శతసహస్ర చ్ఛాయలతో క్షణక్షణం విస్తృతమౌతున్న సారవంతమైన శ్మశాన భూవాటికమధ్య – నిలచివున్నాడు ఆనందరావు తన శరీరాన్ని స్వహస్తాలతో భూస్థాపితం చేసే సంకల్పంతో..

**మహారాజూ యువరాజూ**

మహారాజు పేరు ఎన్.జి.ఒ. యువరాజు పేరు పి.హెచ్.డి. అంటే ప్లాట్‌ఫారం హీరో డిజిగ్నేట్.

ఈ యిద్దరి పరిచయం సంక్షిప్తంగానే కాకుండా సమగ్రంగాకూడా చెయ్యగలిగాడు రవణ కేవలం పది వాక్యాల్లో.

"పి.హెచ్.డి. అనే సంక్షిప్త సంకేతాన్ని యువరాజు స్వయంగా కల్పించి తగిలించుకున్నాడు. దీనికి అతనే గర్వంగా వివరణ చెబుతాడు. అతని హితాభిలాషులూ, మిత్రులూ, పరిచితులూ, బంధువులూ, దూరపు బంధువులూ తీరిక వేళలలో రోజూ ఈ మనిషిని చేరబిలిచి అతని దరిద్రాన్ని, దాన్ని పదిలంగా కాపాడుకుంటున్న అవివేకాన్ని జ్ఞాపకం చేస్తూ వుంటారు. అతన్ని ఎరగని కొత్తవాళ్ళ దగ్గర అతను భోంచేసి ఎన్నాళ్ళయిందో అడిగి చెప్పించి అవతలవాడిని హడలగొడుతూ వుంటారు. ఈ బాధ తప్పించుకోడానికీ, దాన్ని నవ్వుగా పరిమార్చుకోడానికీ యువరాజు ఈ బిరుదు కనిపెట్టి తనూ నవ్వుతూ వుంటాడు శాయశక్తులా."

"ఎన్.జి.వో. మహారాజు ధోరణి వేరు. గుట్టుగా వేదాంతం సాధన చేస్తూ వుంటాడు. గిట్టేనాటికి ముమ్మూరల నేలకోసం, ఈ యాతనలు ఎలాగా తప్పవు.

చేతికి నూనె రాచుకోకుండా అప్పడాల పిండితో ఆటలాడపోతే సంసారం ఇలా అంటుకుంది. అంచేత ఆ పిండి వదలదు. కాబట్టి ఇహ దానికోసం పబ్లీకున దుఃఖపడక తప్పకపోయినా, చాటున మటుకు అసలు పిండేకాదు చేతులే లేవనుకుని విరగబడి నవ్వుకుని తృప్తిపడడానికి తిప్పలు పడతాడు. ఈ మహారాజు పూర్వాశ్రమంలో యువరాజే. విధివశాత్తూ ఐదేళ్ళ క్రితం పట్టాభిషేకం జరుపబడింది."

మహారాజు ఇత్తడి చెంబును, యువరాజు ఫౌంటెన్ పెన్నును తాకట్టేసి చెరో రూపాయి తీసుకుని చెరోదారి పోవటంతో కథ మొదలవుతుంది.

తాకట్టుపడింది మహారాజు అక్షయపాత్ర. అనగా అదుక్కు తినడానికి కూడా మరేం మిగల్లేదన్నమాట.

తాకట్టు పడింది యువరాజు ఫౌంటెన్ పెన్. అంటే ఉద్యోగాల కోసం అప్లికేషనులు రాసే అవకాశంకూడా పోయిందన్నమాట.

నిజానికి తాకట్టుపడింది చెంబూ, పెన్ను కానేకావు. ఎన్.జీ.వో, నిరుద్యోగి యిద్దరూ తాకట్టుపడిపోయారు. విడుదల చేయించుకునే శక్తి యిద్దరిలోనూ లేదు. విడుదలచేసే జాలి పైతరగతిలో అంతకన్నా లేదు. తాకట్టుతో ప్రారంభమైన ఈ కథా ప్రారంభం, అంతటి గాథను కడుపులో దాచుకుంది. ఈ కన్నీటి గాథను కన్నీటి జాలుతో చెప్పే కోరికా ఓపికా లేక ఎండిన కనుకొలకులలో నిస్సారత చిరునవ్వుగా ప్రగల్భించి ఆ వరసలోనే సాగించాడు రవణ భాష, భావం కూడా.

**మహారాజాధిరాజ**

రూపాయిడబ్బుల్తో బజారంతా కొనేసే ధీమాని కొనుక్కుని బియ్యం కొట్టుకి వెళ్ళాడు మహారాజు.

"శేర్రూపాయిన్నరజేసి అంది బియ్యం కొట్టు టూకీగా–

షావుకారు తొలిసారి ఇటు తిరిగి తేరిచూసింది. చూసి చెప్పింది.

మీకెంత కావాల్చెప్పండి బాబూ అంది దుకాణం చిరాగ్గా.

ఒరేయ్ ఈనబేరం సూడరా అంటూ అటుతిరిగింది దుకాణం."

ఈ నాలుగు వాక్యాల్లోను నలభైపేజీల భావాన్ని కుదించాడు రవణ. షావుకారు మహారాజు బేరాన్ని లెక్కచెయ్యలేదు. అది సూచించటానికే దుకాణం అంది, దుకాణం తిరిగింది అని రాశాడు రచయిత. కోపమొచ్చి మరోకొట్టుకి వెళ్ళాడు మహారాజు.

"షావుకారు చెప్పాడు. షావుకారు పది నిముషాలవరకూ విసుగు లేకుండా చెప్పాడు."



ఇద్దరు చెప్పినరేటూ రూపాయిన్నరే! కాని రెండోవాడు మర్యాదస్తుడు అనుకున్నాడు మహారాజు. అంతటి మంచివాడిదగ్గర అర్ధశేరు కొంటే బావుండదని వచ్చేశాడు మహారాజు. మధ్యతరగతి మహారాజుకి తను పూర్వకాలంలో బాగా గొప్పవాడినని అనుమానం. అందుకే తననెవరైనా గుర్తించకపోయినా, గౌరవించకపోయినా కోపం, చిరాకు–నిజానికి బాధ, దుఃఖం. అలాగే కూరలు వగైరాకూడా 'బేరమాడినంత జోరుగా సరుకు కొనలేక' కోపరేటివులోను రానందుకు వాళ్ళని కాసేపు తిట్టుకున్నాడు. లోను గుర్తురాగానే రాబోయే డబ్బుతో కొనబోయే మూడు చక్రాల సైకిలు బేరమాడాడు.

అక్కడ బుచ్చిరాజుగారి ధనరాజు ఫెళఫెళ నవ్వి "సైకిళ్లు పిల్లలు విరవకపోతే డబ్బిచ్చికొన్న మీరు విరుస్తారటండీ" అని పొగిడాడు.

ఆ మత్తులో చిన్న తూగు వచ్చింది మహారాజుకి. మహారాజు ఫాయాలో జరిగి వుండటానికి అవకాశం వున్న ఒక నిజాన్ని అబద్ధమాడేశాడు.

"మీకేవిటండీ కబుర్లు చెప్తారు. చెన్నపట్నంనుంచి ఆ మధ్య రెండు సైకిళ్ళు తెప్పించా. రెండూ విరిచి పెరట్లో పారేశాడు."

మేనేజర్లు మేనేజర్లు నవ్వుకునే నవ్వుతో ప్రారంభమైన యిద్దరి సంభాషణ గుమాస్తా జంకుతూ సన్నంగా నవ్వటంతో కొసకొచ్చింది.

గుమాస్తా నవ్వు చూడగానే "మేనేజర్లు మేనేజర్లు నవ్వుకునేటప్పుడు అచ్చంగా తను నవ్వే నవ్వులాటిది" గుర్తుకొచ్చి కళ్లు చెమ్మగిల్లాయి మహారాజుకి.

పొగడ్తలకి లొంగిపోవటం, అవసరానికి తన అంతస్తు పెంచుకోడానికి అబద్ధాలాడడంతోపాటు తనని తాను మోసగించుకోవటం, తన మనసు చూడకుండా చేతితో, నోటితో కొన్ని పనులు చేసెయ్యటం మహారాజు కలవాటు.

"పదిగంటలయినా ఇడ్లీ సాంబారు ఇంకా ఉండడంచూచి బోలెడు ఆశ్చర్యపడి, ఇడ్లీ తెమ్మన్నాడు – ఉత్తకాఫీ తాగుదామనుకున్నవాడల్లా."

ఈ ఆశ్చర్యం తన మనసుని మోసగించటానికి, ఛ–నేను ఇడ్లీ తినాలనుకోలేదు. ఆ టైములో వుంటుందనికూడా అనుకోలేదు. తను ఆశ్చర్యపడి లేచేలోగా సర్వరే తెచ్చేశాడని మనసుకు నచ్చచెప్పగలడు కావలిస్తే.

"రాత్రి తొమ్మిదిన్నరకి వానలోనడుస్తూ తన పెళ్లాంబిడ్డల మీద జాలిపడడానికి, తనని తనే ఏవగించుకోవటానికి ఉపక్రమించాడు. ఎవరూ లేకుండా చూసి కుళాయి దగ్గర కూచుని భోరున గుండెలవిసేలా, నరనరాలు కదిలిపోయేలా, నాభి కంపించేలా ఏడిచాడు.

అప్పుడు బరువుతగ్గి యింటికి చేరాడు.

"ఏ సంసార తాపత్రయం లేని స్వేచ్ఛాజీవి. పక్షిలా విహరిస్తాడు. ఉంటే తింటాడు. లేకపోతే గుక్కెడు నీళ్లు తాగి కడుపులో కాళ్లెట్టుకు పడుకుంటాడు. బెంగా బెడదా వుండదు. అతని పనే హాయి..." అని యువరాజును తలుచుకుని అసూయపడ్డాడు మహారాజు.

**యువరాజారావు**

యువరాజు రూపాయి దొరికేసరికి జేబులోవున్న ధైర్యం ఆధారంగా హోటల్లో గాత్రంపాడి టిఫిన్ తిని స్పెషల్ కిళ్ళీ వేసుకుని సిగరెట్టు కాలుస్తూ "ప్రపంచంలో మనుషులు మంచివాళ్లే పాపం అనుకున్నాడు. ఝుమ్మని రామమోహన గ్రంథాలయానికి వెళ్ళి ఓమూల కుర్చీ చూసుకుని పంచవర్ష ప్రణాళికల మీద పడి నిద్రపోయాడు."

నిద్రలేచాక జేబు దిలాసాగావున్న ధైర్యంతో పదిమందినీ ఉద్యోగాలడిగెయ్యాలన్న ధీమాతో బయల్దేరాడు.

సారస్వత ప్రియుడైన మేనేజరు దగ్గర ఉద్యోగం సంపాయించటానికి కథలు రాయటానికేనా సరే, కాపీ కొట్టడానికేనా సరే సిద్ధపడాలని తీర్మానించుకున్నాడు.

తక్షణమే కల. ఆ కథ ఒక అమెరికన్ ఇంజనీరు కూతురు ఆసరాతో అమెరికా వెళ్ళి లక్షలుగా తర్జుమా అయి వచ్చినట్లు.

"రోడ్డుమీది మామిడిటెంకని విలాసంగా తన్నబోయి కంకర్రాయిని తన్నడంతో" కల చెదిరి కాలుకుతగిలి ఇలలోకి బోర్లాపడ్డాడు. ఆ బాధకు ఉపశమనం కలగడానికి తన స్థాయికి తగని హోటలులో ముప్పావలా బిల్లు చెల్లించాడు. మిగిలిన పావలాతో మళ్ళీ ఒక కలగని గిట్టుబాటు కాక ఇంటివాడ్ని, కొట్టువాడ్ని తప్పించుకునే ప్రయత్నంలో రెండణాలు పోగొట్టుకున్నాడు.

అంతలో పజిల్వైపు మనసుపోయి విధి విసిరిన అర్ధరూపాయి రోడ్డుమీద కనబడి పోస్టలార్డర్లు కొన్నాడు. కవరుకి డబ్బులేక అవి ఆరణాలకమ్మి మధ్యలో టోకరాతిని ముష్టివాడికి దానం చెయ్యగా మిగిలిన చిల్లరతో బస్సెక్కి రూముకి చేరాడు.

"ఎక్కడెక్కడ తిరిగినా కొంప చేరేసరికి వచ్చారా అనడానికి భార్య, నాన్నా అండానికి పిల్లలు...

ఎన్ని కష్టాలున్నా కలో గంజో తాగుతూ ఆనందాన్వేషణలో వున్న సుఖాన్నో, సౌఖ్యాన్వేషణలోవున్న ఆనందాన్నో పొందవచ్చు. నా అన్నవాళ్లుంటారు. గృహమేకదా స్వర్గసీమ" అని మహారాజుని తలుచుకుని అసూయపడ్డాడు యువరాజు.



**ఆశయాలూ అప్పడాలూ**

మహారాజుకీ, యువరాజుకీ ప్రధానమైన తేడా ఒకటుంది.

వర్తమానం అలకొట్టి తరిమికొట్టగా మోహం పగిలి వేదాంతంలోకి జారిపోతాడు మహారాజు.

వర్తమానం వికృతంగా భయపెట్టగా కలల రాజ్యానికి పట్టాభిషిక్తుడవుతాడు యువరాజు.

నిజ జీవితం నించి పలాయనాన్నే ప్రదర్శించే ఈ యిద్దరి కలల్ని, వేదాంతాన్ని మధ్యతరగతి చేతగానితనంగా, సరిపెట్టుకునే తత్వంగా చిత్రించాడు రవణ.

ఇద్దరికీ నేలమీద కాలు నిలవనీయని కోరికలుంటాయి. మూడు చక్రాల సైకిలు, సన్నబియ్యం, బంగాళదుంపలు మహారాజు కోరికయితే, బంగళా, కారు, బొచ్చుకుక్క యువరాజు కోరిక. మహారాజు తనకోరిక తీరటానికి చిన్న అప్పులకి, తప్పితే కోపరేటివు అప్పుకి ప్రయత్నిస్తాడు. యువరాజు తన కోరిక తీరటానికి కథ రాసి అమెరికాకి పంపి డాలర్లు సంపాయించుకున్నట్టు కలగంటాడు. అది యిద్దరి వ్యక్తిత్వంలో కొట్టవచ్చినట్టు కనబడే తేడా.

కాని యిద్దరి ప్రారంభం ఏదో తాకట్టేసి రూపాయి సంపాయించటంతోనే. యిద్దరి దినచర్య ముగింపు ఒకరినొకరు తలుచుకుని అసూయపడి పోవడంతోనే.

ఆ అసూయ వెనక యిద్దరికీ రాక్షసమైన కోరికలు కూడా లేకపోలేదు.

బ్రహ్మచారిలా జీవితం గడపాలని, అంటే పెళ్లాంబిడ్డలు లేకుండా పోవాలని మహారాజు కోరిక.

తనతోపాటు మరోజీవికూడా మాడిచచ్చి తనకు ఆనందం కలిగించాలని యువరాజు కోరిక.

"నిద్ర కుపక్రమిస్తూన్న మహారాజూ యువరాజూ కూడా ఆకారం ఏర్పడని, తమకే అర్థంకాని ఈ కోరికలని నెరవేర్చవలసిందని పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ ఒకే ముహూర్తాన చేతులు జోడించి మనసారా నమస్కరించారు."

జీవితం అంటే మొండికెత్తటం, భగవద్భక్తి, వుండటం, పజిల్స్ మీద (పజిల్ అదృష్టానికి ప్రతీక) నమ్మకం ఉండటం, ఫాల్స్ ప్రిస్టేజిలో బతకటం, తనను తాను మోసగించుకోవటం, ఎవరికివారు మరొకరు హాయిగా వున్నారని భ్రమపడటం – ఆ భ్రమాస్పదమైన జీవితానికి పరుగులు పెట్టడం మహారాజులోను యువరాజులోను కూడా కనబడుతుంది.

**సినిమెటిక్**

మహారాజు యువరాజు "పెద్దమ్మకి చెరోపక్కా చేరి చెరో చెవిలో చెరో రహస్యం చెప్పారు. పెద్దమ్మ ఇద్దరికీ చెరో చిరునవ్వు ఇచ్చింది."

ఆ తరువాత విషయం మాటలలో కాకుండా ప్రతిభావంతుడైన దర్శకుడిలా మూమెంట్‌లో చెబుతాడు రచయిత.

"తరవాత మహారాజు ఇచ్చిన ఇత్తడిచెంబులో యువరాజు ఇచ్చిన ఫౌంటెన్‌పెన్ పడేసి లోపలికి చక్కాపోయింది పెద్దమ్మ."

కథనంలో సినిమా టెక్నిక్‌ని వాడుకుంటూ మహారాజు యువరాజుల కథలు పార్లల్‌గా సాగనిచ్చి చివరికి తెరమీద సగంలో మహారాజు, సగంలో యువరాజు తమ కోరికలకి ఆకారాలు ఏర్పరచుకుంటుండగా స్వస్తి పలుకుతాడు రచయిత.

మహారాజు కథ ముగించేముందు 'పదకొండు గంటలు కొట్టింది.' అనిచెప్పి, యువరాజుకథ ప్రారంభంలో.

'పదకొండుగంటలు కొట్టింది గడియారం' అని చెప్పటంలో కూడా కథనంలో వేగం, కంటిన్యుటీ కళ్ళక్కనిపిస్తాయి.

**కాకులు లోకులు**

ఋణానందలహరిలో లాగే యిందులో రెండు కాకులు ప్రధాన పాత్ర వహిస్తాయి యువరాజు కథలో.

చిన్నకాకి యువరాజు గురించి ఆసక్తి కనబరచేసరికి,

"వీడు తెలీదూ? ఈ జాతివాళ్ళని మనం బోల్డుమందిని చూశాం. మొండికెత్తిన నిరుద్యోగి. గెలుపు గ్యారంటీ అనే రకం" అంటుంది పెద్దకాకి.

ఇంటర్వ్యూలు, ఆశలూ భోంచేస్తూ ఉంటాడతడని చెప్పేసరికి అతనిమీద రెట్టవెయ్యాలని సరదాపుట్టి వేసింది చిన్నకాకి. యువరాజుకి నెత్తి తడుముకోవాలో, రక్తం కారుతూన్న వేలుని ఓదార్చాలో తెలీక ఒకక్షణం ఆలోచించి రెండూ మానేశాడు.

"వీడి దుంపతెగ – పైకేనా చూడలేదే" అంది చిన్నకాకి.

"నే చెప్పలే" అంది అక్క చిరునవ్వుతో.

యువరాజు సంగతి లోకులు పట్టించుకోకపోయినా కాకులు పట్టించుకున్నాయి. భోజనం కాకపోయినా కలల భోజనం అయినా ఏర్పాటు చెయ్యాలనుకుని ఉత్సాహపడి వయారిభామ నెత్తిమీద వాలి యువరాజుచే దుష్యంతునివలె తోలబడి (తోలబడింది కాకి దుష్యంతుడు కాదు) యువరాజుకి సాయపడింది.



నిరుద్యోగులు ఉద్యోగాలకోసం కాకుల్లా తిరుగుతారని చెప్పటంతో పాటు నిరుద్యోగుల అవస్థలు, కలలు కలగలుపుకుని కథ చెప్పుకోటానికి కాకుల్ని వాడుకున్న ఈ టెక్నిక్‌ని రవణ, అసమర్థుడి జీవయాత్ర రాసిన గోపిచంద్ కాక మరే రచయితా వాడుకోలేదు.

ఈ కథలో కనబడే వాక్య విన్యాసాలు.

"కళ్ళతో సాష్టాంగ నమస్కారం చేసిన ఎన్.జి.వో."

"భావి పౌరులు దారి చూపాల్సినవారు. మీరు దారి తియ్యండి. నేనే రెండోవేపు పోతాను."

"పంచవర్ష ప్రణాళికల మీదపడి నిద్రపోయాడు."

"జీవితం మళ్ళీ ఓ జీతపు మజిలీ మీదికి వచ్చిన రోజున"

"మండే మధ్యాహ్నం మీదికి మళ్ళీ ఒచ్చేశాడు యువరాజు."

**లోకాలోకం**

కథలు రాయటం రాకపోయినా డబ్బుకోసం రాసేవాళ్ళమీద, కాపీలుకొట్టేవాళ్ళ మీద వాటిని డాలర్లుగా మార్చేవాళ్ళమీద చమత్కరించినట్లే అమెరికా పిచ్చిమీద, యాంకీస్టయిల్‌మీద పంచవర్ష ప్రణాళికలమీద సన్నని జల్లులాటి అవహేళనను కురిపించాడు రవణ.

ఈ కథలోనే ఉపకథలాగా రామాయణంలో పిడకల వేటకంటె విలువైందిగా ముష్టివాడు, హోటలు క్లీనరు బేరాలు కథనం చేశాడు రవణ.

"వారానికి అర్ధరూపాయి ఇస్తే భోజనపు హోటలు ఎంగిలాకులన్నీ నువ్వొచ్చే వరకూ ఉంచి నువ్వురాగానే నీకు పడేస్తా" అంటున్నాడు క్లీనరు.

ఆరణాలు చేసుకో అన్నాడు ముష్టివాడు.

"ఇది ఏ క్లాసు హోటలు తెలుసా! అర్ధరూపాయిస్తే అయిదు రూపాయలు గిడతాయి. ఇష్టం ఉంటే చెప్పు.

సరేనంటున్నాడు ముష్టివాడు."

ఈ ఇరుకు సందుల్లోకి కూడా తీక్షణంగా చూసి సునిశితంగా ఆలోచించి సున్నితంగా చెప్పాడు రవణ.

**ఛాయలు**

ఈ కథలో సుబ్రమణ్యం కూడా మధ్యతరగతివాడే! తమ్ముడు తప్పిపోతే వెతకటానికి సెంట్రల్ స్టేషన్‌లో అతను చేసే ప్రయత్నం, కనే కలలు, కరిగే కలల రూపమే ఈ కథ.

తమ్ముడు పారిపోయాడన్న బాధకంటె అతనెత్తుకుపోయిన పాతిక రూపాయల గురించే సుబ్రమణ్యానికి బెంగ ఎక్కువ.

"వాడివాళ దొరక్కపోయాడా, ఎత్తుకొచ్చిన పాతిక రూపాయలూ తగలేసి కాని ఇంటికిరాడు. తను తెలివితేటలుపయోగించాలి."

తెలివితేట లుపయోగించాల్సింది తమ్ముడ్ని పట్టుకోడానిక్కాదు. వాడెలాగా కొంపకి చేరతాడు ఇవాళ కాకపోతే రేపు. పాతిక రూపాయలు ఖర్చుకాకుండా వుండటానికే!

రవణ ఈ తమ్ముడు పారిపోవటం కూడా సింబాలిక్‌గానే వాడుకున్నాడు. అందుకే తమ్ముడు పారిపోవటంమీద కథనెంతమాత్రం కేంద్రీకరించలేదు.

## ఎస్కేపిస్ట్

పారిపోయింది సుబ్రమణ్యమే!

చాలీచాలని జీతంనించి, జీవితంలో కష్టాలనించి, అనుంగుసోదరుడు సృష్టించే సమస్యల్నించి, తనకంటె తక్కువ స్థాయివాళ్లు (పోర్టరు) తమలోకి లాగేసుకోకుండా ఉండటంనించి, తనకంటె పైస్థాయివాళ్లు తనని దూరంగా విసిరేసిన స్థలంనించి, తననించి, స్వేచ్ఛగా పారిపోయాడు సుబ్రమణ్యం. ఈ అసమర్థత, పిరికితనం, మనసులో భయంగా రూపొంది ప్రతినీడని పోలీసు అనీ, వాడు తనను పట్టుకోడానికే వస్తున్నాడనీ అనుమానిస్తుంటాడు సుబ్రమణ్యం.

ఈ పారిపోవటం పోవటం అతను కలలరాజ్యంలోకే పోతాడు. అక్కడ తను పోలీసాఫీసరు, లేక వారికి మిత్రుడు, చాలా గొప్పవాడు – తననెవడూ కాదనేవాడు లేడు. స్టేషన్‌లో తనను దొంగ అని అనుమానించిన సి.ఐ.డి.ని రిపబ్లిక్ సీరియల్స్‌లో హీరోలాగ గడ్డంకింద ఒక్క 'నాకౌట్' యిచ్చినా వాడు రక్తపుమడుగులో పడినా తననెవరూ ఏమీ అనలేరు. అవసరమైతే తన యింటికి రమ్మని చెప్పి తలాడించి కారు డ్రైవ్ చేసుకుని యింటికి పోతాడు.

ఈ కలలకంటె స్పష్టంగా, సుందరంగా శరీరానికంతటికీ సుఖాన్నిస్తూ ఓ రెండు గంటలు మరో లోకంలోకి తీసుకుపోయి 'రెండాల్ఫ్ స్కాట్'తో అభేదాన్ని కలిగించే ఆనందాన్నందించేది సినిమా. అందుకే కలలరాజ్యం వదిలి చివరికి సినిమాహాల్లోకి పారిపోతాడు సుబ్రమణ్యం. ఆ పారిపోవటానిక్కూడా కుంటిసాకులు చెబుతూ తనని తను మోసగించుకుంటూ...

నిజానికిది చాలా దారుణం! కాని తప్పని పరిస్థితి. దొంగలు, గూండాలు, పెద్దమనుషులు, టోపీలవాళ్లు, రాజకీయనాయకులు యితర్లని మోసగిస్తారు – తాము సుఖపడడానికి.



కాని మధ్యతరగతి సుబ్రమణ్యం తన దైరీని, తన మనసునే మోసగించుకుంటాడు తన అసమర్థత కప్పెట్టుకుంటూ–

"రూపాయి పావలా టిక్కెట్టుకొని సుబ్రహ్మణ్యం ఆ సినిమాకి వెళ్లాడు తన పాతశత్రువుకు కొత్తశిక్ష ఎలా వెయ్యాలో సినిమా చూస్తూ ఆలోచిద్దామని. ఇంకో కారణంకూడా వుండొచ్చు. తన తమ్ముడిని వెతికేందుకు ఉపాయాలు ఆలోచించటానికి. బహుశా ఇంకో ముఖ్యకారణమూ వుండొచ్చు. అతడది మీకూ నాకూ ఏనాటికీ చెప్పడు...

...అతను పొందిన ఇన్ని అవమానాలకన్నా సెంట్రల్ స్టేషన్‌లో ఒకే ఒక క్షణంపాటు తను చూసి, క్షుణ్ణంగా చదువుకున్న ఆంగ్లో ఇండియన్ అమ్మాయి వంపులు, రోడ్డు పక్కగా తను చూసిన పోస్టర్ హీరోయిన్ వంపులు అతని బుర్రనిండా ఆలోచనల్ని కల్పించి, తీరని కోరికల్ని రేకెత్తించాయి. ఇప్పుడీ సినిమా హీరోయిన్ వంపులు గంటన్నర చూసి, ఇంటి కెళ్ళినపుడతడు తిరిగి ఇంకో రంగురంగుల ఊహాలోకంలో ప్రవేశించవచ్చు. తీరని కోరికల్ని తృప్తిపరచుకుందుకు....."

ఈ 'ఎస్కేపిజమ్' తమ్ముడు పట్టుకెళ్ళిన పాతిక రూపాయలు సృష్టించే సమస్యలవల్ల అయ్యుండవచ్చు. ఆ పాతిక లేకపోతే ఉద్యోగం రాకపోవచ్చు లేక ఉన్న ఉద్యోగం ఊడవచ్చు – ఏదేనా కావచ్చు. కాని ఆ లోటు పూర్తి చేయటానికి అవకాశం లేదు. అందుకే సుబ్రమణ్యం పాతిక ఎలా సంపాయించాలన్న ఆలోచనకి చోటివ్వక సి.ఐ.డి.ని శిక్షించే మార్గాల్ని ఎక్కువగా కలగన్నాడు – లేకపోతే యువరాజులాగే పాతిక రూపాయిలు రోడ్డుమీద దొరకడమో, తనకు లాట్రీ రావడమో ఏదో కలగనేవాడు.

ఈ తీరని సమస్యనించి రిలీఫ్ దొరకడానికి సినిమాహాల్లోకి వెళ్ళిపోయాడు. వెళ్ళినవాడు వెళ్ళినట్లుండక సి.ఐ.డి.ని తన్నటానికి, తమ్ముడ్ని వెతకటానికి ఉపాయాలలోచించటానికే సినిమాకి వచ్చానని తనని, మనని మోసగిస్తాడు.

ఈ చిన్న కథలోనే మధ్యతరగతి మనిషికుండే ఆశలు, ఆశయాలు, సమస్యలు, లోటుపాట్లు, పొరపాట్లు, అలవాట్లు, దోషాలు, గుణాలు అన్నీ వదలకుండా చెప్పాడు రవణ.

## క(వ)ల్చర్

"అమెరికాలో డిటెక్టివ్‌ల తలదన్నే నేర్పుతో దొంగలు తిరుగుతారు. దొంగల నేర్పుని మించి వీళ్లు తిరుగుతారు. అది ఒక కళ. ఆ కళలో అమెరికన్లు మనని తరిఫీదు చేస్తున్నారు. క్రైము పిక్చర్లద్వారా ఇంగ్లీషు సినిమాకి ఖర్చుపెట్టిన డబ్బులు దండగ కాదనిపించింది సుబ్రహ్మణ్యానికి."

ఆ చిత్రాలమీద సెటైర్‌తో చెప్పడంతో వాటిలోకి పారిపోవడం తప్ప మధ్యతరగతి మనిషికి గతిలేకపోతోందన్న జీవితసత్యం చెబుతాడు రవణ. నేటి నాగరికత, మనుషుల మనస్తత్వాలు వాటికి అనుగుణంగా వాటివైపే ప్రవహిస్తున్నాయి.

**కవిజననం**

ప్రతివాడిలోను కవి వుంటాడు. మన సమస్యల సన్నివేశాల్లోనే కవి ప్రకోపిస్తాడు. మనకి తెలియకుండా పరిస్థితులకి స్పందిస్తుంటాడు. మనకంటె ఒకడుగు ముందేవుంటాడు 'ఎస్కేపిజమ్' విషయంలో. సర్వ సామాన్యమైన ఈ మనఃస్థితిని ప్రదర్శించటానికి రవణ కవితోనే కథ మొదలుపెట్టాడు. కవి అంటేనే ఫస్ట్‌క్లాస్ ఎస్కేపిస్టు! వాడి తరవాతే సుబ్రమణ్యమైనా, సుబ్బారావైనా!

కవి లెఫ్టిస్టు. పేదలపట్ల, వాళ్ళ దారిద్ర్యంపట్ల సానుభూతితోపాటు ధనికులపట్ల వాళ్ళ ఐశ్వర్యంపట్ల కసివున్నవాడు. ఈ తత్వాలు తన మాటల్లో చెప్పుకుంటాడు కవి, సుబ్రమణ్యం విన్నా వినకపోయినా. సెంట్రల్లో 'చెదరిపోయిన పుట్టలోని కందచీమల్లాగ ఇటూ అటూ కంగారుగా తిరుగుతున్నారు మనుషులు. కొంతమంది లావాటివాళ్లు ఓ మాదిరి పెద్దసైజు ఉండల్లాగ దొర్లిపోతున్నారు. సన్నగా, పొడుగ్గా చారల సూటేసుకున్నవాళ్లు గజంబద్ద మింగేసినట్టు నడుస్తూ వున్న ఠీవంతా పారబోసేస్తున్నారు. పైన ఎగిరే పురుగులు మిగిలి కిందనుండే మనుష్యులు లేకపోతే స్టేషను చాలా బాగుండేది.

ఇదీ సుబ్రమణ్యంలో వుండే కవికి కనబడిన స్టేషను తీరు.

ఈ కవి నాస్తికుడు – దేవుళ్ళంటే బొత్తిగా నమ్మకంలేదు... "ఆ వట్టినాన్సెన్స్. వెయ్యి కళ్లేమిటోయ్? ఉత్త అబ్సర్డ్. ఇంపాసిబుల్. అబ్ నార్మల్" అంటాడు ఇంద్రుడి గురించి.

సుబ్రహ్మణ్యం వరండా కలియజూచినప్పుడు కవి కదిలాడు మళ్ళీ

"ఈ పనిలేని అనాధలూ, అభాగ్యులూ అయిన భారతీయులు తిన తిండి, నిలువ నీడా, కట్టుకోడానికి..." సుబ్రమణ్యాని కేడుపొచ్చింది. బాధ, ఆవేదన, జాలి, దైన్యతలతో నిండి పొంగి పొర్లిపోయే చూపులతో కవిని చూశాడు. "నువ్వు దయచేసి ఊరుకుంటే బయటికెళ్లాక సిగరెట్టు కాల్చుకుందాం" అని ఆశపెట్టాడు.

బరువు తూచుకునే మిషన్‌లోకి తొంగిచూస్తున్న ఒక భారతీయ కార్మికుడ్ని చూసేసరికి కవి గేయం కట్టబోయాడు.

రవణలో కవి వున్నాడు. పై పరిస్థితులపట్ల రవణ తీర్పుకూడా అదే! అయినాసరే అతనిలో కవే అలా పలుకుతాడు. కవికి, వ్యక్తికి సామరస్యం కుదరదు. వ్యక్తిగా



పరిస్థితులతో రాజీ అవసరం – గజం బద్దలు మింగినట్టు నడిచే మనుషులతో మర్యాదగా వినయంగా మాట్లాడాల్సి రావచ్చు. భారతీయ కార్మికుడ్ని 'ఒరేయ్ సోమరి వెధవా' అని తిట్టాల్సిన అవసరం రావచ్చు. అందుకని వ్యక్తిగా కొన్ని రిజర్వేషన్స్ వుంటాయి ప్రతివాడికి. కవికి అవసరం లేదు.

కాని ఈ కవిని అడ్డం పెట్టుకుని వ్యక్తిగా కూడా అదే పోజు వేసే ప్రయత్నం చేస్తారు కవిత్వం రాసేవాళ్లు చాలామంది. ముఖ్యంగా కవి పరిస్థితుల్ని ఎక్స్‌ప్లాయిట్ చేసుకుంటాడు. తన దీనస్థితిలో అనాధలూ, అభాగ్యుల పట్ల గేయాలు రాస్తాడు. కాస్త కడుపునిండగానే వాళ్ళని చూసి 'బ్రహ్మరాత' అలావుంది అని విచారిస్తాడు.

కవుల ఈ అవ్యక్త పరిస్థితిమీద, ద్వైతతత్వం మీద ఒక వాక్యం రాశాడు రవణ.

సి.ఐ.డి. దబాయిస్తున్నప్పుడు అక్కడికి వచ్చిన పోర్టరు పెద్దమనిషిలా కనబడ్డాడు సుబ్రమణ్యానికి. మరోసారయితే వాడ్ని డబ్బుల కోసం ఏడిపించి వుండును. 'సామీ, సార్' అనిపించుకుని జాలి ఒలకబోసి పెద్దమనిషిలా పోజుపెట్టి కావలిస్తే "తోటి మానవులే, మనకి సోదరులే" అని ఒప్పుకుని వీళ్ళ తరపున గేయం రాసి 'అయ్యయ్యో! ఈ ఇలలో అందరి గుండెలు శిలలో' అని ఆనందించి వుండును.

ఈ చిత్రణలో వ్యక్తికి, కవికి వుండే తేడాని, వ్యక్తిగా సమాజంతో సంబంధాన్ని, దాన్ని తెంచుకోలేకపోవటాన్ని, కవిగా సమాజాన్ని విదిలించి కొట్టగల తత్వాన్ని పరిశీలించాడు రవణ.

కవి విజృంభించి గేయాలూ గట్రా రాసేస్తే సుబ్రమణ్యానికి నిలువ నీడ లేకుండా పోవచ్చు. అందుకే ఎప్పుడూ వాడి నోరు నొక్కేస్తుంటాడు. మనిషిలో ఆస్తిక నాస్తిక తత్వాలను కూడా యిందులో పరిశీలించాడు రవణ. కవి నాస్తికుడు. సుబ్రమణ్యం ఆస్తికుడు.

"సుబ్రహ్మణ్యం విసుక్కున్నాడు. తను కాస్త దేముడిమీద గురి కుదుర్చుకుంటున్నాడు. ఇంకొంచెం వుంటే ఆ ఆర్తత్రాణ పరాయణుడు ఏదో సాయం చేసునేమో! ఇంతలో ఈ నాస్తిక కవి అడ్డొచ్చి వ్యవహారం చెడగొట్టాడు.

ప్రతివాడు కవిత్వం రాయకపోవచ్చు గాని ప్రతి వ్యక్తిలోను కవి వుంటాడు. ఇలాటి పరిస్థితుల్లో విజృంభిస్తాడు. ఈ స్థితి ఎప్పుడో ఒకసారి ప్రతివాడికి అనుభూతికి వస్తుంది. సార్వజనీనమైన ఈ పరిశీలన రవణ రచనాశక్తికి దర్పణం పడుతుంది.

సంప్రదాయం చావని మధ్యతరగతి వ్యక్తి భగవంతుడి సృష్టి వైచిత్రిని కూడా పరిశీలిస్తాడు. ప్రస్తుత ఆర్థికతత్వం అరగని వ్యక్తి పోర్టరులాటి కింది తరగతి మనుషుల మీద జాలిపడతాడు కవిలాగే. సినిమా ప్రచారశకటాన్ని తోసే కుర్రాడి సోమరితనాన్ని తిడతాడు.

"ఈ కుర్రవెధవలు పగలూ ఇంతే. ఓ మూల ఆపేసి దాంటో పడుకుంటారు." అంతలో వాళ్ళని ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్న కేపిటలిస్టు మీదకి కోపం మళ్లుతుంది.

"అయినా థియేటర్‌వాళ్ళిచ్చే కూలికి చాలీసేవ..." అనుకుంటాడు.

రవణ చేసిన పరిశీలనలో అన్నిటికంటె ప్రధానమైనది జీవసహజమైన 'సెక్స్' పరిశీలన.

## సెక్సయిట్‌మెంట్

సినిమా పోస్టరుమీద బొమ్మలో ఉద్రేకజనకంగా డిజైన్ చేసిన వక్షోజాల మీద పడింది సుబ్రమణ్యం దృష్టి.

"సుబ్రమణ్యంలో కవి సినిమాలవారు సెక్సుని ఎంత ఘోరంగా ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారో ఎంత అవినీతిని రేపుతున్నారో ఆలోచించి విమర్శించును గాని, క్షణంలో అతని శరీరం స్వతంత్రం తీసుకుంది."

వెంటనే అతడు ఎడంచెయ్యి వేళ్లు పోష్టరుమీద బొమ్మ వక్షోజాల మీదుగా పోనిచ్చి చెయ్యి అలా బండి చివర వరకు రాసుకుంటూనే నడిచాడు."

సంతృప్తిపడ్డాడు, కాని ఈ చర్యకూడ అతను పబ్లిగ్గా చెయ్యలేదు. బండి కుర్రాడు కునుకుతుండగా, ఎవరూ చూడకుండా చేశాడు. అతనిలోని పిరికితనానికి ఉదాహరణగా మరో కల కథ చెప్పాడు రవణ.

"ఇలాంటి పిల్ల ఒంటరిగా ఎదురొస్తే గబుక్కున కావలించుకుని గట్టిగా ముద్దెట్టుకుని తిరిగి హఠాత్తుగా వదిలేసి పరిగెత్తుకుని పోవచ్చు తను. ఆ! తనకా ధైర్యం వుంది."

ఒకవేళ ఆ అమ్మాయే పెళ్ళిచేసుకోమనో, తనతో రమ్మనో అంటే వెళ్లే వెన్నెముక గట్టితనం సుబ్రమణ్యానికి ఉండదు.

## రెక్కలగుర్రాలు

సుబ్రమణ్యం కలల గుర్రాలెక్కి రెండుసార్లు సెంట్రల్‌కి తిరిగివెళ్లాడు తన నవమానించిన సి.ఐ.డి.ని శిక్షించటానికి. ఒక కలలో తాను కోటీశ్వరుడు. తనేం చేసినా ఎదురులేదు. ఇది కొంచెం 'లా'కి వ్యతిరేకం. అందుకని 'లా'కి అనుగుణంగా వుండే మరో కల కంటాడు. సర్కిల్ తనని సగౌరవంగా తీసుకువెళ్ళి సి.ఐ.డి. షణ్ముగాన్ని శిక్షిస్తాడు. రోడ్డుమీద కంటున్న ఈ కలల్నించి భూతంలాటి బస్సు తనని దూసుకుపోతే మేలుకుంటాడు.



సినిమాహాలు దగ్గర 'పెద్దగోల, హడావిడి'కి రెండో కలనించి మేలుకుంటాడు. మరి కలలు కనడు. సినిమాహాల్లోకి వెళ్ళిపోతాడు.

## సినిమా-జీవితం

సినిమాల ప్రభావం జీవితం అంతా పరుచుకున్న సుబ్రమణ్యం సినిమాల్లోలాగే ప్రవర్తిస్తాడు కలల్లో.

షణ్ముగాన్ని సర్కిల్ శిక్షిస్తున్నప్పుడు "సుబ్రహ్మణ్యం అమాంతం దయా స్వరూపుడు అయిపోయి, శిబిదధీచులను జ్ఞప్తికి తెచ్చుకుని "పోన్లెండి – ఈ మాటు కొదిలెయ్యండి" అంటాడు సర్కిల్‌తో, సినిమాల్లోలాగా.

ప్రతి మనిషిలో వుండే 'స్ప్లిట్ పర్సనాలిటీ'ని సుస్పష్టంగా వివరించాడు రవణ 'కవి'ని ఆధారంగా చేసుకుని. పోర్టర్ల విషయంలోను, పోలీసుల విషయంలోను, సినిమాల విషయంలోను రవణ రచనలో మంచి 'అబ్సర్వేషన్' కనబడుతుంది.

కవిగాను, సుబ్రమణ్యంగాను రవణ చూసిన దృశ్యాల ఉపమానాలు ప్రత్యేకతను ప్రదర్శిస్తున్నాయి.

"చెదరిపోయిన పుట్టలోని కండచీమల్లాగ"

"పెద్దసైజు ఉండల్లాగే."

"గజంబద్ద మింగేసినట్టు"

"రిపబ్లిక్ సీరియల్స్‌లో హీరోలా"

వీటితోపాటు సార్వకాలికంగా కనబడే వాక్యరచన గమనించండి.

"మనసులో తోచిన అభిప్రాయాల్ని ఆలోచించకుండా బయటపెడితే పర్యవసానం చాలా భయంకరంగా ఉంటుంది."

ఈ మూడు కథల్లోను కనబడే ఉద్యోగి, నిరుద్యోగులు వాళ్ళ తత్వాలు, కనే కలలు, తలచుకునే వేదాంతాలు, ఎదురయే పరిస్థితులు, వాళ్లు తప్పించుకునే తీరుతెన్నులూ సమగ్రంగా చిత్రించాడు రవణ. మహారాజు యువరాజు కథలో చెప్పిన "చాటున అసలు పిండేకాదు. చేతులే లేవనుకుని విరగబడి నవ్వుకుని తృప్తిపడే" తత్వం మధ్యతరగతి వ్యక్తులది.

## జనతా ఎక్స్‌ప్రెస్

జనతా ఎక్స్‌ప్రెస్‌ని మధ్యతరగతికి సింబల్‌గా వాడుకున్నాడు రవణ. సామాన్యుల కందుబాటులో వుండేది జనతా రైలు. ఫస్టుక్లాసు, ఏ.సి. మనుషులు వేరే రైలుకి వెళ్ళిపోవాల్సిందే – ఇందులో చోటులేదు.

**వసుధైక కుటుంబకమ్**

ఆ తోటలో పదకొండు ఇళ్లల్లో మధ్యతరగతి మనుషులు కాపరాలు చేస్తున్నారు.

"చుట్టూవున్న గదిన్నర వాటాలలో పదేసి రూపాయల అద్దె యిచ్చే చిన్న కుటుంబాలున్నాయి. మధ్యయిల్లు రెండు భాగాలు. ఒక వాటాలో పెద్ద మనిషిగారూ ఆయన కుటుంబం" ఉన్నారు.

రెండోదాంట్లో సుబ్బారావుగారి మావగారి కూతురూ, కూతురు మొగుడు సుబ్బారావూ ఉంటున్నారు. చుట్టూవున్న గదిన్నర వాటాలలో చక్రవర్తీ సుందరమ్మలవంటి చిలకా గోరువంకల దగ్గర్నించి, చక్రవర్తి కవిత్వానికి గురి అయిన పిల్లలకోడి నరసమ్మగారి వరకూ రకరకాల కుటుంబాలు ఉన్నాయి.

వీరిలో ఏ తరగతి కిందకూ రాని, మిడిల్ స్కూలులో ఐదో తరగతి వరకూ పాఠాలు చెప్పే పంతులమ్మ జానకమ్మ పెళ్ళిచేసుకోని బంగారు బొమ్మ –

ఇంటి యజమాని వీర్రాజు, మధ్యయింటి మేడగదిలో ఉంటాడు ఒంటరిగా–" బ్రహ్మచారి.

"ఒక్కొక్కసారి చిరాకేసి చేతిలోడబ్బు బొత్తిగా ఇద్దైపోయినపుడు తనకు బాకీ ఉన్నవాళ్లు కులాసాగా సినిమాకి వెళ్తున్నప్పుడు ఒళ్ళు మండిపోయే." వీర్రాజుతో సహా అంతా మధ్యతరగతి మనుషులతోనే నిండిపోయిందా తోట– ఒక్కమాటలో మీనియేచర్ మధ్యతరగతి ప్రపంచం. దానికి గుర్తే జనతా ఎక్స్‌ప్రెస్.

**కోరికల గుర్రాలు**

స్కూలు మాస్టరు చక్రవర్తి భార్య సుందరమ్మకి జాగ్వారుకారు కొనాలని అభిలాష. పిన్నిగారికి ఒక మేడ ప్రస్తుతానికి కొనాలని, తాపీగా కట్టించుకోవాలని సంకల్పం.

"ఇద్దరివీ ఖరీదైన కోరికలు కాబట్టి నెయ్యానికీ, కయ్యానికీ ఆవిడే తగును.

అందుకే సుందరమ్మ పక్కింటి పిన్నిగారిని తప్ప ఇంకెవరినీ కాఫీపొడికాని, మరోటికాని అప్పడగదు.

"మీ నాగపూరు కప్పుతో నాగపూరు కప్పుదుచాలు" అంటే యింటో లేకపోతే కొనయినా అప్పిస్తుంది పిన్నిగారు.

'నా హైదరాబాదు చీరంత నల్లటికారు' చూశానంటుంది సుందరమ్మ.

కలలతోపాటు ఇలాటి డాంబికపు మాటలతీరుకూడా మధ్యతరగతి ఆడవాళ్ళకి తప్పదు.



సుందరమ్మ నానాతిప్పలుపడి '1928వ సంవత్సరపు చలన హేతు శకటం' ఒకటి నాలుగొందలుపోసి కొనుక్కుంది.

"కారు కొన్నాం, కారు కొన్నాం" అంది కారులో కూర్చొన్న సుందరమ్మ.

కాస్తని గంపంతచేసి 'షో' చెయ్యడం, పదిమంది ముందు ప్రదర్శించటం కూడా ఈ తరగతికలవాటు.

అదేకాకుండా అవసరమైతే స్వంతానికి కారంగావున్నా ఇతరులకి తియ్యగా వుంటాయనుకునే అబద్ధాలు కూడా చెప్పగలరు.

**నేను నేనుకాదు**

దుకాణంలో పెద్ద పెద్ద చీరలు బేరమాడి జేబురుమాలు కొన్న సుందరమ్మ షాపువాళ్ళతో స్టైలుగా సామానులు కారులో పడెయ్యమంది.

"అదుగో ఆ డొక్కు కారులేదూ చిన్నది. అందులో పడెయ్యండి అంది. మళ్లా ఏంతోచిందో! ఆ కారు మా డ్రైవరుదిలెండి. మాది రిపేరుకెళ్ళింది అనేసింది."

ఇలాటి అబద్ధపు బతుకులో కలల్ని కంటూ కష్టాలుమోస్తూ కాలం వెళ్ళమార్చడమే మధ్యతరగతి పని.

అలా అని ఆత్మీయతలుగాని, గౌరవాలుగాని వీసం ఎత్తు తగ్గిపోవు.

"కారు డ్రైవరుదన్నావు. రేప్పొద్దున ఈ పట్టుచీర నీ దాసీదాని దంటావు... మరి నేనో?" అన్నాడు నవ్వుతూ చక్రవర్తి.

అరచేతితో చక్రవర్తి నోరుమూసి "ఛఛ ఏం మాటలండి" అంది సుందరమ్మ.

ఆవిడ తత్వానికి ముందు కోపగించినా తరవాత జాలిపడతాడు చక్రవర్తి.

ఈ ఎడ్జస్ట్‌మెంటాలటీయే లేకపోతే ఈ తరగతి బతుకు యింకా అధ్వాన్నంగా వుండేది.

**మూడోకంటికి తెలీకూడదు**

"రాత్రి తమతమ స్వర్గసీమలో జరిగిన రభసలు రట్టు అయిన సంగతి ఇద్దరికీ తెలుసు. సూటిగా చూచుకుందికి ముందు సిగ్గుపడ్డారు.

నాకు మావగారు మీకు కారు అంది సుబ్బారావు నవ్వు.

మరే, నాకు కారు మీకు మావగారు అంది చక్రవర్తి నవ్వు."

తమ కష్టసుఖాలు మరొకరికి తెలియటంకూడా ఇష్టంలేదు యిద్దరికీ. పొరుగిళ్ళలో తగాదాలు జరుగుతుంటే వినటం పెద్దమనిషిగారి సరదా.

సుబ్బారావు మావగారు ఒకరకం మనిషి. అయిదునెల్ల అద్దె తను వాడేసుకుని ఇచ్చానని చెప్పాడు. ఆయనకేవో పథకాలు, ఊహలు – ఆ ఊహలలో ఒక కల' తను మళ్లా పెళ్ళి చేసుకోవాలని.

"ఈ డొక్కు ఇంటికి అద్దె బకాయి పెట్టడంకూడా వల్ల కాదంటే మనకి ఈ ఇంటిలో ఉండేటంత ఖర్మం ఏం కాలిందీ అంట" అన్నాడు సుబ్బారావు మావగారు.

ఆయనకింకా గత దినాల వైభవం నిషా దిగలేదు.

సుబ్బారావు కష్టాల తిరగలిలో పడి అరిగరిగిపోయాడు. ప్రతిదీ ప్రాక్టికల్‌గా ఆలోచించి గుట్టుచప్పుడు కానివ్వడు చక్రవర్తిలాగే.

**అన్యాపదేశం**

ఈ తరగతిలో మరోతత్వం తనవాళ్ళని తిట్టాల్సివచ్చినప్పుడు సూటిగా అనలేక పిల్లిమీద, ఎలకమీద పెట్టి అనటం. సుబ్బారావు మావగారిని ఏం అనలేక అప్పడగడానికి వచ్చిన మిత్రుడ్ని గవర్నమెంటులో రెండు ఉద్యోగాలున్నాయి చేస్తావా అని అడిగాడు.

"అబ్బే నేను గవర్నమెంటుకింద ఉద్యోగం చెయ్యదలచుకోలేదు" అన్నాడతను.

'అయితే మావంటివాళ్ళ ప్రాణాలు తీస్తూ ఉండదలచుకున్నావా" అని సుబ్బారావు తిట్టిన మాటలకి మావగారు బాధపడ్డారు.

"ఆ వెధవ నడ్డుపెట్టుకుని, నన్ను అడ్డమైన మాటలూ అంటావూ, ఇష్టంలేకపోతే పొమ్మనరాదూ" అనేశాడు. దాంతో సుబ్బారావు ధ్యేయం నెరవేరింది.

**అసూయమ్మలు**

మధ్యతరగతి మనుషులు ఎవరైనా బ్రహ్మచారులుగా ఉండిపోయి వాళ్ళ మానాన్న వాళ్లు ఉద్యోగాలు చేసుకుంటుంటే చూసి సహించలేరు. సంసారం రొంపిలోకి దింపటానికి శతవిధాలా ప్రయత్నించి తమాషా చూస్తారు.

సుబ్బారావు మావగారు జానకికి చెప్పకుండా పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తారు. అలాగే వీర్రాజు మిత్రులుకూడా బలవంతాన అతనికో రాక్షసిపిల్లని చూపిస్తారు.

"పలకరించిన ప్రతి మొగాడు పెళ్ళి చేస్తాననడమో, చేసుకుంటాననడమో తప్ప మరోరకంగా మాట్లాడడు" అనుకుంటుంది జానకి.

"అడ్డమయినవాళ్లూ నాకు పెళ్ళి చెయ్యాలని కంకణం కట్టుకున్నారండి" అంటాడు వీర్రాజు.

"ఈ ప్రపంచంలో ఒక్కళ్ళం ఉండడం మహాకష్టమండి. ఎవరిదారిన వాళ్ళు బతకరు. ఇంకోళ్ళని బతకనివ్వరు. ఒక్కొక్కసారి భయమేస్తూంది." అంటాడు వీర్రాజు



జానకి భావాలనే పైకి చదివేస్తూ.

చివరికి సుందరమ్మ మధ్యవర్తిత్వం వహించి జానకి వీర్రాజుల వివాహం ఖాయం చేస్తుంది.

ఆరోజు 'జనతా ఎక్స్‌ప్రెస్' ఎక్కి సినిమానించి వస్తున్న మధ్యతరగతి మనుషుల ఆశలతో, కోరికలతో ఆలోచనతో కారు కిటకిటలాడిపోయింది.

"ఇరుకుగావున్న ఆ కారులో కూర్చున్న అందరి ఆలోచనలు, ఆశలూ వారి విశ్వాసాల్లో నిండి బయటకువచ్చి కలగాపులగంగా కలసిపోతున్నాయి" అంటాడు రచయిత.

ఒకే కారు. అందులోని మనుషులు మాత్రం ఒకటే కారు. ఆ మధ్యతరగతి కారు కోరికలబారు అడ్డదిడ్డంగా, వంకర్లుగా సూటిగా సాగుతూ కొన్ని కొన్నిటితో ఢీకొని రాలిపోతూ, కాలిపోతూ కొన్ని దేదీప్యమానంగా వెలిగిపోతూ వుంటాయి.

**సినీటెక్నిక్**

వాళ్ళ కోరికల్లాగే సన్నివేశాల్ని కూడా కలగాపులగంగా కలిపి కథ చెబుతాడు రవణ.

సుబ్బారావు, మావగారు పోట్లాడే సన్నివేశం సగంచెప్పి ఆ తతంగం చూస్తున్న పెద్దమనిషి కుటుంబం మనస్తత్వం చెప్పి – వాళ్ళలా చూస్తున్నందుకు ఏవగించుకుంటున్న జానకి, వీర్రాజుల మంచితనం విడివిడిగా చెప్పి అంతలో కోరిక కొంతతీరిన సుందరమ్మ కారు హారు వినిపించి మళ్ళీ సుబ్బారావు మావగారు పోట్లాట కంటిన్యూ చేస్తాడు రవణ. సామాన్యంగా చిన్న కథలలో ఈ రకం కథనం కానరాదు. కాని ఇందులో ఈ కథనం కథకి సరిగ్గా అతికిపోయింది.

సన్నివేశం సినిమాటిగ్గా చెప్పటం ఈ కథలోనూ కనబడుతుంది.

"మావగారు చొక్కా ఊడదీసే కార్యక్రమం సగం అమలుపరుపనిచ్చి, ఆయన తలకాయ చొక్కా ముసుగులో మునిగివున్న క్షణాన 'వీర్రాజు అద్దె బకాయి పడ్డామంటున్నాడు' – అన్నాడు సుబ్బారావు.

మావగారు చొక్కా విప్పలేదు, దింపలేదు. తలకాయ అలా చాటునే ఉంచుకుని – ఏ అద్దె అన్నాడు."

**పాదధూళి**

"వీర్రాజుకి శరత్‌బాబు కథల్లో హీరో లక్షణాలు కొన్ని వున్నాయి. ముందూ వెనకా ఎవరూలేరు." అని శరత్ హీరోలమీద ఒక చెణుకు విసురుతాడు రచయిత.

ఈ కథ మధ్యతరగతి కుటుంబాలలో వుండే రకరకాల వ్యక్తుల తత్వాలను చెప్పేది. నిండైన ఈ కథను ఎవరైనా చలనచిత్రంగా నిర్మించగలిగితే కనకవర్షంతోపాటు ఎవార్డుల వర్షం కూడా కురుస్తుంది.

**కానుక**

ముందరి నాలుగు కథలూ ఒక ఎత్తు. కానుక కథ 'ఒక్కటీ పదెత్తులు. పరిణతమైన వ్యక్తిత్వం, మన్తసత్వంతో రాసిన కథ కానుక. ఒక జ్ఞానవృద్ధు తలపండిన భావాలతో చెప్పేకథ కానుక.

సృష్టిలోని ప్రతి వస్తువుకి విలువ వుంది. ఆ విలువను గుర్తించి ప్రపంచంలో భగవంతునికి ఉపయోగపడనిది లేదు అన్న సత్యం తెలుసుకోగలిగిననాడు మనిషి అత్యున్నతస్థితికి చేరతాడు.

భగవంతుడన్నానని ఇందులో ఆస్తిక భావాల ప్రచారంగాని, భగవంతుడ్ని నమ్మనివాళ్ళకి కథ అర్ధంకాకపోవటంగాని, నచ్చకపోవటం గాని జరగదు. ఈ కథ ద్వాపరయుగంలో జరిగినదైనా సాంఘిక కథే!

కవితకు సృష్టిలో ప్రతివస్తువు పనికివస్తుందని చెప్పాడు శ్రీ శ్రీ.

కవితను రసధునిగా, మణిఖనిగా జననిగా భావించి ఉపాసించాడు. ఆకారాన్ని, తత్వాన్ని అంగీకరించకపోయినా శ్రీ శ్రీ కవిత్వాన్ని భగవత్స్వరూపంగానే భావించాడు. కనకనే 'క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం, బ్రహ్మానుభవం' కలిగిస్తుందని నమ్మాడు.

ఆ నమ్మికకు ఈ కథలో గోపన్న నమ్మికకు తేడాలేదు. ఇద్దరూ ఒకేస్థితిలో ఆనందానుభూతి చెందారు. ఇద్దరికీ సాక్షాత్కరించిన తేజోరూపం ఒక్కటే! సత్యం ఒక్కటే!

పరిణతమైన బుద్ధి గ్రహించే ఈ జీవితసత్యాన్ని ప్రతిపాదించే కథే కానుక.

గోపన్నకి "ఒక స్థాయి వచ్చాక అతనికొక ఊహపోయింది. వేణువును కిందపెట్టి సంగీతాన్ని ఊహించబోయాడు. ఊహించిన సంగీతాన్ని భావనచేసి, భావించినదానిని అనుభవించి దర్శించేసరికి అతనికి ఒక సత్యం తోచింది. సంగీతాన్ని అనుభూతికి తెచ్చుకోవడానికి జంత్ర గాత్రాలను ఉపయోగించబోవడం అవివేకం. జలపాతాన్ని వెదురుగొట్టంలో ఇమడ్చడం పొరబాటు. సముద్రాన్ని పాలకడవలో ఇమడ్చడం తెలివితక్కువ. ఊహకందే సంగీతంలో పాటకందేది శతసహస్రాంశం ఉండదు."

కీట్సుచెప్పిన 'అన్‌హెర్డ్ మెలడీస్ ఆర్ స్వీటర్ దేన్ హెర్డ్ మెలడీస్' అన్న సార్వకాలీక సత్యంకూడా యిలాటిదే.



ఆ ఊహ కలిగిన తరవాత, "ఊహసాగిన కొద్దీ స్వరలత దిగంతాల వరకు వ్యాపించసాగింది. ఆకాశంవరకు వ్యాపించసాగింది. రోదసి అంతా నిండిపోసాగింది. క్రమంగా ఓంకార జనితమైన స్వరార్ణవం తిరిగి ఓంకారమై భువన సమ్మోహనంగా భీకరంగా అద్భుతంగా ఎరుకపడసాగింది."

మహాజ్ఞాని, ఋషికల్పుడు అయినవాడు ఆ భీకరమైన, అద్భుతమైన శక్తిని భరించగలడు. ప్రపంచంలోని ప్రతి అణువులోను ఆ శక్తిని దర్శించగలవాడికి వేరే ఓ విగ్రహం అక్కరలేదు ఆరాధన చేసుకోవడానికి. కాని దుర్బలుడాశక్తిని భరించలేడు చూడలేడు. తన శక్తికి తగినట్లుగా ఓ బొమ్మ తయారుచేసుకుని ఆరాధించటం మొదలుపెడతాడు. సాకారారాధనకు నిరాకారారాధనకు వున్న తేడాయే యిది.

అలాగే గోపన్న కూడా ఆ శక్తిని భరించలేక "తన ఊహకు అందినదానికన్న గొప్పదీ, ఆకళింపుచేసుకుని అనుభవించడానికి సులువైనదీ" కృష్ణుడి మురళి అని భావించాడు.

మళ్ళా మాయలోపడి కృష్ణుడు చేత్తో పట్టుకున్న మురళికే ఆ శక్తి ఉన్నదన్న భ్రమతో ఆ మురళి ఎత్తుకువచ్చాడు. కాని అది మాయమైంది.

"మాయదారి కృష్ణుడు. గజదొంగ దగ్గర నేను దొంగతనమేమిటి అనుకున్నాడు."

కాని కృష్ణుడే వచ్చి పోతేపోయిందిలే తనకో మురళి చేసిపెట్టమన్నప్పుడు గోపన్న నిజమన్న భ్రమలో పడిపోయి మురళిని తయారుచేసే ప్రయత్నం చేస్తాడు.

ప్రయత్నలోపంలేదు. శ్రద్ధాభక్తులతోనే చేశాడు "ఆయన పెదిమలూనే చోట, వేళ్లు ఆనేచోట మురళి కఠినంగా ఉండి నొప్పించకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాలను తన చేతులతో అరగదీశాడు."

ఇంతకష్టపడితే అది శ్రుతిశుద్ధంగా లేదు. పైగా జీర.

"కృష్ణుడు ఊదుతాడన్న ఆనందంలో దానికి ఒళ్లు పులకరించిందా" అనుకుంటాడు గోపన్న అంటాడు రవణ.

పాతికేళ్ళ పరిశ్రమ అనంతరం "చివరి మురళిని పరీక్షించడానికి గోపన్నకి ధైర్యం చాలలేదు. సత్యం తెలుసుకుని చనిపోగల శక్తిలేదు. మళ్ళీ ఇంకో ప్రయత్నంచేసే ఓపికలేదు. వ్యవధిలేదు."

ఆ స్థితిలో పాతిక సంవత్సరాల గాలివాన వెలిసిన పరిస్థితిలో నీరసంగా మేనువాల్చినప్పుడు "ఊహా సంగీత ప్రపంచంలోకి తొంగి చూసినపుడుకూడా ఇలాటి నిస్త్రాణే కలిగేదని" గ్రహించాడు గోపన్న.

అప్పుడు గ్రహించిన సత్యం యిది. “శ్రుతిశుద్ధంగా ఉందోలేదో నిర్ణయించే జ్ఞానం తనకు ఉందా...సరిచేసే శక్తి ఆయనకు లేదని తను అనుకొన్నాడా..... ఎంత పొరబాటు.. పాతికేళ్ళ పొరబాటు. ఒక జీవితం పొరబాటు...”

ఆ పొరబాటు తెలుసుకున్న తరవాత “అసత్యమైన వేణువు లేనే లేదు. భగవంతుడికి ఉపయోగపడని వేణువే లేదు” అని తన జీవితాన్నే కానుక చేస్తాడు గోపన్న. తనను తాను తెలుసుకోగలిగిన తర్వాతే గోపన్న భగవంతుణ్ణి గురించి తెలుసుకోగలిగాడు.

ప్రపంచమంతటా నిండిన శక్తిని భరించటం దుర్బలుడికి దుర్భరమన్న విషయంనించి, ఆ శక్తి ఆరాధనకు ఓ వస్తువును ఆధారం చేసుకుని తనను తాను గుర్తించే పర్యంతం తప్పులు చేస్తూ, పడుతూలేస్తూ సాగే అనంత జీవితయాత్ర కధని కధనంచేసిన కానుక తెలుగు సాహిత్యానికే వెలలేని కానుక.

**కవితారసం**

మంటలు ‘వెలుగెత్తి’ చాటటం మొదలైన పదాలను సృష్టించినట్లే ఈ కధకోసం కవితాత్మకమైన వాక్యాలనుకూడా రాశాడు రవణ.

మంటలు ‘వెదుళ్ళమీద వెలుగునీడల భాషతో కావ్యాలు రాస్తున్నాయి.’

‘వంశీనాదాన్ని హృదయంలో పోసుకున్నాడు.’

“పొద్దు వాటారినప్పటినించి మర్రిచెట్లలోంచి ఊడలు ఊడలుగా దిగకారుతున్న చీకటి చెలమై, చెరువై, చెలరేగిన యమునై, సముద్రమై భూమినంతా ముంచివేసింది.”

“శ్రుతులన్నీ దాచుకున్న బొజ్జలోంచి ఓంకారానికి మూలస్థానమైన నాభిలోంచి మంగళ గళంలోంచి మధురాధరాలలోంచి...

వెన్నా పాలు ఆరగించిన మధురాధరాలలోంచి– రాధాధరాలను పవిత్రంచేసిన మధురాధరాలలోంచి జీవంవచ్చి తన వేణువులో ప్రవేశిస్తుంది.”

ఈ వాక్యాలలో గోపన్నకు కలిగిన ఆనందం, పులకరింత మనకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది.

రవణ వాడిన అలంకారాలుకూడా కధాకాలానికి, వాతావరణానికి అతికేవే.

చీకటి ‘రాధ కంటికాటుకలా, కృష్ణుడి వంటినలుపులా, నందుడియింటి చల్లలా’ చిక్కబడింది.

చితుకుల మంటలు కృష్ణుడిమీద ‘ఎర్ర పట్టుకండువా’లా కదలాడుతున్నాయి.

‘ఎవరికివారే యమునాతీరే’ అన్న సామెతను కూడా కధాకాలానికి అతికేట్లు ఉపయోగించుకున్నాడు రచయిత.



పాత్రలు ద్వాపరకాలంనాటివైనా రవణ సెటైర్‌కి గురికాక తప్పలేదు.

“కృష్ణయ్య పెద్దవాడయ్యాడు. బృందావనికి రావడంలేదు. పట్నవాసం మనిషైపోయాడు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు.”

రవణ రాసిన ఈ కథ మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి భాషకేకాక భావానికేకాక, అనుభూతికేకాక, అనుభవానికేకాక పరిణతికికూడా సరిపోల్చదగినదనటం అతిశయోక్తి యెంతమాత్రంకాదు. స్వభావోక్తే!



**బాపూ, రమణ తదితర మిత్రులతో ఎమ్వీయల్**




# కథన కుతూహల రాగం

### రెండుపదుల కథలు

రవణ రచించిన కథాహారంలో అయిదు మంచిముత్యాలూ కాక మరో యిరవై గణించదగిన ముత్యాల్లాటి కథలున్నాయి. ఈ కథలుకూడా ప్రేమాయణం అందులో డ్రామాయణం జోకాభిరామాయణం కథలు కొన్నయితే సంసారపక్షంగా వుండే రాధాగోపాలం కథలు కొన్ని. అప్పుల కథలు రెండయితే డబ్బువిలువ గురించి డప్పేసి చెప్పే ఈశ్వరేచ్ఛ ఓ కథ. సినిమా గురించి ఓ కథ. నేవళమైన కథలు, నేర్పుగా చెప్పిన కథలు యిరవయ్యిన్నీ విలువైనవే అనిపిస్తాయి.

రాధాగోపాలం కథాసంకలనంలో అయిదు కథలున్నాయి. ఈ కథల 'పంచా'యితీలో చాలా నిజాయితీగా కొత్తసంసారం గుట్టుమట్లు గమ్మత్తుగా చెబుతాడు



రచయిత. కొత్తపెళ్లాం కొత్తమొగుడు రైలు ప్రయాణం, అందులో అలకలు చెప్పేకథ 'లహరి'. కొత్తకాపరం పానకం మధ్య పుడకల్లా తేలే మిత్రులు, వాళ్ళడిగే అప్పులకథ రాధమ్మబాకీ. గృహమే కదా స్వర్గసీమ అనేపాటలో అపశ్రుతుల్లా అప్పులు అవి తీర్చే బొమ్మలు 'కుమార సంభవమ్' అంతలో హఠాత్తుగా దిగే చుట్టాలతండావాళ్లు నేర్పిపోయే లోకానుభవం 'చుట్టాలొచ్చారు'. 'సంసారం కాస్త పాత' బడగానే తన తరఫో రాధ తరఫో పిల్లలకి పెళ్ళి సంబంధాలు చూసే బాధ్యత – అందులో అప్పారావు పాత్ర 'తిమింగిలగిలం' కథ – ఇలా సంసారపక్షంగా ఏర్పడ్డ కథలే రాధాగోపాలం.

రవణ ఈ కథల్లోవాడే ఉపమానాలు, సరికొత్త వాక్యాలు, విసిరే విసుర్లు తగిలే దెబ్బలు అన్ని కథల్లాగే సంసారపక్షంగానే వుంటాయి.

'అలసిపోయిన అప్సరసవలె' వుంటుంది రాధ.

'అమవశనిశి కన్న దీపపుమసికన్నా' నల్లగా వుంటుంది ఆమె వేణీభరం. 'ధింకర్సు లైబ్రరీవారి ట్రేడ్‌మార్కు ఆసామీ పోజులో' వుంటాడు గోపాలం కోపంవస్తే. తుకారాం 'పిచికలా' పారిపోతాడు. మీసాలు 'ఢంకా పలాసు ఆడేవాడిలా' వుంటాయి జి.వి.మూర్తికి.

చుట్టాలు దిగినప్పుడు "గోపాలంచేసే అవకతవక ఖర్చులా" తగలడిపోయాయి కట్టెలు.

"బొగ్గులు రాధమ్మ ఖర్చులా వెలిగిపోయాయి."

"నూనెగిన్నె గోపాలరావు మనీపర్సులా దిగాలుమొహం" పెట్టింది.

రాధ 'వెలిసిపోయిన రంగు చీరవంటి' మందహాసం చేసింది.

వాక్యనిర్మాణంకూడా చిలకా గోరింకలు సరదాగా వున్నప్పుడు మాంఛి క్లాసికల్ స్టైల్లోను, దిగాలుపడినప్పుడు పొడిపొడిగాను వుంటుంది. గోపాలమే అనుకుంటాడోసారి – అప్పులాళ్లు రాగానే "పొయిట్రీ ప్రోజుగా మారిపోయింద"ని.

### బ్రహ్మలోకం

కథనాన్ని క్లాసికల్ శైలిలో అంటే, 'కళాపూర్ణోదయం'లో కథ యావత్తు బ్రహ్మ సరస్వతుల సంభాషణ ఆధారం చేసుకున్న రీతిలో – సాగించటం రవణ కలవాటు.

ఈశ్వరేచ్ఛ కథలో గుర్నాధాన్ని మోసంచేసి 'ఈశ్వరేచ్ఛ' అని ఓదార్చాడు గజపతి.

వైకుంఠంలో విష్ణుమూర్తికి కోపం వచ్చింది.

"వాడు చేసే వెధవ పనులన్నిటికీ నాఇష్టం అంటాడేవిటీ' అంటూ బయలుదేరాడు.

"సరేస్వామీ నాచెంగు ముడి అయినా విప్పి వెళ్లు. నేనుకూడా ఎందుకు" అంది లక్ష్మి నవ్వుతూ.

అలాగే రాధాగోపాలం కథలలో 'లహరి'లో కూడా కథలో సరస్వతి బ్రహ్మ కల్పించుకుని 'గెస్టారిస్టు' లవుతారు.

"సరస్వతీ! నువ్వుచేసిన పని తప్పు" అని బ్రహ్మదేవుడు సరస్వతిని చీవాట్లు పెట్టాడు.

"తప్పు నాదో మీదో రైల్లో ఏడుస్తున్న ఆ చిన్నవాడివంక చూడండి తెలుస్తుంది" అంది సరస్వతి వీణపాట ఆపకుండానే.

హీరో వున్న వూరినించి హీరోయిను వున్న వూరికి కెమేరాని, ప్రేక్షకుల్ని తీసుకెళ్ళదలచిన దర్శకుడు ఆకాశాన్ని చూపించి అటూ యిటూ ఎలా జరుగుతుంటాడో అలాగే కథలో సన్నివేశాలు కలుపుకురావటానికి ఆకాశంలోకి వెళ్ళి పెద్దాయన్ని పెద్దావిడ్ని పరామర్శ చేస్తుంటాడు రవణ.

"సరస్వతి మహోద్రేకంతో ఆహిరి రాగాన్ని ఆలాపిస్తోంది.

'నాదే తప్పులే సరస్వతీ! నువ్వింక వాళ్ళమీద కోపం మాని, మలయమారుతం ఆలాపించు – అన్నాడు బ్రహ్మదేవుడు."

రాధాగోపాలం ప్రణయకలహం కూడా మలయమారుతంతో చల్లబడుతుంది.

**పల్లె వాతావరణం**

ప్రయోజకుడు, కృతజ్ఞత అనే రెండు కథల్లోను సుబ్రహ్మణ్యం కథకుడు.

"తలగడా కిందనించి పొగాకు తీసి తుంపి చుట్టనిర్మాణం పూర్తి చేసి చుట్టుప్రక్కల వాళ్ళలో కథ వినాలనే వేడిని కలిగించి ఆ వేడితో చుట్ట అంటించి చిద్విలాసంగా పొగవదిలి నెమ్మదిగా నోట్లో చుట్ట తీసి శ్రద్ధగా దాని కొడి దులిపి అర్ధనిమీలిత నేత్రులై తాపీగా కథ చెబుతారు" సుబ్రహ్మణ్యంగారు.

ఆ కథలు వినే వ్యక్తుల్ని, వాతావరణాన్ని సత్యజిత్రాయ్‌లా చిత్రిస్తాడు రవణ.

"వెండికొండపై పరమేశ్వరుడివలె ఆ తెల్లటి పక్కవేసిన మంచంపైన పెద పంతులుగారు సభాభిముఖవదనులై మందహాసంతో నీలిమాకాశాన వెలిగిపోతున్న చంద్రుణ్ణి చూస్తున్నారు. కొంచెం దూరంలో పెద్దరైతు బంగారయ్య గొంతుకిలా కూచుని పొలం సంగతులు చెప్తున్నాడు. ఆరుగు చివర దూరంగా నిల్చున్న పాలేరు ముళ్ళకర్ర పిడిమీద పెట్టుకున్న చేతి ముణుకుల మీద గడ్డం ఆనించి కబుర్లు ఆలకిస్తున్నాడు. సుబ్రహ్మణ్యంగారి సతీమణి కామేశ్వరి పెద పంతులుగారి భార్య సుందరమ్మ గుమ్మం మెట్లమీద కూర్చున్నారు."



పల్లెటూరి మనుషుల తత్వాలు తొలితరం సంకుచితత్వం, మలితరం కలుపుగోలుపుతనం వాళ్ళ మాటల్లో, చేతల్లో చెబుతూ తన కలవాటైన అప్పుల్ని, రాజకీయాల్ని, సాహిత్యాన్ని, తొలిచూపుల వలపుల్ని కథనం చేశాడు రవణ.

'మనుషుల బతుకులు సూత్రాలమీద నడవ్వు.'

'మంచీ చెడూ కలిస్తేనే మనిషి – ఏడు రంగులు కలిస్తే తెలుపయినట్లు' అన్న సార్వకాలిక సత్యాలు చెబుతూనే,

"దీక్షితులు తాత పువ్వులమ్మిననాడు, సింగారం తాత కట్టెలు అమ్మేవాడు, ఇప్పుడు దీక్షితులు కట్టెలమ్ముతున్నాడు. సింగారం పువ్వులు విరజిమ్మగల స్తోమత సంపాదించాడు."

అంటూ సుతారంగా క్లుప్తంగా కథ చెబుతాడు.

అంతలోనే "ఈ భూప్రపంచంలో ఎదటివాడిలో కృతజ్ఞత ఆశించేకన్నా ఆంధ్ర రాజకీయ నాయకుల్లో ఐకమత్యాన్ని ఆశించు. ఆంధ్రుల్లో కార్యశూరత్వాన్ని ఆశించు" అని చుర్రుమనే చురకలు వేస్తాడు.

ఈ రెండు కథల కథనం, శైలి మల్లాది రామకృష్ణశాస్త్రిగారిని గుర్తుచేస్తాయి.

**భాషలో వేగం**

కథనంలోనే కాక అనేకరకాలుగా భాషలో వేగాన్ని సాధించాడు రవణ. దాన్ని అక్షరాల్లోకి అదిమిపట్టే అతని శక్తి మరోరచయితలో కానరాదు.

'తాంబూలాలిచ్చేశారు' అన్న కథలో రాజుకోసం అతగాడి ప్రేమ కోసం జతగాడైన అప్పారావు నానాతిప్పలు పడ్డాడు. చివరికి రాజు బుద్ధిగా పితృభక్తితో ప్రేమకి స్వస్తి చెప్పాడు. అప్పారావు అది తెలుసుకుని ఆశ్చర్యపడే సన్నివేశం.

"కుర్చీలో కూర్చున్న అప్పారావుకి పక్కనే ఉన్న బల్లమీద ఓ ఉత్తరంలాటిది కనబడింది. రాజు మాటలు వింటూనే చదివాడు.

'తాంబూలాలు ఇచ్చుకున్నాము... ఈ సంబంధం కనక... డొక్క వాలికలు చేసేస్తాను... వె... షాలు వెయ్యక.... టనే రావలెను.

ఇట్లు జగన్నాధము.

మధ్యలో ఖాళీ వచ్చినప్పుడు రాజుమాటలు చెవిని వేసుకుంటూ రానప్పుడు ఉత్తరంలో అక్షరాలు కంట్లోపడుతూండగా లేఖార్థములు గ్రహిస్తాడు అప్పారావు.

ఇంతకంటె విచిత్రమైన సన్నివేశాన్ని, సంభాషణని 'వేట' కథలో సృష్టించాడు రవణ.

అప్పన్న ఋణదరాజు ఒకరికొకరు హఠాత్తుగా తారసపడ్డారు. ఎలాగైనా వొడేసి డబ్బులు లాగాలని అప్పన్న, ఎలాగో అలా తప్పించుకుపోవాలని రాజుగారు కంగారుపడతారు. ఆ కంగారులో వినబడే ఋణ గుణధ్వని యిది.

"దండాలు బాబయ్యా...దండాలు. ఛీ వెధవా నువ్వా? నా దగ్గి...మా బుల్లి కొంట్లో....బాగు...రేం...లేదు....అదికాదు బా...బోయ్ నువ్వెక్కడ దాపురించావు?"

దీన్ని మామూలు వాక్యాలుగా రాస్తే ఇలా కనబడుతుంది.

"దండాలు బాబయ్యా"

చూడకుండా "దండాలు" అన్నారు రాజుగారు.

చూడగానే "ఛీ వెధవా నువ్వా, నాదగ్గిరేం లేదు."

"మా బుల్లి కొంట్లో బాగులేదు, అదికాదు బాబూ."

"బాబోయ్ నువ్వెక్కడ దాపురించావు?"

నిజానికి వాళ్ళలా తీరిగ్గా ఒకళ్ళ డైలాగయ్యాక మరొకరు 'కృష్ణార్జున సంవాదం' లాగా చేసుకోలేదు. అడ్డదిడ్డంగా వచ్చేసిన వాళ్ళ వాక్యాల్లో అక్షరాల్ని, వాటి వేగాన్ని అచ్చులోకి రవణ కాబట్టి నిలువరించగలిగాడు. మామూలుగా రాస్తే వాళ్ళ కంగారు వ్యక్తంకాదన్న విషయం స్పష్టం.

## సినేమియా

సినిమాపిచ్చిపట్టిన ఆనందరావుని గురించి చెప్పే 'సెరిబ్రల్ సినేమియా' విచిత్రమైన కథ. అంతకంటె చిత్రమైన వ్యక్తి అందులో కనబడే వరహాలు.

సినేరియోలు రాసెయ్యాలని ఉబలాటపడే ఆనందరావు విషాదగాధే ఈ కథ. నిజానికి ఆనందరావు "కొత్తలో వేషాలు సంపాదించడానికి ప్రయత్నించాడు. అది కలిసిరాక అసిస్టెంటు డైరెక్టరు అవుదామని ఆశపడ్డారు. రద్దీ ఎక్కువ. టెక్నికల్ సైడు 'ట్రై' చేశాడు. అంబ పలకలేదు. అదీ ఇదీ అన్నాడు. ఏదీ సాగిరాలేదు. చివరికి సినిమాకథలు రాయడానికి సిద్ధపడ్డాడు."

విక్రమార్కుడి మార్కు సింహాసనంలోలాగే ఇందులోను తిమింగిల గిలంలా ఒకరిని మింగాలని మరొక మనిషి అనుకునే – తత్వం కనబడుతుంది.

తన ప్రయత్నాలలో ఎదురుదెబ్బలతోపాటు వాలుదెబ్బలూ తింటూ వరహాలుకి దెబ్బలు తగుల్తుంటే చూస్తూ ఒక నిశ్చయానికి వచ్చేస్తాడు ఆనందరావు.

"మనవంటివాళ్ళకి నీతీ జాతీ లేనిచోట చోటులేదు' అన్నాడు ఆనందం కసిగా."

ఎంత బాధలోనయినా సరే చిత్రపరిశ్రమని కాని, రాజకీయరంగాన్ని కాని ఆ మాట అననివ్వడు రవణ. ఏ రంగమూ చెడ్డదీ – నీతీ నిజాయితీ లేనిదీ కాదు.



రంగం ఎప్పుడూ మంచిదే! అందులో చేరే మనుషులే దుర్మార్గులు. వాళ్ళని చూసి దూరంగా పోతాననటం పలాయన తత్వం. సన్యసిస్తాననటం అంత తప్పు. ఆ చెడునే మంచిగా మార్చాలి. మంచిగా మలచుకోవాలి. మంచిగా నిలబడగలగాలి అనే నీతినే, అనే ఆశనే రాజకీయ భేతాళ పంచవింశతిక చివరా, విక్రమార్కుడి మార్కు సింహాసనం చివరా చెప్పాడు రవణ. అలాగే ఈ కథలో కూడా ఎగ్స్ట్రా నటి సుబ్బులంటుంది ఆనందరావుతో–

"నేను దీనిమీద ఆశ పెట్టుకున్నాను. పదిమందికి అన్నం పెట్టే ఉపాధిని పదిమంది నమ్ముకున్నదాన్ని ఎన్నడూ తిట్టకు. నువ్వు ఒరుగుతుందనుకున్నదేదో వచ్చి పడకపోతే, నోటికొచ్చినట్టు..."

శివుని శాపంవల్ల అన్నం దొరకని అగస్త్యుడు కాశీపట్టణాన్ని నిందిస్తుంటే, నీకు కడుపునిండనంత మాత్రాన పదిమందినీ పోషించే నగరాన్ని, దేవుణ్ణి నిందించటం తప్పు అని మందలించే కాశీ అన్నపూర్ణ కథ గుర్తుకువస్తుంది ఈ వాక్యాలలో.

ఈ హితోపదేశంతో మళ్లా కార్యవాదిగామారి సినేరియో రచనకు పూనుకుంటాడు ఆనందరావు. అతనితోపాటే వరహాలు!

## సన్మానభంగం

ఇందులో అప్పులమీద, పాల్టిక్సుమీద, సన్మానాలు చేయించుకునే జాతిమీద, సన్మానాలుచేసే జాతిమీద, రంగులుమార్చే వాళ్ళమీద, తలకాయలే మార్చే వాళ్ళమీద, తాడి తన్నేవాడి తల తన్నేవాడిమీద – వాడిమీద వీడిమీద సెటైర్ పేల్చాడు రవణ. మధ్యలో సాహిత్యం చోటుచేసుకుంటుంది. నన్నయ్య, తిక్కన, ఎర్రన, కాళిదాసు, విశ్వనాథ సత్యనారాయణ అందరూ సాక్షాత్కరిస్తారు.

"కాంగో రాజకీయాల్లా, సభ గందరగోళంగా వుంది. ఇరవయ్యో శతాబ్ది జీవితంలా చీకాకుగా వుంది.' అనే వాక్యాలతో మొదలయే ఈ కథలో నటులు, రాజకీయ నాయకులు, సాహిత్యవేత్తలు, విమర్శకాగ్రేసరులు, యుగకర్తలు, మంత్రులు, కాబోయే మంత్రులు, అప్పారావులు అంతా వున్నారు. ఈ సన్మాన నాటకరంగం మీద ప్రతి ఒక్కడూ కారెక్టరేక్టరే!

కొమ్ములు మొలిచే రాజకీయ నాయకులతో – సన్మానితులతో – సన్మానాలు చేసేవాళ్ళతో – కవులతో – విమర్శకులతో కిటకిటలాడిపోయే సన్మానభంగం కథారంగం ముమ్మూర్తులా తెలుగుదేశమే!




# ఎపిలోగ్

నలభయ్యేళ్లవాడు. మదరాసు మహానగరంలో వుంటున్నవాడు. రచయితగా, చిత్ర నిర్మాతగా పేరూ పలుకుబడీ గడించుకున్నా ఆ చిన్నెలేవీ కనబడనివ్వనివాడు.

డబ్బుచుట్టూ తిరుగుతున్న రాజకీయాల చుట్టూ తిరుగుతున్న మనుషులతో నిండిన లోకాన్ని అక్షరాల్లోకి దించి, కాలంతో పోటీ పడుతున్న మనిషి కందకుండా పరుగిడుతున్న కాలాన్ని క్షణాల్లో కుదించి రచన చేయగలనన్న నమ్మకం కలిగినవాడు, కలిగించినవాడు-అతని పేరు ముళ్ళపూడి వెంకటరమణ.

అతని పేరది కాదంటున్న ప్రసిద్ధ విమర్శకుడు కె.వి.రమణా రెడ్డి 20-5-62 విశాలాంధ్రలో 'గిరీశం లెక్చర్లు' మీద రాసిన సమీక్షలోని భాగాలను మీ ముందుంచి ఈ రచనకు స్వస్తి పలుకుతాను.

“నిజానికి అతన్ని ముళ్ళవాడి వ్యంగ్యటరమణ అని పిలవవచ్చు. ఆంధ్రపత్రిక ద్వారా అతను దేశంలో పత్రికలు చదివే జనాభాకంతటికి అవలీలగా పరిచయమై ప్రీతిపాత్రుడైపోయాడు. అల్లాటప్పా 'హాస్యం' అనిపిస్తూ, జీవితాన్ని ఘాటుగా పోట్లతో విమర్శించగలడు. హాస్యం ముళ్ళపూడివాని వేడి తాకిడికి ఈడేరింది. దానికొక సాంఘిక ప్రయోజనం ఏర్పడింది.

వఠి లెక్చర్లనుకున్నారేమో, ఇవి భాష్యాలు. వఠి ఆస్సెమనుకుంటారేమో, ఇది జడ్జీగారి డిక్రీ. ఐతే ఎక్కడా గుచ్చుకొని నెత్తురునూ, నొప్పినీ వెలికిదీయనంతటి సున్నితమైన ఇంజక్షను సూది యిది. దీన్ని వర్ణించవలసి వస్తే బోల్డంత గ్రంథం పెరుగుతుంది. ముళ్ళవాడి వ్యంగ్యట రమణ దేనినైతే ఆశించాడో అది శుభ్రంగా సమకూడింది.



దీనికి చమత్కారమొక్కటే చాలదు. సూక్ష్మగ్రహణశక్తి కూడా కావాలి. హాస్యం ఒక్కటే చాలదు. అపహాస్యం కూడా కావాలి. నిందలు సరిపోవు, నిష్ఠురోక్తులు పనిచేయవు. విమర్శలు చర్మాల మందాన్ని దాటి లోపలికి పోలేవు. కాబట్టి వ్యంగ్యం ఒక్కటే విజయవంతం కాగలిగింది. వాడో వీడో ఈవిడో ఆవిడో అని కాకుండా సామూహికంగా ఒక వ్యవస్థను విమర్శించడం జరిగింది. అయినా ఓర్చలేనివాళ్ళెందరో? అలాంటి పుస్తకం రాసేందుకు ధైర్యం కావాలి. ఉద్యోగాల నిలకడమీద, బతుకు తెరువుమీద చూపున్నవాడు ఇంత సాహసం చెయ్యలేదు. అందుకు కూడా ముళ్ళపూడి వెంకటరమణను మెచ్చుకోవాలి. పద్మవ్యూహంలో చిక్కుబడి కూడా ఈ అభిమన్యుడు జయించాడు. ఒక చీకటి కొనపై ఇది తొలి వెలుగు. ఇలాంటివి మరెన్నైనా కావాలి, రావాలి. చలనచిత్ర పరిశ్రమ కూడా జీవితంలో అంతర్భాగమే కాబట్టి అదీ కొన్ని బాధ్యతలను అంగీకరించాలి. వెంకటరమణ జీవిత విమర్శకుడు గనకనే సినిమా ఇండస్ట్రీని వదిలిపెట్టలేదు.”



**రమణ, ఎమ్వీయల్, బాపూ, సజ్జాద్ హుస్సేన్, పి.బి.శ్రీనివాస్ తదితరులు**

ముత్యాలముగ్గు శతదినోత్సవ వేడుక





ఏ.ఎన్.ఆర్. నుంచి జ్ఞాపికను అందుకుంటున్న ఎమ్వీయల్, రమణ



రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ గారి నుంచి జ్ఞాపికను అందుకుంటున్న ఎమ్వీయల్